
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00
సంపుటి: 11
సంచిక: 283

గురువారం 3-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రూపాయి75 పైసలు డౌన్!**
డాలర్ మారకంలో మళ్లీ 70.18కి..
4 సెషన్స్‌లో మొదటి పతనం - బిజినెస్‌లో



**36,000 దిగువకు సెన్సెక్స్**
చైనా వృద్ధిపై ఆందోళన. పడిపోయిన ప్రపంచ మార్కెట్లు - బిజినెస్‌లో

# అల్లిన కథే.. మళ్లీ

## సర్కారు పెద్దల స్క్రిప్ట్‌ను పక్కాగా అప్పజెప్పిన విశాఖ పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్హా

- మొదటి నుంచీ చెబుతున్న కథనే మళ్లీ వినిపించిన పోలీస్ కమిషనర్
- విచారణ డ్రామాకు రక్తి
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక ఎలాంటి కుట్ర లేదని తేల్చేసిన వైనం
- టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరికి క్లీన్‌చిట్
- శ్రీనివాసరావు అక్టోబర్ 18నే ఎయిర్‌పోర్టులో జగన్‌పై దాడికి ప్లాన్ చేశాడని వెల్లడి
- ఆ రోజు కుదరక పోవడంతో 25న దాడి చేశాడన్న కమిషనర్
- దాడి జరిగిన రోజు ఎయిర్‌పోర్ట్ రెస్టారెంట్‌లోనే కత్తులకు స్టెరిలైజేషన్
- హర్షవర్ధన్ చౌదరి ఉదయం నుంచి అక్కడే ఉన్నారు.. రెస్టారెంట్ కేంద్రంగా ఇంత జరుగుతున్నా అతనికి ఏమీ తెలియదట
- రిమాండ్ రిపోర్ట్‌కు భిన్నంగా సీపీ ప్రకటనలు

**సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/ సాక్షి, అమరావతి బ్యూరో:** ఊహించిందే జరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో సంచలనం సృష్టించిన ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటన వెనుక ఎటువంటి కుట్ర కోణం లేదని విశాఖ పోలీసులు తేల్చేశారు. టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరి సహా ఇంకెవరి ప్రమేయమూ లేదని చెప్పేశారు. నిందితుడు శ్రీనివాసరావు కేవలం సంచలనం కోసం, పబ్లిసిటీ కోసం తాను రాసిన, రాయించిన లేఖను వైఎస్ జగన్ చదవాలనే ఉద్దేశంతో కోడి కత్తితో ఆయనపై చిన్న పాటి దాడి చేశాడని.. ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు మొదటి రోజు నుంచీ చెబుతున్న కథనే మూడు నెలల విచారణ తర్వాత కూడా అక్షరం పొల్లుపోకుండా వల్లె వేశారు. చివరకు కేసును శ్రీనివాసరావు ఒక్కడికే పరిమితం చేసిన వైనం వివాదాస్పదమవుతోంది.

విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో అక్టోబర్ 25న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పక్కనే ఉన్న ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. రక్షణశాఖకు చెందిన తూర్పు నావికాదళం పర్యవేక్షణలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఈ దారుణ ఘటన వెనుక భారీ కుట్ర దాగి ఉందనేది ఒక్క రాష్ట్ర ప్రభుత్వం మినహా కేంద్రం మొదలు

మిగతా 7వ పేజీలో ▶



## ఎవరి ప్రమేయమూ లేదు

- మహేష్ చంద్ర లడ్హా వెల్లడి
- పబ్లిసిటీ, సానుభూతి కోసమే ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌పై శ్రీనివాసరావు దాడి
- ఇందులో ఎలాంటి కుట్ర లేదు
- దాడికి పది నెలల ముందే పథకం వేశాడు
- 2018 జనవరిలో కోడి పందాలు వేసే కత్తుల కొనుగోలు
- సంచలనం సృష్టించనున్నట్లు స్నేహితులకు చెప్పాడు
- ఎయిర్‌పోర్టులో ఉద్యోగంలో చేరడానికి విశాఖ పరిధిలో పోలీసులు అనుమతిచ్చారు
- హైకోర్టు అనుమతించాక చార్జిషీటు దాఖలు

**సాక్షి, విశాఖపట్నం:** ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి వెనుక టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరి సహా ఇంకెవరి ప్రమేయం గానీ, కుట్ర గానీ లేదని విశాఖ నగర పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్హా చెప్పారు. శ్రీనివాసరావు పది నెలల ముందు 2017 డిసెంబర్‌లోనే దాడికి పథకాన్ని రచించాడని తెలిపారు. పబ్లిసిటీ, సానుభూతి కోసమే ప్రతిపక్ష నేతపై దాడికి పాల్పడ్డాడని, తాను జగన్ అభిమానినని చెప్పాడని పేర్కొన్నారు. హైకోర్టు అనుమతించాక ఈ కేసుపై చార్జిషీట్ దాఖలు చేస్తామన్నారు. జగన్‌పై హత్యాయత్నం కేసులో పురోగతిని కమిషనర్ బుధవారం విలేకరులకు వివరించారు. సీపీ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

**పక్షులంటే ఇష్టమని ఫ్లెక్సీపై ముద్రించాడు**

'తూర్పు గోదావరి జిల్లా ఠానేలంకకు చెందిన జనుపల్లి శ్రీనివాసరావు మూలపాలెం ఎన్‌పీఎం కాలేజీలో

మిగతా 7వ పేజీలో ▶



### కుట్రదారులను తప్పించేందుకు యత్నం

- జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు అప్పగించాలి
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

7లో



### శ్రీనివాసరావు సేవలో ముగ్గురు ఖైదీలు!

- జైల్లో రాజభోగాలు
- వ్యక్తిగత పనులు చేసేందుకు బిహార్, ఒడిశా ఖైదీల నియామకం

7లో



“పంబా నుంచి ఆలయం వైపు మెట్లు ఎక్కుతుండగా, లోపల పూజలు చేస్తున్న సమయంలోనూ మాకు ఎలాంటి నిరసనలు కాలేదు. అంతా సవ్యంగానే సాగింది. అక్కడ భక్తులు మాత్రమే ఉన్నారు. వారు మమ్మల్ని అడ్డుకోలేదు. దర్శనం తరువాత పోలీసులు మా ఇద్దరిని గుర్తు తెలియని చోటుకు తరలించారు.
– కనకదుర్గ, బిందు

బుధవారం అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్న కనకదుర్గ, బిందులు వీరే..

# కొత్త చరిత్ర

## శబరిమల ఆలయంలో అడుగుపెట్టిన ఇద్దరు మహిళలు

- రక్షణగా నిలిచిన పోలీసులు
- గర్భగుడిని శుద్ధిచేసిన పూజారులు
- కేరళలో పెల్లుబికిన నిరసనలు
- నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన హిందూ సంస్థలు


10లో

శబరిమలలో మహిళల ప్రవేశానికి నిరసనగా కేరళ ముఖ్యమంత్రి విజయన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భక్తులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని ధిక్కరిస్తూ.. ఆందోళనలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నా రుతుస్రావ వయసులోని ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలో అడుగుపెట్టారు. కేరళకు చెందిన కనకదుర్గ, బిందు బుధవారం వేకువ జామున అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించారు. అన్ని వయసుల మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన మూడు నెలల తరువాత ఇది అమలుకు నోచుకున్నట్లయింది.

ఇదిలా ఉండగా మహిళల ప్రవేశం తరువాత ఆలయ ప్రధాన పూజారి భక్తులందరినీ బయటికి పంపించి సుమారు గంట సేపు గర్భగుడిలో సంప్రోక్షణ నిర్వహించారు. మహిళల ప్రవేశం వార్త తెలియగానే కేరళలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు తీవ్రరూపం దాల్చగా, గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించాలని హిందూ సంస్థలు పిలుపునిచ్చాయి.



### లోక్‌సభలో 'రఫేల్' రచ్చ

- లోక్‌సభలో రఫేల్ వివాదంపై రాహుల్, జైట్లీ వాగ్యుద్ధం
- ఆడియో టేపు వినిపించేందుకు రాహుల్ యత్నం.. అనుమతించని స్పీకర్
- టేపు కల్పితమన్న కేంద్ర మంత్రి జైట్లీ

### తీర్పును పునః సమీక్షించండి

- రఫేల్‌పై సుప్రీంలోయశ్వంత్ సిన్హా, ప్రశాంత్ భూషణ్, అరుణ్ శౌరీ పిటిషన్

10లో

### న్యాయప్రతిష్టను కాపాడాలి

- ఈ బాధ్యత బార్ అండ్ బెంచ్‌పైనే ఉంది
- న్యాయవాదుల సహకారంతోనే సత్వర న్యాయం
- సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్లాలి
- న్యాయవాదులకు ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఉద్బోధ
- కార్యకలాపాలు ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
- తొలిరోజు మొదటి కోర్టు హాలులో న్యాయమూర్తుల సమావేశం..
- ఇబ్బందుల మధ్యే కేసుల విచారణ

4లో

### అందని చదువులు.. ఉసురు తీస్తున్న ఫీజులు!

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో భారీగా కోత విధిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
- ఏం చదువులు చదువుతారో నేనే చదివిస్తానని ప్రతిపక్ష నేత జగన్ హామీ
- జగన్ భరోసాపై సర్వత్రా ప్రశంసలు



- ఫ్యామిలీ పేజీలో



### కుప్పంలోనూ నాపై వ్యతిరేకత

జన్మభూమి సభలో అంగీకరించిన సీఎం చంద్రబాబు
పవన్.. మరోసారి సహకరించు.. వచ్చే ఎన్నికల్లోనూ సాయం చేయాలి
నాకు ఇది పరీక్షా సమయం.. నేను చేసిన పనికి ప్రజలు కూలి చెల్లించాలి

- వివరాలు 2లో

## చివరి అంకంలోకి ప్రజా సంకల్పం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన వైఎస్ జగన్


4లో

- అఖండ స్వాగతం పలికిన ప్రజలు.. పోటెత్తిన మహిళలు, యువత
- ప్రతిపక్ష నేతకు తమ కష్టాలు చెప్పుకున్న లోహరిబంద కిడ్నీ బాధితులు
- తమ ప్రాంతంలో ఆరు నెలల్లో 70 మంది వరకూ చనిపోయారని ఆవేదన
- కిడ్నీ బాధితుల కోసం జగన్ ప్రకటించిన రూ.10 వేల పింఛన్, పరిశోధనాస్పత్రిపై హర్షం
- పాదయాత్రికుడికి కష్టాలు చెప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు
- అందరికీ భరోసా ఇస్తూ ముందుకు సాగిన ప్రతిపక్ష నేత

శ్రీకాకుళం జిల్లా హరిపురం వద్ద భారీ జనసందోహం మధ్య పాదయాత్ర సాగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



### ఇదండీ సంగతి



ఎంత చీప్ అయితే మాత్రం ఎందుకు కొట్టించారండీ! విమాన ఇంధనం!

### రెయిన్ గన్.. ఓ విఫల ప్రయోగం

- రెండున్నరేళ్ల క్రితం 13,334 యూనిట్లను కొనుగోలు చేసిన ప్రభుత్వం
- రూ.163 కోట్ల వ్యయం.. నిర్వహణ కోసం మరో రూ.103 కోట్లు
- రైతులకు ఏమాత్రం ఉపయోగపడని గన్‌లు
- చంద్రబాబు రెయిన్ గన్ ప్రారంభించిన పొలంలోనే ఎండిపోయిన పంట
- ఏడాది తర్వాత వాటి ఊసే ఎత్తని ప్రభుత్వం.. ఎక్కడున్నాయో తెలియని వైనం

2లో

## చంద్రబాబు అబద్ధాలకోరు.. స్కాముల్లో మునిగిపోయాడు

ఏపీ ముఖ్యమంత్రిపై విరుచుకుపడ్డ ప్రధాని నరేంద్ర మోదీ

- కేంద్రం ఇచ్చిన నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలి
- నన్ను విమర్శించడం కాదు.. బాబు ఇచ్చిన హామీలు చేశారా?
- ప్రజలకు తానే ఏమీ చేయలేదు కాబట్టే అసత్యాలు ప్రచారం
- 'పోలవరం' నిర్మాణంలో ఏపీ సర్కారు అసమర్థతను 'కాగ్' తప్పుపట్టింది
- చంద్రబాబు అధికారం కోసం విలువల్లేని రాజకీయాలు చేస్తున్నాడు



**సాక్షి, అమరావతి:** కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటప్పుడు గత నాలుగున్నరేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. చంద్రబాబు పేరును నేరుగా ప్రస్తావించకుండా ఆయనను ఒక అబద్ధాలకోరుగా మోదీ అభివర్ణించారు. బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఇలాంటి

మిగతా 2వ పేజీలో ▶




## అంతరిక్షంలో మరో వింత ■ ఖగోళ పరిభాషలో 'పెరిహెలియన్'

**సాక్షి హైదరాబాద్:** అంతరిక్షంలో మరో వింత చోటు చేసుకోబోతుంది. గురువారం భూమిసూర్యుడికి సమీపంగా చేరబోతోంది. ఖగోళ పరిభాషలో సూర్యుడికి భూమి సమీపంగా వెళ్లటాన్ని పెరిహిలియన్ అని, దూరంగా వెళ్లటాన్ని అపిలియన్ అని పిలుస్తుంటారు. గురువారం జరిగే ఈ వింతను పెరిహిలియన్‌గా పిలువనున్నారు. సూర్యుడికి భూమి దగ్గరగా, దూరంగా వెళ్లే ప్రక్రియ ఏటా రెండు మార్లు చోటు చేసుకుంటోంది. సూర్యుడి చుట్టూ భూమి దీర్ఘ వృత్తాకారంలో తిరుగుతుంది. ఈ గమనంలో ఒకసారి సూర్యుడికి సమీపంగా, మరోసారి సూర్యుడికి దూరంగా వెళుతుంది. జనవరి 3న భూమి సూర్యుడికి సమీపంగా వెళుతుంది. ప్రతి ఏటా ఈ వింత చోటు చేసుకుంటోంది. అయితే జీవుల కంటికి నేరుగా కనిపించని ఈ ఘటన ఖగోళపరంగా చాలా ముఖ్యమైంది. దీని వల్ల వాతావరణంపై ఎటువంటి ప్రభావం ఉండబోదని ఖగోళ నిపుణులు చెబుతున్నారు. ఇది ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు ముఖ్యమైన ఒక అంశాన్ని బోధించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**వాతావరణ మార్పులు అపోహే..**

సూర్యుడికి, భూమికి మధ్య దూరం తగ్గటం వలన వాతావరణ మార్పులు వస్తాయనేది అపోహ మాత్రమే అనే విషయాన్ని ఈ ఖగోళ ఘటన ద్వారా రూఢీ చేసుకోవచ్చని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్ తెలిపారు. 'ఈ ఘటనలో భూమి సూర్యుడికి దగ్గరగా వస్తున్నప్పటికీ మనతో సహా ఉత్తర ధృవంలోనూ చలికాలమే కొనసాగుతోంది. జూలైలో భూమి సూర్యుడికి దూరంగా వెళ్లే ఘటన చోటు చేసుకుంటుంది. ఆ సమయంలో మనకు వేసవి కాలం. కాబట్టి సూర్యుడికి, భూమికి మధ్య దూరం తగ్గటం వల్ల రుతువులు ఏర్పడతాయని, లేదా వాతావరణ మార్పులు కలుగుతాయనేది అవాస్తవం. దీర్ఘ వృత్తాకారంలో తిరుగుతున్నప్పుడు భూమి వాలే తీరును బట్టి కాలాలు, రుతువులు ఏర్పడతాయి. ఈ విషయాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవడానికి ఈ ఘటనను వారికి చూపించవచ్చు'అని రఘునందన్ పేర్కొన్నారు.

**పది రోజులు ఉల్కలు..**

2019 జనవరి 12 వరకు సూర్యోదయానికి ముందు ఆకాశంలో ఉల్కలను చూసే అవకాశం ఉందని, ముఖ్యంగా 4వ తేదీ నాడు ఈ అవకాశం మరింత ఎక్కువగా ఉందని రఘునందన్ తెలిపారు. ఉదయం 3 గంటల నుంచి, తూర్పు, ఈశాన్య దిశల్లో రాలే చుక్కల (ఉల్క)ను చూడవచ్చని చెప్పారు.

## టెండర్లు లేకుండా పనులు అప్పగించింది నిజమే

### దేగపూడి–గొట్లపాలెం లింక్ కెనాల్ పనులపై మంత్రి సోమిరెడ్డి



**మనుబోలు:** దేగపూడి–గొట్లపాలెం లింక్ కెనాల్ పనులను టెండర్లు లేకుండా మెగా కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నించిన మాట వాస్తవమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణ రంగంలో అపార అనుభవమున్నందున..తక్కువ కాలంలో పనులు పూర్తి చేయగలదనే నమ్మకంతోనే ఇలా వ్యవహరించామే తప్పా..ఇందులో తనకు ఒరిగేదేమీ లేదన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని పిడూరుపాలెం గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో ఇటీవల వింత రాజకీయాలు చోటు చేసు కుంటున్నాయని చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మెట్ట గ్రామాల రైతులు సాగునీరందక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతుంటే వారి కలను సాకారం చేసేందుకు ఎంతో కష్టపడి దేగపూడి–గొట్లపాలెం లింక్ కెనాల్‌కు రూపకల్పన చేశామని ఆయన చెప్పారు. ఇందుకోసం పరిహారంతో కలిపి రూ.42 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. పరిహారం పోను కాలువ నిర్మాణానికి 31.40 కోట్లతో టెండర్లు పిలిచామని చెప్పారు. అయితే కాలువకు రూ.9 కోట్లే సరిపోతాయని.. మిగిలిన డబ్బంతా తన జేబులోకి పోతుందని సాక్షిలో రాశారని అన్నారు. తనకు విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయని, 2200 కోట్లు విలువైన అటవీ భూములున్నాయని ఇష్టం వచ్చినట్లు రాయడం మంచి సంప్రదాయం కాదని తెలిపారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం సరికాదని పరోక్షంగా కాకాణిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని మంత్రి సోమిరెడ్డి అన్నారు.

## చలి నుంచి కాస్త ఊరట!

- రెండ్రోజులు ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల
- అధికపీడనం, ఈశాన్య గాలుల ప్రభావం



**సాక్షి, విశాఖపట్నం:** రాష్ట్ర ప్రజలను గజగజ వణికిస్తున్న చలి ఒకింత ఊరటనివ్వనుంది. కొన్నాళ్ల నుంచి ఉత్తర, వాయవ్య గాలుల ప్రభావంతో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2 నుంచి 7 డిగ్రీల వరకు తక్కువగా నమోదవున్నాయి. ఫలితంగా అతి శీతల గాలులు (కోల్డ్‌వేవ్స్) వీస్తున్నాయి. దీంతో ఇటు కోస్తాంధ్ర, అటు రాయలసీమల్లో చలి తీవ్ర ప్రభావం చూపుతోంది. విశాఖ ఏజెన్సీలో రాత్రి ఉష్ణోగ్రతలు ఒకట్రెండు డిగ్రీలకు పడిపోయాయి. ఈ తరుణంలో ఒడిశా పరిసరాల్లో అధిక పీడనం ఏర్పడింది. దీనివల్ల గాలులు సముద్రం పైకి వెళ్లి భూమిపైకి వస్తున్నాయి. అదే సమయంలో ఉత్తర గాలులకు బదులు ఈశాన్య గాలులు వీయడం మొదలయ్యాయి. ఫలితంగా కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. అంటే ఇప్పుడు నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతల కంటే 3–4 డిగ్రీలు పెరిగి చలి తీవ్రత తగ్గుముఖం పడుతోంది. అయినప్పటికీ సాధారణంకంటే 2–3 డిగ్రీల తగ్గుదల ఉంటుందని, కానీ గడచిన కొన్ని రోజులతో పోల్చుకుంటే వణుకు తగ్గుతుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు. ఈ పరిస్థితి కొద్దిరోజులే ఉంటుందని అంచనా వేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోకెల్లా అత్యల్పంగా జంగమహేశ్వరపురంలో 11(–6) డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు విశాఖ ఏజెన్సీలోని చింతపల్లిలో 3, లంబసింగిలో 1 డిగ్రీ చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**'ఈశాన్యం' సమాప్తం!**

దాదాపు రెండు నెలల పాటు కొనసాగిన ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించాయి. ఈ రుతుపవనాలు తమిళనాడు, పాండిచేరి, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్రభావం చూపిస్తుంటాయి. బుధవారంతో ఈశాన్య రుతుపవనాల సీజను ముగిసిందని, ఇక ఈ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురవవని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం వెల్లడించింది.

**చలి-పులి**

**రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా..**

| ప్రాంతం | కనిష్ట ఉష్ణోగ్రత |
|---|---|
| జంగమహేశ్వరపురం | 11 |
| అగళి(అనంతపురం) | 5.1 |
| ఆరోగ్యవరం | 12 |
| నంద్యాల | 13 |
| విశాఖపట్నం | 13 |
| బాపట్ల | 13 |
| నందిగామ | 13 |
| అమరావతి | 14 |
| కళింగపట్నం | 14 |
| విజయవాడ | 15 |
| కర్నూలు | 15 |
| తిరుపతి | 15 |
| కడప | 15 |
| తుని | 16 |
| కాకినాడ | 17 |
| కావలి | 17 |
| మచిలీపట్నం | 17 |
| ఒంగోలు | 18 |
| ఆదిలాబాద్ | 6 |
| హైదరాబాద్ | 10 |

### చలి తీవ్రతకు ఇద్దరు మృతి

**జి.మాడుగుల(పాడేరు):** విశాఖ ఏజెన్సీలో చలి గాలులకు తట్టుకోలేక బుధవారం ఇద్దరు మృతి చెందారు. జి.మాడుగుల మండలం నేరేడువలసకు చెందిన ఎల్.నారాయణమ్మ(70), జి.మాడుగులకు చెందిన షేక్ రాజాసాహెబ్ (85) చలి తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందారు. మన్యంలో మూడు రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉంది. ప్రజలు గజగజ వణుకుతున్నారు.

# రెయిన్ గన్.. ఓ విఫల ప్రయోగం

**రెండున్నరేళ్ల క్రితం 13,334 యూనిట్లను కొనుగోలు చేసిన ప్రభుత్వం**

**రూ.163 కోట్ల వ్యయం.. నిర్వహణ కోసం మరో రూ.103 కోట్లు**

- కరువు బారినపడ్డ పంటలను కాపాడుతామంటూ సీఎం ఆర్భాటం
- రైతులకు ఏమాత్రం ఉపయోగపడని గన్‌లు
- చంద్రబాబు రెయిన్ గన్ ప్రారంభించిన పొలంలోనే ఎండిపోయిన పంట
- ఏడాది తర్వాత వాటి ఊసెత్తని ప్రభుత్వం

**సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు**

వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వం కొనుగోలు చేసిన రెయిన్ గన్స్ ఇపుడు ఎక్కడ ఉన్నాయి? రాష్ట్రాన్ని కరువు కుదిపేస్తున్న తరుణంలో రెయిన్‌గన్స్ గురించి చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పగా ప్రచారం చేసిన రెయిన్ గన్‌లు ప్రస్తుతం ఎక్కడున్నాయో.. ఏమైపోయాయో, వాటిని ఎవరైనా వాడుతున్నారో లేదో ఎవరికీ తెలియడం లేదు. రూ.వందల కోట్ల ప్రజాధనం కుమ్మరించి, కొనుగోలు చేసిన రెయిన్‌గన్స్ ఆచూకీ లేకుండాపోయాయి. రెండేళ్ల క్రితం రెయిన్ గన్‌ల గురించి భారీగా ప్రచారం చేసిన ప్రభుత్వం ఆ తర్వాత వాటి ఊసెత్తడం మానేసింది. వర్షాధార పంటలకు మాత్రమే ఉపయోగపడే రెయిన్ గన్‌లతో అన్ని పంటలనూ కాపాడుకోవచ్చని ప్రభుత్వం ప్రచారం చేసింది. అయితే, అవి రైతులకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. గతంలో ఒక్కొక్క మండలానికి 3 నుంచి 10 వరకు రెయిన్ గన్స్‌ను పంపిణీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయ శాఖ అధికారులు 15 కంపెనీల నుంచి వీటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వర్షాధార పంటలకు ఒకటి లేదా రెండు తడులు ఇవ్వడానికి మాత్రమే రెయిన్ గన్‌లను డిజైన్ చేశారు. పొలాలకు సమీపంలోని నీటి గుంతలు, చెరువులు, కాలువలు, ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి, రెయిన్ గన్‌ల సాయంతో సగటున ఎకరం పొలం తడిసేలా ఏర్పాటు చేయవచ్చు. అయితే వర్షాధార పంటలకు మాత్రమే ఇవి పనికొస్తాయి.

### ఒక్కో యూనిట్ ధర రూ.50 వేల పైమాటే

కరువు బారినపడ్డ పంటలను రక్షిస్తామంటూ.. రైతులకు ఇవ్వాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టి రూ.163 కోట్లు ఖర్చు పెట్టి 13,334 రెయిన్ గన్‌లు, స్ప్రింకర్లు, 7,970 ఆయిల్ ఇంజిన్లు, 3.50 లక్షల నీటి పైపులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ కోసం మరో రూ.103 కోట్లు ఖర్చు పెట్టింది. రెయిన్‌గన్‌ల కొనుగోలు వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి జరిగినట్టు అప్పట్లో శాసనసభలో దుమారం చెలరేగింది. ప్రభుత్వం కొనుగోలు చేసిన 13,334 రెయిన్‌గన్‌లు ప్రస్తుతం ఎక్కడున్నాయో తెలియదు. అవి ఇప్పుడు ఎక్కడా పంటల పొలాల్లో పెద్దగా కనిపించడం లేదు. వాస్తవానికి రెండేళ్లుగా ప్రభుత్వంతో సహా రైతులు కూడా రెయిన్ గన్‌లను పూర్తిగా మరిచిపోయారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల్లో వ్యవసాయశాఖ గోదాములకే రెయిన్ గన్ కిట్లు పరిమితమయ్యాయి. రాష్ట్రంలో 11 జిల్లాల్లో ఇవి ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలో వీటిని అసలు వినియోగించలేదు. రెయిన్ గన్ కిట్‌లో రూ.6 వేల ఖరీదు



చేసే రెయిన్ గన్, రూ.24 వేల ఖరీదైన ఆయిల్ ఇంజిన్, రూ.14 వేల విలువైన 20 పైపులు, రూ.7 వేల విలువ చేసే స్ప్రింక్లర్ల సెట్ ఉంటాయి. ఒక యూనిట్ ఖరీదు రూ.50 వేలకు పైగానే ఉంటుంది.

### టీడీపీ నేతల ఇళ్లల్లో రెయిన్‌గన్‌లు

ఉద్యాన వన, సూక్ష్మ నీటిపారుదల పథకం కింద ప్రభుత్వం కొనుగోలు చేసిన 13,334 రెయిన్ గన్‌లు అడ్రస్ లేకుండా పోయాయి. అప్పట్లో రెయిన్ గన్‌లు కొన్న తర్వాత 2016 ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాలోనే మకాం వేసి 4 రోజుల్లో 4 లక్షల ఎకరాల్లో పంటలను కాపాడామని ప్రకటించారు. చంద్రబాబు రెయిన్ గన్‌ను ప్రారంభించిన పొలంలోనే పంట ఎండిపోయింది. ఇప్పుడా రెయిన్ గన్‌లు, వీటికి ఉపకరణాలైన ఆయిల్ ఇంజిన్లు, స్ప్రింక్లర్లు, పైపులు, ఇతరత్రా సామగ్రిలో మూడొంతులు అధికార తెలుగుదేశం పార్టీ నేతల ఇళ్లకు చేరాయి. ఈ రెయిన్ గన్స్‌లో దాదాపు సగం అంటే 6,426 గన్లను, 4306 ఆయిల్ ఇంజన్లను, 5,894 స్ప్రింకర్లు, 4.11 లక్షల పైపులను అనంతపురం జిల్లాకు ఇచ్చామని అధికారిక లెక్కలు చూపినా వీటిల్లో 60 శాతం ఎక్కడున్నాయో తెలియడం లేదని వ్యవసాయ శాఖ గుర్తించింది. ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చివరకు ఏం చేయాలో తెలియక వ్యవసాయ అధికారులు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేయాల్సి వచ్చింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే రెయిన్ గన్‌లతో 2018లో కూడా వేలాది ఎకరాల్లో పంటలను కాపాడానని సీఎం ఇటీవల శ్వేతపత్రంలో పేర్కొనడం గమనార్హం.

### రైతులకు సగం సబ్సిడీ..

రెయిన్ గన్లను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తుంది. రైతులే కొనుక్కుంటామంటే వారికున్న పొలాన్ని బట్టి రాయితీ ఇస్తుంది. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం, ఆపైన ఉండే వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలన్నది ప్రభుత్వ పాలసీ.. ఎకరా పంటపై నీటిని చల్లేందుకు రూ.3 వేల వ్యయం అవుతుందని అంచనా వేసి ఇందులో సగం అంటే రూ.1,500లను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందన్న మాట. రైతులు కొనగా మిగిలిన రెయిన్ గన్స్‌ను ప్రభుత్వమే భద్రపరచాల్సి ఉంది. ఈ రెయిన్ గన్స్ కిట్లను వ్యవసాయ శాఖ గోదాములలో భద్రపరిచినట్లు శాసనసభలో చర్చ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది. వీటి నిర్వహణకు 103 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు కూడా తెలిపింది. వాస్తవానికి రెయిన్‌గన్స్‌ను రైతులెవరూ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. అన్నీ టీడీపీ నేతల ఇళ్లకు చేరిపోయాయి.

### రెయిన్‌గన్ అంటే?

బిందు, తుంపర సేద్యానికి ఉపయోగించే పరికరం లాంటిదే రెయిన్‌గన్. పంటను బట్టి రెయిన్ గన్ స్టాండ్లను ఏర్పాటు చేస్తారు. జొన్న, సజ్జ, చెరకు వంటి వాటికైతే ఐదారు అడుగులు, మిర్చి, పత్తి తదితర పంటలకు రెండు మూడు అడుగుల ఎత్తులో స్టాండ్లను అమర్చుతారు. సామర్థ్యాన్ని బట్టి కొన్ని రెయిన్‌గన్లు సుమారు 45 మీటర్ల వరకు కూడా నీటిని విరజిమ్ముతాయి. ఇది పని చేయడానికి 5 హెచ్‌పీ ఇంజిన్ కావాలి. బోర్లు, బావులు, కాలువలు, చెరువులు, కుంటల్లో నీరున్నప్పుడే వీటిని వినియోగించడం సాధ్యమవుతుంది. లేదంటే ఎక్కడి నుంచైనా ట్యాంకర్లతో తెచ్చుకోవాలి. నీటి వనరులున్న ప్రాంతం వద్ద ఆయిల్ ఇంజిన్‌ను ఏర్పాటు చేసి పైపుల ద్వారా నీటిని రెయిన్‌గన్‌కు అందిస్తే అది నీటిని చిమ్ముతుంది. ఎక్కడి నుంచో నీటిని తీసుకొచ్చి చేలను తడుపుతామనడం అశాస్త్రీయమని నిపుణులు చెబుతున్నారు.

### రెయిన్ గన్ ప్రయోగం కొత్తేమీ కాదు

నిజానికి రెయిన్‌గన్ల ప్రయోగం కొత్తదేమీ కాదు. హైదరాబాద్‌లోని కేంద్రీయ మెట్ట పంటల పరిశోధనా కేంద్రం(క్రిడా)లో వీటిని పదేళ్ల క్రితమే ప్రయోగించారు. ఒక్కో గన్ నిమిషానికి 240 లీటర్ల చొప్పున 24 మీటర్ల చుట్టూ వృత్తాకారంలో నీటిని చిమ్ముతుంది. ఒక్కో విడతకు 1,809 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గంటకు 14,400 లీటర్ల నీటిని వెదజల్లుతుంది. అంటే కేవలం 8 మిల్లీమీటర్ల వర్షపాతంతో సమానం. అనంతపురం వంటి జిల్లాల్లోని తేలికపాటి ఎర్రభూముల్లో ఈ నీటి పరిమాణం ఏమాత్రం సరిపోదు. మెట్టప్రాంతాల్లో ఎండిపోయే దశకు వచ్చిన పంటలకు కనీసం 30 మిల్లీమీటర్ల వర్షపాతం కావాలి. భూమిలో 15 సెంటీమీటర్ల లోతు వరకు తడిపినప్పుడు మాత్రమే పంట నిలుస్తుంది. ఇంతటి నీటి తడి ఇవ్వాలంటే రెయిన్‌గన్లు కనీసం 3 గంటల 45 నిమిషాలు పని చేయాలి. రెండు మూడు సార్లు షిఫ్ట్ పద్ధతిలో వీటిని ఉపయోగించాలి. ఎకరానికి 30 మిల్లీమీటర్ల వర్షపాతానికి సమానమైన నీటి తడి పెట్టాలంటే 1,21,500 లీటర్ల నీరు కావాలి. ఇంత నీరు అంటే ఒక్కొక్కటి 6 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న 20 ట్యాంకులు కావాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రెయిన్‌గన్లతో ఇచ్చిన నీరు కేవలం 5 మిల్లీమీటర్ల వర్షపాతంతో సమానం. ముఖ్యమంత్రి చెప్పినట్టు కేవలం నాలుగు రోజుల్లో 4 లక్షల హెక్టార్లలో పంటలను కాపాడాలంటే 20 లక్షల ట్యాంకర్లు కావాల్సి ఉంటుంది. రాష్ట్రం మొత్తం వెతికినా ఇన్ని ట్యాంకర్లు గానీ, నీళ్లు గానీ కనిపించవు. అంటే నీరు, ట్రాక్టర్లు లేకుండా రెయిన్ గన్లు కొనుగోలు చేసి, కమీషన్లు మింగేశారే తప్ప వాటివల్ల దమ్మిడీ ప్రయోజనం లేకుండా చేశారు.

**2016 ఆగస్టు 28**

''వరుణ దేవుడు కరుణించకపోయినా మీరెవరూ భయపడాల్సిన పని లేదు. వర్షం కురవకపోయినా రెయిన్ గన్‌లతో వర్షం కురిపిస్తా. మీ పంటను కాపాడే బాధ్యత నాదీ''

*– అనంతపురం జిల్లా గుండువారిపల్లికి చెందిన రైతు శివన్న పొలంలో రెయిన్ గన్‌ను ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట*

**2016 సెప్టెంబర్ 12**

''చంద్రబాబు వస్తారని ఆగస్టు 27 రాత్రి నా పొలం పక్కన ఓ కుంట తవ్వారు. అందులో ప్లాస్టిక్ పట్టా వేసి ట్యాంకర్లతో నీటిని నింపారు. చంద్రబాబు వచ్చిన తర్వాత 10 నిమిషాలు రెయిన్‌గన్‌లు నడిపారు. ముఖ్యమంత్రి అటుపోగానే రెయిన్ గన్లతోపాటు పట్టాను, పైపులను తీసుకుపోయారు. ఐదు ఎకరాలకు రెండు ఫైరింజన్ల నీళ్లు ఏం సరిపోతాయి? పంట పూర్తిగా ఎండిపోయింది. బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలసవెళ్లా''

*– శివన్న, రైతు, గుండువారిపల్లి, ఆమడగూడూరు మండలం, అనంతపురం జిల్లా*

**2018 డిసెంబర్ 26**

''రెయిన్ గన్‌లతో లక్షలాది ఎకరాల్లో పంటలను కాపాడాం. ప్రస్తుతం రబీలో అనంతపురం, వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో సైతం 15,296 హెక్టార్లలో పంటలకు తడులు అందించాం''

*– వ్యవసాయ రంగంపై శ్వేతపత్రం విడుదల చేస్తూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు*

# చంద్రబాబు అబద్ధాలకోరు.. స్కామ్‌ల్లో మునిగిపోయాడు

▶ మొదటి పేజీ తరువాయి

తప్పుడు ప్రచారమంతా.. నిజం(వాస్తవం) అనే సునామీలో కొట్టుకుపోక తప్పదని అన్నారు. రాష్ట్రంలోని కాకినాడ, మచిలీపట్నం, నరసాపురం, విశాఖపట్నం, విజయనగరం లోక్‌సభ నియోజకవర్గాల్లోని బీజేపీ బూత్ కమిటీ నాయకులతో మోదీ బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దాదాపు గంటపాటు పార్టీ నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని గరివిడి మండల బీజేపీ అధ్యక్షుడు అడిగిన ప్రశ్నకు మోదీ బదులిస్తూ... ''ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోందో నాకు తెలుసు. మీ బాధ కూడా తెలుసు. బీజేపీపై, కేంద్రంపై విమర్శలు చేస్తున్న ఆయన(చంద్రబాబు పేరును ప్రస్తావించకుండా) ఏ హామీని అమలు చేశారో చెప్పమనండి. నాపై మాత్రం విమర్శలు చేస్తున్నారు. ఆయన ఏదైనా కొంతచేసి ఉంటే ఇంకొకరిని విమర్శించడానికి అవకాశం ఉంటుంది. అతను చేసింది చూపించడానికి ఏమీ లేకపోగా అసత్యాలను మాత్రమే చెబుతున్నారు. తాను ఏమీ చేయకుండానే పక్కవారిపై విమర్శలు చేయడానికి అసక్తి ప్రదర్శిస్తున్నారు'' అని చురకలంటించారు. ఆయన కుంభకోణాల్లో(స్కామ్‌లు) నిండా మునిగిపోయారని చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### 'పోలవరం'లో రాష్ట్ర సర్కారు అసమర్థత

ఆంధ్రప్రదేశ్‌కు రెవెన్యూ లోటు భర్తీ కింద కేంద్రం రూ.23,000 కోట్ల సాయం అందజేసిందని ప్రధాని మోదీ తెలిపారు. కేంద్రం నుంచి నిధులు రాలేదని చెబుతున్న వాళ్లను ఆ నిధులు ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించాలని బీజేపీ రాష్ట్ర నాయకులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం ఈ నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన నిధులు ఎక్కడికి వెళ్లాయో ప్రశ్నించాలన్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.1,000 కోట్లు ఇచ్చినా సరైన సమయంలో సక్రమంగా ఖర్చు పెట్టలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తూ దాని నిర్మాణానికి కేంద్రం వంద శాతం ఆర్థిక సహాయం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రాజెక్టు నిర్మాణ పర్యవేక్షణ చేస్తోందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.7 వేల కోట్లు ఇచ్చినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా దాని నిర్మాణం చేపట్టడం లేదని విమర్శించారు. పోలవరం నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను 'కాగ్' తప్పుపట్టిందని మోదీ గుర్తుచేశారు.

### తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

రాష్ట్రంలో 10 జాతీయ విద్యా సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేశామని, గతంలో అధికారంలో ఉన్న ఏ కేంద్ర ప్రభుత్వమైనా రాష్ట్రానికి ఒక్క విద్యా సంస్థను కూడా మంజూరు చేయలేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని ప్రధాని మోదీ సూచించారు. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా ఏపీలో 38 లక్షల కుటుంబాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులిచ్చామన్నారు. పీఎంజీఎస్‌వై పథకంలో 2,000 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. రెండు లక్షల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు, రెండున్నర లక్షల మంది ఉపాధి కోసం శిక్షణ, ఆరు లక్షల ఇళ్లు, ముద్రా పథకంలో రూ.7 వేల కోట్ల రుణాలు రాష్ట్ర ప్రజలకు కేంద్రం సాయం చేసిందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతి కార్యకర్త ఒక ఆయుధమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### ఎన్టీఆర్ చెప్పింది చంద్రబాబు తప్పనగలరా?

చంద్రబాబు అసత్యాలను ప్రచారం చేయడమే కాకుండా, అధికారం కోసం విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీ రామారావు కాంగ్రెస్ పార్టీని దుష్ట కాంగ్రెస్ అని చెప్పేవారని.. ఇప్పుడు చంద్రబాబు అధికారం కోసం అదే కాంగ్రెస్‌తో దోస్తీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అంటే ఆనాడు ఎన్టీఆర్ చెప్పింది తప్పు అని ఇప్పుడు చంద్రబాబు వాళ్ల పార్టీ కార్యకర్తలకు చెబుతున్నాడా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఎన్టీ రామారావు మాటలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇలాంటి అపవిత్ర పొత్తును తెలంగాణ ఎన్నికల్లో అక్కడి ప్రజలు తిరస్కరించారని.. ఏపీలోనూ మహాకూటమికి అలాంటి ఫలితాలే వస్తాయని తేల్చిచెప్పారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు.

### పార్టీ విజయం కోసం కృషి చేయాలి

నాలుగున్నరేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీ విజయం కోసం కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించారు. బూత్ స్థాయిలో గెలుపు అంటే పార్టీ గెలుపేనని అన్నారు. ప్రజాస్వామ్యమంటే ఒక పండుగ వంటిందని...18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడిని ఓటరుగా నమోదు చేయించడం ద్వారా వారిని ఈ పండుగలో భాగస్వామ్యులను చేయాలని మోదీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం నుంచి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, విశాఖపట్నం నుంచి దగ్గుబాటి పురంధరేశ్వరి, నరసాపురం నుంచి మాజీ మంత్రి పి.మాణిక్యాలరావు, కాకినాడ నుంచి పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ సోము వీర్రాజు, రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు చలపతిరావు పాల్గొన్నారు.

# కుప్పంలోనూ నాపై వ్యతిరేకత

- జన్మభూమి సభలో అంగీకరించిన సీఎం చంద్రబాబు
- పవన్.. మరోసారి సహకరించు
- వచ్చే ఎన్నికల్లోనూ సాయం చేయాలి
- నాకు ఇది పరీక్షా సమయం
- నా పనికి ప్రజలు కూలి చెల్లించాలి



**చిత్తూరు, సాక్షి:** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వచ్చే ఎన్నికల్లో కూడా తనకు సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. తన సొంత నియోజకవర్గం కుప్పంలోనూ తన పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఆయన అంగీకరించారు. కుప్పంలో గురువారం నిర్వహించిన 6వ విడత జన్మభూమి సభలో చంద్రబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా తాను చేసిన మంచి పనులకు ప్రజలు కూలి చెల్లించాల్సిన సమయం ఆసన్నమైందని, తనను ఆశీర్వదించాలని కోరారు. కుప్పం ప్రజలకు తాను అందుబాటులో ఉండనని, ఇక్కడ అభివృద్ధి కొంత మేర కుంటుపడటం వాస్తవమేనని అంగీకరించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందడం లేదని ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. తెలంగాణా సీఎం కేసీఆర్ తనను ఎంత తిట్టినా ప్రజల కోసం భరిస్తున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉండకూడదనే దుర్బుద్ధితో కేసీఆర్ పని చేస్తున్నారని ఆరోపించారు. ఇది తనకు పరీక్షా సమయమని, ప్రజలు సహకరించాలని చంద్రబాబు కోరారు.


**పెద్ద నోట్ల రద్దు పనికిమాలిన చర్య..**

రాష్ట్రం, దేశం ప్రయోజనాల కోసమే తాను కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా మోదీ మొండిచెయ్యి చూపిస్తున్నారన్నారు. పెద్దనోట్ల రద్దు పనికిమాలిన చర్య అని విమర్శించారు.

**336వ రోజు**

02–01–2019, బుధవారం

తురకశాసనం, శ్రీకాకుళం జిల్లా




## చావుకోసం ఎదురుచూస్తున్నామని చెబుతుంటే గుండె తరుక్కుపోయింది..

ఈ రోజు మందస, సోంపేట మండలాల్లో పాదయాత్ర సాగింది. ఉదయం బాలిగంకు చెందిన భారతీ, ప్రవీణ్ అనే దంపతులు కలిశారు. నాన్నగారి వల్ల వారి కుటుంబానికి జరిగిన ఎనలేని మేలును తలచుకుని కృతజ్ఞతలు చెప్పారు. నాన్నగారి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల సోదరి భారతీ అక్క డాక్టర్ అయ్యిందట. భారతీతో పాటు ఆమె అన్న కూడా ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగం చేస్తున్నారు. ప్రవీణ్‌కేమో నాన్నగారి హయాంలో రుణమాఫీ అయ్యింది.. ఇందిరమ్మ ఇల్లు వచ్చింది. ఉచిత విద్యుత్ అందింది. వారింట్లో పాపకు ఒళ్లు కాలిపోతే నాన్నగారి ఆరోగ్యశ్రీ పుణ్యమాని ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ జరిగిందని చెప్పారు. మీ నాన్నగారే లేకుంటే ఓ సామాన్య రైతు కుటుంబానికి చెందిన మాకు ఇవన్నీ సాధ్యమయ్యేవా? అంటూ ఆ దంపతులు ఉద్వేగానికి గురయ్యారు. వాళ్లను చూసి చాలా సంతోషమేసింది. నాన్నగారిలా జనం గుండెల్లో నిలిచిపోవడం కన్నా అదృష్టం ఏముంటుంది? మనిషి జన్మకు ఇంతకంటే సార్థకత ఏముంటుంది?

ఈ రోజు కూడా ప్రతి చోటా కిడ్నీ బాధితులు కలుస్తూనే ఉన్నారు. లోహరిబంద పంచాయతీ నుంచి చాలామంది కిడ్నీ బాధితులు వచ్చి కలిశారు. ఆ పంచాయతీలోనే వందల సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారట. విషాదమేంటంటే.. ఈ మధ్యనే పదుల సంఖ్యలో కిడ్నీ వ్యాధులతో మరణించారట. ప్రజలిలా పిట్టల్లా రాలిపోతున్నా.. అధికార పార్టీ నేతలకు చీమకుట్టినట్లయినా లేకపోవడం అత్యంత బాధాకరం. ఆ గ్రామమంతా యాదవులు, మత్స్యకార సోదరులే. కిడ్నీ రోగాల బారినపడి ఓ వైపు భూములు అమ్ముకుంటూ, మరో వైపు అప్పులు చేస్తున్నారు. పింఛన్లు రావడం లేదు. మందులివ్వడం లేదు. ఆస్పత్రికి వెళ్తే వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. బస్ పాసుల్లేవు. డయాలసిస్‌కు వెళ్తే నెల రోజులు ఆగమంటున్నారు. విధిలేక ప్రయివేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. అదీ లేనివాళ్లు.. చావుకోసం ఎదురుచూస్తున్నామని చెబుతుంటే గుండె తరుక్కుపోయింది. ఇంత దారుణ బాధలు అనుభవిస్తున్న ఆ పంచాయతీ ప్రజలకు సరిగా మంచినీరు కూడా సరఫరా చేయడం లేదట. రక్షిత మంచినీటి పథకంలో కూడా బురదనీరే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే.

గౌడగొరంటి నుంచి ఒక కౌలు రైతు కొడుకు రమేష్‌చౌదరి వచ్చి కలిశాడు. నాలుగేళ్ల కిందట కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నాడట. ఆరోగ్యశ్రీ వర్తించక, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయమూ అందక.. ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకున్నాడు. అదీ సరిపోక లక్షల్లో అప్పు చేశాడు. నెలనెలా వడ్డీలకు రూ.10 వేలు, మందులకు రూ.15 వేలు అవుతున్నాయని కన్నీరు పెట్టాడు. ఓ సాధారణ కౌలు రైతు కుటుంబానికి నెలకు పాతిక వేలు ఖర్చన్నది తలకు మించిన భారం కాదా?

ప్రజా సంకల్ప యాత్రలో చిట్టచివరి నియోజకవర్గమైన ఇచ్ఛాపురంలోకి అడుగుపెట్టాను.

**ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. మీరు రూ.500 కోట్లకు పైగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయి. మీ విలాసాలకు, విదేశీయానాలకు, ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న ధర్మపోరాట దీక్షలకు, తుపాను పరిహారం పేరిట మీరిచ్చిన చెల్లని చెక్కుల పంపిణీ ప్రచార కార్యక్రమాలకు వందల కోట్ల ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంలా ఖర్చుపెడుతున్న మీరు.. పేదల ప్రాణాలను రక్షించే పథకాలకు మాత్రం నిధులివ్వకపోవడం మానవత్వమేనా?**

వై.యస్. జగన్

## విశాఖలో కౌలు రైతు ఆత్మహత్య

**చీడికాడ(మాడుగుల):** విశాఖపట్నం జిల్లా చీడికాడ మండలం జి.కొత్తపల్లి పంచాయతీ శివారు చినగోగాడకు చెందిన కౌలు రైతు ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులతో పాటు వడ్డీ భారం పెరిగిపోవడంతో మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగిన పడాల సూర్యనారాయణ (72) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సూర్యనారాయణకు ఎకరం న్నర పొలం ఉండగా, మరో ఎకరం కౌలుకు తీసుకుని వరి, చెరకు పంటలు సాగుచేశాడు. మదుపుల కోసం చీడికాడ కెనరా బ్యాంకులో రూ.34 వేలు అప్పు తెచ్చాడు. బంగారం కుదువపెట్టి మరో రూ.2.5 లక్షలు తెచ్చాడు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మొత్తం పంట పాడైపోయింది. దీంతో తీవ్ర మనస్థాపంతో ఆయన ఆరోగ్యం దెబ్బతింది. అప్పులు తడిసి మోపెడవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# కుట్రపూరితంగానే ఆధారాలు ధ్వంసం?

- ‘ఆయేషా’ హత్యాచారం కేసులో సీబీఐ నిర్ధారణ
- ముగ్గురు కోర్టు ఉద్యోగులపై కేసు నమోదు
- హైదరాబాద్, విశాఖపట్నం సీబీఐ యూనిట్లుగా రెండు కేసులు దర్యాప్తు

**సాక్షి, అమరావతి/అమరావతిబ్యూరో:** సంచలనం రేపిన ఆయేషామీరా హత్య కేసుపై సీబీ‘ఐ’ దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో కీలకమైన సాక్ష్యాలను ధ్వంసం చేశారంటూ ముగ్గురు కోర్టు ఉద్యోగులపై సీబీఐ కేసు నమోదు చేయడం సంచలనం రేపుతోంది. ఆ ముగ్గురితోపాటు మరికొందరు అంటూ సీబీఐ పేర్కొనడంతో వారు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. ఇందులో కుట్ర కోణం ఉందంటూ సీబీఐ దర్యాప్తు బృందం తీగలాగుతోంది. దీంతో ఎవరి డొంక కదులుతుందన్నది చర్చనీయాంశమైంది. ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తును సీబీఐకు అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెల్సిందే. ఈ కేసును రెండు సీబీఐ బృందాలు రెండు కేసులుగా నమోదు చేసి వేర్వేరు కోణాల్లో దర్యాప్తు చేపట్టాయి. హైదరాబాద్‌లోని సీబీఐ బృందం ప్రధాన కేసు దర్యాప్తు చేస్తోంది. విశాఖపట్నంకు చెందిన సీబీఐ యూనిట్ మాత్రం కీలకమైన సాక్ష్యాలు ధ్వంసం చేసిన కేసును దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే సాక్ష్యాల ధ్వంసంలో విజయవాడ కోర్టుకు చెందిన ముగ్గురు ఉద్యోగులు, మరికొందరి పాత్రను నిగ్గు తేల్చారు. దీనిలో ఒక మహిళా ఉద్యోగితోపాటు మరో ఇద్దరు కుట్రదారులు ఉన్నట్టు సీఐబీ నివేదికలో పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. 2010 డిసెంబర్ 10న సత్యంబాబుకు శిక్ష పడిన మూడు నెలలకు మహిళా కోర్టు జూనియర్ అసిస్టెంట్ టి.కుమారి కమిటల్ కోర్టు (4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, విజయవాడ)కు సాక్ష్యాలు పంపారు. కమిటల్ కోర్టులో అప్పటి ప్రాపర్టీ క్లర్క్ కె.జయలక్ష్మి వాటిని తీసుకుని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేశారు. అయితే 2014 సెప్టెంబర్ 7న ఈ కేసులో సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు అనుమతి కోరుతూ కమిటల్ కోర్టు మెజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ ముందు అప్పటి కోర్టు ప్రాపర్టీ క్లర్క్ పి.వెంకటకుమార్ ఫైలు పెట్టారు. కోర్టు ఇన్‌స్పెక్షన్ ఉన్నందున ధ్వంసానికి అనుమతివ్వాలని కోరడంతో న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసినట్టు చెబుతున్నారు. దీంతో సాక్ష్యాలను ధ్వంసం చేశారని సీఐబీ నివేదికలో పేర్కొన్నారు. సాధారణంగా ఏ కేసులోనైనా అప్పీలు వేశారా? అప్పీలు గడువు ముగిసిందా? హైకోర్టులో ఏం జరిగింది? అనే విషయాలను పరిశీలించాకే సాక్ష్యాల ధ్వంసంపై న్యాయస్థానాలు నిర్ణయం తీసుకుంటాయి. కానీ ఆయేషా మీరా కేసులో హైకోర్టులో అప్పీలు పెండింగ్ ఉందన్న విషయాన్ని ప్రాపర్టీ క్లర్క్ వెంకటకుమార్ ఎక్కడా ప్రస్తావించలేదని సీబీఐ పేర్కొంది. ఈ కేసులో సాక్ష్యాలను ధ్వంసం చేసే ముందు అప్పీలు విషయం చూసుకోని క్లర్క్ టి.కుమారిని కుట్రదారుల్లో ఏ–1గానూ, హైకోర్టులో అప్పీలు విషయం 2011 జనవరిలోనే తెలిసినా స్థానిక కోర్టుకు తెలియజేయని విజయవాడ మహిళా కోర్టు సీనియర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డిని ఏ–2గానూ, కోర్టు ప్రాపర్టీ క్లర్క్ పి.వెంకటకుమార్‌ను ఏ–3గానూ సీబీఐ పేర్కొంది.సాక్ష్యాలు ధ్వంసం కుట్ర కేసులో వారిపై పలు సెక్షన్లు నమోదు చేసిన సీబీఐ ప్రివెన్షన్ అప్ కరప్షన్ సెక్షన్ కింద కూడా నమోదు చేశారు.

## గృహ నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

### అధికారులకు సీఎస్ ఆదేశాలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీటిడ్కో) ద్వారా చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర స్థాయి శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిదశ గృహ నిర్మాణాలను ఎట్టిపరిస్థితుల్లోనూ 4 నెలల్లో పూర్తి చేయాలన్నారు. కేంద్ర నిధులు, రాష్ట్ర వాటా నిధులు సకాలంలో సమకూరేలా కృషిచేయాలని ఆర్థికశాఖ అధికారులకు సూచించారు. ఏపీటిడ్కో ఎండీ బి.యం.దివాన్ మైదీన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ ఎన్టీఆర్ నగర్స్ పథకం కింద 5,29,786 ఇళ్లు మంజూరు కాగా, 3,60,365 ఇళ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్‌కు సంబంధించి 4,28,444 ఇళ్లు మంజూరు కాగా, 71 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాములు, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ కె.కన్నబాబు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కె.వి. సత్యనారాయణ, ఏపీటిడ్కో ఇంజనీర్లు పాల్గొన్నారు.

**జన్మభూమికి అదనపు బృందాలు**

జన్మభూమి కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు గ్రామాలకు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో (మల్టీ డిసిప్లైనరీ) అదనపు బృందాలను ఏర్పాటు చేస్తామని అనిల్ చంద్ర పునేఠ పేర్కొన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో జన్మభూమిపై సమీక్ష నిర్వహించారు. జన్మభూమి జరిగే తేదీలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. జన్మభూమి కార్యక్రమాలపై ప్రజాస్పందన ఎలా ఉందో ఏరోజుకు ఆరోజు క్షేత్రస్థాయి నుంచి నివేదికలను పంపించాలని ఆదేశించారు.

## ‘విజన్ డాక్యుమెంట్’ కన్సల్టెన్సీ ఫీజుకు రూ.1.95 కోట్లు

**సాక్షి, అమరావతి:** జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించేందుకు కన్సల్టెన్సీ ఫీజు నిమిత్తం ప్రభుత్వం రూ.1.95 కోట్లు విడుదల చేసింది. జిల్లాకు రూ.15 లక్షల చొప్పున రూపాయల చొప్పున 13 జిల్లాలకు ఈ మొత్తాన్ని విడుదల చేస్తూ ప్రణాళికా శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## హోదా కోసం నేడు, రేపు ఢిల్లీలో నిరసనలు: రామకృష్ణ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురు, శుక్రవారాల్లో ఢిల్లీలో నిరసనలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. రెండు రోజులపాటు తలపెట్టిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని నాయకులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంకల్ప యాత్ర

**336వ రోజు**

ఇప్పటి వరకు నడిచిన దూరం

**3,593.6**

కిలో మీటర్లు

**336వ రోజు**

నడిచిన దూరం

**8.6 కిలో మీటర్లు**

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు హరిపురం

ముగింపు: తురకశాసనం

**ముఖ్యాంశాలు**

- శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం మందస మండలం హరిపురం, అంబుగాం, ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలం రాణిగాం, మామిడిపల్లి, పాత్రపురం క్రాస్, తురకశాశనం గ్రామాల ప్రజలతో మమేకం.





రాణిగాంలో వైఎస్ జగన్‌తో పాటు పాదయాత్రలో నడుస్తున్న జనవాహిని

# చివరి అంకంలోకి ప్రజా సంకల్పం



అంబుగాంలో వైఎస్ జగన్‌తో కలిసి నడుస్తున్న చిన్నారి విద్యార్థినులు

**ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:** రాష్ట్రంలో సాగుతున్న మోసపూరిత పాలనకు బలై కునారిల్లుతున్న రాష్ట్ర ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని.. వారికి భరోసా ఇచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 14 నెలల కిందట ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర బుధవారం చిట్టచివరి అంకానికి చేరుకుంది. మధ్యాహ్నం జగన్ పలాస నియోజకవర్గ సరిహద్దు దాటి తాళభద్ర జంక్షన్ వద్ద ఇచ్ఛాపురం శాసనసభ నియోజకవర్గంలోకి ప్రవేశించారు. ఇడుపులపాయ

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన వైఎస్ జగన్
- అఖండ స్వాగతం పలికిన స్థానిక ప్రజలు.. పోటెత్తిన మహిళలు, యువత
- ప్రతిపక్ష నేతకు తమ కష్టాలు చెప్పకున్న లోహరిబంద కిడ్నీ బాధితులు

నుంచి ఇచ్ఛాపురం దాకా ప్రజలకు చేరువవుతూ కాలినడకన రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తానని జగన్ ప్రకటించిన విషయం విదితమే. దారి పొడవునా ప్రజల వెతలను తెలుసుకుంటూ, వివిధ వర్గాల నుంచి జయ జయధ్వానాలు అందుకుంటూ ముందుకు సాగిన జగన్.. రాష్ట్ర ప్రజల ఇబ్బందులు, వారి కష్టాలను ఆకళింపు చేసుకున్నారు. ఆయన ఇచ్ఛాపురం పరిధిలోకి ప్రవేశించేటప్పుడు స్థానిక ప్రజల నుంచి అఖండ స్వాగతం లభించింది. పార్టీ పతాకంలోని రంగులతో కూడిన తోరణాలు, ఫ్లెక్సీలతో స్వాగతాలు పలకడంతో ఉత్సవ వాతావరణం కనిపించింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మరో మాజీ ఎమ్మెల్యే లల్లూ, నియోజకవర్గం నేత నర్తు రామారావు.. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఎదురేగి జగన్‌కు స్వాగతం పలికారు.

### జాతరను తలపించిన పల్లెలు

వైఎస్ జగన్ పాదయాత్రగా తమ ఊర్లకు వచ్చినప్పుడు ఆ పల్లెల్లో జాతర వాతావరణం కనిపించింది. రాత్రి బస చేసిన శిబిరం నుంచి నడక ప్రారంభించి హరిపురం, అంబుగాం, రాణిగాం, మామిడిపల్లి, పాత్రపురం క్రాస్, తురకశాసనం క్రాస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పల్లెల్లో జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. సంబరంగా ఎదురేగిన జనం.. తమ గ్రామాల్లోకి సాదరంగా ఆహ్వానించారు. వారందరినీ జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఇదే సమయంలో వివిధ వర్గాల ప్రజలు తమ కష్టాలు చెప్పుకున్నారు. మన ప్రభుత్వం రాగానే వాటన్నింటినీ పరిష్కరిస్తానని జగన్ వారికి భరోసా ఇచ్చారు.





హరిపురంలో భావోద్వేగానికి గురైన ఓ సోదరిని ఓదార్చుతున్న వైఎస్ జగన్, అవ్వతో ఆప్యాయంగా..



రాణిగాంలో ఓ దివ్యాంగురాలి కష్టాలు వింటున్న జగన్

## కిడ్నీ మహమ్మారి కబళిస్తోందయ్యా..

### వైఎస్ జగన్ ఎదుట లోహరిబంద కిడ్నీ బాధితుల ఆవేదన

**వజ్రపుకొత్తూరు:** మా పంచాయతీ పరిధిలో కిడ్నీ మహమ్మారి ప్రజలను కబళిస్తోందయ్యా.. చిన్నా పెద్దా తేడా లేదు. ఇటీవల ఒకే రోజు ముగ్గురు చనిపోయారు. పంచాయతీలో దాదాపు 5,500 మంది జనాభా ఉండగా 1,500 మంది కిడ్నీ రోగులున్నారంటూ శ్రీకాకుళం జిల్లా మందస మండలం లోహరిబంద పంచాయతీ పరిధిలోని తొమ్మిది గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అందాల శేషగిరి వాపోయారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం అంబుగాం వద్ద పాదయాత్రగా వచ్చిన వైఎస్ జగన్‌ను కలిసి వారి కష్టాలు చెప్పుకున్నారు. గత ఆరు నెలల్లో సుమారు 70 మంది వరకు కిడ్నీరోగులు చనిపోయారని కన్నీరుమున్నీరయ్యారు. బోర్ల నుంచి తోడిన నీటిని గ్రామంలో పంపిణీ చేస్తున్నారని, ఉద్దానం మంచినీటి పథకం ద్వారా సర్ఫేస్ వాటర్ పంపిణీ చేస్తున్నా.. అది బురదమయమై పశువులు సైతం తాగలేని పరిస్థితి ఉందన్నారు. పలాస సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ఉన్నా.. పడకలు అందుబాటులో లేవని, నెఫ్రాలజీ వైద్యుడు సైతం రావడం లేదని వాపోయారు. హరిపురం సీహెచ్‌సీలో ఎక్స్‌రే తీయమంటే బయట తీసుకోవాలని చెబుతున్నారని, వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. పీహెచ్‌సీల్లో కిడ్నీ రోగులకు మందులు కూడా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుజల పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా.. భూగర్భం నుంచి తోడిన ఆ నీటిని సరిగా ఫిల్టర్ చేయడం లేదన్నారు. కిడ్నీ రోగులకు మందుల కోసం నెలకు రూ.8 వేలు ఖర్చవుతోందని, విశాఖపట్నం వెళ్లి డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటే.. కనీసం బస్‌పాస్‌లు కూడా ఇవ్వడం లేదని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా కిడ్నీ రోగుల కోసం పరిశోధనాస్పత్రి ఏర్పాటు చేస్తానని, నెలకు రూ.10 వేలు పింఛన్ ఇస్తామన్న వైఎస్ హామీపై వారు హర్షం వ్యక్తం చేశారు.



లోహరిబంద గ్రామ కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్



మామిడిపల్లిలో చిన్నారితో ఆప్యాయంగా..

ప్రజాసంకల్ప యాత్ర మరిన్ని చిత్రాల కోసం QR code స్కాన్ చేయండి

**ప్రజా సంకల్ప యాత్ర**
**మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో**

### సీఎం సహాయనిధి అందకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు..



నాకు నాలుగేళ్ల కిందట కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. బంధువులంతా విరాళాలు సేకరించి రూ.30 లక్షలతో ఆపరేషన్ చేయించారు. తర్వాత చూపు మందగించడంతో మళ్లీ బంధువుల సాయంతో కళ్లకు శస్త్ర చికిత్స చేయించారు. ఇప్పుడు కూడా చూపు అంతంత మాత్రమే. నెలకు మందుల కోసం రూ.5 వేల వరకు ఖర్చవుతోంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమని సీఎం సాహాయ నిధిని రానీయకుండా ఈ టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు.

– నల్లా రమేష్, గౌడుగురంట గ్రామం, మందస మండలం

### పెద్దల అండదండలున్న వారికే తుపాను పరిహారం



అర్హత ఉన్నా ఈ టీడీపీ నాయకులు సంక్షేమ పథకాలు అందనీయడం లేదు. తిత్లీ తుపాను కారణంగా నాకున్న 120 కొబ్బరి చెట్లు, జీడితోట ధ్వంసమయ్యాయి. నిలువ నీడ లేదు. చాలా మందిది ఇదే పరిస్థితి. బాధితుల వివరాలు సేకరించిన అధికారులు.. పరిహారం అందించడంలో ముఖం చాటేస్తున్నారు. పెద్దల అండదండలున్నవారికే ఇస్తున్నారు.

– సింగుపురం కృష్ణమ్మ, నిమ్మాన ఏకాశమ్మ, .జెనగ దమయంతి, హరిపురం, పలాస

### బెంతు ఒరియాలపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



సార్.. బెంతు ఒరియాలపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రాష్ట్ర గజిట్ ప్రకారం మమ్మల్ని ఎస్టీలుగా గుర్తించాల్సి ఉంది. గతంలో మాకు ఎస్టీ ధ్రువప్రతాలిచ్చి.. ఆ తర్వాత ఆపేశారు. వైఎస్ హయాంలో మా జీవన విధానంపై అధ్యయనం చేసేలా థర్డ్ పార్టీ కమిటీ కూడా వేశారు. మా ప్రాంతంలో అధ్యయనం చేసిన ఈ కమిటీ.. మమ్మల్ని ఎస్టీలుగా గుర్తించాలని నివేదిక రూపొందించింది. ఇంతలో వైఎస్ మరణంతో ఆ నివేదిక బుట్టదాఖలైంది. మీరే మాకు న్యాయం చేయాలి..

– రజనీకుమార్ దొళై, శ్యాం పురియా, దేవరాజ్ సాహు,వ బల్లిపుట్టుగ, కవిటి మండలం, పలాస

# 12 నుంచి సంక్రాంతి సెలవులు

- సెలవుల షెడ్యూల్‌కు జన్మభూమి ‘ఎఫెక్ట్’
- ప్రచారానికి విద్యార్థులు, టీచర్ల తరలింపునకు ఏర్పాట్లు
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు

**సాక్షి, అమరావతి:** ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా..చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. జన్మభూమి ప్రచార కార్యక్రమాల కోసం రాష్ట్రంలో పాఠశాలల సంక్రాంతి సెలవుల షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పు చేసింది. సాధారణంగా ఈనెల 8వ తేదీనుంచి 17వ తేదీ వరకు సెలవులు ఇవ్వాల్సి ఉంది. అయితే ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొనాలనే ఆదేశాలుండడంతో.. 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సెలవులుంటాయని, పాఠశాలలు తిరిగి 21వ తేదీన తెరుచుకుంటాయని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాగా పండుగ సెలవుల షెడ్యూల్ మార్పుపై విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లతో సహా ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. విద్యాశాఖ గతంలో నిర్ణయించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 8వ తేదీనుంచి 17వ తేదీవరకు సెలవులుంటాయని, వారంతా పండుగలకు సొంత ఊళ్లకు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. నాలుగు నెలల ముందుగానే రైళ్లు, బస్సులు, విమానాల టికెట్లను బుక్ చేసుకున్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా షెడ్యూల్‌ను మార్పు చేయడం వల్ల ఇప్పటికిప్పుడు కొత్తగా టికెట్లు దొరికే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ ప్రచారానికి విద్యార్థులు టీచర్లా..**

విద్యా కార్యక్రమాలకు మినహా ఇతర కార్యక్రమాలకు టీచర్లు, విద్యార్థులను తరలించరాదని సుప్రీంకోర్టు స్పష్టమైన ఉత్తర్వులున్నా.. టీడీపీ ప్రభుత్వం జన్మభూమి పేరిట తన ప్రచారానికి వాడుకోవడం సిగ్గుచేటని పలువురు విమర్శిస్తున్నారు.

**అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెలవులు ప్రకటించాలి**

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సంక్రాంతి సెలవులను జనవరి 8 నుంచి 17 వరకు అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు జి.హృదయరాజు ప్రకటనలో పేర్కొన్నారు.

**ఉన్నతీకరణ అమలు కాకుంటే ఆందోళనలే..**

భాషోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల ఉన్నతీకరణకు సంబంధించి జీవో విడుదల చేసినా దాన్ని అమలు చేయకపోవడానికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు అంకాల్ కొండయ్య పేర్కొన్నారు. సంక్రాంతి సెలవుల్లోగా దీన్ని అమలు చేయకుంటే 24న డీఈవో కార్యాలయాల ముట్టడి, 31న కమిషనరేట్ ముట్టడి ఉంటుందన్నారు.

# న్యాయప్రతిష్టను కాపాడాలి

- ఈ బాధ్యత బార్ అండ్ బెంచ్‌పైనే ఉంది
- న్యాయవాదులకు ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఉద్బోధ
- కార్యకలాపాలు ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
- తొలిరోజు మొదటి కోర్టు హాలులో న్యాయమూర్తుల సమావేశం..
- కోర్టు హాళ్లు చిన్నవి కావడంతో న్యాయవాదులు, న్యాయమూర్తుల ఇబ్బంది

**సాక్షి, అమరావతి:** అమరావతి రాజధాని కేంద్రంగా కొత్తగా కొలువుదీరిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం తన తొలి కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హైకోర్టు (10 కోర్టు హాల్స్)లోని మొదటి కోర్టు హాలులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కోర్టు హాలు చిన్నది కావడంతో న్యాయవాదులతో కిక్కిరిసిపోయింది. న్యాయవాదులనుద్దేశించి మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, ఏపీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామన్నదొర, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదులు(బార్), న్యాయమూర్తులు (బెంచ్) కలిసి పనిచేస్తేనే కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. న్యాయప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత బార్ అండ్ బెంచ్‌పై ఉందన్నారు. కేసుల విచారణలో న్యాయవాదుల సహకారం లేకుండా న్యాయమూర్తులు ఏమీ చేయలేరన్నారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకెళ్లినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలగలమని న్యాయవాదులకు ఉద్బోధించారు. సామాజిక న్యాయస్థానాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే విషయంలో ఎంతమాత్రం వెనుకడుగు వేయరాదన్నారు.

**చరిత్రలో నిలిచిపోయే రోజు..**

అంతకుముందు న్యాయవాదుల తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమరావతి నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోయే గొప్పరోజన్నారు. హైకోర్టుకు అవసరమైన సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఏపీ హైకోర్టును దేశంలోనే గొప్ప హైకోర్టుగా తీర్చిదిద్దాలని బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు ఆకాంక్షించారు. ఈ దిశగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు బార్ కౌన్సిల్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. సౌకర్యాల విషయంలో ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులు భవిష్యత్తులో ఉండబోవనే నమ్మకం తమకుందన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

**ఇబ్బందుల మధ్యే తొలిరోజు కార్యకలాపాలు..**

ఈ కార్యక్రమం అనంతరం హైకోర్టు కేసుల విచారణను ప్రారంభించింది. తొలిరోజు కార్యకలాపాలు నిరుత్సాహం, నిట్టూర్పుల మధ్య మొదలయ్యాయి. కోర్టు హాళ్లు చిన్నవి కావడంతో న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు న్యాయమూర్తులకు కేసులను విచారించేందుకు కోర్టు హాళ్లు లేకపోవడంతో వారు తమ ఛాంబర్ నుంచే కేసులను విచారించారు. ఒక్కో న్యాయవాది ఛాంబర్‌లోకి వెళ్లి వాదనలు పూర్తి చేసిన తరువాత మరో కేసును పిలిచి విచారణ జరిపారు. అలాగే బార్ కౌన్సిల్, న్యాయవాదుల సంఘం సంయుక్తంగా మధ్యాహ్నం న్యాయవాదులకు ఏర్పాటుచేసిన భోజనాల కార్యక్రమం రసాభాసగా మారింది. చాలామంది న్యాయవాదులకు భోజనం లేకుండా పోయింది. దీంతో వారు బయట హోటళ్లను ఆశ్రయించారు. ఉమ్మడి హైకోర్టులో విశాల ప్రాంగణంలో ఇన్నేళ్లు తిరిగిన న్యాయవాదులకు సీఎం క్యాంపు కార్యాలయంలోని ఇరుకు వరండాలు ఇబ్బందిగానే అనిపించాయి.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం 2019 క్యాలెండర్‌ను అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. హైకోర్టు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, సంఘం అధ్యక్షుడు రామన్నదొర, సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### తొలి తెలుగు రిట్ పిటిషన్ తిరస్కరణ

**విజయవాడ లీగల్:** తెలుగులో రిట్ పిటిషన్‌ను స్వీకరించబోమని అధికారులు చెప్పినట్లు న్యాయవాది ప్రకాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. నూతన సంవత్సరంలో సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కార్యకలాపాలు బుధవారం యథావిధిగా జరిగాయి. తొలిరోజే మాతృభాషలో తొలి వ్యాజ్యం దాఖలైంది. చిత్తూరు జిల్లా, పుంగనూరు పట్టణానికి చెందిన టి.రహాక్ జాన్, ఎం.భాస్కరరెడ్డి మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో భాస్కరరెడ్డి స్థలాన్ని విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ స్థలంపై రిజిస్ట్రేషన్ చేయకుండా ఆదేశాలు ఇవ్వమని కోరుతూ పుంగనూరుకు చెందిన న్యాయవాది పీఎన్ఎస్ ప్రకాష్ రిట్ ఆఫ్ మాండమస్‌ను దాఖలు చేశారు. అయితే ఈ రిట్ పిటిషన్ అంతా మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు తెలుగులో టైపు చేశారు. తెలుగు భాషలో దాఖలైన తొలి తెలుగు రిట్ పిటిషన్‌ను స్వీకరించబోమని అధికారులు పేర్కొన్నారని న్యాయవాది ప్రకాష్ తెలిపారు.

# పెండింగ్‌లో 3.54 లక్షల ‘గ్యాస్’ దరఖాస్తులు

- ఇటీవల కలెక్టర్ల సదస్సులో వెల్లడైన వివరాలు
- గిరిజనులకు సబ్సిడీపై కిరోసిన్ సరఫరాకు ఓకే

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వంద శాతం కుటుంబాలకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేశామని 8 నెలల కిందట ప్రభుత్వం ప్రకటించింది. దీపం పథకం కింద పేదలందరికీ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశామని చెప్పి సబ్సిడీ కిరోసిన్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. వాస్తవంగా రాష్ట్రం గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో ఇంకా 3.54 లక్షలు పెండింగ్‌లోఉన్నట్లు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో బహిర్గతమైంది. నిబంధనల ప్రకారం గుడిసెల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వడానికి వీలులేదని అధికారులు చెప్పారు. సదస్సులో చర్చించిన అనంతరం ఎట్టకేలకు గిరిజనులకు సబ్సిడీ కిరోసిన్ ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ముఖ్యంగా గిరిజనులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కొన్ని ఇళ్లలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కనీసం దీపం వెలిగించుకోలేని పరిస్థితి ఉందని గుర్తించారు. గతంలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై లీటర్ కిరోసిన్ రూ. 14.96కు లబ్ధిదారులకు సరఫరా చేశారు. ఆయిల్ కంపెనీలు ప్రభుత్వానికి లీటర్ కిరోసిన్ రూ. 33.47 ప్రకారం సరఫరా చేస్తే ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటాగా లీటరకు రూ. 12 సబ్సిడీ ఇచ్చేది. కేంద్రం సబ్సిడీ నిలిపివేయడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా చేతులెత్తేసింది. గిరిజన ప్రాంతాల్లో 5 కిలోల ఎల్పీజీ సిలిండర్లను సరఫరా చేసేందుకు నిధులు కేటాయించి రెండేళ్లయినా పథకం మాత్రం వారి దరికి చేరడం లేదు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్యాస్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలని విశాఖపట్నం జిల్లాలో 32,610, తూర్పు గోదావరిలో 10,466, విజయనగరంలో 2,583, శ్రీకాకుళంలో 1,079, పశ్చిమ గోదావరిలో 336 గిరిజన కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.



**దీపం పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు**

| జిలా | పెండింగ్ దరఖాస్తులు |
|---|---|
| విశాఖపట్నం | 90,672 |
| గుంటూరు | 62,648 |
| నెల్లూరు | 38,973 |
| తూర్పు గోదావరి | 35,496 |
| కర్నూలు | 31,095 |
| చిత్తూరు | 19,856 |
| ప్రకాశం | 17,428 |
| విజయనగరం | 16,065 |
| అనంతపురం | 15,500 |
| వైఎస్సార్ | 12,816 |
| శ్రీకాకుళం | 5,710 |
| కృష్ణా | 5,446 |
| పశ్చిమ గోదావరి | 2,496 |
| మొత్తం | 3,54,20 |

# 108 అంబులెన్సులు నిర్వీర్యం

ఇన్‌డెప్త్

- రోజురోజుకూ క్షీణిస్తున్న వాహనాల సామర్థ్యం
- తరచూ మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- డీజిల్‌కు సకాలంలో నిధులివ్వని సర్కారు
- అంబులెన్సు వ్యవస్థపై ప్రైవేటు సంస్థ అజమాయిషీ
- చివరకు ప్రైవేటు అంబులెన్సులను ఆహ్వానించిన సర్కారు
- తక్కువ తిరుగుతున్నా కోర్ డ్యాష్ బోర్డులో ఎక్కువగా చూపిస్తున్న వైనం
- వాహనాలు తిరగకపోయినా ప్రైవేటు సంస్థకు బిల్లుల చెల్లింపు



■ ఈమె పేరు.. ఆర్.శ్రావణి, ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా రాజాం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె స్వగ్రామం వంగర మండలంలోని నీలయ్యవలస. రాజాం పట్టణానికి ఈ గ్రామం 23 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈమెకు డిసెంబర్ 31న పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కి ఫోన్ చేశారు. కాల్ రిసీవర్ వివరాలు తెలుసుకుని వంగర మండలానికి 108 వాహనం లేదని చెప్పారు. అప్పటికే చాలా సమయం దాటడంతో కుటుంబీకులు ఆందోళన చెంది ప్రైవేట్ వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు.



■ ఈయన పేరు దేవదాసు. ఊరు చిత్తూరు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫోన్ చేయగానే కుయ్.. కుయ్.. మంటూ కొద్ది నిమిషాల్లోనే 108 అంబులెన్స్ వచ్చేదని అంటున్నాడు. ఇప్పుడు ఆ శబ్దం కూడా కరువైందని, ఆపదల్లో 108కు ఫోన్ చేస్తే బండి అందుబాటులో లేదనే సమాధానం వస్తోందని వాపోతున్నాడు. 108 సౌకర్యం లేక చాలా అవస్థలు పడుతున్నామని, ఆటోల్లో ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోందని చెబుతున్నాడు.

**పేదవాడికి అపర సంజీవని లాంటి 108 పథకాన్ని సర్కారే గొంతు నులుముతోంది. గతంలో అర్ధరాత్రి, అపరాత్రి భేదం లేకుండా ఫోన్ చేసిన అతికొద్ది నిమిషాల్లోనే రోగి దగ్గరకు వచ్చివాలిపోయిన 108 అంబులెన్సులు నేడు మొరాయిస్తున్నాయి. నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం, సకాలంలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోవడం, డీజిల్‌కు నిధులివ్వకపోవడం వంటి కారణాలతో 108 పథకం అస్తవ్యస్తమైంది. ప్రైవేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి, 108 వాహనాలు తిరగకపోయినా ఆ సంస్థకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు చెల్లిస్తోంది. దీంతో 108 పథకం పూర్తిగా కుప్పకూలే దిశగా సాగుతోంది.**

**సాక్షి, అమరావతి:** ఆరోగ్యశాఖలో పీపీపీ (పబ్లిక్–ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్) పేరుతో కార్పొరేట్లకు కోట్లకు కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వానికి.. పేదవాడిని కాపాడే 108 అంబులెన్సులు గుర్తుకు రావడం లేదు. టైర్లు అరిగిపోయాయని, డీజిల్ లేదని, వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఉద్యోగులు రోజూ మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తన బాధ్యతలను నిర్వర్తించకుండా నెపాన్ని నిర్వహణ సంస్థపైకి నెట్టేస్తోంది. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి. కొత్త అంబులెన్సుల కొనుగోలు మాట కూడా ప్రభుత్వం నుంచి వినిపించడం లేదు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన 108 పథకం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో అమలవుతోంది. రాష్ట్రంలో మాత్రం పుట్టెడు కష్టాల్లో కొనసాగుతోంది.


### నాలుగున్నరేళ్లుగా కష్టాల్లోనే..

108కు బాధితులు ఫోన్ చేస్తుంటే వాహనాలు ఘటనా స్థలానికి రావడం లేదు. టైర్లు అరిగిపోయి కొన్ని, డీజిల్ లేక మరికొన్ని, ఇంజన్ మరమ్మతులకు వచ్చి ఇంకొన్ని ఆగిపోతున్నాయి. కొత్త వాహనాలను కొనుగోలు చేసి బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయడం లేదు. సమస్య తలెత్తిన వెంటనే 108 వాహనాలను రోడ్డు మీద తిప్పాల్సిన ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి నెలల తరబడి ఆలస్యం చేసింది. కొనుగోలు చేసిన వాటికి కూడా 100 శాతం అధికంగా చెల్లించి కమీషన్లు కొట్టేసిన తీరు చూస్తుంటే ప్రభుత్వ అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్న రోగులను కాపాడాల్సిన 108 వాహనాల కొనుగోలును కూడా ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకున్న తీరు విస్మయం కలిగిస్తోంది. అవినీతికి పరాకాష్టగా పథకాన్ని మార్చడం, సరిగా నిధులు కేటాయించకపోవడం, ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం, చివరకు నిర్వహణ సంస్థపై తప్పులు నెట్టేయడం ప్రభుత్వ అసమర్థ పనితీరుకు అద్దం పడుతున్నాయని ఉద్యోగుల నుంచి సామాన్యుల వరకూ మండిపడుతున్నారు.

### సకాలంలో రాని అంబులెన్సులు

ఎక్కడైనా ప్రమాదం జరిగి 108 అంబులెన్సుకు ఫోన్ చేస్తే ఎంతకీ రావడం లేదు. ఇటీవల విజయవాడ నడిబొడ్డున బెంజి సర్కిల్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో యనమలకుదురులో ప్రమాదం జరిగి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సుకు ఫోన్ చేస్తే ఎంతకీ రాలేదు. దీంతో క్షతగాత్రులను ప్రైవేటు అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. అంతేకాదు విజయవాడలో రాఘవయ్య పార్కు సమీపంలో వారం క్రితం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. 108కు ఫోన్ చేస్తే అరగంట దాటినా రాలేదు. దీంతో గాయపడిన వ్యక్తిని ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాష్ట్ర రాజధాని నగరం నడిబొడ్డునే ఇలాంటి పరిస్థితి ఉంటే.. ఇక రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయొచ్చు.

### వాహనాల పరిస్థితి ఇలా..






### తిరగకపోయినా తిరిగినట్టు..

రాష్ట్రం మొత్తం మీద 108 వాహనాలు 439 ఉన్నాయి. అందులో రోజూ రోడ్డు మీద తిరుగుతున్నవి తక్కువగా ఉంటున్నాయి. వివిధ కారణాలతో సగటున రోజూ 70 నుంచి 80 వాహనాలు నిలిచిపోతున్నాయి. కానీ సీఎం కోర్ డ్యాష్ బోర్డులో 96 శాతం వాహనాలు తిరుగుతున్నట్టు చూపిస్తున్నారు. కోర్ డ్యాష్ బోర్డులో ఉన్న లెక్కల ప్రకారమే వాహనాలకు బిల్లుల చెల్లింపు కూడా జరుగుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అంటే.. రోజుకు 80కి పైగా వాహనాలు మూలన పడి ఉన్నా వాటిని తిరిగినట్టు చూపించి బిల్లులు చెల్లిస్తున్నట్టు తేలింది.

### ప్రస్తుతం 108 వాహనాల దుస్థితి ఇలా..

- సమయానికి ఇంజన్ ఆయిల్ మార్చకపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి.
- హెడ్‌లైట్లు లేకపోవడంతో రాత్రిపూట కొన్ని వాహనాలు తిరగలేకపోతున్నాయి.. ప్రమాదానికి కూడా గురవుతున్నాయి.
- అతిముఖ్యమైన సైరన్, బార్‌లైట్స్, బ్లింకర్స్, బ్యాటరీ హారన్ పనిచేయకుండానే వాహనాలు తిరుగుతున్నాయి.
- టైర్లు పూర్తిగా అరిగిపోవడంతో ఎప్పుడు ఆగిపోతాయో తెలియడం లేదు.
- స్టెప్నీ టైర్లు లేకపోవడంతో వాహనాలు ఆగిపోతే ఇబ్బంది కలుగుతోంది.
- స్టీరింగ్ ఆయిల్, గేర్‌బాక్స్ ఆయిల్, డిఫ్రెన్షియల్ ఆయిల్, హబ్ గ్రీసింగ్ చేయడం లేదు.
- బ్రేక్‌ప్యాడ్స్, బ్రేక్ బూస్టర్లు, బ్రేక్ లైనింగ్స్, బ్రేక్ ఆయిల్‌ను మార్చకపోవడం వల్ల బ్రేకులు పనిచేయడం లేదు.
- వర్షం పడితే అంబులెన్సులోకి నీరు కారడంతో పేషెంట్లు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.
- వాహనాల్లో వైద్య పరికరాల చార్జింగ్‌కు అవసరమైన చార్జింగ్ పాయింట్లు పనిచేయడం లేదు.
- పేషెంట్ కేబిన్‌లో లైట్లు, ఫ్యాన్‌లు పనిచేయడం లేదు.
- చాలా వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ లేవు.
- వాహనాల్లో మల్టీచానెల్ మానిటర్, సెక్షన్ ఆపరేటర్, డిఫ్రిబ్యులేటర్, వెంటిలేటర్స్, పల్సాక్సీ మీటర్‌లు సరిగా పనిచేయడం లేదు.
- బీపీ ఆపరేటర్స్, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, థర్మామీటర్‌లు మరమ్మతులకు గురయితే బాగు చేయడం లేదు.
- చాలా అంబులెన్సుల్లో ఆక్సిజన్ అందుబాటులో ఉండటం లేదు.
- షుగర్ పరీక్షలకు అవసరమైన గ్లూకోస్ట్రిప్స్, లాన్‌సెట్లు అందుబాటులో లేవు.
- క్షతగాత్రులకు అవసరమైన డ్రెస్సింగ్ ప్యాడ్స్, స్టెరిలైజ్ దూది, అయోడిన్‌లు కూడా కరువవుతున్నాయి.



### దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో..

- తొలుత 8 జిల్లాల్లో 310 అంబులెన్సులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పథకాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు.
- 2007, నవంబర్ నాటికి పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి 802 వాహనాలను పథకం కోసం సమకూర్చారు.
- 2009 నాటికే ఈ పథకంపై సుమారు రూ.300 కోట్లకు పైగా వెచ్చించారు.
- 108 అంబులెన్సులు రోజూ రాష్ట్రవ్యాప్తంగా ఆపదలో ఉన్న కొన్ని వేల మందిని కాపాడి ఆస్పత్రులకు చేరేసేవి.
- పథకానికి ఏటా రూ.100 కోట్లు తక్కువ కాకుండా కేటాయించేవారు.
- 70 శాతం మంది గర్భిణులు ప్రసవం కోసం 108 అంబులెన్సులపైనే ఆధారపడేవారు.
- ఫోన్ చేసిన అతి కొద్ది నిమిషాల్లోనే ఘటనా స్థలికి చేరుకునేవి.
- 108 వాహనాల్లో అత్యవసర పరికరాలతోపాటు మందులకు, సిబ్బందికి లోటు ఉండేది కాదు.

**108 పథకాన్ని నిర్వీర్యం చేశారు**

“ 2014 తర్వాత 108 అంబులెన్సుల పథకం నిర్వీర్యమైంది. పూర్తిగా ప్రైవేటు సంస్థల అజమాయిషీలోకి వెళ్లింది. ప్రభుత్వం పట్టించుకోవడమే మానేసింది. చివరకు పథకాన్ని ఏ దశకు తెచ్చారంటే ఏకంగా ప్రైవేటు అంబులెన్సులను తీసుకుంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని లేఖ ఇస్తే.. అంబులెన్సులు పెరుగుతాయి కదా అని అంటున్నారు. ప్రైవేటు అంబులెన్సులను తెరమీదకు తెచ్చి ప్రభుత్వ పరిధిలో ఉన్న వాటిని మరుగునపడేసేందుకు ఈ జీవోను తెచ్చారు. రాష్ట్రంలో 108 అంబులెన్సుల పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు.

*–కిరణ్‌కుమార్, అధ్యక్షుడు, 108 ఉద్యోగుల సంఘం*

**గతంలో కంటే పరిస్థితి మెరుగైంది**

గతంతో పోల్చితే అంబులెన్సుల పరిస్థితి బాగా మెరుగైంది. కొత్తగా 32 అంబులెన్సులను కొనుగోలు చేశాం. మరో 12 వాహనాలు కొత్తవి వస్తాయి. పాత వాటిని తీసేసి వీటి సేవలను అందుబాటులోకి తెస్తాం. అంతేకాకుండా ప్రైవేటు అంబులెన్సులతో ఎంవోయూ చేసుకుంటున్నాం. ఇప్పటివరకూ 100 వరకు ప్రైవేటు అంబులెన్సులు ఎంవోయూ చేసుకున్నాయి. ఘటనా స్థలానికి అంబులెన్సులు చేరుకునే నేపథ్యంలో ఒక అంబులెన్సు నుంచి మరో అంబులెన్సుకు కాల్ డైవర్ట్ చేయడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వాటిని కూడా పరిష్కరిస్తున్నాం. ”

*–డా.రాజేంద్రప్రసాద్, నోడల్ అధికారి, 108 పథకం*

**108 అంబులెన్సు ఘటనాస్థలికి చేరాల్సిన సమయం, చేరుతున్న సమయం**

| ప్రాంతం | చేరాల్సిన సమయం | చేరుతున్న సమయం |
|---|---|---|
| పట్టణ ప్రాంతాల్లో | 20 నిముషాల్లో | 35 నిముషాలు |
| గ్రామీణ ప్రాంతాల్లో | 25 నిముషాల్లో | 40 నిముషాలు |
| గిరిజన ప్రాంతాల్లో | 30 నిముషాల్లో | 50 నిముషాలు |

### వైఫల్యాలను ప్రైవేటు సంస్థపై నెట్టేసి..

ఇష్టారాజ్యంగా ప్రైవేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలు కట్టబెట్టింది ప్రభుత్వమే. ఇప్పుడు తన వైఫల్యాలను ప్రైవేటు సంస్థపై నెట్టేస్తోంది. బీవీజీ సంస్థ 108 నిర్వహణా బాధ్యతలు చూస్తోంది. ఈ సంస్థ 108 పథకాన్ని సరిగా నిర్వహించడం లేదని అధికార వర్గాలే చెబుతున్నాయి. మరోవైపు వివిధ కారణాలతో వాహనాలు ఆగిపోతున్నాయని, ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బీవీజీ సంస్థ వాపోతోంది. మరోవైపు ఉద్యోగులేమో 108 వాహనం బాధితుడిని తీసుకురావడానికి ఘటనా స్థలికి వెళ్లేవరకూ అనుమానమేనని చెబుతున్నారు. సకాలంలో పథకానికి నిధులు చెల్లించకపోవడమే దీనికి కారణమంటున్నారు. వాహనాలకు మరమ్మతులు చేయించకపోవడంతో రోజూ కనీసం వంద వాహనాలు మూలనే పడి ఉంటున్నాయని పేర్కొంటున్నారు.

### ప్రైవేటుకు అంబులెన్సులు

పథకం దారుణంగా నిర్వీర్యమవడంతో తాజాగా ప్రైవేటు అంబులెన్సులకు చోటు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018, నవంబర్ 20న దీనికోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై 108 అంబులెన్సులు కొనసాగించడానికి ఆసక్తి ఉంటే ప్రైవేటు అంబులెన్సులకు కూడా అవకాశం కల్పిస్తారు. డిజిటల్ పూల్ పేరుతో ప్రైవేటు అంబులెన్సులకు ఈ పథకంలో చేరే అవకాశం కల్పించారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఇకపై కొత్త 108 అంబులెన్సులను కొనుగోలు చేయకుండా ఇలా ప్రైవేటు అంబులెన్సులకు అవకాశం కల్పిస్తున్నారని అధికార వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక విధంగా ప్రైవేటుకు సేవలు ఇవ్వడమంటే బాధ్యతల నుంచి తప్పుకోవడమేనని అంటున్నాయి.



### ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లాం

మా మనవరాలు తిరుపతమ్మకి నొప్పులొస్తుంటే 108కు ఫోన్ చేశాం. చాలాసేపు వేచిచూసినా రాకపోయేసరికి ఏమిచేయాలో పాలుపోక నొప్పులతో అల్లాడుతున్న నా మనవరాలిని ఆటోలో ప్రత్తిపాడుకు తీసుకెళ్లాం.

*– నల్లబోతుల ఏసమ్మ, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా*

### నా చేతుల్లోనే ప్రాణం విడిచారు..

చిత్తూరులో మేము అద్దెకుంటున్న ఇంటి యజమాని గోపాల్ గుండెపోటు వచ్చి బాత్‌రూమ్‌లో పడిపోయారు. వెంటనే 108కు ఫోన్ చేశాను. అర్ధ గంటపాటు వేచిచూసినా రాలేదు. దీంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లాను. అయినా ఫలితం దక్కలేదు. నా చేతుల్లోనే ఆయన ప్రాణం విడిచారు. 10 నిముషాల ముందు వచ్చి ఉంటే ఆయన బతికుండేవారని డాక్టర్లు చెప్పారు. ఇలాగైతే 108పై నమ్మకం ఎలా ఉంటుంది?

*– ప్రభు, చిత్తూరు నగరం*



# నిరసనల జన్మభూమి



అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని కోమటికుంట్లలో జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ టేబుళ్లను బయటవేసిన గ్రామస్తులు



విశాఖ జిల్లా రేవడి గ్రామసభలో మంత్రి గంటా శ్రీనివాసరావును నిలదీస్తున్న పద్మనాభం మండలం రౌతుపాలెం గ్రామానికి చెందిన పిన్నంటి సింహాచలం..



చిత్తూరు జిల్లా వీ కోట మండలం గోనుమాకులపల్లిలో మంత్రి అమరనాథ్‌రెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు

**నిలదీతలు, నిరసనలతో ప్రారంభమైన ఆరోవిడత జన్మభూమి**

- తొలిరోజు నిరసనల హోరు
- సమస్యలపై మంత్రులు, అధికారులు, అధికారపార్టీ నేతలను నిలదీసిన జనం
- హామీలిచ్చి.. నెరవేర్చలేదని ఆగ్రహం
- విశాఖలో మంత్రి గంటాకు చుక్కెదురు.. నిలదీసిన ఓ వృద్ధురాలు
- ఇతర మంత్రులకూ ఇదే పరిస్థితి..
- పలుచోట్ల గ్రామసభల బహిష్కరణ..

**సాక్షి, నెట్‌వర్క్:** ఆరో విడత ‘జన్మభూమి–మావూరు’ కార్యక్రమం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనల నడుమ ప్రారంభమైంది. తమ సమస్యలు పరిష్కరించాలని ఐదేళ్లుగా జరుగుతున్న జన్మభూమిలో అర్జీలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదంటూ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమ అసంతృప్తిని వెళ్లగక్కుతూ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల గ్రామసభలను అడ్డుకున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై మంత్రులు, అధికారులను, అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను నిలదీశారు. పింఛన్లు అందట్లేదని, మరుగుదొడ్లు, హౌసింగ్ బిల్లులు మంజూరు కావట్లేదని, తమ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించట్లేదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నిరసనలు, నిలదీతలతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల జన్మభూమి గ్రామసభలు రసాభాసగా సాగాయి. సమస్యలు పరిష్కరించని కార్యక్రమం ఎందుకంటూ అనేక గ్రామాల్లో గ్రామసభల్ని బహిష్కరించారు.

**నిరసనలు.. నిలదీతలు..**

కృష్ణా జిల్లాలో జన్మభూమి కార్యక్రమం తొలిరోజు నిరసనల మధ్య సాగింది. కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో సుబాబుల్ కర్రను కొనుగోలు చేయకపోవడాన్ని తప్పుపడుతూ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను రైతులు నిలదీశారు. పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూరులో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదంటూ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను ప్రజలు నిలదీశారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కోమటికుంట్లలో తాగునీరివ్వలేని ప్రభుత్వం ప్రచార ఆర్భాటంకోసం చేపట్టిన గ్రామసభను జరగనివ్వబోమంటూ ప్రజలు అడ్డుకున్నారు. జన్మభూమి కార్యక్రమం ఫ్లెక్సీని, సభలోని ఫర్నిచర్‌ను తొలగించారు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఒకటో వార్డు కౌన్సిలర్ గోవిందరావు, ఆయన అనుచరులు జన్మభూమి సభను బహిష్కరించారు. రౌతులపూడి మండలం దిగువ శివాడలో, అంబాజీపేట మండలం పసుపల్లిలో ప్రజలు గ్రామసభను బహిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పక్కిలంకలో ఊరంతా రోడ్లు వేస్తున్నా.. ఎస్సీ ఏరియాలో రోడ్లు ఎందుకు వేయడం లేదంటూ మంత్రి కేఎస్ జవహర్‌ను గ్రామస్తులు నిలదీశారు. నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామసభకు హాజరైన వారికి పాఠశాల విద్యార్థులచే టీ, తాగునీరు పంపిణీ చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. తిత్లీ తుపానుతో నష్టపోయిన తమకు పరిహారం అందలేదని శ్రీకాకుళం జిల్లాలోని హిరమండలం, శ్రీకాకుళం, టెక్కలి మండలాల్లో జరిగిన సభల్లో రైతులు ధ్వజమెత్తారు. విజయనగరంలోని 15వ వార్డు పరిధిలోని దాసన్నపేట సభలో ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కమిషనర్ టి.వేణుగోపాల్ పాల్గొనగా జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు సభను అడ్డగించేందుకు ప్రయత్నించారు.

**మంత్రి గంటాను నిలదీసిన వృద్ధురాలు**

విశాఖ జిల్లా పద్మనాభం మండలం రేవడి గ్రామంలో మంత్రి గంటా శ్రీనివాసరావును ఓ వృద్ధురాలు నిలదీసింది. ‘రూ. కోట్లుతో అభివృద్ధి చేశామంటున్నారు.. ఉండడానికి నిలువ నీడ లేదని మీరు వచ్చినప్పుడల్లా చెబుతున్నా.. వింటున్నారు.. వెళ్తున్నారే తప్ప పట్టించుకోవట్లేదు.. అంటూ రౌతుపాలెంకు చెందిన పిన్నంటి సింహాచలం మంత్రిని నిలదీసింది. ఆమెను పోలీ సులు, నాయకులు వెనక్కి నెట్టేశారు. అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ ములియగుడలో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో అల్లాడిపోతున్నా పట్టించుకోవట్లేదంటూ బగ్మారవలస గ్రామ గిరిజనులు మంత్రి కిడారి శ్రావణ్‌ను నిలదీశారు. బుచ్చెయ్యపేట మండలం చిన్న అప్పన్నపాలెం గ్రామసభలో పాల్గొన్న మంత్రి అయ్యన్న పాత్రుడు.. వయస్సు పైబడినప్పటికీ దుక్కల్లా ఉన్న వారికి ప్రభుత్వం పింఛన్లు ఇవ్వబోదని వ్యాఖ్యలు చేశారు. కొంతమంది మొగుడ్ని పక్కన పెట్టి ఒంటరి మహిళనంటూ పింఛన్లు తీసుకుంటున్నారన్నారు.

**అధికారుల నిర్బంధం..**

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం ఆమని గుడిపాడులో చేపట్టిన 500 ఇంకుడు గుంతలు, 200 మరుగుదొడ్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదంటూ అధికారపార్టీ నాయకులు, గ్రామస్తులు కలసి తహసీల్దార్ సుబ్బారావుతోపాటు ఇతర అధికారుల్ని రెండు గంటలపాటు పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ వచ్చి త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో అధికారులను వదిలిపెట్టారు. గుంటూరులో రేషన్‌కార్డు, ఇళ్లస్థలాలకోసం ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డిని మహిళలు నిలదీశారు. తమ గ్రామంలో సిమెంట్‌రోడ్డు, వీధిలైట్లు, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి విస్మరించడంపై వైఎస్సార్ జిల్లాలోని సుండుపల్లె మండలం మడితాడు గ్రామపంచాయతీలోని వడ్డెపల్లెకు చెందిన గ్రామస్తులు మండిపడ్డారు. ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చకపోగా.. ఇప్పుడు శంకుస్థాపనకోసం హడావుడిగా దిమ్మె ఏర్పాటు చేయడంపై రగిలిపోయిన గ్రామస్తులు కట్టిన దిమ్మెను కూల్చివేశారు. తమ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులున్నారనే కారణంతో ఒక్క సమస్యా పరిష్కరించలేదంటూ కర్నూలు జిల్లా అవుకు మండలం అన్నవరంలో గ్రామసభను బహిష్కరించారు. చిత్తూరు జిల్లా వీ కోట మండలం గోనుమాకులపల్లిలో గ్రామసభకు హాజరైన మంత్రి అమరనాథ్‌రెడ్డిని ‘గత జన్మభూమి అర్జీల మాటేంటి? అర్జీలు తీసుకొంటారు.. ఆఫీసులో ఏరిపారేస్తారు. పేదలు పూరిపాకల్లోనే మగ్గాల్సిందేనా..?’ అంటూ గ్రామస్తులు నిలదీశారు.

**కౌలు రైతు ఆత్మహత్యాయత్నం**

కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నడకుదురు గ్రామసభలో రాముడుపాలెంకు చెందిన కౌలు రైతు బడుగు వెంకటేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం సృష్టించింది. పురుగుమందు డబ్బాతో వచ్చిన వెంకటేశ్వరరావు పెథాయ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకుంటుందా? లేదా? పంట నష్టపరిహారం ఎప్పుడు వస్తుందో చెప్పాలంటూ అధికారులను ప్రశ్నించాడు. ఎకరం భూమి కౌలుకు తీసుకుని 1061 రకం వరిని సాగుచేశానని, పంట కోత కోశాక తుపానుకు తడిచిపోయిందని చెప్పాడు. తనకు సరైన భరోసా లభించట్లేదంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని చెబుతుండగా పోలీసులు పురుగుమందు డబ్బాను లాక్కున్నారు. అధికారులు అతడ్ని సముదాయించారు.

# నీటి ఎద్దడిపై నినదించిన మహిళలు

- 565వ జాతీయ రహదారిపై బైఠాయింపు
- 3 గంటల పాటు ఆగిన వాహన రాకపోకలు
- ప్రజా ప్రతినిధుల నిర్బంధం



565వ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

**దుత్తలూరు:** నీటి సమస్యను పరిష్కరించకుండా అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 565 జాతీయరహదారిపై బైఠాయించి 3 గంటలు రాకపోకలను స్తంభింపజేశారు. జన్మభూమి సభలకు వెళుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలను సైతం అడ్డుకుని నిరసన తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు గ్రామం, ఎస్టీకాలనీ, బీసీ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో గతేడాది సెప్టెంబర్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేసే దివ్యాంగుడికి బిల్లులు చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో రూ.7 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. అధికారుల సమన్వయ లోపంతో నీటి సరఫరా చేసే వ్యక్తి ఇబ్బందుల్లో పడ్డాడు. దీంతో ఇక తాను నీటి సరఫరా చేయలేనని రెండు వారాల క్రితం చేతులెత్తేశాడు. దీంతో ఆయా ప్రాంతాలలో నీటి సమస్య అధికమైంది. దీంతో బుధవారం గ్రామానికి చెందిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై బైఠాయించి అధికారుల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జన్మభూమి సభలకు వెళుతున్న ఎంపీపీ రవీంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చీదర్ల మల్లికార్జునల్ని అడ్డుకుని సమస్య పరిష్కరించేవరకూ కదలనివ్వమని తేల్చిచెప్పారు. సమాచారం అందుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పంచాయతీ నిధులతో బీసీ కాలనీ, దుత్తలూరు సెంటర్‌లలో నూతన బోర్లు రెండు, మూడు రోజుల్లో వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కావలి సబ్ కలెక్టర్ శ్రీధర్ దగ్గరికి వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజా ప్రతినిధులూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సాక్షి
గురువారం, జనవరి, 3

# మోదీ సుదీర్ఘ సంభాషణ

మరో ఆర్నెల్లలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా ప్రధాని నరేంద్ర మోదీ ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. గంటన్నరపాటు జరిగిన ఆ ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై తన అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకున్నారు. గత పాలకులు ఏ పార్టీకి చెందినవారైనా, వారిలో కొందరు మీడియాతో సంఘర్షించిన సందర్భాలున్నా తరచూ పాత్రికేయులతో సంభాషించేవారు. విశాల ప్రజానీకానికి తమ భావాలు చేరాలంటే మీడియానే ఆధారమని విశ్వసించేవారు. కానీ మోదీ ఇందుకు భిన్నం. ఆయన కేవలం ఎంపిక చేసుకున్న చానెళ్లతో మాట్లాడతారు. ట్వీటర్ ద్వారా, 'మన్ కీ బాత్' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో సంభాషిస్తారు. మీడియా సమావేశాల్లో నేతల ప్రసంగాలు పూర్తయిన వెంటనే విలేకరులు ప్రశ్నల బాణాలు సంధిస్తారు. వాటిలో ఎన్నో అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు ప్రజలకు మరింత లోతుగా ఆ నాయకుల ఆలోచనలు, మనోభావాలు అర్థమవుతాయి. మోదీ బలమంతా ఆయన సంభాషణ చాతుర్యమే. పార్లమెంటులో జరిగే చర్చల్లో ఈ సంగతి తరచు తెలుస్తూనే ఉంటుంది. అయినా ఆయన విలేకరుల సమావేశాలకు దూరంగా ఉంటారు. తాజా ఇంటర్వ్యూలో నరేంద్ర మోదీ పలు ప్రశ్నలకు సుదీర్ఘంగా జవాబులిచ్చారు. ఇందులో రామమందిరం మొదలుకొని ఈమధ్యే జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకూ అనేక అంశాలు ప్రస్తావనకొచ్చాయి. పాకిస్తాన్‌తో సంబంధాలు, చైనాతో ఏర్పడ్డ వివాదం, మూకదాడులు, పెద్దనోట్ల రద్దు, ట్రిపుల్ తలాక్, శబరిమల తదితర విషయాలపై ఆయన మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ గురించి అడిగితే 'నేను వినలేదు. నాకేమీ తెలియదు' అని తేల్చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మహా కూటమి ఓటమిపాలైన సంగతిని ప్రస్తావించారు. ఉర్జిత్ పటేల్ రాజీనామాపైనా పెదవి విప్పారు.

రామమందిరం విషయంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తుందన్న ఊహాగానాలు నిజం కాదని ఆయన తేల్చిచెప్పడం బాగానే ఉంది. ఊహాగానాలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉన్నకొద్దీ అవి మరింత చిక్కబడతాయి. అనవసర ఉద్రిక్తతలు ఏర్పడతాయి. కానీ 'న్యాయ ప్రక్రియ ముగిశాక' మా బాధ్యతను నిర్వర్తించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం వల్ల కొత్త సందేహాలొస్తాయి. సుప్రీంకోర్టులో ఎలాంటి తీర్పు వెలువడినా దానికి కట్టుబడి ఉంటామని చెబితే వేరు. ఆ స్పష్టత లేకపోవడం వల్ల తమ ఆలోచనలకు భిన్నమైన తీర్పు వస్తే ప్రభుత్వం ఏం చేస్తుందన్న సందేహం మిగిలే ఉంటుంది. ట్రిపుల్ తలాక్ అంశం వేరు. ఆ విధానం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాక ప్రభుత్వం దానికి అనుగుణంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. అనంతరం దాని స్థానంలో ప్రవేశపెట్టిన బిల్లు ప్రస్తుతం రాజ్యసభ ముందుంది. మరో ముఖ్యాంశం రైతు రుణ మాఫీ గురించి కూడా మోదీ తన మనోగతం చెప్పారు. రుణమాఫీ వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నీ తొలగిపోతాయనుకుంటే ఆ పని ఖచ్చితంగా చేయాల్సిందేనని అంటూనే ఎన్నోసార్లు రుణ మాఫీ జరిగినా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి కారణమేమిటని కూడా ఆయన అడిగారు. దానికి భిన్నంగా భూసార పరీక్ష కార్డులు, 22 పంట దిగుబడులకు స్వామినాథన్ కమిషన్ సూచించినట్టు 50 శాతం అదనంగా ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంటున్నామని మోదీ వివరించారు. కానీ కేంద్ర విధానం తాను సూచించిన తరహాలోలేదని స్వయానా స్వామినాథనే ఆమధ్య చెప్పిన సంగతి ఆయనకు తెలిసినట్టు లేదు. సాగు పెట్టుబడిని కేవలం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకయ్యే ఖర్చుకే పరిమితం చేయకుండా పొలంలో పనిచేసేవారి వార్షిక వేతనాలు, కౌలు మొత్తం, బీమా వ్యయం వగైరాలను కూడా లెక్కేసి దానికి అదనంగా ఒకటిన్నర రెట్లు ఇవ్వాలన్నది స్వామినాథన్ సూచించిన విధానం. దాన్ని తు చ తప్పకుండా అమలు చేస్తే రైతుల సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. అప్పుడు మోదీ చెప్పినట్టు రుణమాఫీ అవసరమే రాకపోవచ్చు. మరో సంగతేమంటే...యూపీ ఎన్నికల సమయంలో బీజేపీయే రుణమాఫీ వాగ్దానాన్ని చేసింది. అందువల్ల ఎన్నికల్లో లబ్ధి పొందింది. ఆ తర్వాత వచ్చిన ఒత్తిళ్లతో మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం కూడా అమలు చేసింది. రైతుల్లో ఎక్కువమంది బ్యాంకుల దగ్గర కాకుండా ప్రైవేటు రుణాలే తీసుకుంటారన్న మాట కూడా నిజం. తక్కువ వడ్డీకి రుణం దొరికే బ్యాంకుల దగ్గరకు పోకుండా అధిక వడ్డీ వసూలు చేసే ప్రైవేటు రుణాలకు రైతులు ఎందుకు వెళ్తున్నారో గ్రహించి ఆ లోటుపాట్లను కేంద్ర ప్రభుత్వం ఈపాటికే సరిచేసి ఉంటే బాగుండేది. కనీసం ఆ విషయంలో ఏం చేయబోతున్నారో కూడా మోదీ చెప్పలేదు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీలు చిక్కినప్పుడల్లా తనపై విరుచుకు పడుతున్నా ఇంటర్వ్యూలో ఆయన గురించి మోదీ అసలు ప్రస్తావించనే లేదు. తెలంగాణలో మహా కూటమి చిత్తుగా ఓడిపోవడం గురించి మాత్రమే మాట్లాడి దానికి సూత్రధారిని మాత్రం ఏమీ అనలేదు. ఆ రెండు పార్టీల ఉన్న బంధం చిత్రమైనది. బాబు చెప్పుకుంటున్నట్టు నిజంగా ఆయన మోదీపై హోరాహోరీగా తలపడుతుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిరాయించిన ఎంపీలపై ఈపాటికే అనర్హత వేటు పడి ఉండాలి. చట్టసభల అధ్యక్షులే ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాలని నిబంధనలు చెబుతాయి. కానీ అంతిమంగా అది రాజకీయ నిర్ణయం. ఈ విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసి అనేకసార్లు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేకపోయింది. మరో ఆర్నెల్లలో ఈ సభ గడువు కూడా ముగిసిపోతోంది. చట్టప్రకారం యధావిధిగా జరగాల్సిన అంశంలోనే ఇలాంటి వైఖరి ప్రదర్శిస్తుంటే ఇక వారిద్దరూ ప్రత్యర్థులంటే నమ్మేదెవరు? ఇప్పుడు మోదీ తన జవాబుల్లో బాబు పేరెత్తకపోవడం కూడా దాన్నే ధ్రువపరుస్తోంది. మొత్తానికి ఈ ఇంటర్వ్యూలో సుదీర్ఘ సంభాషణే సాగినా, కీలక అంశాలే ప్రస్తావనకొచ్చినా అసంపూర్ణంగానే అనిపిస్తుంది. కేవలం ఒక్కరితోనే సంభాషించినప్పుడు ఇది తప్పదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిరమాసం,తిథి బ.త్రయోదశి రా.3.56 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం అనూరాధ ప.12.33 వరకు, తదుపరి జ్యేష్ఠ వర్జ్యం సా.6.24 నుంచి 8.04 వరకు, దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 10.57 వరకు తదుపరి ప.2.38 నుంచి 3.21 వరకు, అమృతఘడియలు...తె.4.03 నుంచి 6.23 వరకు(తెల్లవారితే శుక్రవారం)

**సూర్యోదయం :** 6.36
**సూర్యాస్తమయం:** 5.34
**రాహుకాలం :** ప. 1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# ఊహల్లోనే కలల రాజధాని

**రాజధానికి సంబంధించిన ప్రతి పని ఒక ఆర్భాటపు ప్రహసనమే తప్ప క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. పరిపాలనా నగరం డిజైన్లను రూపొందించేందుకు మాస్టర్ ఆర్కిటెక్ట్‌గా మొదట జపాన్‌కు చెందిన మకి అసోసియేట్స్‌ను అంతర్జాతీయ పోటీలో ఎంపిక చేసింది. ప్రభుత్వ పెద్దల అభిమతానికి అనుగుణంగా మకి అసోసియేట్స్ పనిచేయక పోవడంతో అనూహ్యంగా దాన్ని పక్కకు తప్పించి లండన్‌కు చెందిన నార్మన్ పోస్టర్స్ అండర్ పార్టనర్స్‌ను మాస్టర్ ఆర్కిటెక్‌గా ఎంపిక చేసింది. దీంతో మకి ఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు అంతర్జాతీయ జర్నళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలను ఎండగట్టడంతో రాష్ట్రం పరువు బజారునపడింది.**

అమరావతిలో రాజధాని ఎక్కడుందో కనపడ్డంలేదు కానీ అంతర్జాతీయ స్థాయి కుంభకోణాలు మాత్రం కలవరపెడుతున్నాయి. కొత్త రాజధానిలో నిర్మాణాలు ఒకటి రెండే ఉండగా వివాదాలు, అడ్డగోలు వ్యవహారాలు మాత్రం అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. సింగపూర్ కంపెనీలతో లాలూచీపడి వేల కోట్ల విలువైన భూములను వారికి అప్పనంగా అప్పగించడం.. భూసమీకరణ పేరుతో నాలుగు పంటలు పండే భూములను రైతుల నుంచి బలవంతంగా తీసుకోవడం.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా వేల కోట్ల విలువైన భూములను సొంతం చేసుకోవడం.. డిజైన్లు, తాత్కాలిక నిర్మాణాల పేరుతో వందల కోట్ల రూపాయలను దుబారా చేయడం వంటి అనేక దారుణాలు అమరావతిలో చోటుచేసుకున్నాయి. ప్రపంచ స్థాయి రాజధాని కడుతున్నామంటూ పంచరంగుల సినిమా చూపించి ప్రచారం చేసుకోవడమే తప్ప రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల గురించి పట్టించుకోలేదు. నాలుగున్నరేళ్లలో రాజధానిని కాగితాల నుంచి వాస్తవంలోకి తీసుకురాలేకపోయిన ప్రభుత్వం ఆ పేరుతో కనీవినీ ఎరుగని అవినీతికి పాల్పడిందనడానికి ఇవే నిదర్శనాలుగా ఉన్నాయి. కానీ రాజధానిపై విడుదల చేసిన శ్వేతపత్రంలో అంతా చేసేసినట్లు మరోసారి రాష్ట్ర ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది.

### ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో భారీ కుంభకోణం

2014 జూన్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజధాని ఎక్కడనే విషయంపై వ్యూహాత్మకంగా లీకులిచ్చిన ప్రభుత్వ పెద్దలు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా చేజిక్కించుకున్నారు. శివరామ కృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను పక్కనపెట్టి తమకు అనుకూలమైన ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని ఆ విషయాన్ని తమ అనుయాయులు, అస్మదీయులకు మాత్రమే తెలిసేలా చేశారు. ముఖ్యమంత్రి కుమారుడు, ఆయనకు కావల్సిన వ్యక్తులంతా రాజధాని ఏర్పాటు చేయాలను కున్న ప్రాంతంలో తక్కువ ధరకు భారీగా భూములు కొనుగోలు చేశారు. సుమారు 25 వేల ఎకరాలను ఇలా తాము ముందే అనుకున్న ప్రాంతంలో టీడీపీ నాయకులు తక్కువ రేటుకు చేజిక్కించుకున్నారు. అదే సమయంలో బయట ప్రపంచానికి మాత్రం రాజధాని నూజివీడులో అని, గన్నవరంలో అని, గుంటూరు నాగార్జున వర్సిటీ పరిధిలో అని అనుకూల మీడియా ద్వారా లీకులిచ్చారు. తద్వారా రాజధాని పేరుతో ఆయా ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ బూమ్ సృష్టించి సాధారణ, మధ్యతరగతి ప్రజలను తప్పుదారి పట్టించారు. మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా తాము ముందే నిర్ణయించుకున్నచోట కారుచౌకగా భూములు కొనేశారు. అక్కడ భూములన్నీ చాలావరకూ తమ చేతుల్లోకి వచ్చాక గుంటూరు జిల్లా తుళ్లూరులో రాజధాని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆ ప్రాంతంలో అప్పటివరకూ భూములమ్ముకున్న వారు గొల్లుమనగా, ప్రభుత్వ లీకులతో వేరే ప్రాంతాల్లో కొన్నవారు నిండామునిగిపోయారు. తాము అనుకున్న ప్రాంతంలో కొన్న భూముల విలువ రాజధాని ప్రకటన తర్వాత అమాంతం పెరిగిపోవడంతో టీడీపీ బడా బాబులంతా వేలకోట్ల లబ్ధి పొందగా, ఈ ఆట తెలియని సామాన్యులు సర్వం పోగొట్టుకున్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా ముఖ్యమంత్రి కుమారుడు లోకేశ్, మంత్రులు నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వర రావుతోపాటు అనేక మంది టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు రాజధాని ప్రాంతంలో ఇష్టానుసారం భూములు కొనుగోలు చేయడాన్ని రెండేళ్ల క్రితమే 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది.


### బలవంతపు భూసమీకరణ.. అడుగడుగునా దౌర్జన్యాలు

భూములన్నీ తమ చేతుల్లోకి వచ్చిన తర్వాత తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 29 గ్రామాల్లోని 28,054 మంది రైతుల నుంచి ప్రభుత్వం భూసమీకరణ ద్వారా 34 వేల ఎకరాలను బలవంతంగా లాక్కుంది. కృష్ణా నది తీరంలో నాలుగు పంటలు పండే అత్యంత విలువైన భూములను ఇవ్వలేమని రైతులు గగ్గోలు పెట్టినా, పర్యావరణవాదులు ఎంత మొత్తుకున్నా, ప్రతిపక్షాలు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా పట్టించు కోకుండా ప్రభుత్వం బెదిరింపులు, దౌర్జన్యాలతో భూములు లాక్కుంది. పలు చోట్ల తోటలను దగ్ధం చేయడం, ఇవ్వని రైతులపై కేసులు పెట్టి వేధించడం, వారి ఇళ్లకు వెళ్లి మరీ టీడీపీ నాయకులు బెదిరించడం, పొలాలకు నీరు, విద్యుత్ సరఫరా ఆపివేయడం, వ్యవసాయ రుణాలు ఇవ్వకపోవడం, రైతులకు తెలియకుండానే వారి భూములను దున్నేయడం వంటి అనేక అరాచకాలు తెరవెనుక చోటుచేసుకున్నాయి. ఇంత దారుణంగా భూములు లాక్కున్న ప్రభుత్వం తమకు అనుకూలమైన కొందరు రైతులను చూపించి స్వచ్ఛందంగా రైతులు భూములిచ్చినట్లు ప్రచారం చేసింది. భూసమీకరణ ప్యాకేజీ టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి లబ్ధి చేకూర్చేలా తయారు చేయడంతోపాటు సమీకరించిన భూమికి సంబంధించి రైతులకిచ్చే ప్లాట్ల విషయంలోనూ వివక్ష చూపించారు. చిన్న రైతుల నోట్లో మట్టికొట్టి వారి భూముల పేరుతో స్థానికంగా టీడీపీ నాయకులకు ప్లాట్లు ఇచ్చిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. దళిత రైతుల అసైన్డ్, లంక భూములను అధికార పార్టీ నేతలు భయపెట్టి కారుచౌకగా తీసుకున్నారు. ఐదు వేల ఎకరాలకుపైగా భూములు ఇలా టీడీపీ నేతల వశమయ్యాయి.

### రైతులకిచ్చిన హామీలు బుట్టదాఖలు

రాజధానిలో భూములిచ్చిన రైతులకు పెద్దపీట వేస్తున్నామని ప్రచారం చేస్తున్నా అది మాటల వరకే పరిమితమైంది. సేకరించిన భూమికి బదులు మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లను తిరిగి ఇస్తామని వాటి విలువ ఇచ్చిన భూమి కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటుందని నమ్మించారు. భూములు తీసుకున్న మూడున్నరేళ్ల తర్వాత కూడా ఇప్పటివరకూ రైతులకు భౌతికంగా ప్లాట్లు అప్పగించలేదు. కేవలం కాగితాల్లోనే పంపిణీ జరిగింది. రైతులకిచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం వారిచ్చిన భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టింది. తమకిస్తామని చెప్పిన ప్లాట్లలో పిచ్చిమొక్కలు మొలిపించి వాటిని బీళ్లుగా మార్చిన ప్రభుత్వం, వాటి పక్కనే అపార్టుమెంట్లు నిర్మించి వేరే వాళ్లకి అమ్మకం ఎంతవరకూ సమంజసమని రైతులు వాపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. 29 గ్రామాల్లో రైతుల వాటాగా ఇవ్వాల్సిన ప్లాట్ల లేఅవుట్లను 13 జోన్లుగా విభజించి వాటిలో రోడ్లు, డ్రయిన్లు, మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, విద్యుదీకరణ, భూగర్భ డ్రైనేజీ వంటి సకల సౌకర్యాలు కల్పిస్తామని సీఆర్‌డీఏ ప్రకటించింది. కానీ మూడున్నరేళ్లయినా ఒక్క జోన్లో కూడా ఈ పనులు మొదలు కాకపోగా పీపీపీ, హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో పలుమార్లు టెండర్లు పిలిచి వాటిని రద్దు చేశారు. ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వంపై నమ్మకం లేక రైతులు తమకు తిరిగి ఇచ్చిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు రాలేదు. 62,596 ప్లాట్లను 28 వేల మంది రైతులు తమ పేరు మీద రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు 27,750 ప్లాట్లను

**శ్వేతపత్రం - 7**
**అమరావతి అంతర్జాతీయ కుంభకోణాలపై విశ్లేషణ**



మాత్రమే సంబంధిత రైతులు రిజిస్టర్ చేయించుకున్నారు. ఇంకా 34,846 ప్లాట్లను వాటి యజమానులైన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా వదిలేశారు. రైతులకివ్వాల్సిన ప్లాట్లను ఆయా గ్రామాలకు దూరంగా లేఅవుట్లు వేసి హద్దుల ప్రకారం రాళ్లు పాతారు. అవన్నీ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి దారీతెన్నూ లేకుండా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. లేఅవుట్లకు వెళ్లేందుకు రోడ్లు కూడా లేవు. లేఅవుట్లలోపల అంతర్గతరోడ్లు, డ్రయిన్లు, వీధిలైట్లు వంటి కనీస సదుపాయాలకు సైతం ఇంకా ప్రణాళికలు రూపొందిస్తూనే ఉన్నారు. మరోవైపు కార్పొరేట్ సంస్థలు, తమకు నచ్చిన వారికి కట్టబెట్టిన భూములను మాత్రం సీఆర్‌డీఏ సుందరంగా తీర్చిదిద్దింది. రైతుల నుంచి తీసుకున్న భూములను వారికి అప్పగించేముందు పూర్తిగా చదును చేశారు. ఎస్ఆర్ఎం, విట్ వంటి సంస్థలకిచ్చిన వందల ఎకరాలను పూర్తిగా అభివృద్ధి చేయడంతోపాటు సీఆర్‌డీఏ సొంత ఖర్చులతో మంగళగిరి నుంచి ఆ క్యాంపస్‌లకు రోడ్లు వేసింది. తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సౌకర్యాల కల్పన కూడా సీఆర్‌డీఏ అధికారులు దగ్గరుండి సమకూర్చారు. రైతుల వద్దకొచ్చేసరికి ప్రభుత్వం మొండిచేయి చూపింది. రైతుల నుంచి సేకరించిన భూమిని కార్పొరేట్ సంస్థలకు, తమకు నచ్చిన వారికి ప్రభుత్వం కారుచౌకగా కట్టబెట్టింది. విట్, ఎస్ఆర్ఎం, బీఆర్ శెట్టి వంటి సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకు కట్టబెట్టగా ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు ఎకరం నాలుగు కోట్లకు అమ్మింది. తనకు కావాల్సిన కొన్ని సంస్థలకు ఉచితంగా, నామమాత్రపు రేట్లకు భూములు కట్టబెట్టారు.

### సింగపూర్ కంపెనీలతో లాలూచీ

స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు పేరుతో రాజధాని భూములను కారుచౌకగా సింగపూర్ కంపెనీలకు కట్టబెట్టి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి కుంభకోణానికి తెరతీసింది. రైతుల నుంచి సేకరించిన భూముల్లో 1691 ఎకరాలను ఎకరం రూ.12 లక్షల చొప్పున స్విస్ చాలెంజ్ విధానంలో నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి సింగపూర్ కన్సార్టియంకు అప్పగించింది. అవే భూములను ఇతర కంపెనీలకు ఎకరం రూ.4 కోట్లకు ప్రభుత్వం కేటాయించింది. దీన్నిబట్టి రూ.6,764 కోట్ల విలువైన భూములను కేవలం రూ.243 కోట్లకు అప్పగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ప్రాజెక్టు కోసం రాజధాని ప్రకటనకు ముందే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యులు సింగపూర్ కంపెనీలతో లోపాయకారీ ఒప్పందం చేసుకున్నారు. రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను వారితో తయారు చేయించి ఆ తర్వాత ఈ ప్రాజెక్టును స్విస్ చాలెంజ్ విధానంలో వారికే అప్పగించారు. ఈ విధానంలో ఉన్న అవకతవకలు, ఇందులో తమకూ అవకాశం ఇవ్వాలని పలు సంస్థలు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపింది. దీంతో ఏపీఐడీసీ చట్టాన్నే మార్చివేసి సింగపూర్ కన్సార్టియంకు ప్రాజెక్టును అప్పగించారు. ప్రభుత్వం అభివృద్ధి చేసి ఇచ్చిన ఈ భూముల్లో ప్లాట్లు వేసి సింగపూర్ కన్సార్టియం, ఏడీసీ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కలిసి విక్రయిస్తుంది. కారుచౌకగా భూములివ్వడంతోపాటు రూ.5,500 కోట్లతో అందులో మౌలిక వసతులు అభివద్ధి చేసే పని కూడా ప్రభుత్వానిదే. ఈ భూములపై సింగపూర్ కన్సార్టియంకు సీఆర్డీఏ పవర్ ఆఫ్ అటార్నీ కూడా ఇచ్చేసింది. ఇంతచేసి సింగపూర్ కంపెనీలు ఇందులో పెట్టే పెట్టుబడి రూ.330 కోట్లు మాత్రమే. కానీ ప్రాజెక్టులో మాత్రం 58 శాతం వాటా వారికిచ్చారు. భూములు, వసతుల కల్పన అన్నీ చేసిన ఏడీసీకి 42 శాతం వాటా ఉండటం గమనార్హం. ఇంత దారుణంగా నష్టపోతూ సింగపూర్ కన్సార్టియంకు మోకరిల్లడం వెనుక ప్రభుత్వ ముఖ్యుల స్వప్రయోజనాలున్నాయని, వేల కోట్ల లబ్ధి ఉందని స్పష్టమవుతోంది.

### తాత్కాలిక సచివాలయం ఒక్కటే.. అందులోనూ అవినీతి..

ప్రపంచ స్థాయి రాజధాని అంటూ నాలుగున్నరేళ్లుగా హంగామా చేసినా ఇప్పటివరకూ తాత్కాలిక సచివాలయం తప్ప మరో నిర్మాణాన్ని రాజధానిలో కట్టలేకపోయారు. వెలగపూడిలో నిర్మించిన తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలకు ఎవరూ ఊహించని విధంగా వెయ్యి కోట్ల వరకూ ఖర్చు చేశారు. ఆరు లక్షల చదరపు అడుగుల్లో నిర్మించిన ఆరు బ్లాకులను మొదట రూ.180 కోట్లతో మొదలు పెట్టి అంచెలంచెలుగా దాని ఖర్చు పెంచుకుంటూ వెళ్లారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా చదరపు అడుగుకు రూ.10 వేలు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనాలు పైన పటారం లోన లొటారం మాదిరిగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికే భవనాల లోపల వర్షపు ధార కారిపోతుండటం వాటి నాణ్యతను బయటపెట్టింది. తాత్కాలిక హైకోర్టు నిర్మాణం విషయంలోనూ ప్రభుత్వం చేతులెత్తేసింది. గత సంవత్సరం డిసెంబర్ 15వ తేదీలోపు కోర్టు భవనాలను అందుబాటులోకి తెస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రభుత్వం మాటలు నమ్మి సుప్రీంకోర్టు హైకోర్టు విభజనకు నోటిఫికేషన్ ఇచ్చాక ఇంకా భవన నిర్మాణం పూర్తికాలేదని, ఇప్పటికిప్పుడు ఎలా హైకోర్టును విభజిస్తారని సాక్షాత్తూ ముఖ్యమంత్రి మాటమార్చేశారు. ప్రభుత్వం చెప్పే మాటలకు చేతలకు పొంతన లేదనడానికి హైకోర్టు నిర్మాణం ఒక ఉదాహరణ.

### కన్సల్టెన్సీలకు రూ. 461 కోట్ల చెల్లింపులు

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో నిష్ణాతులైన అధికారులున్నా, రాష్ట్రంలోనూ, దేశంలోనూ అనేక మంది నిపుణులు, సంస్థలున్నా పట్టించుకోకుండా పైపై మెరుగుల కోసం కన్సల్టెన్సీల కోసం కోట్లు ధారబోసింది. నాలుగున్నరేళ్లలో అక్షరాల రూ.461 కోట్లను కన్సల్టెన్సీలకు చెల్లించింది. మొత్తం 55 కన్సల్టెన్సీలను నియమించుకోగా అందులో రాజధాని డిజైన్ల పేరుతో కేవలం రెండు సంస్థలకే రూ.173 కోట్లు ఇచ్చింది. వందలాది మంది ఇంజనీర్లను కొత్తగా నియమించుకుని, డిప్యుటేషన్లపై వివిధ శాఖల నుంచి రప్పించుకున్నాక కూడా ప్రాజెక్టుల నిర్వహణ కోసమంటూ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్లను తెచ్చిపెట్టుకుంది. ఈ నిర్వహణ సంస్థలకే ఇప్పటివరకూ రూ.117 కోట్లు సమర్పించింది.

### ఒక్క శాశ్వత భవనమూ లేదు

ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్ల వరకూ తాత్కాలిక సచివాలయం మినహా ఒక్క శాశ్వత భవన నిర్మాణానికి పునాది వేయలేదు. డిజైన్ల కోసం పాత సినిమాల్లో విఠలాచార్యను మించిన ఐడియాలతో చంద్రబాబు చేస్తున్న విన్యాసాలతో నవ్వులపాలవడం తప్ప ఫలితం లేకుండాపోయింది. 1,375 ఎకరాల రాజధాని పరిపాలనా నగరం డిజైన్లను రూపొందించేందుకు మాస్టర్ ఆర్కిటెక్ట్‌గా మొదట జపాన్‌కు చెందిన మకి అసోసియేట్స్‌ను అంతర్జాతీయ పోటీలో ఎంపిక చేసింది. ప్రభుత్వ పెద్దల అభిమతానికి అనుగుణంగా మకి అసోసియేట్స్ పనిచేయకపోవడంతో అనూహ్యంగా దాన్ని పక్కకు తప్పించి లండన్‌కు చెందిన నార్మన్ పోస్టర్స్ అండర్ పార్టనర్స్‌ను మాస్టర్ ఆర్కిటెక్‌గా ఎంపిక చేసింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని మకి ఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు అంతర్జాతీయ జర్నళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలను ఎండగట్టడంతో రాష్ట్రం పరువు బజారునపడింది. మరోవైపు నార్మన్ పోస్టర్స్ సంస్థ డిజైన్లు సమర్పించకుండానే బాహుబలి సినిమాలో మాహిష్మతి సెట్టింగ్, గౌతమీపుత్ర శాతకర్ణిలోని అమరావతి సెట్టింగ్‌లపై మనసుపడిన చంద్రబాబు వాటి దర్శకులతో చర్చలు జరిపారు. ఇలా రకరకాల డిజైన్లను అనుకూల మీడియాలో చూపిస్తూ అదే రాజధాని అని హడావుడి చేశారు. నాలుగేళ్లయినా శాశ్వత కట్టడాలకు పునాది పడలేదనే విమర్శల హోరు తట్టుకోలేక మూడు నెలలక్రితం నుంచే శాశ్వత భవనాలైన సచివాలయం, అసెంబ్లీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ నివాస భవనాల పనులను మొదలు పెట్టారు. అయితే ఈ భవనాలు, రాజధాని రోడ్ల నిర్మాణ అంచనాలను కళ్లుచెదిరేలా రూపొందించి పనులు చేస్తుండటం వెనుక భారీ అవినీతి చోటు చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. చదరపు అడుగుకు నాలుగైదు వేలతో నిర్మించే అవకాశం ఉన్న భవనాలను రూ.7 వేల నుంచి పది వేల వరకూ అంచనాలతో చేపట్టడంతో నిపుణులే విస్తుపోయే పరిస్థితి నెలకొంది. రూ.1,387 కోట్ల అంచనాతో కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి పనుల్ని ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించడం ఈ కోవలోనిదే. మరోవైపు టెండర్లు, డిజైన్లతో సంబంధం లేకుండా రూ.250 కోట్లు ఖర్చు పెట్టి రెండున్నరేళ్ల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి శంకుస్థాపన చేయించినా అక్కడ ఏం కట్టాలనే దానిపై ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. పరిపాలనా నగరానికి కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీతో రెండేళ్ల కిందట శంకుస్థాపన చేయించినా అక్కడ ఇప్పుడిప్పుడే నిర్మాణాలు మొదలు పెట్టి వాటిని చూపించి అదే రాజధాని అని ప్రచారం చేస్తున్నారు. ఇలా రాజధానికి సంబంధించిన ప్రతి పని ఒక ఆర్భాటపు ప్రహసనమే తప్ప క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది.

–బొల్లికొండ ఫణికుమార్, సాక్షి ప్రతినిధి

## మళ్లీ మెరిసిన హసీనా

ఆవామీలీగ్ అధ్యక్షురాలు, ప్రస్తుత ప్రధాని షేక్ హసీనాకి వరుసగా మూడోసారి బంగ్లాదేశ్ ప్రధానిగా అవకాశమిస్తూ ఆ దేశ ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో భారీ విజయాన్ని కట్టబెట్టడం చరిత్రాత్మకం. ఆమె పార్టీ ఆధ్వర్యంలోని అధికారిక కూటమికి 98 శాతం సీట్లు రాగా,ప్రతిపక్ష కూటమికి కేవలం రెండు శాతం రావడం విశేషం. గత పదేళ్ల పాలనలో ఆ దేశం గణనీయమైన ఆర్థిక ప్రగతి కనపర్చింది. సామాజిక సూచీల్లో పైకి ఎగబాకి పేద దేశమన్న ముద్ర చెరుపుకోగలగడం హసీనా నాయకత్వ పటిమకు నిదర్శనం. అయితే మానవ హక్కుల ఉల్లంఘనలో, ప్రతిపక్షవాణిని, మీడియా గొంతుని నొక్కేయడంలో మాత్రం ముందుండి తల వంపులు తెచ్చుకుంది. నామమాత్రంగా ఉన్న ప్రతిపక్షం, భారీగా చేకూరిన విజయంతో రానున్న పదవీకాలంలో మరింత నిరంకుశ ధోరణి చూపిస్తే ప్రజలకు కష్టమే. మొదటినుంచీ భారత్ పట్ల సానుకూల వైఖరి చూపిస్తున్న ఆమె తిరిగి గెలుపొందడం భారత్‌కు ఊరట. ఒక్కొక్క పొరుగు దేశం భారత్‌కి దూరం జరుగుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో సుస్థిర పాలన, మిత్ర వైఖరికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ కోణంలో చూస్తే ఆమె గెలుపు శుభవార్త. ఈమధ్య భావోద్వేగాల ఎజెండాలతో అమెరికా సహా వివిధ దేశాల్లో ఎన్నికలు జరుగుతుండగా, అభివృద్ధి ఎజెండాతో బంగ్లాదేశ్ ఎన్నికలు జరగడం, అధికార పార్టీ గెలుపొందడం మంచి సమకాలీన పరిణామం. ఆచరించదగ్గ ఆదర్శం.

డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపి, పార్వతీపురం.

## ఓ అజ్ఞాత విజ్ఞాని



గొల్లపూడి మారుతీరావు

చెన్నైలో లజ్ సెంటర్ నుంచి ఎల్డామ్స్ రోడ్డు వేవు నడుస్తున్నప్పుడు దారిలో చాలా ప్రసిద్ధమైన అడ్రసులు. ఇంగ్లీషు వారి కాలంలోనే కోర్టుల్లో వారినే తన ఆంగ్లభాషా వైశిష్ట్యంతో అబ్బుర పరిచిన రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి హాలు తగుల్తుంది. అది దాటగానే అమృతాంజనం ఆఫీసు, పక్కన ఆంధ్రదేశ చరిత్రలో భాగమయిన శ్రీభాగ్ ఒడంబడిక జరిగిన శ్రీ భాగ్ బంగళా, తర్వాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి పార్కు. అయితే అటు వెళ్లేటప్పుడు ఇవేవీ గుర్తుకురావు. శాస్త్రిహాలుకి ముందుగా రోడ్డు పక్క రోడ్డుమీదే గుట్టగా పోసిన కొన్ని లక్షల పాతపుస్తకాల దుకాణం కనిపిస్తుంది. దీనికి గది, తాళాలు, పుస్తకాలకి రక్షణా ఏమీలేదు. ఆరుబయట– రోడ్డుమీదే పరిచిన దుకాణం. ఎండా, వానా, తుఫాన్, గాలి దుమారం ఏది వచ్చినా తట్టుకుంటూ గత అయిదు దశాబ్దాలుగా నడుస్తున్న సెకండ్ హ్యాండ్ దుకాణం. పుస్తకాలమీద పెద్ద టార్పాలిన్ కప్పి ఉంటుంది. ఆ గుట్ట ముందు – తపస్సు చేస్తున్నట్టు ఓ ముసలాయన కూర్చుంటాడు. అతని పేరు ఆళ్వార్. వొంటిమీద షర్టు లేదు. ఆయన పెరియార్ రామస్వామి నాయకర్ భక్తుడు. అందుకని తర్వాతి రోజుల్లో ఆయనలాగ గెడ్డం పెంచాలి. నగరంలో వేలాది మేధావులకు, విద్యార్థులకు, రచయితలకు ఆ గుట్ట ఆటపట్టు. ఎప్పుడూ ఆ గుట్ట చుట్టూ ఖరీదయిన దుస్తులు వేసుకున్న వారూ, మేధావులూ పుస్తకాలు తిరగేస్తూ కనిపిస్తారు.

రోజర్స్ థెసారెస్ , పాపిలియాన్, షేక్స్పియర్ సమగ్ర రచన సర్వస్వం, థామస్ హార్డీ రచనలు –ఇలా వేటి గురించయినా చెప్పగలడు. ఇంకా వైద్యం, ఇంజనీరింగ్, అకౌంటెన్సీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ – ఈ విభాగాలలో ఎన్నో అరుదయిన పుస్తకాలు దొరుకుతాయి .ముద్రణలో లేని పుస్తకమా? ఇదొక్కటే అడ్రసు. కష్టమర్లు తప్పిపోయిన పాతమిత్రుడిని కలిసినట్టు పుస్తకాలను కరుచుకువెళ్లడం అక్కడ తరచుగా కనిపించే దృశ్యం. విశేషమేమిటంటే ఐయ్యేయస్ పరీక్షలకి వెళ్ళే గ్రాడ్యుయేట్లు మధుర, తిరుచ్చి వంటి సుదూరమయిన ప్రాంతాలనుంచి అరుదయిన పుస్తకాలకి ఇక్కడికి వస్తారు.

**జీవన కాలమ్**



ఆళ్వార్‌కు నివాళి

ఈ 50 సంవత్సరాలలో ఆ పుస్తకాల గుట్టకి తరచు వచ్చే కొందరు మహానుభావుల పేర్లు – సుప్రసిద్ధులైన భారతీ దాసన్ ఆయన కస్టమర్. పుళమై పిత్తన్, ముత్తులింగం వంటి కవులు వతనుగా వచ్చే వారు. ఫిలిం ఇండస్ట్రీ నుంచీ సెంథిల్, గౌండర్ మణి, ఎస్. వి. శేఖర్, చో రామస్వామి ఆయన సోదరుడు అంబి తరచు వచ్చేవారు. హీరో జయశంకర్ ఇక్కడ కూర్చుని టీ తాగి వెళ్లేవాడు కొన్ని రోజులు –ఇతను మైసూరు మహారాజా సామరాజ వొడయార్‌కీ, అప్పటి ముఖ్యమంత్రులు రామస్వామి రెడ్డియార్, అన్నాదురైకి పుస్తకాలు ఇచ్చి వచ్చేవాడు.

ఇతని అసలు పేరు ఆర్. కె. నమ్మాళ్వార్. కాని అందరికీ అతను ఆళ్వార్. ఆళ్వార్ షాపు లజ్ దగ్గర పెద్ద బండగుర్తు. ఎప్పుడో 60 ఏళ్ల కిందట కడుపు పట్టుకుని విల్లుపురం దగ్గర వానియం పాలయం నుంచి చెన్నైలో దిగాడు ఆళ్వారు. 1950లో ఇక్కడ ఈ దుకాణానికి ప్రారంభోత్సవం చేశాడు. అప్పటి ముఖ్యమంత్రి –''ఇక్కడ వ్యాపారం చేసుకోవయ్యా'' అని అనుమతి ఇచ్చారు. ఆ మాట ఇనుపకవచంలాగా సంవత్సరాల తరబడి పోలీసుల బారిన పడకుండా కాపాడింది. రోడ్డుపక్క ఈ పుస్తకాల గుట్ట పోలీసులకి కన్నెర్ర, ఈ మధ్య ఎవరో పోలీసులమంటూ వచ్చి కొన్ని వేల పుస్తకాలే పట్టుకుపోయారు. మళ్ళీ తిరిగి ఇస్తే ఒట్టు. ఈ పుస్తకాల వ్యాపారానికి ముందు ఆళ్వార్ నెప్ట్యూన్ స్టూడియోలో లైట్ బోయ్‌గా పనిచేశాడు. కొన్ని సినిమాల్లో నటించాడు – మనోహర, స్వర్గవాసల్, తిలివిషం మొదలైనవి.

మరి ఈ లక్షల పుస్తకాలు ఆళ్వార్‌కి ఎలా చేరుతాయి? కనీసం 10 మంది ఇంటింటికీ తిరిగి పుస్తకాలను కొని తీసుకు వస్తారు. రమణన్ అనే అతను 17 ఏళ్లుగా ఈ పని చేస్తున్నాడు. అతనికిప్పుడు 73 సంవత్సరాలు. ధనరాజ్ అనే కుర్రాడు పాతికేళ్లుగా ఈ పని చేస్తున్నాడు.

ఇతని వ్యక్తిగత జీవితం ఇంకా ఆసక్తికరం. వెనుక ఇంట్లో పని చేసే పనిమనిషి– 'మేరీ'ని ఆళ్వార్ పెళ్లి చేసుకున్నాడు. ప్రేమా? అని మేరీని అడిగితే సిగ్గుపడింది. విచిత్రమేమిటంటే ఈ మతాతీత వివాహం పెద్దలు చేసినది! మేరీకి ఎప్పుడు పెళ్లయిందో గుర్తు లేదు. ఆ మాటకు వస్తే తన వయస్సు ఎంతో తెలీదు! వాళ్లకి నలుగురమ్మాయిలు. ఒక అమ్మాయికి పెళ్లి చేశారు.

''నేను విజ్ఞానాన్ని పంచుతానని అందరూ అంటారు. ఆ మాట ప్రభుత్వం అనుకుని నా వ్యాపారం సాగనిస్తే మేలు'' అంటాడు ఆళ్వార్. ఈ మధ్య చాలాసార్లు అటువేపు వెళ్లాను. ఇప్పుడక్కడ పుస్తకాల గుట్టలేదు. ఆళ్వార్ లేడు. ఏమయింది?

వారం రోజుల కిందట – తన 95వ యేట – ఆళ్వార్ కన్నుమూశాడు.

## ఎగసి పడిన ఆఖరి అల!



దూసనపూడి సుబ్బాయమ్మ మృతితో మహిళా చైతన్య మహోజ్జ్వల పర్వంలో ఓ శకం ముగిసినట్లయింది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దూసనపూడి విరాట్రాజు సతీమణి సుబ్బాయమ్మ, కిందటి నెల 22న, తాడేపల్లిగూడెంలో కన్నుమూశారు. పదమూడేళ్ళ వయసులో సుబ్బాయమ్మ మహిళా ఉద్యమంలో ప్రవేశించారు. పశ్చిమగోదావరి జిలాలోని నవుడూరులో, 1943లో జిల్లా మహిళా సంఘం రెండో మహాసభలో పాల్గొనడంతో ఆమె ప్రజాజీవనం మొదలైంది. అది దాదాపు అర్ధ శతాబ్దం పాటు కొనసాగింది. 1930 దశకం చివరి సంవత్సరాల్లో, ఆనాటి కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషీ (పూరణ్ చంద్ జోషీ) ప్రజాసంఘాల నిర్మాణ కార్యక్రమానికి చొరవ తీసుకున్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐకేఎస్ (కిసాన్ సభ), ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (మహిళా సమాఖ్య), ఇప్టా (ప్రజా నాట్యమండలి), అభ్యుదయ రచయితల సంఘం తదితర ప్రజాసంఘాల శిల్పి జోషీయే. ఈ సంఘాలన్నింటిలోకీ మహిళా సంఘం విశిష్ట ప్రాధాన్యం సంతరించుకుంది. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనని కారణంగా ప్రజలకు దూరమయిపోయిన 'పార్టీ'కి ఈ ప్రజాసంఘాలే కొత్త నెత్తురు ఎక్కించి నిలబెట్టాయి. సుబ్బాయమ్మ ఈ కొత్తనెత్తురులో భాగంగానే మహిళా ఉద్యమంలో ప్రవేశించారు. 1948లో విజయవాడలో జరిగిన మహిళా సంఘం శిక్షణ తరగతులపై విధించిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించి సుబ్బాయమ్మ మొదటిసారి జైలుకు వెళ్ళారు.

1943 డిసెంబర్ 23, 24 తేదీల్లో జరిగిన నవుడూరు మహిళా సభ విశిష్టతను అర్థం చేసుకోవడానికి ఆ సభ చేసిన తీర్మానాలను ఒక్కసారి చూస్తే సరిపోతుంది. మహిళలకు వారసత్వ సంపదలో సమాన హక్కు ఇవ్వాలని మొట్టమొదటిసారి తీర్మానం చేసిన సభ ఇదే. పెళ్ళిళ్ళన్నిటినీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసే విధంగా చట్టాన్ని సవరించాలని కూడా ఈ సభ తీర్మానించడం మరో విశేషం. ప్రతి గ్రామంలోనూ స్థానిక ప్రభుత్వాలు మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని, మంత్రసానులను నియమించాలని, బాలికల కోసం పాఠశాలల్ని ప్రారంభించాలని ఈ సభ తీర్మానించిన సంగతి గుర్తు చేసుకోవడం ముఖ్యం. అయితే ఈ అవసరాలు ఇప్పటికీ అంటే 75 సంవత్సరాల తర్వాత కూడా అపరిష్కృతంగా మిగిలే ఉన్న వాస్తవాన్ని గుర్తు చేసుకోవడం మరింత ముఖ్యం. స్త్రీ పురుష వివక్ష లేకుండా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్మానం చేసిన తొలి సభ ఇదేనేమో! అలాగే పిల్లలను దేశభక్తులుగా తీర్చిదిద్దే నిమిత్తం బాలసంఘాలను నిర్మించాలన్నది మరో విశిష్టమైన తీర్మానం. అన్నిటికీ మించి, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న గాంధీజీనీ, తదితరులనూ తక్షణమే విడుదల చెయ్యాలన్న తీర్మానంకాలంచెల్లిన పురుషాధిక్య సమాజాన్ని నిలదీసి, జలకడిగేసిన చైతన్యమది! ఆ చైతన్య వారిధిలో ఎగసిపడిన ఆఖరి అల దూసనపూడి సుబ్బాయమ్మ. అందుకే ఆమె మృతితో ఓ శకం అంతరించదనేది!

(నేడు తాడేపల్లి గూడెంలో దూసనపూడి సుబ్బాయమ్మ సంస్మరణ సభ)

– ఇసుకపల్లి సత్యవతి, తాడేపల్లి గూడెం

# అల్లిన కథే.. మళ్లీ

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని రాజకీయ పక్షాలూ అనుమానిస్తూ వచ్చాయి. ఎయిర్‌పోర్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్ఎఫ్) ఉన్నతాధికారులు కూడా ప్రాథమిక విచారణలో ఇదే నిర్ధారణకు వచ్చారు. అయితే ఘటన జరిగిన మరుక్షణం నుంచే కేసును నిర్వీర్యం చేసేందుకు, పక్కదారి పట్టించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆరాటపడుతూ వచ్చింది. ఆ క్రమంలోనే సీఎం చంద్రబాబు మొదలు, డీజీపీ ఠాకూర్, మంత్రులు, టీడీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడారు. వైఎస్ జగన్‌పై సానుభూతి కోసమే శ్రీనివాసరావు దాడి చేశాడని ఏకపక్షంగా ప్రకటనలు చేశారు. ఏదో చిన్నపాటి ఘటనగా చిత్రీకరించేందుకు యత్నించారు. అయితే..నిందితుడు శ్రీనివాసరావు పనిచేస్తున్న ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని టి.హర్షవర్ధన్ ప్రసాద్ చౌదరి సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు అత్యంత సన్నిహితుడు కావడం, పక్కా ప్రణాళిక ప్రకారం నేరచరిత్ర ఉన్న శ్రీనివాసరావుకు తప్పుడు ఎన్‌వోసీ ఇప్పించి రెస్టారెంట్‌లో ఉద్యోగంలో పెట్టడం, ఆగస్టు నుంచి దాదాపు ప్రతివారంలో రెండుసార్లు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్న వైఎస్ జగన్‌కు పార్టీ కార్యకర్త ఇంటి నుంచి వస్తున్న కాఫీని అడ్డుకుని ఆ రెస్టారెంట్ నుంచే తీసుకోవాలని నిబంధన పెట్టడం, అక్టోబర్ 25 గురువారం మధ్యాహ్నం ఆ రెస్టారెంట్ నుంచి కాఫీ తీసుకురావడం, అదే రోజు శ్రీనివాసరావు జగన్‌పై కత్తి దూయడం, ఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డీజీపీ అసలు అది దాడే కాదని ప్రచారం చేయడం.. సదరు దుండగుడు వైఎస్సార్ పార్టీ అభిమాని అని ప్రచారం పుట్టించడం, ఇందుకు అనుగుణంగా ఓ లేఖ సృష్టించడం... ఇవన్నీ దీని వెనుక ఉన్న కుట్రను దాచలేకపోయాయి. కుట్రపూరితంగానే ఇదంతా జరిగినట్టు స్పష్టమవుతున్నా విశాఖ పోలీసులు మాత్రం ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు విచారణ డ్రామాను రక్తికట్టించారు. జగన్‌పై హత్యాయత్నం వెనుక కుట్ర కోణం లేదని తేల్చేశారు.

### శ్రీనివాసరావుతో చెప్పించిన స్క్రిప్టే..

రెండు నెలల క్రితం పోలీస్ కస్టడీలో ఉన్న శ్రీనివాసరావుతో ఏదైతే చెప్పించారో అవే విషయాలను విశాఖ సీపీ మహేష్ చంద్ర లడ్హా బుధవారం విలేకరుల సమావేశంలో మరోసారి వల్లెవేయడం గమనార్హం. ఆరు రోజుల పోలీసు విచారణలో శ్రీనివాసరావుతో 'నేను జగన్ అభిమానినే..' అని పదే పదే చెప్పించేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు. అవే మాటలు నేరుగా శ్రీనివాసరావుతోనే మీడియాకు చెప్పించేందుకు అతనికి వైద్యసేవల పేరిట ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఇప్పుడు సీపీ కూడా అవే మాటలు వల్లెవేయడంతో అసలు ఈ కేసు విచారణ ఏపాటిగా జరిగిందో ఇట్టే అర్థమవుతోంది.




"బాస్‌ల నివేదిక సిద్ధం.. ఇదే స్క్రిప్ట్ " శీర్షికన నవంబర్ 1వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనం

### కత్తులకు పదును పెడుతుంటే హర్షవర్ధన్ ఎందుకు అడ్డుకోలేదు

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసిన అక్టోబర్ 25న ఉదయమే శ్రీనివాసరావు ఎయిర్‌పోర్ట్‌లోని ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌కు చేరుకున్నాడని, ఉదయం 9 గంటల సమయంలో కత్తులను రెస్టారెంట్‌లోనే వేడినీళ్లలో స్టెరిలైజ్ చేశాడని సీపీ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో రెస్టారెంట్ యజమాని, టీడీపీ నేత హర్షవర్ధన్ ప్రసాద్ చౌదరి అక్కడే ఉన్నారు. తాను ఆ రోజు తెల్లవారుజాము నుంచి జగన్‌పై హత్యాయత్నం జరిగే పదినిమిషాల ముందువరకు అక్కడే ఉన్నానని చౌదరి ఇప్పటికి ఎన్నోసార్లు మీడియాకు చెప్పారు. ఈ లెక్కన తన రెస్టారెంట్‌లో పనిచేసే యువకుడు కత్తులకు పదును పెడుతుంటే ఎందుకు అడ్డుకోలేదు? కనీసం ఎందుకోసం అని ఎందుకు అడగలేదన్న దానిపై సీపీ నుంచి సమాధానమే లేదు. రెస్టారెంట్ మొత్తం సీసీ టీవీ ఫుటేజ్ పరిధిలోనే ఉంటుంది. అతను ఎక్కడ స్టెరిలైజ్ చేసినా కనపడుతుంది. మరి అంతమంది కళ్ళుగప్పి అతను కత్తులను ఎలా దాచాడు?, అదే రోజు ధైర్యంగా ఎలా పదును పెట్టాడన్న ప్రశ్నలకు కూడా పోలీసుల వద్ద సమాధానం లేదు.

### రిమాండ్ రిపోర్ట్‌కు భిన్నంగా సీపీ ప్రకటనలు

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగింది ముమ్మాటికీ హత్యాయత్నమేనని, ఆ కత్తి గొంతులో దిగి ఉంటే ప్రాణాలు పోయేవని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పోలీసులు పేర్కొన్న సంగతి తెలిసిందే. వాస్తవానికి కుట్ర కోణం దాచి రిమాండ్ రిపోర్ట్ రాసినప్పటికీ ప్రభుత్వ పెద్దల నుంచి వారికి తీవ్రస్థాయిలో అక్షింతలు పడినట్టు అప్పట్లోనే ప్రచారం జరిగింది. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేవిధంగా రిమాండ్ రిపోర్ట్ రూపొందించారంటూ ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారన్న వాదనలు వినిపించాయి. అయితే ఇప్పుడు రిమాండ్ రిపోర్ట్‌కు భిన్నంగా సీపీ మహేష్ చంద్ర లడ్హా ప్రకటనలు చేయడం గమనార్హం. సీపీ తాజా ప్రకటనలు చూస్తుంటే చార్జ్‌షీట్‌లో... అసలు హత్యాయత్నమే జరగలేదంటూ కేసు నిర్వీర్యం చేసే విధంగా పొందుపరచడం ఖాయంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## కోర్టు ధిక్కారం..!

నిందితుడు శ్రీనివాసరావు పథకం ప్రకారమే హత్యాయత్నానికి పాల్పడ్డాడని సీపీ లడ్హా చెప్పారు. ఈ కేసు వెనుక ఇంకెవరూ లేరన్నట్లుగా చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఈ కేసును రాష్ట్ర పోలీసులు నిష్పక్షపాతంగా విచారించడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రజలూ భావిస్తున్నారు. అందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ నిర్వహించాలని పార్టీ న్యాయస్థానాన్ని కోరింది. ఆ మేరకు కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ దశలో పోలీస్ కమిషనర్ ఏకపక్షంగా మీడియాకు ప్రకటనలు చేయడం కోర్టు ధిక్కారమే అవుతుందని, అయినా అదేమీ పట్టించుకోకుండా సీపీ లడ్హా ఆ విధంగా ప్రకటనలు చేస్తున్నారంటే వారిపై ప్రభుత్వ పెద్దల ఒత్తిడే కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

### పెద్దల వ్యాఖ్యలను సమర్థించేలా మరోసారి..

శ్రీనివాసరావు తాను ఉపయోగించిన కత్తిని హత్యాయత్నానికి ముందు రెండు సార్లు వేడి నీటిలో మరిగించాడని సీపీ చెప్పడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కత్తితో పొడిచినా ఏమీ కాకుండా శ్రీనివాసరావు జాగ్రత్త తీసుకున్నాడన్న అర్థం స్ఫురించేలా సీపీ వ్యూహాత్మకంగా మాట్లాడారు. ఆ విధంగా మాట్లాడటం ద్వారా సానుభూతి కోసమే శ్రీనివాసరావు ఈ హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలనే సీపీ మరోసారి సమర్థించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఇలాగేనా హర్షవర్ధన్‌ను విచారించేది?

కేసులో కీలకంగా అందరూ అనుమానిస్తున్న టీడీపీ నేత, ఎయిర్‌పోర్ట్‌లోని రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరిని పలుమార్లు విచారించామని సీపీ చెప్పుకొచ్చారు. కానీ పోలీస్‌స్టేషన్ వద్దనే పడిగాపులు కాసి విచారణ క్రమం తెలుసుకునేందుకు ప్రయత్నించిన ప్రతి ఒక్కరికీ హర్షవర్ధన్ విచారణ ఏ విధంగా జరిగిందో క్షుణ్ణంగా తెలుసు. కేవలం కేసు విచారణ పేరిట కాలయాపన చేసేందుకు రెస్టారెంట్‌లో పనిచేసే సిబ్బందిని, నిందితుడు శ్రీనివాసరావు స్నేహితులను విచారించిన సందర్భాల్లో... వారిని తిరిగి ఇళ్ళకు తీసుకువెళ్లేందుకు మాత్రమే హర్షవర్ధన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవాడు. ఆ సందర్భాల్లో కూడా పోలీస్‌స్టేషన్లలో దర్జాగా తిరుగుతుండటం, పోలీసు లంటే లెక్కలేనట్టుగా ప్రవర్తించడం ప్రతిఒక్కరూ గమనించారు. తన వాహనాన్ని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోనే నో పార్కింగ్ బోర్డ్ ఎదురుగా సీపీ మహేష్ చంద్ర లడ్హా వాహనం ఎదురుగా పార్క్ చేసే వాడంటేనే అతనికున్న అండదండలు ఎలాంటివో అర్థం చేసుకోవచ్చు.



ఇదీ విచారణ తీరు.. పోలీస్‌స్టేషన్‌లో నో పార్కింగ్ బోర్డ్ ఎదుట... సీపీ లడ్హా వాహనం ఎదురుగా పార్కింగ్ చేసిన హర్షవర్ధన్‌చౌదరి వాహనం

### గతంలోనూ ఇదే తీరు

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో విశాఖపట్నం సీపీ గతంలోనూ ఇదే రీతిలో వివాదాస్పదంగా వ్యవహరించారు. హర్షవర్ధన్‌కు చెందిన రెస్టారెంట్‌లో పనిచేసేందుకు నిందితుడు శ్రీనివాసరావుకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఉందని చెప్పారు. కానీ అతని స్వస్థలం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పోలీసులు తాము ఎన్‌వోసీ ఇవ్వలేదని తెలిపారు. సీపీ వెంటనే స్పందిస్తూ విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీనివాసరావు ఎన్‌వోసీ పొందాడని ప్రకటించారు. అయితే ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) డీజీ కుమార్ రాజేష్ చంద్ర అసలు విషయాన్ని వెల్లడించడంతో ప్రభుత్వ కుట్ర బట్టబయలైంది. విమానాశ్రయంలో పనిచేసేందుకు అవసరమైన ఏరోడ్రోమ్ ఎంట్రీ పర్మిట్ (ఏఈపీ) కోసం శ్రీనివాసరావుగానీ అతని తరఫున రెస్టారెంట్ యజమాని గానీ అసలు దరఖాస్తు చేయనేలేదని ఆయన స్పష్టం చేశారు. ఏఈపీ కోసం దరఖాస్తు చేయనప్పుడు ఎన్‌వోసీ అవసరమే తలెత్తదని, శ్రీనివాసరావు పేరిట ఎన్‌వోసీ లేనే లేదని స్పష్టం చేశారు.

### ఫ్లెక్సీపై సీపీ హాస్యాస్పద వ్యాఖ్యలు

చివరికి శ్రీనివాసరావు ఆ ఊళ్ళో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయంలోనూ సీపీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఫ్లెక్సీపై గరుడ పక్షి ఫొటో ఉండటం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్ 25న జగన్‌పై హత్యాయత్నం ఘటనతో ఆర్నెల్ల క్రితం హాస్యనటుడు శివాజీ చెప్పిన గరుడ పురాణంలో మాదిరిగానే ప్రతిపక్షనేతపై హత్యాయత్నం జరిగిందన్న వాదనలు, అనుమానాలు ఒక్కసారిగా బయలుదేరాయి. కాగా శ్రీనివాసరావు వేయించిన ఫ్లెక్సీలో గరుడ పక్షి ఉండటంతో ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగిందన్న ప్రచారం జరిగింది. ఆ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు అనుమానం వ్యక్తం చేసి ఈ దిశగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అవేమీ పట్టించుకోని సీపీ లడ్హా ఫ్లెక్సీలోని గరుడ పక్షి బొమ్మపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. శ్రీనివాసరావుకు గరుడ పక్షి అంటే ఇష్టమని, అందుకే దానిపై ఆ బొమ్మ వేయించుకున్నాడని చెబుతూ తేలిగ్గా తీసిపారేశాడం చూస్తుంటే.. రాష్ట్ర ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నం కేసు విచారణ ఏ విధంగా కొనసాగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

### సిట్ ఆఫీసుకు తాళం వేసేస్తే ఇంకేం విచారణ

హత్యాయత్నం వెనుక ఎటువంటి కుట్ర కోణం లేదంటూ విచారణ మొదలుపెట్టకుండానే తేల్చేసిన సీపీ మహేష్ చంద్ర దర్యాప్తు ఇంకా కొనసాగిస్తామని చెప్పారు. నిజమైన విచారణను హత్యాయత్నం జరిగిన రోజే గాలికొదిలేసిన పోలీసులు కొన్నాళ్ళు సిట్ కార్యాలయం తెరిచి పబ్లిసిటీ స్టంట్ నడిపారు. దానికి కూడా ఇటీవల తాళం కూడా వేసేశారు. విచారణ ముగిసిందని, తాము ఎవరి పనుల్లో వారు ఉన్నామని సిట్ అధికారి ఒకరు ఈమధ్య చెప్పారు. వాస్తవం ఇలావుంటే సీపీ మాత్రం కేసు విచారణ కొనసాగుతుందని చెప్పడం గమనార్హం.

### సిట్ స్క్రిప్ట్‌ను రెండు నెలల ముందే వెల్లడించిన సాక్షి

సిట్ స్క్రిప్ట్‌ను రెండు నెలల ముందే సాక్షి బట్టబయలు చేసింది. హత్యాయత్నం జరిగిన రోజు నుంచి విచారణ తంతును పరిశీలించిన సాక్షి ముందే నివేదిక సారాంశాన్ని గ్రహించింది. గత నవంబర్ 3న ''బాస్‌ల నివేదిక సిద్ధం.. ఇదే స్క్రిప్ట్ '' శీర్షికన గత నవంబర్ 1న ప్రచురించింది. సరిగ్గా అందులోని అంశాలనే సీపీ చెప్పుకురావడం గమనార్హం.

# ఎవరి ప్రమేయమూ లేదు: లడ్హా

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటర్మీడియట్ మధ్యలో ఆపేశాడు. 2009–16 మధ్య గోవా, కర్ణాటక, కువైట్, హైదరాబాద్‌లో వెల్డర్, వంట పని చేశాడు. 2017లో రాజమండ్రి బాలాజీ బేకరీలో కేక్ మాస్టర్‌గా కొన్నాళ్లు, అమలాపురంలో కుక్‌గా కొన్నాళ్లు చేశాడు. అదే ఏడాది డిసెంబర్ 27న తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరంలోని అఖిల్ స్టూడియోలో ఫోటో దిగాడు. 30న పి.గన్నవరం లేపాక్షి ఫ్లెక్సీలో వైఎస్ జగన్‌తో తన ఫోటో ఉండేలా ఫ్లెక్సీ ప్రింటింగ్‌కు ఆర్డరిచ్చాడు. పక్షులంటే తనకు ఇష్టమని గరుడ పక్షిని కూడా ముద్రించాడు. ఆపరేషన్ గరుడ కాదు. 31 రాత్రి ఠానేలంకలో ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. 2018 జనవరిలో రాజుపాలెంలో కోడిపందాలు చూడటానికి వెళ్లి అక్కడ రెండు కత్తులు కొనుగోలు చేశాడు. అదే నెల 28న విశాఖ ఎయిర్‌పోర్టులో ఉన్న ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌లో కుక్‌గా చేరాడు. అప్పట్నుంచి తన స్వగ్రామానికి వెళ్లి వస్తున్నాడు. అక్టోబర్ మొదటి వారంలో తన ఇంటి కెళ్లినప్పుడు తన సమీప బంధువు విజయదుర్గతో తొమ్మిది పేజీలు, తన గదిలో ఉంటున్న రేవతీపతితో ఒక పేజీ లేఖ రాయించాడు. 17న తిరిగి విశాఖ వచ్చి తానుంటున్న గదిలో కత్తిని స్టెరిలైజ్ (వేడినీటిలో మరిగించడం) చేశాడు. ఈ కత్తి ఎందుకని సహోద్యోగులు శిరీష, ప్రసాద్‌లు అడగ్గా రెస్టారెంట్‌లో కూరగాయలను అందమైన ఆకృతిలో మలచడానికని చెప్పాడు.

### టీవీల్లో కనిపిస్తాను.. చూడండి

తాను జగన్‌పై దాడి చేసి సంచలనం సృష్టించబోతున్నానని, టీవీల్లో కనిపిస్తానని తనకు పరిచయం ఉన్న ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన షేక్ అమ్మాజీతో అక్టోబర్ 14, 15 తేదీల్లో శ్రీనివాస్ ఫోన్‌లో చెప్పాడు. 17న మరోసారి ఆమెకు అదే విషయాన్ని చెప్పడంతో తాము వెటకారమని నవ్వుకున్నట్టు అమ్మాజీ చెప్పింది. ప్రజాప్రతినిధులు తనకంటే గొప్పవారు కాదని, తానూ త్వరలో ఎమ్మెల్యే, ఎంపీ అంతటి వాడినవుతానని, తనను కలవాలంటే తన పీఏ ద్వారా కలవాల్సి ఉంటుందని సహోద్యోగులతోనూ శ్రీనివాసరావు చెప్పేవాడు. శ్రీనివాసరావు ఫ్యూజన్ ఫుడ్స్‌లో ఉద్యోగం మానేసి సొంతంగా రెస్టారెంట్ పెట్టుకోవడానికి లోన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు.. కానీ మంజూరు కాలేదు. శ్రీనివాస్ వద్ద 11 పేజీల లేఖ ఉంది. అందులో తొలి తొమ్మిది పేజీలు సమీప బంధువు విజయదుర్గ, పదో పేజీ రూమ్‌మేట్ రేవతీపతి, 11వ పేజీ శ్రీనివాస్ రాశాడు. ఈ పేజీల దస్తూరీ వీరిదేనని ఎఫ్ఎస్ఎల్ తేల్చింది.



### వెంకటపతి సిఫార్సుతో..

గతంలో కర్ణాటకలో తనతో పనిచేసిన వెంకటపతి అనే వ్యక్తి సిఫార్సుతో ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌లో చేరాడు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగంలో చేరడానికి అవసరమైన ఎన్ఓసీని 2018 జనవరి 28, ఏప్రిల్ 6న విశాఖ పరిధిలో పోలీసులు ఇచ్చారు. ఫ్యూజన్‌ఫుడ్స్‌కు అన్ని అనుమతులూ ఉన్నాయి. శ్రీనివాసరావు డిపార్చర్ ఏరియాలో తిరగడానికి అనుమతి ఉంది.

### కుట్రకోణం లేదు..పబ్లిసిటీ కోసమే..

ఈ కేసులో 92 మంది సాక్షులను విచారించాం. వారి నుంచి వివరాలు సేకరించాం. నిందితుడి తన ఫోన్ నుంచి 1,110 కాల్స్ చేసినట్టు గుర్తించాం. కుట్రకోణంలో కూడా దర్యాప్తు చేశాం. ఇందులో అలాంటిదేమీ లేదు. ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ హర్షవర్ధన్ చౌదరిని కూడా విచారించాం. శ్రీనివాస్ పబ్లిసిటీ కోసమే జగన్‌పై కత్తితో దాడి చేశాడు. దాడి సమయంలో ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాయకులు రామన్నదొర ఉన్నారు.


## ఆ అధికారం కేంద్రం, రాష్ట్రాలదే..

రాష్ట్రంలో ఏ నేరం జరిగినా సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేస్తారు. ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్‌కు కేసు నమోదు చేసే అధికారం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు (ఎన్ఐఏ) దర్యాప్తు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాల్సి ఉంటుంది. లేదా కేంద్రం కోరాలి. శ్రీనివాసరావు తమ ప్రాంతంలో నాలుగెకరాల భూమి కొనుగోలుకు ప్రయత్నించిన విషయం మాకు తెలియదు. నిందితుని వద్ద ఉన్న లేఖ బ్యాగులో ఉంచడం వల్ల నలగలేదు. శ్రీనివాసరావు, ఆయన కుటుంబ అకౌంట్లను పరిశీలించి అతని సోదరికి రమాదేవి అనే సహోద్యోగిని అకౌంట్ ద్వారా రూ.40 వేలు, 22 వేల చొప్పున బదలాయించినట్టు గుర్తించాం. ఘటన జరిగిన గంటలోనే ఫ్లెక్సీ బయట పడడం వెనక ఎలాంటి ముందస్తు వ్యూహం లేదు. ఈ కేసు పూర్తయ్యే వరకు సిట్ విచారణను కొనసాతుంది..' అని సీపీ చెప్పారు. విలేకరుల సమావేశంలో సిట్ ఇన్‌చార్జి బీవీఎస్ నాగేశ్వరరావు, ఏసీపీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 18నే దాడికి ప్లాన్

తొలుత అక్టోబర్ 18న జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో దాడికి ప్లాన్ వేశాడు. కానీ దసరా సందర్భంగా ఒకరోజు ముందు అంటే 17నే జగన్ హైదరాబాద్ పయనమవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. తర్వాత 25 మధ్యాహ్నం జగన్ విశాఖ విమానాశ్రయానికి వస్తున్నారని విశాఖ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణకాంత్ అనే వ్యక్తి నుంచి రెస్టారెంట్‌లో పనిచేస్తున్న హేమలత ద్వారా తెలుసుకున్నాడు. 25 ఉదయం 4.55కి కోడిపందాల కత్తిని పర్స్‌లో పెట్టుకుని తన ఇంటి నుంచి ఎయిర్‌పోర్టుకు బయల్దేరాడు. 9 గంటల సమయంలో కత్తిని మరోసారి స్టెరిలైజ్ చేశాడు. జగన్ మధ్యాహ్నం 12.21–25 గంటల మధ్య ఎయిర్‌పోర్టుకు చేరుకుని వీఐపీ లాంజ్‌కు వెళ్లారు. తొలుత ఆయనకు రెస్టారెంట్ సిబ్బంది సురేష్, హేమలతలు టీ ఇవ్వబోగా జగన్ కాఫీ తాగుతారని చెప్పడంతో కాఫీ ఇచ్చారు. విమానం బయలుదేరే సమయం అవుతోందని సీఐఎస్ఎఫ్ అధికారులు చెప్పడంతో జగన్ సిద్ధమయ్యారు. శ్రీనివాస్ అప్పటికే బ్యాగులో రాసి ఉంచిన లేఖతో పాటు రెండు మంచినీళ్ల బాటిళ్ల వెంట తీసుకుని జగన్ దగ్గరకు ఫోటో దిగే నెపంతో వెళ్లాడు. తన వద్ద ఉన్న కత్తితో జగన్ భుజంపై పొడిచాడు. అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలు అతని వద్ద నుంచి కత్తిని లాక్కున్నారు. కత్తికి విషం పూసారన్న ఆందోళనతో నగరంలోని విజయా ల్యాబ్‌కు, కళా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అలాందేమీ లేదని చెప్పడంతో చిన్న శ్రీను అనే వ్యక్తి సీఐఎస్ఎఫ్ అధికారులకు ఇవ్వడంతో దానిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపాం. దాడికి పాల్పడిన వెంటనే పోలీసు, సీఐఎస్ఎఫ్ అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతిపక్ష నేతకు ఎయిర్‌పోర్టులో ఉన్న వైద్యురాలితో ప్రాథమిక చికిత్స అందించారు. విమానం బయలుదేరే సమయం కావడంతో జగన్ హైదరాబాద్ వెళ్లిపోయారు. కత్తి దాడితో జగన్ భుజంపై ఒక సెంటీమీటరు వెడల్పు, 3.5 సెంటీమీటర్ల లోతులో గాయమైంది.

## కుట్రదారులను తప్పించేందుకు యత్నం



**విజయవాడ సిటీ:** ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో అసలు కుట్రదారులను తప్పించే ప్రయత్నం తీవ్రంగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును కేవలం నిందితుడు జనపల్లి శ్రీనివాస్‌కే పరిమితం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. ఎన్ఐఏ పరిధిలోని కేసును రాష్ట్ర పరిధిలో విచారణ చేపట్టి నీరుగారుస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో డీజీపీ చేసిన వ్యాఖ్యలు తప్పుడువనే విషయం బుధవారం విశాఖపట్నం సీపీ లడ్డా ప్రెస్‌మీట్‌తో వెల్లడైందన్నారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాస్ ఒక్కడినే కర్త, కర్మ, క్రియ అని చెప్పే విధంగా విశాఖపట్నం పోలీసు కమిషనర్ లడ్డా ప్రయత్నించారన్నారు. కేసు రిజిస్టర్ చేసే సమయంలో ఐపీసీ సెక్షన్ 120 బి లేకుండా ఈ కేసులో కేవలం సెక్షన్ 307 మాత్రమే ఎందుకు నమోదు చేశారని నిలదీశారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు డీజీపీ ప్రెస్‌మీట్ పెట్టి..'జగన్ అభిమానే దాడి చేశాడని' వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అది తప్పని మాత్రమే ఈ రోజు లడ్డా చెప్పారన్నారు.

### ఎన్ఐఏతో ఎందుకు విచారణ చేయించరు?

ఎయిర్‌పోర్టులో ఏ నేరం జరిగినా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. ఎన్ఐఏ పరిధిలోకి వచ్చే కేసు ఎందుకు రాష్ట్ర పరిధిలో పెట్టుకున్నారని నిలదీశారు. కేంద్ర పరిధిలో ఉన్న స్థలంలో జరిగిన ఘటనపై సెక్షన్ 61 ఎన్ఏఐ యాక్ట్ 2008 ప్రకారం, అలాగే సివిల్ ఏవియేషన్ యాక్ట్ 1982 సెక్షన్ 3ఏ కింద కేసు నమోదు చేసి దానిని ఎన్ఐఏకి బదిలీ చేయాలన్నారు. పాడేరు ఎమ్మెల్యే కిడారి, మాజీ ఎమ్మెల్యే సోముపై మావోయిస్టులు దాడి చేసి హత్య చేస్తే వెంటనే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కి బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. వైఎస్ జగన్ కేసును ఎందుకు అప్పగించడం లేదని నిలదీశారు. పై రెండు చట్టాలు డీజీపీకి తెలియవా? లేక కావాలనే తొక్కిపట్టారా? అని ప్రశ్నించారు. విచారణను చంద్రబాబు ప్రభావితం చేశారని, ఈ కేసును ఆలస్యం చేస్తే ఇందులో సాక్ష్యాలు ఆవిరవుతాయని హైకోర్టులో ఫిర్యాదు చేశామన్నారు. 'జగన్‌పై ఉన్న కేసుల నుంచి తప్పించుకునేందుకే ప్రధానిని ఆశ్రయించారని, మోదీ తలచుకుంటే జగన్ జైలుకే అని' కుప్పంలో బుధవారం జరిగిన జన్మభూమి గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని చెప్పారు. చంద్రబాబు మీద 27 కేసులు ఇవాల్టికీ స్టే రూపంలో ఉన్నాయంటే...ఆ కేసులు ముందుకు వెళ్లకుండా ఆయన కోర్టును మేనేజ్ చేశారా? అని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే బాబుకు అంత చులకన భావమా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వ్యాఖ్యలను కోర్టు ధిక్కారం కింద పరిగణించాలన్నారు. వైఎస్ జగన్‌పై ఉన్న కేసులు గాలి బుడగ లాంటివని, ఎవరి కుట్రతో కేసులు పెట్టారో అందరికీ తెలిసిందేనని సుధాకర్‌రెడ్డి అన్నారు.

# శ్రీనివాసరావు సేవలో ముగ్గురు ఖైదీలు!

- జైల్లో జనుపల్లి రాజభోగాలు
- వ్యక్తిగత పనులు చేసేందుకు బిహార్, ఒడిశా ఖైదీల నియామకం

**సాక్షి, అమరావతి బ్యూరో:** ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు విశాఖ సెంట్రల్ జైల్లో వీఐపీ మర్యాదలు అందుతున్నాయి. చిత్రావతి హై అలర్ట్ బ్లాక్‌లో రిమాండ్ ఖైదీగా ఒంటరిగా ఉంచిన శ్రీనివాసరావుకు సదుపాయాలను సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నిందితుడు ఉంటున్న గదిని శుభ్రం చేయడం, వ్యక్తిగత పనులు, భోజనం గదికి తెచ్చేందుకు ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాలకు చెందిన ముగ్గురు ఖైదీలను ఏర్పాటు చేశారు. బిహార్‌కు చెందిన భాయ్, జలీల్, ఒడిశాకు చెందిన మిధుల్ అనే ఖైదీలను శ్రీనివాసరావుకు సేవలు చేసేందుకు నియమించారు.

### ఇతర రిమాండ్ ఖైదీలు కలవకుండా కట్టడి..

జైల్లో శ్రీనివాస్ ఉంటున్న గది వద్దకు నలుగురు కాపలా పోలీసులు, సేవలు అందిస్తున్న ముగ్గురు ఖైదీలు, జైలు ఉన్నతాధికారులు మినహా ఇతరులు ఎవరూ వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిందితుడికి జైల్లో జరుగుతున్న రాచ మర్యాదలు ప్రతిపక్ష నేతపై హత్యాయత్నాన్ని ఓ ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పెద్దలే చేయించారనే వాదనకు బలం చేకూరుస్తున్నాయి.



నిందితుడు శ్రీనివాసరావు(ఫైల్)

### శ్రీనివాస్‌కి సేవలు చేస్తే రోజూ నాన్‌వెజ్

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావును రిమాండ్ ఖైదీగా సెంట్రల్ జైలుకి తరలించినప్పుడు అతడికి అవసరమైన సేవలు చేస్తే రోజూ శ్రీనివాసరావుకు అందించే మాంసాహారాన్నే ఇస్తామని జైలు అధికారులు ఖైదీలకు ఆఫర్ ఇచ్చారు. ఆసక్తి చూపిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఖైదీలను కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఎంపిక చేశారు.

# కేసుల విచారణకు 4 ద్విసభ్య ధర్మాసనాలు

- మిగిలిన న్యాయమూర్తులు సింగిల్ జడ్జీలుగా కేసుల విచారణ
- జగన్‌పై హత్యాయత్నం కేసును ప్రస్తావించిన న్యాయవాది
- బోగస్ ఓట్ల పిల్‌పైనా ప్రస్తావన
- ఈ కేసుల ఫైళ్లు రాలేదన్న ధర్మాసనం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసుల విచారణ నిమిత్తం నాలుగు ద్విసభ్య ధర్మాసనాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన న్యాయమూర్తులు సింగిల్ జడ్జిలుగా కేసులను విచారిస్తారు. మొదటి ధర్మాసనం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో, రెండో ధర్మాసనం జస్టిస్ ఎస్.వి.భట్, జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో, మూడో ధర్మాసనం జస్టిస్ శేషసాయి, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో, నాల్గవ ధర్మాసనం జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ ఎం.గంగారావులతో ఏర్పాటైంది. ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, హెబియస్ కార్పస్, ఉరిశిక్ష ఖరారు, పర్యావరణం, కాలుష్య సంబంధిత వ్యాజ్యాలు, క్రిమినల్ అప్పీళ్లు తదితరాలపై విచారణ జరుపుతుంది. జస్టిస్ భట్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదాయపుపన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, ఆదాయపు పన్ను వివాద కేసులు, చట్టాలను, చట్ట నిబంధనలను సవాలు చేస్తూ దాఖలు చేసే కేసులను, ఏపీ పునర్విభజన చట్టం కింద దాఖలయ్యే కేసులను, వైద్యశాఖకు చెందిన కేసులను విచారిస్తుంది. జస్టిస్ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు వివాదాలు, భూ ఆక్రమణ నిరోధక చట్టం కింద దాఖలయ్యే కేసులను విచారిస్తుంది. జస్టిస్ సీతారామమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఫ్యామిలీ కోర్టు అప్పీళ్లు, లోకాయుక్త చట్టం కింద దాఖలయ్యే కేసులను విచారిస్తుంది. సింగిల్ జడ్జిలుగా జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, భూసంస్కరణలు తదితర అంశాలకు సంబంధించిన కేసులను విచారిస్తారు. జస్టిస్ టి.సునీల్ చౌదరి పంచాయతీరాజ్, భూసేకరణ, నీటిపారుదల శాఖ తదితర కేసులతోపాటు కంపెనీ పిటిషన్లపై విచారణ జరుపుతారు. జస్టిస్ శ్యాంప్రసాద్ పురపాలకశాఖ, గనులు, రవాణా, దేవాదాయం, ఎక్సైజ్, అటవీ శాఖలకు సంబంధించిన కేసులను విచారిస్తారు. జస్టిస్ ఉమాదేవి సివిల్ రివిజన్ పిటిషన్లను విచారిస్తారు. జస్టిస్ బాలయోగి హోం(ఎఫ్ఐఆర్‌ల కొట్టివేత వ్యాజ్యాలు మినహా), విద్యా, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల కేసులను విచారిస్తారు. జస్టిస్ రజనీ బెయిల్ పిటిషన్లు, క్రిమినల్ పిటిషన్లను విచారిస్తారు.

### జగన్‌పై హత్యాయత్నం కేసు ప్రస్తావన...

ఇదిలా ఉండగా ఏసీజే కోర్టులో బుధవారం కేసుల విచారణ ప్రారంభమవగానే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్న ఘటన మీద ఎన్ఐఏ దర్యాప్తు కోరుతూ తాము దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) గురించి ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై త్వరగా విచారణ జరపాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఉమ్మడి హైకోర్టు నుంచి ఇంకా కేసుల ఫైళ్లు రావాల్సి ఉందని తెలిపింది. అత్యవసర విచారణ అవసరమున్న కేసుల జాబితాను తమకు అందిస్తే, అందుకనుగుణంగా ఆ కేసులను అక్కడినుంచి తెప్పిస్తామని న్యాయవాదులకు స్పష్టం చేసింది. ఇదే సందర్భంగా సుధాకర్‌రెడ్డి బోగస్ ఓటర్లకు సంబంధించి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దాఖలు చేసిన పిల్ గురించి ప్రస్తావించగా.. ఆ కేసు ఫైలు కూడా రాలేదని ధర్మాసనం తెలిపింది.

### ఏసీజీ ధర్మాసనం విచారించిన తొలికేసు..

ఏపీ హైకోర్టులో కార్యకలాపాలు ప్రారంభమైన తొలిరోజున ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపింది. వాదనలు వినిపించేందుకు ప్రతివాదుల తరఫు న్యాయవాది లేకపోవడంతో ధర్మాసనం ఆ అప్పీల్‌పై విచారణను 4వ తేదీకి వాయిదా వేసింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) పరిధిలో నిర్మాణాలున్నాయన్న కారణంతో శోభారాణి అనే మహిళకు చెందిన నిర్మాణాలకు జీవీఎంసీ అధికారులు సీలు వేశారు. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఉమ్మడి హైకోర్టులో దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సీలు వేయడానికి ముందున్న పరిస్థితిని కొనసాగించాలని ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలపై జీవీఎంసీ తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణరెడ్డి అప్పీలు దాఖలు చేశారు.

## లింగంపల్లి-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు

**రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా లింగంపల్లి–కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్టు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి–కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (82728) జనవరి 11వ తేదీ సాయంత్రం 4.15కు లింగంపల్లిలో బయలుదేరుతుంది.

## 5 రోజుల్లో 5 లక్షలమంది దీక్షల విరమణ

### కనకదుర్గమ్మ సన్నిధిలో ముగిసిన కార్యక్రమం



దీక్షల విరమణ చేస్తున్న భవానీలు

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఐదు రోజులుగా జరుగుతున్న భవానీ దీక్ష విరమణలు బుధవారంతో పూర్తయ్యాయి. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో బుధవారం నిర్వహించిన పూర్ణాహుతిలో దీక్ష విరమణలు లాంఛనంగా ముగిశాయి. ఆలయ ఈవో వి.కోటేశ్వరమ్మ, పాలక మండలి చైర్మన్ గౌరంగబాబు, పాలక మండలి సభ్యులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనగా, వైదిక కమిటీ, వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. దీక్ష విరమణలకు మొత్తం 5 లక్షల మంది భవానీలు విచ్చేశారని ఈవో కోటేశ్వరమ్మ తెలిపారు. దీక్ష విరమణల్లో నాలుగో రోజు మంగళవారం కావడంతో మాల విరమణ చేయలేదు. దీంతో మంగళవారం రాత్రి సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భవానీలతో పాటు నగరానికి చెందిన భవానీలు, అమ్మవారి భక్తులు ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. దీంతో గిరి ప్రదక్షిణ మార్గంలో పండుగ శోభ సంతరించుకుంది. గిరి ప్రదక్షిణ చేసే భవానీలకు పలువురు భక్తులు అల్పాహారం, పాలు, టీ, పండ్లు పంపిణీ చేశారు. దీక్ష విరమణలకు భవానీలు వస్తుండటంతో గురువారం కూడా దేవస్థానంలో ఏర్పాట్లు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

### వైఎస్సార్‌సీపీ నేత సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట అర్బన్:** అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారం కోసం అమలుకాని 600కుపైగా హామీలను ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు అవుతున్నా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంభించారని విమర్శించారు. నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తామని చెప్పి రూ1,000 కి తగ్గించారని, అది కూడా ఎన్నికలకు ముందు నామమాత్రంగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో 25 లక్షల ఇళ్లు అవసరం కాగా ఇప్పటివరకు 3 లక్షలు మాత్రమే నిర్మించారని, రానున్న 6 నెలల్లో 19 లక్షల ఇళ్లు నిర్మిస్తామని చంద్రబాబు ప్రభుత్వం సాధ్యంకాని వాదనలు వినిపిస్తుందని ధ్వజమెత్తారు. మహిళలపై దాడులు 2016తో పోలిస్తే 2017 లో 4.36 శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం మహిళలపై దాడుల కేసుల్లో ప్రతి 10 మందిలో ఐదుగురు టీడీపీ నేతలు ఉండటం గమనార్హమన్నారు. వైఎస్ జగన్ పాదయాత్ర ఈనెల 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చౌడవరపు జగదీష్, తుమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

- ఎత్తిపోతల పథకం కోసం 60 ఏళ్లుగా పల్నాడు రైతుల ఎదురుచూపులు
- 1996లో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి విస్మరించిన చంద్రబాబు
- 2008లో శంకుస్థాపన చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి
- మహానేత అకాల మరణంతో నిలిచిన ప్రాజెక్టు నిర్మాణం
- ఎన్నికలు సమీపిస్తుండడంతో వరికపూడిసెలను తెరపైకి తెచ్చిన సీఎం చంద్రబాబు
- చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని పల్నాడు ప్రజల ఆగ్రహం




# కలగానే మిగిలిన ‘వరికపూడిసెల’



సాక్షి, గుంటూరు

**రా**ష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు జల సంకల్పం చేపట్టామని తెలుగుదేశం ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలన్నీ ఉత్త మాటలుగానే మిగిలిపోతున్నాయి. కృష్ణానది ఒడ్డునే ఉన్న రైతులు కరువు కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నా సర్కారుకు చీమ కుట్టినట్లయినా ఉండడం లేదు. నదులను అనుసంధానించామని, రాష్ట్రాన్ని పచ్చగా మార్చేశామని ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు గుంటూరు జిల్లాలోని పల్నాడు రైతుల గోస పట్టడం లేదు. సాగునీరు, తాగు నీరు లేక పల్నాడు ప్రజలు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు.

గుంటూరు జిల్లా మాచర్ల, వినుకొండ, ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో నీటి కొరత తీర్చే వరికపూడిసెల (దొమ్మలగొంది) ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం 60 ఏళ్లుగా రైతులు ఎదురు చూస్తున్నారు. 1952లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎత్తుపల్లాల భూములు ఉన్న వెల్దుర్తి, బొల్లాపల్లి, దుర్గి, పుల్లలచెరువు ప్రాంతాలకు నీరందించేలా వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టును బోస్ల కమిటీ ప్రతిపాదించింది.

### ఎన్నికలు వస్తుండడంతో బాబు కొత్త ఎత్తు

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని నాలుగు మండలాలకు తాగునీరు, సాగునీరు అందించే వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిరిగిరిపాడు వద్ద శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి, మళ్లీ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం గురించి ఏనాడూ పట్టించుకోలేదు.



1996లో శిరిగిరిపాడు వద్ద వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మళ్లీ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. ఇటీవల నాగార్జున సాగర్ వద్ద జల హారతి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. తమను మభ్యపెట్టి, ఓట్లు కొల్లగొట్టేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు తప్ప వరికపూడిసెల ఎత్తిపోతలను పూర్తిచేయాలన్న చిత్తశుద్ధి ఆయనకు లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా ఈ పథకంపై ఎందుకు దృష్టి పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు.

### మహానేత అకాల మరణంతో..

పల్నాడులోని దుర్గి, వెల్దుర్తి, బొల్లాపల్లితోపాటు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలాల్లో 55,000 ఎకరాల బీడు భూములకు సాగునీరు, స్థానిక ప్రజలకు తాగునీటిని అందించే వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి 2008 జూన్ 5న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని హనుమాపురంతండా వద్ద శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని గంగలకుంట, శిరిగిరిపాడు, ఉప్పలపాడు, మిట్టమీదపల్లె, లోయపల్లి, వజ్రాలపాడుతండా గ్రామాల్లో 5,000 ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా 20 గ్రామాలకు తాగునీరు అందించాలని నిర్ణయించారు. రూ.40.10 కోట్ల వ్యయంతో 1,500 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు విద్యుత్ మోటార్ల ద్వారా 1.503 కిలోమీటర్ల మేర ప్రెషర్ మెయిన్ ఏర్పాటు చేసి 5.103 కిలోమీటర్ల మేర లింకు కాలువలను తవ్వాలని ప్రణాళిక రూపొందించారు. ఇదే పథకంలో వజ్రాలపాడుతండా వద్ద 202.6 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి, 96 మీటర్ల సాటిక్ హెడ్ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. పనులు వేగంగా సాగాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి అయ్యాక 2009లో అకాల మరణం చెందడంతో వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వైఎస్ మరణం తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకున్న పాపానపోలేదు.



2008లో గంగలకుంట వద్ద వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

### ప్రాజెక్టు నిర్మించకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా..



‘‘వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. కృష్ణా నది నుంచి మాచర్ల పట్టణానికి పుష్కలంగా తాగునీటిని అందిస్తాం. అనుపు ఎత్తిపోతల పథకం ఫేజ్–2 పనులు పూర్తి చేసి, 10,000 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం. అలా చేయలేని పక్షంలో రాజకీయ సన్యాసం తీసుకుంటా’’

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ విప్, మాచర్ల ఎమ్మెల్యే

## స్వాతంత్య్ర సమరంలో ఆంధ్రుల పాత్ర అపూర్వం

- మహాత్మా గాంధీ మనవడు రాజమోహన్ గాంధీ
- విజయవాడలో గాంధీహిల్‌ను సందర్శించిన రాజమోహన్ దంపతులు


**వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ):** స్వాతంత్య్ర సమరంలో ఆంధ్రులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారని, ఉద్యమంలో వారి పాత్ర అపూర్వమైనదని మహాత్మా గాంధీ మనవడు, చరిత్రకారుడు ఆచార్య రాజమోహన్ గాంధీ తెలిపారు. విజయవాడ వన్‌టౌన్‌లోని గాంధీహిల్‌ను రాజమోహన్ గాంధీ, ఉషా గాంధీ దంపతులు బుధవారం సందర్శించారు. కొండ పై భాగంలో ఉన్న గాంధీజీ స్మారక స్థూపాన్ని, టాయ్ ట్రైన్‌ను సందర్శించారు. సంస్థ నిర్వాహకులతో ముచ్చటించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. గాంధీజీకి విజయవాడతో గొప్ప అనుబంధం ఉందన్నారు. ఆంధ్రుల్లో జాతీయ భావజాలం అధికంగా ఉండేదని తన తల్లి తనతో తరచుగా చెప్పేవారని వివరించారు. దీన్ని తాను ప్రత్యక్షంగా చూశానని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో రైతులు, నేత కార్మికులు అధికంగా ఉన్నారని, వారందరి జీవితాలకు సంబంధించిన విషయాలను తన ‘మోడ్రన్ సౌత్ ఇండియా’ పుస్తకంలో పొందుపరిచానన్నారు. 27 సంవత్సరాల వయస్సులో ఈ ప్రాంతాన్ని సందర్శించిన తాను.. తిరిగి తన 84వ ఏట ఇక్కడకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో గాంధీ ఫౌండేషన్ నిర్వాహకుల్లో ఒకరైన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీహిల్‌పై సేదతీరుతున్న ఆచార్య రాజమోహన్‌గాంధీ, ఉషాగాంధీ దంపతులు

## అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నేడు ధర్నాలు

- 13 జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద కార్యక్రమాలు
- అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి



**పట్నంబజారు (గుంటూరు):** అగ్రిగోల్డ్ బాధితులకు అండగా, వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 13 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద గురువారం ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు మద్దతుగా నిలిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 లక్షల 70 వేల మంది అగ్రిగోల్డ్ బాధితులు విలవిలలాడిపోతున్నారని, ఆర్థిక భారం తాళలేక, మనోవేదనతో ఇప్పటికే 260 మంది ఆత్మహత్యలు చేసుకున్నా చంద్రబాబు సర్కార్‌లో కనీస చలనం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు నీరో చక్రవర్తిని తలపిస్తున్నారని, పైపెచ్చు పొంతన లేని ప్రకటనలతో బాధితులను మరింత భయపెడుతున్నారని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆ సొమ్మును నేరుగా బాధితులకు అందజేయాలని, తక్షణమే రూ.1,182 కోట్లును విడుదల చేసి బాధితులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పులు, బాధితుల వివరాలను ఎందుకు ఆన్‌లైన్‌లో పెట్టరని ప్రశ్నించారు. నేడు జరిగే ఆందోళన కార్యక్రమాలలో బాధితులు పాల్గొనిజయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

● పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో నిర్వాసితులు ఉభయ భ్రష్టులుగా మారిపోయారని ప్రముఖ ఆర్థిక, సామాజిక వేత్త డాక్టర్ పెంటపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు మండలాల ప్రజలు పుల్లారావును బుధవారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతంలో ఉన్న వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వేలాది నిర్వాసిత కుటుంబాలు ఎటూకాకుండా పోయాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశాయని విమర్శించారు.



# ఈ-ఆటోలపై చినబాబు ట్యాక్స్ రూ.83 కోట్లు

## పట్టణాలు, పల్లెల్లో చెత్త సేకరణకు 7,500 ఈ-ఆటోల కొనుగోలు

- అధిక ధర కోట్ చేసినా చినబాబు అస్మదీయ సంస్థకే టెండర్ ఖరారు
- తక్కువ ధరకే ఆటోలు సరఫరా చేస్తామన్న కంపెనీలకు మొండిచేయి
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌లో మాయాజాలం

**సాక్షి, అమరావతి బ్యూరో/సాక్షి, అమరావతి:** ఏదైనా వస్తువు కొనాలంటే మార్కెట్ ధర పరిశీలించి, బేరం ఆడి కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయాలంటే టెండర్లు పిలిచి, తక్కువ ధరకే ఆ వస్తువును అందించే సంస్థకే టెండర్ ఖరారు చేసి, కొనుగోలు చేయడం పరిపాటి. కానీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న ఆరాటంతో మార్కెట్ ధర కంటే రెండింతలు అధికధరకు వస్తువు సరఫరా చేస్తామంటున్న సంస్థకే టెండర్ కట్టబెట్టడం విస్మయం కలిగిస్తోంది. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న ఈ బాగోతం వెనుక చినబాబు హస్తం ఉన్నట్లు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో చెత్తను సేకరించడానికి బ్యాటరీతో నడిచే ఈ-ఆటోలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జాతీయ సఫాయి కర్మచారీ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తొలివిడతగా 7,500 ఈ-ఆటోలను కొనుగోలు చేసి, షెడ్యూల్ క్యాస్ట్(ఎస్సీ) నిరుద్యోగ యువతకు అప్పగించాలని నిర్ణయించారు. పశ్చిమ గోదావరి, చిత్తూరు, తూర్పు గోదావరి, విశాఖపట్నం, కృష్ణా జిల్లాల్లో ఈ-ఆటోల కొనుగోలు కోసం టెండర్లు పిలిచారు. జూలై 29వ తేదీన కైనెటిక్ గ్రీన్ ఇండియా సంస్థ ప్రతినిధులు సచివాలయంలో చినబాబును కలిశారు. ఈ-ఆటోల సరఫరా టెండర్‌ను ఆ సంస్థకే అప్పగించేలా డీల్ కుదిరినట్లు ఆరోపణలున్నాయి. ఓపెన్ టెండర్ కావడంతో మొత్తం 24 ప్రైవేటు సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. అందులో 16 సంస్థలు అర్హత సాధించినట్లు అధికారులు నిర్ధారించారు. టెండర్‌ను తెరిచే సమయంలో చినబాబు తెరపైకి వచ్చారు. తాము సూచించిన కంపెనీకే టెండర్ దక్కేలా చూడాలని ఆదేశించారు. అప్పట్లో చినబాబు ఆశీస్సులు ఉన్న కంపెనీ ఇతర కంపెనీల కంటే ఎక్కువ ధర కోట్ చేసింది. దాంతో ఆ కంపెనీకి టెండర్ దక్కే అవకాశాలు లేవని అధికారులు ఏకంగా ఆ టెండర్‌నే రద్దుచేశారు. మరోసారి సెప్టెంబర్‌లో టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్లపైనా వివాదం తలెత్తడంతో మళ్లీ నవంబర్‌లో టెండర్లు పిలిచారు. డిసెంబర్ 4న టెండర్లను తెరిచారు.

### టెండర్ నిబంధనల్లో మార్పులు

అస్మదీయ సంస్థకే టెండర్ దక్కేలా టెండర్ నిబంధనల్లోనూ చినబాబు మార్పులు చేయించారు. ముందుగా పిలిచిన టెండర్‌లో ఈఎండీ(ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) నాన్ రిఫండబుల్ రూ.25 వేలు కాగా, తాజాగా పిలిచిన టెండర్‌లో ఈఎండీ రూ.1.5 కోట్లుగా చూపించడం గమనార్హం. దాంతోపాటు ఈ-ఆటోలను సరఫరా చేసే సంస్థ ఇప్పటికే 2,500 ఆటోలను ఏదైనా సంస్థకు సరఫరా చేసినట్లు అధికారిక ధ్రువీకరణ కావాలని నిబంధన విధించారు. అయినప్పటికీ టెండర్లలో ఏడు కంపెనీలు పాల్గొన్నాయి. ఎస్ఎస్‌వీ టెక్నాలజీ, గోయెంకా మోటార్స్, విక్టరీ ఎలక్ట్రికల్, రిప్ టెక్నాలజీ, కైనెటిక్ గ్రీన్ ఇండియా, భారత్ ఇంజనీరింగ్ వర్క్స్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి. చివరకు చినబాబుతో డీల్ కుదుర్చుకున్న కైనెటిక్ గ్రీన్ ఇండియా సంస్థకే టెండర్‌ను ఖరారు చేశారు.

### అర్హత లేని కంపెనీకే టెండర్

టెండర్ నిబంధనల ప్రకారం హోమోలోగేషన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి. కానీ, ఆ సర్టిఫికేట్ లేని కైనెటిక్ గ్రీన్ ఇండియాకు టెండర్ ఖరారు చేయడం గమనార్హం. మిగిలిన సంస్థల కంటే ఎక్కువ ధర కోట్ చేసిన కంపెనీకి టెండర్ కట్టబెట్టడం విశేషం. కైనెటిక్ గ్రీన్ ఇండియా ఒక్కో ఆటోను రూ.2.44 లక్షలకు సరఫరా చేయనున్నట్లు టెండర్లలో చూపించారు. మిగిలిన సంస్థలు రూ.2.20 లక్షల లోపు ధరకే సరఫరా చేస్తామంటూ బిడ్ దాఖలు చేశాయి.



ఇటీవల సచివాలయంలో మంత్రి లోకేశ్‌ను కలిసిన కైనెటిక్ గ్రీన్ ఇండియా ప్రతినిధులు

ఈ-ఆటో ప్రస్తుతం రూ.1.48 లక్షల ధర పలుకుతోంది. కానీ, చినబాబు సూచించిన సంస్థ మాత్రం ఒక్కో ఆటోను రూ.2.44 లక్షలకు ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడం గమనార్హం. అంటే ఒక్కో ఆటోకు అదనంగా రూ.లక్ష చెల్లించాల్సి వస్తోంది. తొలివిడతగా ఆహ్వానించిన టెండర్లలో పాల్గొన్న కంపెనీలు చిత్తూరు జిల్లాలో ఒక్కో ఆటోను రూ.1.08 లక్షలకు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.1.16 లక్షలకు సరఫరా చేస్తామంటూ ముందు కొచ్చాయి. కానీ, ఆ టెండర్లను రద్దు చేయించారు. అధిక ధర కోట్ చేసిన కైనెటిక్ గ్రీన్ ఇండియాకే టెండర్ కట్టబెట్టడం వెనుక లోగుట్టు ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కేవలం రూ.1.08 విలువైన ఆటోను అస్మదీయ సంస్థ నుంచి రూ.2.44 లక్షలకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడింది. అంటే ఖజానాపై రూ.83 కోట్ల మేర అదనపు భారం పడుతోంది. ఈ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

### ఎస్సీ యువతపై అదనపు భారం

పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా అర్హులైన దళిత యువతకు ఈ-ఆటోలను సరఫరా చేయనున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉంటుంది. ఆటోలకు ప్రభుత్వ సబ్సిడీ పోను బ్యాంకు రుణం అందిస్తారు. బ్యాంకు రుణాన్ని లబ్ధిదారుడు నెలవారీగా చెల్లించుకోవాలి. చినబాబు కమీషన్ల కక్కుర్తి వల్ల లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.లక్ష వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది.

**ఈ-ఆటోల టెండర్లలో అవినీతి**

''ఈ-ఆటోల సరఫరా టెండర్లలో అవినీతి చోటుచేసుకుంది. కొందరి స్వార్థం కోసం మన రాష్ట్రానికి చెందిన చిన్న తరహా పరిశ్రమలకు అన్యాయం చేశారు. మరో రాష్ట్రానికి చెందిన కంపెనీకి ఈ-ఆటోల సరఫరా టెండర్‌ను అప్పగించడం దారుణం. టెండర్లలో అక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే న్యాయ పోరాటం చేస్తాం''

– కె.పి.రావు, ఎలక్ట్రికల్ బ్యాటరీ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ నేత, విజయవాడ

## 5జీ టవర్ల కోసం అద్దెకు ప్రభుత్వ భూమి

**సాక్షి, అమరావతి:** త్వరలో అందుబాటులోకి రానున్న 5జీ సేవల కోసం వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో 12,000 టవర్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. టవర్ల ఏర్పాటుకు అవసరమయ్యే భూములను ఆయా ప్రైవేటు సంస్థలకు అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఏపీ డిజిటల్ ఇన్‌ఫ్రా, ఏపీ ఫైబర్‌నెట్ కార్యకలాపాలపై ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శి అనిల్ చంద్ర పునేఠ బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇంధనశాఖ కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ.. రూ.55 కోట్లతో ఫైబర్‌నెట్ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైఫై కేంద్రాల్లో గూగుల్ భాగస్వామ్యంగా ఉంటోందని, ప్రకటనలపై వచ్చే ఆదాయంలో 70 శాతం గూగుల్‌కు వెళితే, మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీల్లో 970 ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నాటికి ఈ ఉచిత వైఫై కేంద్రాలను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అజయ్ జైన్ చెప్పారు.

## టీటీడీ చైర్మన్‌కు వైఎస్సార్ జిల్లా జడ్జి నోటీసులు

### 'సాక్షి' కథనంపై న్యాయమూర్తి స్పందన



'సాక్షి' కథనం గురించి వివరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ (ఫైల్)

**కడప కల్చరల్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్‌కు వైఎస్సార్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ గోకవరపు శ్రీనివాస్ బుధవారం నోటీసులు జారీ చేశారు. టీటీడీ పరిధిలో ఉన్న జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో తరగతి ఉద్యోగులను టీటీడీ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, 12 ఏళ్లుగా వారు కేవలం నెలకు రూ.5,010 జీతంతో జీవనం గడపాల్సి వస్తోంది. దీంతో ఇద్దరు ఉద్యోగులు ఆకలి చావుకు గురి కావడంతో గతేడాది డిసెంబర్ 29న 'సాక్షి' టాబ్లాయిడ్‌లో కథనం వెలువడింది. దీంతో స్థానిక పారా లీగల్ వాలంటీర్ బి.సుభాష్ జిల్లా జడ్జి గోకవరపు శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జడ్జి బుధవారం టీటీడీ చైర్మన్‌తో పాటు జేఈవో, జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. నోటీసుల్లో 'సాక్షి' కథనాన్ని ఉటంకించారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## కొత్త అవతారం.. 'నారా పవన్ రాహుల్ నాయుడు'

- వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజం
- ప్రత్యేక హోదా కోసం పార్లమెంటు ఆవరణలో నిరసన



**సాక్షి, న్యూఢిల్లీ:** అవకాశవాద రాజకీయాలకు పెట్టింది పేరైన సీఎం చంద్రబాబు 'నారా పవన్ రాహుల్ నాయుడు'గా కొత్త అవతారం ఎత్తారని వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తో ఓ మారు పొత్తు పెట్టుకుని విడాకులు తీసుకున్న చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ ఆయనతో బంధానికి తహతహలాడుతున్నారని విమర్శించారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలతోనూ పొత్తు పెట్టుకుని విడాకులు తీసుకున్న బాబు ఇప్పుడు ఎన్టీఆర్ ఆశయాలకు తిలోదకాలిచ్చి కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు.

**సొంతింటిని నిర్మించుకుని.. హైకోర్టును విస్మరించారు..**

అత్యంత విలాసవంతమైన ఇంటిని అతి తక్కువ కాలంలో నిర్మించుకున్న చంద్రబాబు ఏపీ హైకోర్టు భవన నిర్మాణాన్ని మాత్రం ఉద్దేశపూర్వకంగా విస్మరించారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌ను తానే కట్టానని చెప్పుకునే చంద్రబాబు నాలుగున్నరేళ్లలో ఒక్క హైకోర్టు భవనాన్ని ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. ఏపీ హైకోర్టు భవన నిర్మాణంలో ఘోరంగా విఫలమైన చంద్రబాబు న్యాయవ్యవస్థను, న్యాయమూర్తులను అవమానపరిచారని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 600పైచిలుకు హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో శంకుస్థాపనల పేరుతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## 'కార్మికుల సంక్షేమం కోసం 17 వేల కోట్ల ఖర్చు'

**సాక్షి, న్యూఢిల్లీ:** భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం అన్ని రకాల నిర్మాణ కార్యకలాపాలపై చట్ట ప్రకారం ఒక శాతం సెస్ వసూలు చేస్తున్నది వాస్తవమే అని, అలా ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రూ.45,473 కోట్లు వసూలు చేసి కార్మికుల సంక్షేమం కోసం రూ.17,591 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. బుధవారం ఆయన రాజ్యసభలో వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. కార్మికుల రోజువారి వేతనాల ప్రాతిపదికన సెస్ వసూలు జరగదని, భవనాలు ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం 1996లో రూపొందించిన చట్ట ప్రకారం నిర్మాణ వ్యయంలో ఒక శాతం మొత్తాన్ని సెస్ రూపంలో నిర్మాణదారుల నుంచి వసూలు చేస్తున్నట్లు వివరించారు.

## అవినీతి లేని ఏపీ లక్ష్యంగా పనిచేస్తున్నాం: డీజీపీ

**సాక్షి, అమరావతి:** అవినీతి లేని ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వార్షిక నివేదికను విడుదల చేశారు. అవినీతి తక్కువగా ఉండే రాష్ట్రాల్లో 2017లో ఏపీ 19వ స్థానంలో ఉండగా 2018లో 3వ స్థానానికి వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై కూడా ఏపీ ఏసీబీ దాడులు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే ఒక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని పట్టుకున్నామని, మరికొంత మందిపై దృష్టి పెట్టామన్నారు. గడిచిన ఏడాది కాలంలో 146 కేసులు నమోదు చేశామని, 107 ట్రాప్ కేసుల్లో లంచం సొమ్ము రూ.21.64 లక్షలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అక్రమ ఆదాయం (రికార్డుల్లో పేర్కొన్న లెక్కలు) రూ.54.72 కోట్లు గుర్తించినట్లు వివరించారు. 8 మంది ప్రభుత్వ ఉద్యోగులపై దుష్ప్రవర్తన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# పోలవరంపై శ్వేతపత్రం ఏదీ?

- విడుదల చేసినవన్నీ..అవాస్తవాలు, కట్టు కథలే
- బాబు పాలన..అంతా అవినీతిమయం
- చర్చలకు పాలకులు సిద్ధమేనా?
- జగన్ ప్రజా సంకల్పయాత్రకు అపూర్వ స్పందన..
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



**దేవీచౌక్ (రాజమహేంద్రవరం):** ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రాలపై చర్చకు సిద్ధం కావాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉండవల్లి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు విషయంలో తాను లేవనెత్తిన అంశాలకు సమాధానాలతో వెంటనే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని, తాను చేసిన ఆరోపణలు తప్పని నిరూపిస్తే క్షమాపణ కోరతానన్నారు. 'పోలవరంపై శ్వేతపత్రాన్ని నేను పదేపదే కోరుతుంటే, దానిని మినహాయించి, అవాస్తవాలతో కూడిన శ్వేతపత్రాలను విడుదల చేశారని' ఉండవల్లి విమర్శించారు. ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్‌ను చూపేందుకు ప్రజలను తీసుకుని వెళ్లినట్టు కాకుండా చర్చలకు తన సొంత ఖర్చులతో వస్తానని.. టీడీపీ ప్రభుత్వం స్పందించాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల కోసం విడుదల చేసిన శ్వేతపత్రంలో భాగస్వామ్య సదస్సుల ద్వారా రాష్ట్రానికి రూ.18 లక్షల కోట్లతో పరిశ్రమలు వచ్చాయని గతంలో వెల్లడించారు. ఇప్పుడు కేవలం ఇందులో 11% మాత్రమే వచ్చాయని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. ఇది కూడా నిజం కాదని నిరూపించడానికి తాను సిద్ధమేనని' ఉండవల్లి అన్నారు. పోలవరం ప్రాజెక్టులో నీరు నిలపాలంటే 6 నెలల ముందుగా ప్రాజెక్టు పరిస్థితి, నిర్వాసితుల సమస్యలపై సుప్రీంకోర్టుకు తెలియజేయాలని అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదన్నారు. చంద్రబాబు శ్వేతపత్రాలపై మాజీ సీఎస్ అజేయకల్లాం లేవనెత్తిన అంశాలకు ప్రభుత్వం సమాధానం చెప్పడంలో విఫలమైందని తెలిపారు. 'పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గేటు ప్రస్తుతం వేళాడుతోంది, దానిని కిందకు దింపి అమర్చడానికి కనీసం నెలకుపైగా పడుతుంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోలవరం ప్రాజెక్టుపై కొంతమంది సాంకేతిక అంశాల్లో అనుమానాలు లేవనెత్తితే, నాడు ప్రభుత్వంలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని పంపి సందేహాలు నివృత్తి చేయించారని, ఆ వ్యక్తి ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారన్నారు. అంతటి పారదర్శకత, నిజాయతీ .. నిప్పు అని చెప్పుకుంటున్న చంద్రబాబులో చూడలేమని ఉండవల్లి విమర్శించారు. ప్రధాని మోదీ తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని రంకెలు వేస్తున్న చంద్రబాబు రాష్ట్రంలో తన ప్రత్యర్థులపై అదే నీతిని అవలంబించడం లేదా అని ప్రశ్నించారు.

**బాబు పాలన..అంతా అవినీతిమయం..**

క్షేత్రస్థాయి నుంచి నిర్లజ్జగా, విచ్చలవిడిగా, నగ్నంగా.. ఇప్పుడు జరుగుతున్న అవినీతిని తాను గతంలో ఎన్నడూ చూడలేదని ఉండవల్లి అన్నారు. 'ఎల్ఈడీ బల్బుల కొనుగోలు, అన్న క్యాంటీన్ల నిర్మాణం, ఆదరణ పథకం, ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ ఉద్యోగులకు సెల్‌ఫోన్ల పంపిణీ..ఇలా అన్నింటిలో దోపిడీ జరుగుతోంది. వస్తువులను భారీస్థాయిలో కొనుగోలు చేసేటప్పుడు ధర తగ్గాలి, కానీ మార్కెట్ ధర కన్నా, 2. 3 రెట్లు అదనంగా చెల్లించి కొనుగోలు చేయడం వెనుక అవినీతి దాగి ఉందని' చెప్పారు. ఈ దోపిడీ సొమ్ముతోనే చంద్రబాబు ఎన్నికలకు సిద్ధమవుతున్నారేమోనని ఉండవల్లి అనుమానం వ్యక్తం చేశారు.

### జగన్ యాత్రకు అపూర్వ స్పందన..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గతంలో చేసిన పాదయాత్రకు, చంద్రబాబు తర్వాత కాలంలో చేపట్టిన పాదయాత్రకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఉండవల్లి అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంకల్పయాత్రకు వస్తున్న స్పందన తన రాజకీయ జీవితంలో చూడలేదని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో జగన్ సఫలమయ్యారని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ఒకవేళ చంద్రబాబుకు మద్దతు పలికితే, రానున్న ఎన్నికల్లో ఆయన ప్రభావం ఏ మాత్రం ఉండబోదని ఉండవల్లి జోస్యం చెప్పారు.

# రాజధానిలో దళితులపై దౌర్జన్యం

- కేసు పెడతామంటూ అధికారుల బెదిరింపులు
- బాధితుల రాస్తారోకో
- సీఆర్‌డీఏ డీఈని సస్పెండ్ చేయాలని డిమాండ్
- తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



డీఈ వ్యాఖ్యలను నిరసిస్తూ దళితవాడ రహదారిలో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

**తాడేపల్లిరూరల్ (మంగళగిరి):** తెలుగుదేశం పార్టీ ఎంపీ, పాలకులు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మించాలని కోరిన దళితులపై సీఆర్‌డీఏ అధికారులు బెదిరింపులకు దిగిన వైనం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఫోన్‌లోనే తమను బండ బూతులు తిట్టిన సదరు అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని దళితులు రోడ్డుపై బైఠాయించి..పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన రాజధాని ముఖద్వారమైన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..

ఉండవల్లి దళితవాడ నుంచి పోలకంపాడు పాత జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోంది. ఈ రోడ్డు శంకుస్థాపన సమయంలో తెలుగుదేశం పార్టీ ఎంపీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అధికారులు వచ్చి 12 అడుగులు ఉన్న రోడ్డును 18 అడుగుల మేర విస్తరణ చేసి, మరో 3 అడుగులు మార్జిన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తీరా పనులు మొదలైన తర్వాత 15 అడుగుల సీసీ రోడ్డును మాత్రమే నిర్మిస్తుండటంతో దళితవాడ ప్రజలు పలుమార్లు పనులను అడ్డుకున్నారు. తిరిగి బుధవారం పనులను ప్రారంభిస్తుంటే చేయడానికి వీల్లేదంటూ దళితవాడ యువకులు అడ్డగించారు. దీంతో సీఆర్‌డీఏ డీఈ బాబూరావుకు సదరు కాంట్రాక్టర్ ఫోన్ చేసి రోడ్డును అడ్డుకున్నారని తెలిపారు. దీంతో డీఈ బాబూరావు ఫోన్‌లో మండిపడ్డారు. 'అది గ్రామం కాదు, దళితవాడ. ఎవడు అక్కడ మాట్లాడేది? వాడి పేరు చెప్పు. మక్కెలు ఇరగదీసి లోపలేద్దాం' అంటూ రెచ్చిపోయారు. అంతటితో ఆగక చెప్పడానికి వీల్లేని బూతులు తిట్టారు. అప్పటికే వందల సంఖ్యలో చేరుకున్న యువకులు డీఈ తీరును నిరసిస్తూ రాస్తారోకోకు దిగారు. డీఈని సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా బయలు దేరారు. అంతలో సీఐ బ్రహ్మయ్య మార్గమధ్యంలో ర్యాలీలు చేస్తే సహించం అని చెప్పడంతో పరిస్థితి కొంచెం ఉద్రిక్తంగా మారింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డీఈ బాబూరావుపై ఫిర్యాదు చేశారు.

### నెలా 15 రోజులుగా తీవ్ర ఇబ్బందులు



నెలా పదిహేను రోజులనుంచి దళితవాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది అధికారపార్టీ నేతలు సదరు అధికారిని కాపాడేందుకు ప్రయత్నం చేస్తూ మాట్లాడుతున్నారు. ఇక అలాంటివి చేస్తే సహించేదే లేదు. దళితులు ఏ పార్టీలో ఉన్నా ఒక్కటిగా పోరాడుతాం.

– అందె జ్యోత్స్న, వార్డు మెంబరు

### డీఈని సస్పెండ్ చేయాలి



దళితులు రహదారి గురించి సావధానంగా మాట్లాడుతుంటే నోటికి చెప్పడానికి వీల్లేని బూతులు తిట్టిన సదరు డీఈపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఆయన దౌర్జన్యంపై పూర్తి ఆధారాలు ఉన్నాయి.వెంటనే చర్యలు తీసుకోకపోతే ఉద్యమించక తప్పదు.

– సంకురు వేణు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

### ఎంతమందిని అరెస్టు చేస్తారో చూస్తాం



దళితులు తమ హక్కులు సాధించుకునేందుకు అడుగుతుంటే కులం పేరుతో దూషించి, నోటికొచ్చినట్లు మాట్లాడే అధికారులపై చర్యలు తీసుకోవాలి. అలాగే 18 అడుగుల రోడ్డు వేసే వరకు ఉద్యమం చేస్తాం. ఎంత మందిని ప్రభుత్వం అరెస్టు చేస్తుందో చూస్తాం. పిల్లాజల్లా అంతా ఉద్యమానికి సిద్ధమవుతాం.

–పిల్లి రత్నశేఖర్, ఉండవల్లి

## సిద్ధార్థలో 'కాలేజ్ కనెక్ట్'



'కాలేజ్ కనెక్ట్' కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కంపెనీల సీఈవోలు, చౌదరి తదితరులు

**నారాయణవనం:** సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో వృత్తి నైపుణ్య విద్యను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగాలను ప్రముఖ కంపెనీల్లో కల్పించాలన్న లక్ష్యంతో 'కాలేజ్ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎం ఐటీ అడ్వైజర్ జేఏ చౌదరి తెలిపారు. చిత్తూరు జిల్లా నారాయణవనంలో బుధవారం కళాశాల ఆడిటోరియంలో 15 కంపెనీల సీఈవోలు, అపిట సీఈవో భాస్కర్‌రెడ్డి, ఏపీ ఇన్నొవేటివ్ సొసైటీ సీఈవో విన్నోపాత్ర, కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజుతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి వివిధ కంపెనీలతో పాటు పరిశ్రమల సీఈవోలు ప్రతి కళాశాల నుంచి 5 నుంచి 10 మంది విద్యార్థులను గుర్తించి వారికి ఉద్యోగ అవకాశాలను పొందేవరకు శిక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాలల చైర్మన్ అశోకరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎంకే.ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి వ్యాపారం ఎన్టీఆర్ ట్రస్టుకు..

- ఎన్టీఆర్ సుజల పథకంలో ప్రభుత్వం ఒప్పందం
- కుప్పం నియోజకవర్గంలో ట్రస్టు ఆధ్వర్యంలో మంచినీటి వ్యాపారం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి వ్యాపారాన్ని క్రమంగా ఎన్టీఆర్ ట్రస్టుకు అప్పగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ట్రస్టులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులే సభ్యులుగా కొనసాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటి అమ్మకాలపై పర్యవేక్షణకు ఎన్టీఆర్ ట్రస్టుతో ప్రభుత్వం గతంలో ఒప్పందం చేసుకుంది. తర్వాత దాన్ని రద్దు చేస్తూ శాఖాపరమైన అంతర్గత ఉత్తర్వులు జారీ చేశామని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ.. ఇప్పటికీ ఆ ఒప్పందం అమల్లోనే ఉందని కొందరు అధికారులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. శుద్ధి చేసిన 20 లీటర్ల క్యాను రూ.5 నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే మంచినీటి ప్లాంట్లలో శుద్ధి చేసిన 20 లీటర్ల నీటిని రూ.2కే సరఫరా చేస్తామని 2014 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్టీఆర్ సుజల పేరుతో శుద్ధి చేసి నీటి సరఫరా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 48,692 గ్రామీణ నివాసిత ప్రాంతాలు ఉన్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తయినా అందులో కేవలం 1,500 ప్రాంతాలకు మాత్రమే ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్లాంట్లలో నీటి శుద్ధి, రూ.2 చొప్పున క్యాన్ల అమ్మకం సహా మొత్తం పర్యవేక్షణ ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో జరగాలన్నదే ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం సారాంశం.

**కుప్పంలో ట్రస్టు ఆధ్వర్యంలోనే వ్యాపారం**

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మంచినీటి వ్యాపారం జరుగుతోంది. ఎన్టీఆర్ ట్రస్టు మొదట ఆ నియోజకవర్గంలోని 26 గ్రామాల్లో రూ.2కే 20 లీటర్ల మంచినీటి వ్యాపారాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఇక్కడ గత మూడేళ్లగా 20 లీటర్ల క్యానుకు రూ.2 చొప్పున వసూలు చేస్తున్నారు.

**ఒప్పందం రద్దుపై భిన్న కథనాలు**

ఎన్టీఆర్ సుజల పథకంలో మంచినీటి వ్యాపారం పర్యవేక్షణను పూర్తిగా ఎన్టీఆర్ ట్రస్టుకు అప్పగిస్తూ 2017లో ఒప్పందం జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే విమర్శలు వస్తాయని ఈ ఒప్పందాన్ని 2018 జూన్– జులై నెలల్లో ప్రభుత్వం రద్దు చేసుకుందని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. కాగా, ఉన్నతాధికారులు చెప్పినట్టు ఒప్పందం రద్దు చేసుకున్న తర్వాత కూడా, కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికీ 26 గ్రామాల్లో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నీటి క్యాన్ల వ్యాపారం జరుగుతోందని చిత్తూరు జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులు వెల్లడించారు.

# పొగడ్తలపై ప్రత్యేక శిక్షణ!

- సీఎంకు కానిస్టేబుళ్ల అభినందన సభకు కథ, మాటలు, డైరెక్షన్ అంతా 'ఇంటెలిజన్స్'
- పోలీసు శాఖలో వింత పోకడలపై విస్తుపోతున్న సీనియర్లు

**సాక్షి, అమరావతి:** ఉద్యోగులు, ప్రజల కోసం ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమాలను సైతం రాజకీయ కోణంలో చూస్తూ టీడీపీ సర్కారు లబ్ధి కోసం పాకులాడుతోందని పరిశీలకులు తప్పుబడుతున్నారు. తాజాగా పోలీసు కానిస్టేబుళ్ల పదోన్నతులకు సంబంధించి సీఎంకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో చోటు చేసుకున్న పరిణామాలు విమర్శలకు దారితీశాయి. రాష్ట్రంలో 2019 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్స్‌గా, 566 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగాను పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. సీనియారిటీ ప్రకారం సమయానికి పదోన్నతి ఇవ్వకపోగా ఆలస్యంగా ఇవ్వడం గమనార్హం. సీఎంను కీర్తిస్తూ గత నెల 31న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించిన తీరుపై సీనియర్ పోలీసులు ముక్కున వేలేసుకుంటున్నారు. ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపే సభలో మాట్లాడేందుకు ఏరికోరి మరీ వక్తలను ఎంపిక చేయడం గమనార్హం. ఎంపిక చేసిన కొందరు కానిస్టేబుళ్లను గుంటూరుకు తీసుకొచ్చి ముందు రోజే ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్టు సమాచారం. సీఎంను పొగడటంలో బెరుకు, స్టేజ్ ఫియర్ లేకుండా, తప్పులు దొర్లకుండా మాట్లాడేలా మైక్ ఏర్పాటు చేసి రిహార్సల్స్ చేయించినట్టు పోలీసు శాఖలోనే చర్చ సాగుతోంది. ఇందుకు సంబంధించి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా ఒక ఇంటెలిజెన్స్ అధికారి నిర్వహించినట్టు పోలీసు అధికారి వెల్లడించారు.

**పోలీసుశాఖలో ఇవేం పోకడలు?**

సీఎం సన్మానసభ సందర్భంగా పోలీసు శాఖలో ఉండకూడని పోకడలు ప్రస్ఫుటమయ్యాయని, ఇది మంచి పరిణామం కాదని పలువురు సీనియర్ పోలీసులు పేర్కొంటున్నారు. ప్రమోషన్ అనేది ఉద్యోగి హక్కు అని, సీనియారిటీ ప్రకారం ఇవ్వాల్సిందేనని పేర్కొంటున్నారు. ఇదేదో చంద్రబాబు ఇచ్చిన వరం మాదిరిగా పొగడ్తలు శృతిమించాయని తప్పుబడుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో పోలీసు శాఖకు ప్రత్యేకత ఉంటుందని గుర్తు చేస్తున్నారు.

# లోక్‌సభలో 'రఫేల్' రచ్చ


లోక్‌సభలో రఫేల్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, అరుణ్ జైట్లీ

**మోదీ దాక్కున్నారన్న రాహుల్**
- రఫేల్‌పై ఆడియో టేపు వినిపించేందుకు యత్నం
- అనుమతించని స్పీకర్ మహాజన్
- టేపు నకిలీ, కల్పితమన్న జైట్లీ

న్యూఢిల్లీ

రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోలు ఒప్పందంపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య బుధవారం పార్లమెంటులో హైడ్రామా నడిచింది. రఫేల్ వ్యవహారంలో దేశ ప్రజలకు జవాబు ఇచ్చే ధైర్యంలేక ప్రధాని మోదీ ఇంట్లో దాక్కుంటున్నారని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ సందర్భంగా రఫేల్ ఒప్పందంపై గోవా మంత్రి విశ్వజిత్ రాణె మరొకరితో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో టేపును సభలో వినిపించేందుకు అనుమతి ఇవ్వాలని రాహుల్ స్పీకర్‌ను కోరారు. వెంటనే కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ స్పందిస్తూ, అవినీతిలో నిండా మునిగిన కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై అబద్ధాలను ప్రచారం చేస్తోందన్నారు. ఈ టేపు నకిలీ, కల్పితమని ఆరోపించారు. ఈ టేపు నిజమైనదేనని రాహుల్ నిరూపించగలరా? అని సవాలు విసిరారు. ఒకవేళ నిరూపించలేకపోతే ప్రివిలేజ్ మోషన్‌ను రాహుల్ ఎదుర్కోవాల్సి ఉంటుందని, అలాగే సభ నుంచి సస్పెండ్ అవుతారని హెచ్చరించారు. దీంతో బీజేపీ సభ్యులు భయపడుతున్నందున ఈ టేపును పార్లమెంటులో వినిపించబోనని రాహుల్ వ్యాఖ్యానించారు. కాగా, ఆడియో టేపు నకిలీ అని తెలుసు కాబట్టే రాహుల్ భయపడి వెనక్కి తగ్గారని జైట్లీ దుయ్యబట్టారు.

**సభలో కాగితపు విమానాలు**

అరుణ్ జైట్లీ మాట్లాడుతుండగా విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాగితపు విమానాలను సభలో ఎగరేసి ఆందోళనకు దిగడంతో కార్యకలాపాలు కొన్నిసేపు స్తంభించాయి. దీంతో కాంగ్రెస్ సభ్యుల్లో అసహనం వ్యక్తం చేసిన స్పీకర్ సుమిత్రా మహాజన్ 'మీరంతా ఇంకా చిన్నపిల్లలా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రఫేల్ టేపును సభలో వినిపించేందుకు అనుమతి నిరాకరించారు. బీజేపీ మిత్రపక్షం శివసేన సైతం విపక్షాలకు మద్దతు పలికింది. రఫేల్‌పై జేపీసీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. రఫేల్ జెట్లు మంచివే అయినప్పటికీ ఒప్పందం మాత్రం లోపభూయిష్టంగా ఉందని వ్యాఖ్యానించింది. మరోవైపు కావేరీ నదీజలాల వివాదంలో ఆందోళనకు దిగిన 24 మంది అన్నాడీఎంకే ఎంపీలను స్పీకర్ మహాజన్ ఐదు రోజుల పాటు సస్పెండ్ చేశారు.

**బీజేపీ నేతలు భయపడుతున్నారు: రాహుల్**

లోక్‌సభలో రాహుల్ మాట్లాడుతూ..'మీరు(మోదీ) ఈ కాంట్రాక్టును మీ ప్రియమైన మిత్రుడు ఏఏ(అనిల్ అంబానీ)కి ఎందుకు ఇచ్చారు? జనాభాపై రూ.30వేల కోట్ల భారాన్ని ఎందుకు మోపారు. మోదీకి పార్లమెంటులో ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేదు. అందుకే ప్రధాని తన ఇంట్లోని బెడ్రూమ్‌లో దాక్కుంటున్నారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ఆందోళన చేస్తున్న అన్నాడీఎంకే సభ్యుల వెనుక దాక్కుంటున్నారు. ఈ విషయంలో వెంటనే సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణకు ఆదేశించాలి. నిజం నిదానంగా బయటకు వస్తుంది. ప్రపంచమైనా మోదీ వెంటనే సభకు వచ్చి జవాబు చెప్పాలి. దేశమంతా ఆయన ఏం చెబుతారోనని ఆసక్తిగా చూస్తోంది' అని తెలిపారు. రఫేల్ యుద్ధవిమానాల ధరను రూ.526 కోట్ల నుంచి రూ.1,600 కోట్లకు పెంచడాన్ని రక్షణశాఖ అధికారులు స్వయంగా వ్యతిరేకించలేదా? అని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఒప్పందాన్ని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హాల్) నుంచి లాక్కుని ఏఏకు అప్పగించారని ఆరోపించారు. అలాగే యుద్ధ విమానాల సంఖ్యను 126 నుంచి 36కు తగ్గించేశారని విమర్శించారు. మోదీ ఇటీవల ఇచ్చిన 90 నిమిషాల ఇంటర్వ్యూలో రఫేల్‌పై ప్రశ్నలకు జవాబివ్వలేదని దుయ్యబట్టారు. రఫేల్ ఒప్పందం విషయంలో తనపై ఎవరూ వేలెత్తి చూపడం లేదని ప్రధాని అంటున్నారని, కానీ దేశమంతా ఆయనవైపే వేలెత్తి చూపుతోందని అన్నారు.

**జేపీసీతో నిష్పాక్షిక విచారణ జరగదు: జైట్లీ**

రఫేల్ ఒప్పందంలో అవకతవకలేవీ లేవని స్వయంగా సుప్రీంకోర్టు చెప్పిందని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. అలాంటప్పుడు రఫేల్‌పై జేపీసీ ఏర్పాటు అవసరం ఏంటని ప్రశ్నించారు. 'అవినీతిలో నిండా మునిగిపోయిన కాంగ్రెస్ పార్టీ పారదర్శకంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు అబద్ధాలను ప్రచారం చేస్తోంది. బోఫోర్స్ కుంభకోణంపై ఏర్పాటైన జేపీసీని గుర్తుకు తెచ్చుకోండి. లంచం అందుకున్నారన్న ఆరోపణలను అది కొట్టిపారేసింది. జేపీసీ అన్నది అనుకూల పార్టీలు ... కమిటీ. దీనివల్ల నిష్పాక్షిక విచారణ జరగదు. యూపీఏతో పోల్చుకుంటే మా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న రఫేల్ యుద్ధవిమానం 9 శాతం చవకగా, ఆయుధ వ్యవస్థలు అమర్చిన రఫేల్ 20 శాతం చవకగా అందుబాటులోకి రానుంది. కొందరు వ్యక్తులు నిజాలను ఇష్టపడరు. వాళ్లు గత ఆరు నెలలో పార్లమెంటు లోపల, బయట రఫేల్‌పై చెప్పినవన్నీ అబద్ధాలే. అబద్ధాలను వండివార్చడం వారికి వారసత్వంగా సంక్రమించింది. నిజాలను అంగీకరించలేని అలవాటు రాహుల్‌కు ఉంది. అందుకే ఆయన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడితో మాట్లాడినట్లు కట్టుకథలు అల్లారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదు' అని జైట్లీ వెల్లడించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కాగితపు విమానాల్ని విసరడంపై స్పందిస్తూ.. 'ఐఏఎఫ్ కాంట్రాక్టును దక్కించుకోడానికి డసో కంపెనీతో పోటీపడిన యూరో ఫైటర్‌కు గుర్తుగా కాంగ్రెస్ నేతలు వీటిని విసురుతున్నారేమో' అని ఎద్దేవా చేశారు. అగస్టాస్కాం, నేషనల్ హెరాల్డ్ కేసు, బోఫోర్స్‌లో మధ్యవర్తి ఖత్రోచీ పేర్లను ప్రస్తావించిన జైట్లీ.. కాంగ్రెస్‌కు డబ్బుపై ఉన్న శ్రద్ధ దేశభద్రతపై లేదన్నారు. గతంలో పలు కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు మోదీ ప్రభుత్వాన్ని వేలెత్తి చూపుతున్నారని దుయ్యబట్టారు.

**'జేమ్స్‌బాండ్'పై సంవాదం**

చర్చలో మంత్రి జైట్లీ మాట్లాడుతూ.. ''రాహుల్ గతంలో జేమ్స్‌బాండ్ సినిమాలు చూసుంటారు. అందులో 'ఏదైనా ఘటన ఒకసారి జరిగితే అనుకోకుంటే జరిగిందనుకోవాలి. రెండుసార్లు అదే జరిగితే యాదృచ్ఛికమనీ, మూడుసార్లు జరిగితే అది కుట్ర అని అర్థం చేసుకోవాలి' అని బాండ్ చెబుతాడు. కాంగ్రెస్ చీఫ్ అదే చేస్తున్నారు'' అని అన్నారు. దీనికి తృణమూల్ ఎంపీ సౌగత రాయ్ స్పందిస్తూ.. 'జైట్లీ ఆ డైలాగ్ తప్పుగా చెప్పారు. ఓ ఘటన మొదటిసారి జరిగితే దాన్ని అనుకోకుండా జరిగిన విషయంగా భావించాలి. అదేరెండుసార్లు జరిగితేయాదృచ్ఛికమనీ, మూడు సార్లు జరిగితే అది శత్రువుల చర్య అని అర్థం చేసుకోవాలి' అని సినిమాలో ఉంటుందన్నారు.

# దమ్ముంటే చర్చకు రండి


ఏఐసీసీలో మీడియాతో మాట్లాడుతున్న రాహుల్

- ప్రధాని మోదీకి రాహుల్ సవాల్
- పరీకర్ మోదీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** రఫేల్ ఒప్పందం సహా ఏ వ్యూహాత్మక అంశంపై అయినా దమ్ముంటే తనతో 20 నిమిషాలు ముఖాముఖి చర్చకు రావాలని ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాలు విసిరారు. రాహుల్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ..'ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చ కోసం నాకు కేవలం 20 నిమిషాలు ఇవ్వండి. ఆ తర్వాత వాస్తవమేంటో మీరే నిర్ణయించుకోండి. కానీ ప్రధాని మోదీకి మీ(మీడియా) ముందు కూర్చుని మాట్లాడే దమ్ము లేదు. మీరంతా మంగళవారం ప్రధాని ఇంటర్వ్యూ చూశారా? ఆయనేమో అక్కడ నవ్వుతున్నారు. ఎదురుగా ఉన్న జర్నలిస్ట్ మాత్రం ప్రశ్నలతో పాటు ప్రధాని ఇవ్వాల్సిన జవాబులను చెప్పేస్తున్నారు' అని విమర్శించారు. రఫేల్ ఆడియో టేపు విషయమై మాట్లాడుతూ..'రఫేల్‌కు సంబంధించిన ఫైలు మొత్తం తన దగ్గర ఉందని గోవా సీఎం పరీకర్ చెప్పినట్లు ఆయన కేబినెట్ సభ్యుడు రాణే బయట పెట్టారు. తనను ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పించకుండా ఉండేందుకు పరీకర్ దీన్ని వాడుకుంటున్నారు. ఇలాంటి ఆడియో టేపులు ఇంకా చాలా ఉండొచ్చు. పరీకర్ ప్రధానిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం..**

రఫేల్ ఒప్పందంపై తనకు ఎలాంటి ప్రశ్నలు ఎదురు కాలేదని మోదీ చెప్పడంపై స్పందిస్తూ..'ఆయన ఏ లోకంలో జీవిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. మోదీజీ.. మీకు వ్యతిరేకంగా ప్రశ్నలు వస్తున్నాయి. మీరు అనిల్ అంబానీ(ఏఏ)కు రూ.30,000 కోట్లు ఎందుకు ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు' అని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రఫేల్ ఒప్పందంపై విచారణకు ఆదేశిస్తామన్నారు.

# పరీకర్ పడకగదిలో 'రఫేల్' ఫైల్స్!

**న్యూఢిల్లీ:** రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పంద వివాదం కొత్త మలుపు తిరిగింది. ఈ ఒప్పందానికి సంబంధించిన ఓ దస్త్రం అప్పటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరీకర్ పడక గదిలో ఉందని, ఆయన సహచర మంత్రి ఒకరు వ్యాఖ్యానిస్తున్న ఆడియోను కాంగ్రెస్ బయట పెట్టింది. అయితే ఈ వీడియో ఎంత వరకు నిజమో తెలియరాలేదు. ఓసారి కేబినెట్ సమావేశంలో పరీకర్ ఈమేరకు వ్యాఖ్యానించినట్లు గోవా మంత్రి విశ్వజిత్ రాణె గుర్తుతెలియని వ్యక్తితో అంటున్నట్లు ఆడియోలో ఉంది. రఫేల్ ఒప్పంద విషయమై మోదీని పరీకర్ బెదిరిస్తున్నారని ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సంచలన వ్యాఖ్య చేశారు. ఈ ఆడియో టేపులు అబద్ధం, కట్టుకథలని

**ఆడియో విడుదల చేసిన కాంగ్రెస్**

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొట్టిపారేశారు. కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని సుప్రీంకోర్టే ఎండగట్టిందని, నిజాల్ని తారుమారు చేసేందుకు మరే మార్గం లేకపోవడంతో ఆ పార్టీ ఇలా నకిలీ ఆడియోల్ని విడుదలచేస్తోందని పరీకర్ దుయ్యబట్టారు. ఆడియోలో ఉన్నట్లుగా తానెప్పుడూ కేబినెట్ సమావేశంలోగానీ, మరే ఇతర సమావేశంలోగానీ చర్చించలేదని స్పష్టం చేశారు. 'సీఎం పరీకర్ ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. రఫేల్‌కు సంబంధించిన పూర్తి సమాచారం ఆయన పడకగదిలోనే ఉందట. దీనర్థం.. ఏదో ఆశించే ఆయన ఆ సమాచారాన్నంతా తన వద్ద భద్రపరుచుకున్నారు' అని రాణెను ఉటంకిస్తూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా వ్యాఖ్యానించారు. ఈ ఆడియో కల్పితమని, దాని విడుదల వ్యవహారంపై విచారణకు ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాణె అమిత్ షాకు చెప్పారు.

**పరీకర్‌కు లైడిటెక్టర్ పరీక్షలు: గోవా కాంగ్రెస్**

రఫేల్ ఒప్పంద ఫైల్‌ను గుర్తించడానికి పరీకర్ నివాసంపై సీబీఐతో సోదాలు నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పరీకర్, ఆయన సహచరులకు లైడిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ ఆడియోను వెలుగులోకి తెచ్చిన వేగును గుర్తించి రక్షణ కల్పించాలని, దివంగత జడ్జి లోయా లాంటి పరిస్థితి ఎదురుకాకుండా, పరీకర్‌కు కూడా భద్రతను పెంచాలని గోవా కాంగ్రెస్ ప్రతినిధి సిద్ధాంత్ బుయావో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్తంగా రైతుబంధు!

**న్యూఢిల్లీ:** మూడు రాష్ట్రాల్లో ఓటమిపాలైన బీజేపీ రైతులకు చేరవయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో పంటకాలానికి రైతులకు ఎకరాకు రూ.4 వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లోకే నగదును బదిలీ చేసే కొత్త పథకానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే, ఎకరానికి రూ.50 వేల వడ్డీ రహిత (రైతుకు గరిష్టంగా రూ.లక్ష) రుణాలు అందించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు పథకాల వల్ల కేంద్ర ఖజానాపై ఏటా రూ.2.3 లక్షల కోట్ల భారం పడే అవకాశాలున్నాయి. ఎరువుల సబ్సిడీ పథకాన్ని కూడా వీటిలో విలీనం చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటన ఈ వారంలోనే వెలువడుతుందని భావిస్తున్నారు.

## రఫేల్‌పై తీర్పును పునఃసమీక్షించండి



**న్యూఢిల్లీ:** రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుపై వెలువరించిన సుప్రీం తీర్పును పునఃసమీక్షించాలని మాజీ కేంద్ర మంత్రులు యశ్వంత్‌సిన్హా, అరుణ్‌శౌరీ, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ బుధవారం సుప్రీం కోర్టును కోరారు. 36 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేస్తూ, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిసెంబర్ 14న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎటువంటి సంతకాలు లేకుండా ప్రభుత్వం సమర్పించిన సీల్డ్‌కవర్ నివేదికపై ఆధారపడి సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించిందని వారు కోర్టుకు విన్నవించారు. 'కేవలం నమ్మశక్యంకాని ఆధారాల ఆధారంగా కోర్టు ఈ తీర్పునిచ్చిందని భావిస్తున్నాం. కనీసం సంతకాలు కూడా లేని సీల్డ్‌కవర్ నివేదికపై తీర్పు ఇవ్వడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమ'ని యశ్వంత్‌సిన్హా, అరుణ్ శౌరీ, ప్రశాంత భూషణ్‌లు పిటిషన్‌లో వివరించారు. తీర్పును రిజర్వ్ చేసిన తరువాత అనేక కొత్త వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, వాటి మూలాల్లోకి వెళ్లి కోర్టు విచారించాలని, ఆ లోపు తీర్పును సమీక్షించాలని వారు కోర్టుకు విన్నవించారు.

## వలసదారులపై బాష్పవాయువు

**టిజువానా:** మెక్సికో సరిహద్దుల గుండా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాలనుకున్న వలసదారులను యూఎస్ సరిహద్దు దళాలు అడ్డుకున్నాయి. వీరిలో 25 మందిని అరెస్టు చేశాయి. నూతన సంవత్సర వేడుకలు జరుగుతున్న సమయంలో దాదాపు 100 మంది వలసదారులు అమెరికాలోకి చొరబడేందుకు యత్నించారని స్థానిక మీడియా పేర్కొంది. మెక్సికో సరిహద్దు నుంచి దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన 45 మంది వలసదారులను అడ్డుకున్నామని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ మంగళవారం వెల్లడించింది. కొద్దిసేపటి తర్వాత వీరంతా సీబీపీ అధికారులపై రాళ్ల వర్షం కురిపించారని తెలిపింది. వలసదారులను అదుపు చేసేందుకు బాష్పవాయువు, పెప్పర్ స్ప్రేను వాడామని వివరించింది.

## మధ్యప్రదేశ్‌లో 'వందేమాతరం' వివాదం

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో వందేమాతరం గీతం విషయంలో వివాదం నెలకొంది. రాష్ట్ర సచివాలయంలో ప్రతి నెలా మొదటి పని దినం నాడు వందేమాతరం ఆలపించడం 13 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని మంగళవారం నిలిపివేసింది. దీంతో బీజేపీ నేతలు విమర్శలకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునరుద్ధరించుకోవాలని.. లేని పక్షంలో బీజేపీ ఎమ్మెల్యేలందరం కలిసి అసెంబ్లీ సెషన్ ప్రారంభమయ్యే (7వ తేదీ) నాడు వందేమాతరం పాడతామని మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. సీఎం కమల్‌నాథ్ సూచనల మేరకే వందేమాతరం పాడటం నిలిపివేశారని చౌహాన్ ఆరోపించారు. వందేమాతరం పాడకపోవడంపై వస్తున్న విమర్శలను కమల్‌నాథ్ ఖండించారు.


వాటికన్ సిటీలో భక్తులతో మమేకమైన సందర్భంగా క్యూబా సర్కస్ బృంద సభ్యుడు బహూకరించిన సాకర్ బంతిని వేలిపై తిప్పుతున్న పోప్ ఫ్రాన్సిస్

# శబరిమలలో కొత్త చరిత్ర

- అయ్యప్ప ఆలయంలో అడుగుపెట్టిన ఇద్దరు మహిళలు
- రక్షణగా నిలిచిన పోలీసులు
- వెంటనే గర్భగుడిని శుద్ధిచేసిన పూజారులు
- కేరళలో పెల్లుబికిన నిరసనలు


శబరిమలలో గర్భగుడి ప్రాంగణాన్ని శుద్ధిచేస్తున్న పూజారి


కొచ్చిలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను పక్కకు లాగేస్తున్న పోలీసులు

**శబరిమల/తిరువనంతపురం:** కొత్త ఏడాది వేళ.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల ప్రస్థానంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. శతాబ్దాల సంప్రదాయాన్ని ధిక్కరిస్తూ రుతుస్రావ వయసులో ఉన్న ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. కేరళకు చెందిన కనకదుర్గ(44), బిందు(42) బుధవారం వేకువ జామున పోలీసు రక్షణతో అయ్యప్ప స్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించారు. అన్ని వయసుల మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత రుతుస్రావ దశ (10–50 ఏళ్ల మధ్య)లో ఉన్న మహిళలు అక్కడికి వెళ్లడం ఇదే తొలిసారి. దీంతో అత్యున్నత న్యాయస్థానం తీర్పు మూడు నెలల తరువాత అమలుకు నోచుకున్నట్లయింది. లింగ సమానత్వం కోరుతూ కేరళ వ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు రాష్ట్రం ఒక చివర నుంచి మరో చివర వరకు మానవ హారం ఏర్పాటుచేసిన మరుసటి రోజే ఈ ఘటన జరగడం గమనార్హం. మహిళల ప్రవేశం తరువాత ఆలయ ప్రధాన పూజారి భక్తులందరినీ బయటికి పంపించి, తలుపులు మూసి సుమారు గంట సేపు గర్భగుడిలో సంప్రోక్షణ నిర్వహించారు. ఆ తరువాతే ఆలయ తలుపులు తిరిగి తెరుచుకున్నాయి. ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించారన్న వార్త తెలియగానే కేరళలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించాలని హిందూ సంస్థలు పిలుపునిచ్చాయి.

**అడ్డంకులు లేవు.. నిరసనలు లేవు**

పటిష్ట పోలీసు భద్రత నడుమ నల్లటి దుస్తులు, ముఖాలకు ముసుగులు ధరించి కనకదుర్గ, బిందు బుధవారం వేకువజామున 3.38 నిమిషాలకు అయ్యప్ప ఆలయంలో అడుగుపెట్టారు. పంబా నుంచి ఆలయం వైపు మెట్లు ఎక్కుతుండగా, లోపల పూజలు చేస్తున్న సమయంలో తమకు ఎలాంటి నిరసనలు కాలేదని, అంతా సవ్యంగానే సాగిందని వారు తెలిపారు. అక్కడ భక్తులు మాత్రమే ఉన్నారని, వారు తమని అడ్డుకోలేదని వెల్లడించారు. దర్శనం ముగిసిన తరువాత పోలీసులు ఆ ఇద్దరిని గుర్తు తెలియని చోటుకు తరలించారు. మలప్పురంకు చెందిన కనకదుర్గ పౌర సరఫరా శాఖలో ఉద్యోగి కాగా, కోజికోడ్‌కు చెందిన బిందు కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తాజా ఘటన నేపథ్యంలో వారిద్దరి ఇళ్ల వద్ద పోలీసు బలగాల్ని మోహరించారు. ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయ మెట్లు ఎక్కుతున్న దృశ్యాల్ని స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేయడంతో ఈ సంగతి రాష్ట్రమంతా తెలిసిపోయింది. ముఖ్యమంత్రి పి. విజయన్ స్పందిస్తూ 'కొన్ని అడ్డంకుల వల్ల ఇంతకు ముందు మహిళలు ఆలయంలోకి ప్రవేశించలేకపోయారు. కానీ ఈ రోజు అలాంటి సమస్యలు లేకపోవడం వల్లే వారు గుడిలోకి వెళ్లగలిగారు. మహిళలు శబరిమల ఆలయంలో అడుగుపెట్టారన్నది నిజం' అని వ్యాఖ్యానించారు.

**విజయన్ మొండివైఖరి వల్లే: కాంగ్రెస్**

అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీ సీఎం విజయన్‌పై మండిపడ్డాయి. ఆలయంలోకి మహిళలు అడుగుపెట్టడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఇది సీఎం విజయన్ మొండి వైఖరిని సూచిస్తోందని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితాల అన్నారు. విజయన్ ఆదేశాల మేరకు నడుచుకున్న పోలీసులు ఆ ఇద్దరు మహిళలకు రక్షణ కల్పించారన్నారు. సంప్రోక్షణ కోసం ఆలయాన్ని మూసివేయడం వందశాతం సరైనదేనన్నారు. ప్రతిపక్ష కూటమి యూడీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతుందని తెలిపారు. కేరళ ప్రభుత్వం భక్తుల మనోభావాల్ని దెబ్బతీసిందని, సీఎం, కమ్యూనిస్టు నాయకులు, వారి భావి తరాలకు అయ్యప్ప ఆగ్రహం తప్పదని రాష్ట్ర బీజేపీ చీఫ్ పీఎస్ శ్రీధరన్ పిళ్లై హెచ్చరించారు. విజయన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని 'నామజపం' ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న శబరిమల కర్మ సమితి డిమాండ్ చేసింది. కొత్త ఏడాదిలో మహిళలకు ఇది గొప్ప ప్రారంభమని సామాజిక కార్యకర్త తృప్తి దేశాయ్ అన్నారు.

**అట్టుడుకుతున్న కేరళ**

శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం కేరళలో ఉద్రిక్తత రాజేసింది. ఆందోళన బాట పట్టిన బీజేపీ, హిందూ సంస్థల కార్యకర్తలు వీరంగం సృష్టించారు. తిరువనంతపురంలో సచివాలయం బయట బీజేపీ కార్యకర్తలు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. అధికార సీపీఎం, బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగి పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో అక్కడి వాతావరణం రణరంగాన్ని తలపించింది. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు జలఫిరంగులు, బాష్పవాయువు గోళాల్ని ప్రయోగించారు. అతి కష్టం మీద ఆందోళనలను అణచివేసిన పోలీసులు ఇద్దరు మహిళల్ని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సీపీఎం కార్యాలయాలపై దాడులు జరిగాయి. మలప్పురంలో బీజేపీ కార్యకర్తలు సీఎం విజయన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కొచ్చి, పాతనంతిట్టా, తిరువనంతపురం, కొల్లాంలలో భక్తులు అయ్యప్ప చిత్రపటాలు చేతబూని వీధుల వెంట ర్యాలీలు నిర్వహించారు.

## తమిళ ఎంపీలను బయటికి పంపిన వెంకయ్య

**న్యూఢిల్లీ:** కావేరి నదీ జలాల పంపిణీపై రాజ్యసభలో ఆందోళనకు దిగిన ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులను చైర్మన్ వెంకయ్యనాయుడు బయటకు పంపించారు. ఇదే అంశంపై గందరగోళం తలెత్తడంతో సభ తొలుత రెండుసార్లు, ఆ తరువాత రోజంతటికీ వాయిదా పడింది. నిబంధన 255ని అనుసరించి..తమిళనాడుకు చెందిన డజనుకుపైగా ఎంపీలు రోజంతా సభకు దూరంగా ఉండాలని వెంకయ్య ఆదేశించారు. మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి డీఎంకే సభ్యులు మద్దతు పలికారు. జల వనరుల మంత్రి గడ్కరీ బదులిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ చెప్పినా వారు వినిపించుకోలేదు.

# కాంగ్రెస్ 'వార్ రూమ్' భేటీ

**లోక్‌సభ ఎన్నికల వ్యూహాలపై చర్చ**

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ వ్యూహాలకు పదునుపెట్టుకునే లక్ష్యంతో కాంగ్రెస్ కోర్ కమిటీ నేతలు బుధవారం ఏఐసీసీ వార్ రూమ్‌లో భేటీ అయ్యారు. సమావేశానికి కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌తో పాటు సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే, అహ్మద్ పటేల్, చిదంబరం, జైరాం రమేశ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఫిబ్రవరి తరువాత లోక్‌సభ ఎన్నికల ప్రకటన ఏ క్షణమైనా వెలువడవచ్చని, ఈ లోపే క్షేత్రస్థాయి ఏర్పాట్లను పూర్తి చేయాల్సి ఉంటుందని భేటీలో నిర్ణయించారు. గత నెలలో 3 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఎన్నికల సన్నద్ధతలో ఇంకా వెనకబడే ఉన్నామని పలువురు ప్రస్తావించారు. ఎన్డీయేను అధికారం నుంచి దింపేందుకు అవసరమైన వ్యూహాలపై భేటీలో చర్చించారు. అయితే, విపక్ష కూటమిపై స్పష్టత రాకపోవడం బీజేపీకి లాభించవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను ప్రస్తావించిన ఖర్గే, అహ్మద్ పటేల్ తదితర నేతలు వాటిని అధిగమించేందుకు పలు సూచనలు చేశారు. కీలక రాష్ట్రమైన యూపీలో ఎస్పీ, బీఎస్పీలతో పొత్తుపై ఒక అవగాహన, స్పష్టత రాకపోవడం కాంగ్రెస్‌కు నష్టం చేసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. హైకమాండ్‌కు, రాష్ట్రాల్లోని పీసీసీలకు మధ్య సమన్వయం అవసరమని పలువురు సూచించారు. పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ 'ఏక వ్యక్తి సైన్యం'లా పనిచేస్తున్నారని, సమర్థవంతమైన సంస్థాగత బృందాన్ని ఆయన ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే, పార్టీలో రాష్ట్రాల వారీగా సీనియర్లు, యువ నేతల మధ్య సయోధ్యకు, సహకారానికి రాహుల్ ప్రయత్నించాలన్నారు. అలాగే, కాంగ్రెస్‌కు విజయావకాశాలు బలంగా ఉన్న హరియాణా లాంటి రాష్ట్రాల్లో సంస్థాగత మార్పులు చేపట్టాల్సి ఉందన్నారు.

## మత ఘర్షణల్లో 1,605 మంది మృతి

**నోయిడా:** భారత్‌లో 2004 నుంచి 2017 వరకు జరిగిన 10,399 మత ఘర్షణల్లో ఏకంగా 1,605 మంది ప్రాణాలు కోల్పోయారు. 30,723 మంది గాయాలపాలయ్యారు. సమాచార హక్కు చట్టం కింద నోయిడాకు చెందిన ఐటీ ఉద్యోగి, ఆర్టీఐ కార్యకర్త అమిత్ గుప్తా అభ్యర్థించిన మేరకు కేంద్ర హోంశాఖ ఈ వివరాలు వెల్లడించింది. ఒక్క 2008లోనే అత్యధికంగా 943 మతసంబంధ కేసులు నమోదయ్యాయని, ఆ ఏడాదిలోనే అధికంగా 167 మంది చనిపోయారని కేంద్రం పేర్కొంది. అత్యంత తక్కువ మత కేసులు 2011లో నమోదయ్యాయి. ఆ ఏడాదిలో 91 మంది మరణించారని, 1,899 మంది గాయపడ్డారని తెలిపింది. 2017లో 822 కేసులు నమోదవగా, ఆ ఏడాది ఘర్షణల్లో 111 మంది చనిపోయారు.

# సోషల్ మీడియాకు సంకెళ్లు



**ఐటీ చట్టం సవరణకు ముసాయిదా బిల్లు**

గత ఏడాది ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో షికార్లు చేసిన పుకార్లు.. దేశంలో పలుచోట్ల అల్లర్లు, మూక హత్యలకు అసలు కారణంగా నిలిచాయి. దీంతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, పుకార్లను కట్టడిచేసే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు కదిలింది. కొత్త సంవత్సరంలో ఈ దిశగా ఐటీ చట్టాన్ని సవరిస్తోంది. భారీగా జరిమానాలు వేసి అసత్యవార్తలు, అశ్లీల సమాచారాన్ని వ్యాప్తి చేసే మాధ్యమాలను నియంత్రించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాలకు భారత్‌లో ఖాతాదారులు చాలా ఎక్కువ. గత ఏడాది అనుభవాలతో ఇవి కొన్ని నష్ట నివారణ చర్యలు చేపట్టాయి. ఫేక్ న్యూస్‌పై ప్రజలకు అవగాహన కలిగిస్తూ, హెచ్చరిస్తూ భారీస్థాయిలో ప్రకటనలు ఇస్తున్నాయి. అసభ్య, అసత్య సందేశాలు, సమాచారం పంపకుండా ఖాతాదారులను కట్టడి చేసేందుకు యత్నిస్తున్నాయి.

**కేంద్రం హెచ్చరికలు**

ఖాతాదారుల సమాచారాన్ని దొంగిలించి తద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీ మంత్రి రవి శంకర్ ఫేస్‌బుక్, వాట్సాప్‌లను హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో తమ మాధ్యమం ద్వారా అనైతిక సమాచారం వ్యాప్తి కాకుండా ఫేస్‌బుక్ ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లో ఎన్నికల ప్రకటనలు పోస్టుచేసే వారు వారి వివరాలు, ఎక్కడ నుంచి పోస్టు చేస్తున్నారనేవి విధిగా వెల్లడించాల్సిందే.

**15 కోట్ల వరకు జరిమానా**

వదంతులు, అశ్లీల సమాచారాన్ని, దృశ్యాలను నియంత్రించడంలో విఫలమైన వెబ్‌సైట్లు, యాప్‌లపై భారీ జరిమానా విధించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఐటీ చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ' డేటా ప్రొటెక్షన్ బిల్లు' పేరుతో ముసాయిదాను ఖరారు చేసింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, గూగుల్ వంటి సోషల్ మీడియా, ఇంటర్నెట్ సంస్థల అధిపతులతో ఐటీ శాఖ అధికారులు సమావేశమయ్యారు. మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టి, వాటి జవాబుదారీతనాన్ని పెంచే మార్గాలపై చర్చించారు. 'అసత్య, అశ్లీల సమాచారం సోషల్ మీడియాలోకి ఎక్కడ నుంచి వస్తోందో గుర్తించాలి, దాన్ని తొలగించాలి. ఈ దిశగా ప్రభుత్వం చట్టాన్ని సవరించనుంది. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉండాలి' అని ఓ ఉన్నతాధికారి అన్నారు. నిబంధలను ఉల్లంఘించిన కంపెనీలపై రూ. 15 కోట్లు లేదా వాటి ప్రపంచవ్యాప్త టర్నోవర్‌లో 4శాతం ఈ రెండింటిలో ఏది ఎక్కువయితే దాన్ని జరిమానాగా విధించాలని ప్రతిపాదించారు.

## ఇది 'పింక్' టెస్టు...

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య సిడ్నీ టెస్టు మూడో రోజు మైదానం గులాబీ (పింక్) మయం కానుంది. ఆసీస్ దిగ్గజ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ భార్య జేన్ మెక్‌గ్రాత్ స్మారకార్థం 2009 నుంచి ఈ సంప్రదాయం పాటిస్తున్నారు. జేన్ 2008లో రొమ్ము క్యాన్సర్‌తో కన్నుమూశారు. అంతకుముందే 2005లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో భార్యాభర్తలు... 'గ్లెన్ మెక్‌గ్రాత్ ఫౌండేషన్' ఏర్పాటు చేశారు. తర్వాత మూడేళ్లకు జేన్ చనిపోయారు. దీంతో ఏటా జనవరిలో సిడ్నీ ఆతిథ్యమిచ్చే టెస్టును 'పింక్ టెస్టు'గా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా మ్యాచ్ మూడో రోజును 'జేన్ మెక్‌గ్రాత్ డే'గా పేర్కొంటారు. ప్రేక్షకులు గులాబీ దుస్తులతో మైదానానికి వస్తారు. పింక్ స్టంప్‌లను ఏర్పాటు చేస్తారు. మహిళల స్టాండ్‌ను 'జేన్ మెక్‌గ్రాత్ స్టాండ్'గా పిలుస్తారు. ఆటగాళ్లు మెక్‌గ్రాత్‌కు గులాబీ రంగు టోపీలను అందజేస్తారు.

# సిడ్నీలో మోగాలి విజయ ఢంకా

ఉదయం 5 గంటల నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లలో ప్రత్యక్ష ప్రసారం





### చారిత్రక సందర్భం ముంగిట కోహ్లి సేన

- నేటి నుంచి ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టు
- 13 మందితో జట్టును ప్రకటించిన టీమిండియా
- గాయంతో ఇషాంత్ దూరం; అశ్విన్ అనుమానమే!
- ఓపెనర్‌గా రాహుల్; ఆరో స్థానంలో విహారి

**గెలిస్తే నయా చరిత్ర... 'డ్రా' చేసుకున్నా రికార్డులకెక్కే ఘనత... ఓడిపోకుండా ఉండటం ఒక్కటే కావాల్సింది! అనే స్థితిలో టీమిండియా సిడ్నీ టెస్టు బరిలో దిగబోతోంది. 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయం' అనే చిరకాల స్వప్నాన్ని నెరవేర్చేందుకు మరొక్క అడుగు దూరంలోనే ఉంది భారత్. ఏమరుపాటు లేకుండా... పొరపాటు పడకుండా దీనిని సాకారం చేస్తే కోహ్లి సేన పేరు సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది. అశేష అభిమానులందరి ఆకాంక్షలు నెరవేరుస్తూ మన జట్టు నెగ్గాలని ఆశిద్దాం!**


రాహుల్


విహారి

**సిడ్నీ:** చరిత్ర సృష్టించేందుకు తహతహలాడుతున్న టీమిండియా... దానిని అడ్డుకుని పరువు కాపాడుకునే యత్నాల్లో ఉన్న ఆస్ట్రేలియా మధ్య గురువారం నుంచి ఇక్కడి సిడ్నీ క్రికెట్ మైదానం (ఎస్‌సీజీ)లో చివరి టెస్టు జరుగనుంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే భారత్ 2–1తో ముందంజలో ఉంది. దీనిలోనూ గెలిస్తే తిరుగులేని ఆధిక్యం (3–1)తో ఆస్ట్రేలియాలో తొలిసారి సిరీస్‌ను వశం చేసుకుంటుంది. 'డ్రా' అయినా గణాంకాల్లో తేడా తప్ప మన ఘనతేం తగ్గదు. అయితే, సొంత గడ్డపై ప్రత్యర్థికి ఇందుకు అవకాశం ఇవ్వకూడదని కంగారూలు భావిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ మ్యాచ్‌కు ఇరు జట్లు రెండేసి మార్పులతో బరిలో దిగే అవకాశం కనిపిస్తోంది.

**మార్పులు తప్పలే!**

కీలకమైన టెస్టుకు బ్యాటింగ్ బలంగా ఉండాలని భారత్ భావిస్తోంది. స్వదేశానికి వచ్చేసిన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ స్థానంలో పేస్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను కాకుండా ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను ఆడించనుండటమే దీనికి నిదర్శనం. దీంతో కర్ణాటక సహచరుడు మయాంక్ అగర్వాల్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా, ఆంధ్ర బ్యాట్స్‌మన్ హనుమ విహారి ఆరో స్థానంలో వస్తాడు. గాయపడిన పేసర్ ఇషాంత్ శర్మ బదులుగా ఉమేశ్ యాదవ్, కుల్దీప్ యాదవ్‌ల పేర్లను చేర్చింది. పిచ్ పరిస్థితిని బట్టి స్పిన్నర్ కుల్దీప్ వైపే మొగ్గుచూపొచ్చని తెలుస్తోంది. 13 మందిలో ఉన్నా, ఇంకా ఫిట్‌నెస్ సంతరించుకోని ఆఫ్ స్పిన్నర్ అశ్విన్‌ను బెంచ్‌కే పరిమితం చేయనున్నారు. ఇద్దరు పేసర్లు (బుమ్రా, షమీ), ఇద్దరు స్పిన్నర్లు (జడేజా, కుల్దీప్) వ్యూహంతో టీమిండియా బరిలో దిగనున్నట్లు కనిపిస్తోంది. ఎప్పటిలానే బ్యాటింగ్‌లో పుజారా, కోహ్లి, రహానే బాధ్యత మోయాల్సి ఉంటుంది. ఓపెనర్లు రాహుల్, మయాంక్‌తో పాటు విహారి, వికెట్ కీపర్ రిషభ్ పంత్ మంచి స్కోర్లు చేస్తే జట్టు భారీ స్కోరుకు బాటలు పడతాయి. అయితే, కొంతకాలంగా ప్రత్యర్థులకు కంగారు పుట్టిస్తున్న పేస్ త్రయంలో ఇషాంత్ దూరం కావడం లోటే. బుమ్రా, షమీ చక్కటి లయలో ఉన్నందున పెద్దగా ఆందోళన చెందాల్సిన పనిలేదు. అనూహ్యంగా కుల్దీప్ తేలిపోతే మాత్రం దీని ప్రభావం కనిపిస్తుంది. ముగ్గురు పేసర్లు తప్పనిసరి అనుకుంటే ఉమేశ్‌ను ఆడిస్తారు. పెర్త్‌లోనే ఆకట్టుకోలేని అతడు సిడ్నీలో ఏం చేస్తాడో చూడాలి.

**ఆసీస్‌దూ... అదే తీరుగా!**

ఆతిథ్య ఆస్ట్రేలియా సైతం మార్పులు తప్పని పరిస్థితుల్లో ఉంది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ ఆరోన్ ఫించ్‌పై వేటు వేసి... మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ హ్యాండ్స్‌కోంబ్‌ను తీసుకోనుంది. పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ స్థానంలో స్పిన్నర్ లబషేన్‌ను దింపుతోంది. మార్కస్ హారిస్‌కు తోడుగా ఉస్మాన్ ఖాజా ఓపెనింగ్‌కు వస్తాడు. అయితే, జట్టును బ్యాటింగ్ వైఫల్యం తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. షాన్ మార్ష్, ట్రావిస్ హెడ్ భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోతున్నారు. ఎన్నో అంచనాలు పెట్టుకున్న ఖాజా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. కెప్టెన్ టిమ్ పైన్, లోయరార్డర్‌లో స్టార్క్, కమిన్స్ కాస్తోకూస్తో పరుగులు చేస్తుండటంతో జట్టు పోరాడగలుగుతోంది. బౌలింగ్‌లో కమిన్స్ ప్రమాదకరంగా కనిపిస్తున్నాడు. ప్రధాన పేసర్లు మిషెల్ స్టార్క్, హాజల్‌వుడ్ నుంచి ఇంతవరకు మంచి ప్రదర్శన రాలేదు. పెర్త్‌లో ప్రతాపం చూపిన స్పిన్నర్ లయన్ మెల్‌బోర్న్‌లో లయ తప్పాడు. అతడిని భారత అరంగేట్ర ఓపెనర్ మయాంక్ ఆటాడుకున్నాడు. ఏమాత్రం అనుకూలత ఉన్నా చెలరేగే లయన్‌పై సిడ్నీలో ఓ కన్నేసి ఉంచాల్సిందే. లబషేన్ బ్యాటింగ్ సామర్థ్యం ఉపయోగపడుతుందని ఆసీస్ ఆశిస్తోంది.

**పిచ్, వాతావరణం**

మూడు రకాలుగా స్పందించే పిచ్ ఎదురవనుంది. తొలి రోజు పేసర్లకు... తర్వాత బ్యాట్స్‌మెన్‌కు... మూడో రోజు నుంచి స్పిన్‌కు అనుకూలించ వచ్చని తెలుస్తోంది. సిడ్నీలో ప్రస్తుతం వేడి వాతావరణం ఉంది. టెస్టు నాలుగు, ఐదో రోజు వర్ష సూచనలున్నాయి. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గు చూపొచ్చు.

**11**

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు సిడ్నీ మైదానంలో 11 టెస్టులు జరిగాయి. ఇందులో భారత్ ఒక విజయం (1978లో) సాధించగా... ఆస్ట్రేలియా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచింది. మరో ఐదు 'డ్రా'గా ముగిశాయి.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రాహుల్, మయాంక్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహానే, విహారి, పంత్, జడేజా, కుల్దీప్/ఉమేశ్, బుమ్రా, షమీ.
**ఆస్ట్రేలియా:** ఖాజా, హారిస్, షాన్ మార్ష్, హెడ్, హ్యాండ్స్‌కోంబ్, పైన్ (కెప్టెన్), లయన్, లబషేన్, స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్.

## సిరీస్ కోల్పోతామనే బెంగ లేదు!

**టిమ్ పైన్ వ్యాఖ్య**

**సిడ్నీ:** నాలుగో టెస్టులో భారత్ గెలిచినా లేదా 'డ్రా' చేసుకున్నా ఆస్ట్రేలియా గడ్డపై తొలి సిరీస్ విజయమవుతుంది. స్వదేశంలో టీమిండియాకు సిరీస్ కోల్పోయిన మొదటి ఆసీస్ కెప్టెన్‌గా టిమ్ పైన్ ఖాతాలో చెత్త రికార్డు చేరుతుంది. అయితే తాను దాని గురించి అతిగా ఆలోచించడం లేదని, జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చడంపైనే దృష్టి పెట్టినట్లు పైన్ చెబుతున్నాడు. 'మా ఆటను మెరుగుపర్చుకొని సాధ్యమైనంత ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం ముఖ్యం. మేం కూడా ప్రతీ టెస్టు గెలవాలని కోరుకుంటాం. కానీ అది సాధ్యం కాదు. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ జట్టును ఎదుర్కొంటున్నాం. సిరీస్ కోల్పోవడం గురించి నేను ఎక్కువగా ఆలోచించ లేదు. మా ఆటను బాగుపర్చడం, భారత్‌కు గట్టి పోటీనివ్వడమే ప్రస్తుతం నా లక్ష్యం' అని పైన్ పేర్కొన్నాడు.

## గెలిస్తే గొప్ప ఘనతవుతుంది!

- ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్‌పై కోహ్లి వ్యాఖ్య
- చరిత్రను పట్టించుకోనన్న భారత కెప్టెన్

**సిడ్నీ:** నాలుగేళ్ల క్రితం ధోని అనూహ్య రిటైర్మెంట్‌తో సిడ్నీలో జరిగిన చివరి టెస్టుతోనే కోహ్లి కెప్టెన్‌గా బాధ్యత చేపట్టాడు. ఆ సమయంలో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానంలో ఉన్న భారత్ కోహ్లి నాయకత్వంలో వరుస విజయాలు సాధించి నంబర్‌వన్‌గా ఎదిగింది. ఇప్పుడు 'టాప్' హోదాలో మరోసారి అదే మైదానానికి వచ్చిన కోహ్లి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవడం ఎంతో కష్టమని, ఇప్పుడు గనక దానిని సాధిస్తే అది చాలా పెద్ద ఘనత అవుతుందని వ్యాఖ్యానించాడు. 'నేను వరుసగా మూడో సారి ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చాను. ఇక్కడ సిరీస్ గెలుపు ఎంత కష్టమో నాకు బాగా తెలుసు. నా నాయకత్వంలో ఇక్కడి నుంచి భారత జట్టు కొత్త ప్రస్థానం మొదలైంది. ఇప్పుడు నంబర్‌వన్‌గా మళ్లీ వచ్చాం. దానిని కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాం. అందుకే సిరీస్ గెలిస్తే దానిని నేను మాత్రమే కాకుండా జట్టంతా గొప్ప ఘనతగా భావిస్తుంది' అని కోహ్లి అన్నాడు. తన దృష్టిలో గత రికార్డులకు ఎలాంటి విలువ లేదని, తాను చరిత్రను పట్టించుకోనని కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్లలో ఎప్పుడైనా గెలవాలనే కసి ఉండాలన్నాడు. 'మనకు ఏదైనా లక్ష్యం మాత్రమే ఉంటే ఒకటి రెండు మ్యాచ్‌ల తర్వాత అది ముగిసిపోతుంది. కానీ ఎప్పుడైనా గెలవాలనే కసి ఉంటే మాత్రం అది ఆగిపోదు. మెల్‌బోర్న్ టెస్టులో గెలిచిన క్షణాన ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారితో సహా ప్రతీ ఒక్కరు తమ భావోద్వేగాలు ప్రదర్శించారు. అందరిలోనూ ఒక రకమైన కసి అక్కడ కనిపించింది. నిజాయతీగా చెప్పాలంటే గతంలో ఏం జరిగిందనేది అనవసరం. నేను వర్తమానంపైనే దృష్టి పెట్టి పని చేస్తా' అని కోహ్లి కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ఆస్ట్రేలియాలో సిరీస్ విజయంతో తాను ఏదో నిరూపించుకోవాలని భావించడం లేదన్న భారత కెప్టెన్... కొత్త సంవత్సరాన్ని గెలుపుతో ప్రారంభిస్తామని విశ్వాసం వ్యక్తం చేశాడు.

**అశ్విన్ గాయం కొత్తది కాదు!**

వరుసగా రెండు విదేశీ పర్యటనల్లోనూ ప్రధాన స్పిన్నర్ అశ్విన్ ఒకే తరహా గాయంతో బాధపడుతున్నాడని, దీనికి పరిష్కారం చూడాల్సి ఉందని కోహ్లి వ్యాఖ్యానించాడు. 'ఇంగ్లండ్‌లో, ఇప్పుడు ఆస్ట్రేలియాలో కూడా అశ్విన్‌కు ఒకే తరహా గాయం ఉండటం దురదృష్టకరం. దీనికి చికిత్స తీసుకోవడంపై అతను దృష్టి పెట్టాడు. ఫిజియో, ట్రైనర్ కూడా అందుకు సహకరిస్తున్నారు. టెస్టు క్రికెట్‌లో అతను ఎంత కీలకమో తెలుసు కాబట్టి 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నాం. సరైన సమయంలో కోలుకోలేకపోతున్నందుకు అశ్విన్ కూడా బాధపడుతున్నాడు' అని కోహ్లి చెప్పాడు. మరోవైపు ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి బౌలింగ్‌పై కెప్టెన్ ప్రశంసలు కురిపించాడు. నిజానికి అశ్విన్ గైర్హాజరులో ఆఫ్ స్పిన్ లోటు కనిపించడం లేదని, విహారి పార్ట్‌టైమర్‌గానే ఆ పని చేస్తున్నాడని కోహ్లి చెప్పాడు. అతనికి ఎప్పుడు అవకాశం ఇచ్చినా అద్భుతంగా బౌలింగ్ చేస్తూ తమకు మంచి ప్రత్యామ్నాయంగా మారాడని కోహ్లి అభిప్రాయం వ్యక్తం చేశాడు.

## 'దిగ్గజ గురువు' అస్తమయం

- కన్ను మూసిన కోచ్ అచ్రేకర్
- సచిన్, కాంబ్లీలను తీర్చిదిద్దిన శిక్షకుడు


తన భారతరత్న పురస్కారాన్ని అచ్రేకర్‌కు చూపుతున్న సచిన్ (ఫైల్)

**ముంబై:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పాటు అనేక మంది అంతర్జాతీయ, ఫస్ట్ క్లాస్ ఆటగాళ్లను దేశానికి అందించిన ప్రముఖ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ కన్ను మూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. గత కొంత కాలంగా అచ్రేకర్ అనారోగ్యంతో బాధపడుతున్నారని, బుధవారం సాయంత్రం ఆయన మృతి చెందారని కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆటగాడిగా తన కెరీర్‌లో అచ్రేకర్ ఒకే ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. 1964లో హైదరాబాద్‌లో జరిగిన మొయినుద్దౌలా గోల్డ్‌కప్ టోర్నీలో భాగంగా హెచ్‌సీఏ ఎలెవన్‌తో జరిగిన పోరులో ఆయన ఎస్‌బీఐ తరఫున బరిలోకి దిగారు. కొంత కాలం ముంబై సెలక్టర్‌గా కూడా పని చేశారు. సచిన్‌తో పాటు ఆయన వద్ద శిక్షణ పొందిన వారిలో వినోద్ కాంబ్లీ, ప్రవీణ్ ఆమ్రే, సమీర్ దిఘే, బల్విందర్ సింగ్ సంధూ, చంద్రకాంత్ పండిత్, అజిత్ అగార్కర్, రమేశ్ పొవార్ అంతర్జాతీయ క్రికెటర్లుగా ఎదిగారు. శిక్షకుడిగా సేవలకుగాను 1990లో 'ద్రోణాచార్య' అవార్డు అందుకున్న అచ్రేకర్‌కు 2010లో 'పద్మశ్రీ' పురస్కారం దక్కింది.

**సచిన్‌కు ఓనమాలు...**

దాదర్ ప్రాంతంలోని శివాజీ పార్క్‌లో అచ్రేకర్ క్రికెట్ అకాడమీ ఉండేది. ఆయన ఎంత మందికి శిక్షణ నిచ్చినా 'సచిన్ గురువు'గానే క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంది. సచిన్ కూడా తన సుదీర్ఘ కెరీర్‌లో లెక్క లేనన్ని సార్లు తన గురువును గుర్తు చేసుకునేవాడు. ఓనమాలు నేర్పిన నాటినుంచి తన చివరి టెస్టు ఆడే వరకు ప్రతీ దశలో ఆయన పాత్ర, ప్రభావం గురించి చెప్పడం టెండూల్కర్ ఏనాడూ మర్చిపోలేదు. క్రికెట్‌లో ఎదగాలంటే అప్పటి వరకు చదువుతున్న న్యూ ఇంగ్లీష్ స్కూల్ నుంచి శారదాశ్రమ్ విద్యామందిర్‌కు మారమని అచ్రేకరే తన శిష్యుడికి సూచించారు. ప్రతి ఏటా గురుపూర్ణిమ రోజున తన గురువును కలిసి ఆశీర్వచనాలు తీసుకోవడం సచిన్ అలవాటుగా మార్చుకున్నాడు.

> సర్ శిక్షణ ఇచ్చిన చాలా మంది విద్యార్థుల్లాగే నేను కూడా ఆయన దగ్గరే క్రికెట్‌లో ఏబీసీడీలు నేర్చుకున్నాను. నా జీవితంలో ఆయన పోషించిన పాత్ర గురించి మాటల్లో చెప్పడం కష్టం. ఆయన వేసిన పునాదిపైనే నేను నిలబడ్డాను. సర్ వద్ద శిక్షణ తీసుకున్న మరికొందరితో కలిసి గత నెలలో ఆయనను కలిశాం. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపాం. నేరుగా ఆడటమే కాదు తప్పులు చేయకుండా నిజాయతీగా బతకడం కూడా అచ్రేకర్ సర్ నేర్పించారు. మీ కోచింగ్‌తో మమ్మల్ని మీలో ఒకడిగా చేసుకున్నందుకు కృతజ్ఞతలు. జీవితంలోనూ చాలా బాగా ఆడారు సర్. మీరు ఎక్కడ ఉన్నా కోచింగ్ ఇస్తూనే ఉంటారు. మీ వల్ల స్వర్గంలో కూడా క్రికెట్ వికసిల్లుతుంది.
>
> – సచిన్ టెండూల్కర్ నివాళి

## ఆంధ్రకు 3 పాయింట్లు

**సాక్షి, విజయనగరం:** హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. ఆట చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 33/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 5 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. కెప్టెన్ అక్షత్ రెడ్డి (98 బంతుల్లో 65; 10 ఫోర్లు, సిక్స్), హిమాలయ్ అగర్వాల్ (93 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సందీప్ (45; 5 ఫోర్లు), ఠాకూర్ తిలక్ వర్మ (34; 6 ఫోర్లు) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో షోయబ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కగా... బండారు అయ్యప్ప, గిరినాథ్ రెడ్డి, పృథ్వీ రాజ్ ఒక్కో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన ఆంధ్రకు 3 పాయింట్లు దక్కగా... హైదరాబాద్‌కు 1 పాయింట్ లభించింది. ఆంధ్ర బ్యాట్స్‌మన్ శ్రీకర్ భరత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం దక్కింది. ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర 11 పాయింట్లతో గ్రూప్ 'బి'లో చివరిదైన తొమ్మిదో స్థానంలో ఉంది. ఈనెల 7 నుంచి ఇండోర్‌లో జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర ఆడుతుంది. మరోవైపు నిర్ణీత 8 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 17 పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది.

## 'అమ్మ'యినా... సాగిపోవచ్చు!

**పనిచేసే మాతృమూర్తులే తనకు స్ఫూర్తి అన్న సెరెనా**



**పెర్త్:** అమ్మంటే అనుబంధం... అమ్మయితే ఆనందం... పనిచేసే మహిళలు అమ్మ హోదా వచ్చాక బిడ్డను చూసుకునేందుకు ఇంటి వద్దే ఆగిపోకుండా తమ వృత్తిగత జీవితంలో ముందుకు సాగిపోతున్నారని... రెంటికి న్యాయం చేస్తున్న అలాంటి తల్లులే నాకు స్ఫూర్తి అంటోంది అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్. మంగళవారం హాప్‌మన్ కప్ టీమ్ ఈవెంట్‌లో స్విట్జర్లాండ్ జట్టుతో తలపడే ముందు ఆమె తన గారాలపట్టి ఒలింపియాను భుజంపై ఎత్తుకునే వార్మప్ చేసింది. దీనికి సంబంధించిన ఫొటోల్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టింది. దీనికి స్ఫూర్తిదాయక సందేశాన్ని జతచేసింది. 'మాతృమూర్తులకు ఏదైనా సాధ్యమే. అమ్మతనానికి అడ్డువుండదు. నేనైతే కొత్త ఏడాదిలో తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నా. నా చిట్టితల్లి మాత్రం నా ఒడిలోనే నిద్రపోతోంది. అలాగని కసరత్తు ఆపలేను. కుమార్తెనూ దించలేను. ఈ విషయంలో పనిచేసే తల్లిదండ్రులే నాకు ప్రేరణ. చంటి బిడ్డల తల్లులు చేస్తున్న ఉద్యోగాలు... పడుతున్న కష్టాలు విన్నప్పుడు, చదివినపుడు నేను కూడా అలా చేయగలను అనిపించింది. ఇలా వారు జీవితంలో చేస్తున్న పోరాటానికి నా వందనం' అని సెరెనా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది.

## మళ్లీ ఓడిన ఢిల్లీ డాషర్స్


సాయిప్రణీత్

**అహ్మదాబాద్:** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఢిల్లీ డాషర్స్ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఓడింది. బుధవారం జరిగిన పోరులో బెంగళూరు రాప్టర్స్ 2–1తో ఢిల్లీ డాషర్స్‌పై నెగ్గింది. ముందుగా ఒకరి ట్రంప్ మ్యాచ్‌ను మరొకరు గెలవడంతో ఈ పోటీలో రెండు మ్యాచ్‌లు ముగిసినా కూడా స్కోరు 0–0గానే ఉండిపోయింది. ఢిల్లీ 'ట్రంప్' మ్యాచ్‌లో ప్రణయ్ 12–15, 15–14, 13–15తో సాయిప్రణీత్ (బెంగళూరు) చేతిలో కంగు తినగా... బెంగళూరు 'ట్రంప్' మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎలిస్–లారెన్ స్మిత్ జంట 13–15, 9–15తో జొంగ్జిత్–కొసెట్స్‌కయా (ఢిల్లీ) ద్వయం ముందు తలవంచింది. తర్వాత రెండో పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ (బెంగళూరు) 15–6, 12–15, 15–10తో సుగియార్తో (ఢిల్లీ)పై... మహిళల సింగిల్స్‌లో తిత్రంగ్ వు 12–15, 15–3, 15–8తో చియా సిన్ లీపై నెగ్గడంతో రాప్టర్స్ విజయం ఖాయమైంది. చివరగా జరిగిన పురుషుల డబుల్స్‌లో బియావో–జొంగ్జిత్ (ఢిల్లీ)15–7, 11–15, 15–14తో అహ్సాన్–సెతియవాన్ (బెంగళూరు)పై నెగ్గారు.

సాక్షి బిజినెస్
గురువారం 3-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| తగ్గుదల | 363 | 118 |
| ముగింపు | 35,891 | 10,793 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (రాత్రి 11.30గం.లకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 6,640 | 5 |
| డోజోన్స్ | 23,265 | 62 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,734 | 6 |
| డాక్స్ | 10,580 | 21 |
| షాంఘై | 2,465 | 28 |
| నికాయ్ (శుక్రవారం ముగింపు) | 20,015 | 63 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు రూ. లలో**

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | [illegible] | 68.84 | 70.48 |
| £ | బ్రిటన్ పౌండ్ | [illegible] | 87.08 | 90.21 |
| € | యూరో | [illegible] | 78.31 | 81.23 |
| ¥ | జపాన్ ఎన్ (100) | [illegible] | 62.49 | 64.87 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | [illegible] | 47.84 | 50.04 |
| SS | సింగపూర్ డాలర్ | [illegible] | 50.16 | 51.92 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 17.03 | 20.45 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | -- | -- |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 9.15 | 10.85 |

# మరో మెగా బ్యాంక్ రెడీ..!

## బీవోబీలో విజయ, దేనా బ్యాంకుల విలీనానికి కేంద్రం ఓకే

### మూడో అతి పెద్ద బ్యాంక్ ఏర్పాటు • ఏప్రిల్ 1 నుంచి కార్యకలాపాలు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగంలో మరో భారీ బ్యాంక్ ఏర్పాటుకు ముహూర్తం ఖరారయ్యింది. బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)లో విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీన ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఈ మూడు బ్యాంకుల విలీనంతో ఉద్యోగుల సర్వీస్ విషయంలో ఎలాంటి మార్పులు ఉండబోవని, సిబ్బంది తొలగింపు చర్యలుండవని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ విలేకరులకు చెప్పారు. 'ఈ విలీనంతో ఉద్యోగుల సర్వీస్ కండీషన్స్‌పై ప్రతికూల ప్రభావం ఉండదు. అలాగే, ఉద్యోగుల తొలగింపు చర్యలూ ఉండవు. కస్టమర్ల సంఖ్య పెరగడంతో పాటు మార్కెట్, నిర్వహణ సామర్థ్యాలు, పథకాల విస్తృతి, కస్టమర్లకు సేవలు గణనీయంగా మెరుగుపడతాయి. నెట్‌వర్క్, చౌక డిపాజిట్లు మొదలైనవి విలీన బ్యాంకుకు లాభిస్తాయి' అని ఆయన వివరించారు. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా బీవోబీని తీర్చిదిద్దే లక్ష్యంతో 3 బ్యాంకుల విలీన నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ మూడింటి విలీనం అమల్లోకి వస్తుంది. దీంతో ప్రభుత్వ రంగంలోని బ్యాంకుల సంఖ్య 19కి తగ్గుతుంది. విలీన స్కీమును ఈ శీతాకాల సమావేశాల్లోనే సభ్యుల పరిశీలనకు పార్లమెంటు ముందు 30 రోజులు ఉంచనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలు జనవరి 8తో ముగుస్తాయి.

**ప్రభుత్వ రంగంలో రెండో పెద్ద బ్యాంక్..**

విలీనానంతరం ఏర్పడే కొత్త బ్యాంక్ రూ.14.82 లక్షల కోట్ల వ్యాపార పరిమాణంతో ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రైవేట్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ తర్వాత దేశంలోనే మూడో అతి పెద్ద బ్యాంక్‌గా అవతరిస్తుంది. ప్రభుత్వ రంగంలో రెండో అతి పెద్ద బ్యాంకుగా నిలుస్తుంది. విలీన బ్యాంక్ నికర మొండిబకాయిల నిష్పత్తి 5.71% స్థాయిలో ఉండనుంది. మిగతా ప్రభుత్వ రంగ బ్యాంకుల సగటు 12.13 శాతంగా ఉంది. ఇక క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తి (సీఏఆర్) కూడా నియంత్రణ సంస్థ నిర్దేశిత 10.87 శాతం కన్నా అధికంగా 12.25 శాతం స్థాయిలో ఉంటుంది. అయిదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంక్ విలీనంతో ఎస్‌బీఐ ప్రపంచంలోనే టాప్ 50 బ్యాంకుల్లో ఒకటిగా మారిన సంగతి తెలిసిందే. అదే కోవలో బీవోబీని కూడా మెగా బ్యాంక్‌గా తీర్చిదిద్దే ఉద్దేశంతో విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌లను అందులో విలీనం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సారథ్యంలోని ప్రత్యామ్నాయ యంత్రాంగం గతేడాది సెప్టెంబర్‌లో నిర్ణయం తీసుకుంది. మైనారిటీ షేర్‌హోల్డర్ల అభ్యంతరాలేమైనా ఉంటే పరిష్కరించేందుకు ముంబై హైకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రమోద్ కడే సారథ్యంలో ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.




### షేర్ల స్వాప్ నిష్పత్తి ఖరారు..




విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌లను విలీనం చేసుకోనున్న బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ).. తాజాగా షేర్ల మార్పిడి నిష్పత్తిని నిర్ణయించింది. విలీన ప్రతిపాదన ప్రకారం.. విజయ బ్యాంక్ షేర్‌హోల్డర్లకు సంబంధించి ప్రతి 1,000 షేర్లకు బీవోబీ షేర్లు 402 లభిస్తాయి. అటు దేనా బ్యాంక్ విషయానికొస్తే.. ప్రతి 1,000 షేర్లకు 110 బీవోబీ షేర్లు లభిస్తాయి. బీవోబీ, దేనా బ్యాంక్‌ల బోర్డులు షేర్ల స్వాప్ నిష్పత్తి ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశాయి. బుధవారం బీఎస్‌ఈలో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 3.16 శాతం క్షీణించి రూ. 119.40 వద్ద, దేనా బ్యాంక్ షేరు 0.28 శాతం క్షీణించి రూ.17.95 వద్ద ముగియగా.. విజయ బ్యాంక్ షేరు స్వల్పంగా 0.29 శాతం లాభపడి రూ. 51.05 వద్ద క్లోజయ్యింది. ఈ ధరల ప్రకారం చూస్తే.. దేనా బ్యాంక్ షేర్‌హోల్డర్లకు రూ.17,950 విలువ చేసే షేర్లకు బదులుగా రూ.13,134 విలువ చేసే బీవోబీ షేర్లు లభిస్తాయి. అలాగే విజయ బ్యాంక్ షేర్‌హోల్డర్లకు రూ.51,050 విలువ చేసే 1,000 షేర్లకు గాను రూ.47,998.80 విలువ చేసే బీవోబీ షేర్లు 402 లభిస్తాయి.

### ఎగుమతి వర్తకులకు వడ్డీ రాయితీ..

ఎగుమతులను మరింతగా ప్రోత్సహించే క్రమంలో ఎగుమతి వర్తకులకు 3 శాతం మేర వడ్డీ రాయితీ కల్పించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందుకు రూ.600 కోట్ల మేర వ్యయం కానుంది. దీనికి సంబంధించి కేంద్ర వాణిజ్య శాఖ చేసిన ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రధానంగా లఘు, చిన్న, మధ్య తరహా (ఎంఎస్‌ఎంఈ) సంస్థల ఉత్పత్తులు, వ్యవసాయ, హస్తకళలు, జౌళి, తోలు, యంత్రపరికరాల సంస్థలు తయారు చేసే సుమారు 416 ఉత్పత్తులు ఈ పరిధిలోకి వస్తాయి. వడ్డీ రాయితీ స్కీములో ఎగుమతి వర్తకుల్ని కూడా చేర్చడంతో వారు మరింతగా ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహం లభించగలదని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. తద్వారా ఎంఎస్‌ఎంఈల్లో ఉత్పత్తి పెరిగి, మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. తయారీ ఎగుమతిదారుల కోసం 2015 ఏప్రిల్‌లో వడ్డీ రాయితీ పథకాన్ని అయిదేళ్ల వ్యవధికి కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే, ఇందులో వర్తక ఎగుమతిదారులకు చోటు కల్పించలేదు. తాజాగా వీరిని కూడా ఈ స్కీమ్‌లో చేర్చింది. రుణాలు తక్కువ వడ్డీకే లభించడం వల్ల ఎగుమతిదారులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ గణేష్ కుమార్ గుప్తా చెప్పారు. మరోవైపు, తయారీ ఎగుమతిదారుల తరహాలోనే ఎగుమతుల వృద్ధిలో కీలకపాత్ర పోషించే వర్తక ఎగుమతిదారులను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఫరీదా గ్రూప్ చైర్మన్ రఫీక్ అహ్మద్ పేర్కొన్నారు.



## నిర్మాణంలోని ఇళ్లు, ఫ్లాట్లపై జీఎస్‌టీ తగ్గింపు?

- 5%కి పరిమితం చేసే అవకాశం
- ఈ నెల 10న జీఎస్‌టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం?
- రూ.75 లక్షలలోపు టర్నోవరుండే వ్యాపారులకు మినహాయింపు!




**న్యూఢిల్లీ:** నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఫ్లాట్లపై జీఎస్‌టీని 5 శాతానికి పరిమితం చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రతిపాదనపై జీఎస్‌టీ కౌన్సిల్ ఈ నెల 10న జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటుందని విశ్వసనీయంగా తెలిసింది. డిసెంబర్ 22న జరిగిన చివరి సమావేశంలో కౌన్సిల్ 23 రకాల వస్తు, సేవలపై పన్ను భారాన్ని తగ్గించటం తెలిసిందే. జీఎస్‌టీ కౌన్సిల్ 32వ భేటీ ఈ నెల 10న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జరగనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. నివాసిత గృహాలపై పన్ను క్రమబద్ధీకరణను తదుపరి సమావేశంలో పరిశీలించనున్నట్టు జైట్లీ గతంలోనే చెప్పారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లు లేదా నిర్మాణం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్స్‌పై.... వాటి నిర్మాణం పూర్తయినట్టు సర్టిఫికెట్ జారీ కాకపోతే 12 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. పూర్తయినట్టు సర్టిఫికెట్ తీసుకుంటే, కొనుగోలుదారులపై ప్రస్తుతం జీఎస్‌టీ లేదు. అయితే, భవన నిర్మాణంలో భాగంగా వినియోగించిన ఉత్పత్తులపై బిల్డర్లు అప్పటికే పన్నులు చెల్లించి ఉంటారు కనుక ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకుంటే వాస్తవ పన్ను 5–6 శాతం మధ్యే ఉంటుంది. అయితే, బిల్డర్లు ఈ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను వినియోగదారులకు బదిలీ చేయడం లేదు. దీంతో కొనుగోలు దారులపై అధిక పన్ను పడుతోంది. ఈ నేపథ్యంలో... బిల్డర్లు నమోదిత డీలర్ల నుంచి భవన నిర్మాణం కోసం 80% ఉత్పత్తులు కొనుగోలు చేసి ఉంటే, వాటిపై 5% జీఎస్‌టీనే విధించాలన్నది తాజా ప్రతిపాదనగా అధికార వర్గాలు తెలిపాయి.

**చిన్న వ్యాపారులకు ఊరట లభించేనా?**


ప్రస్తుతం జీఎస్టీ జీఎస్‌టీ విధానం కింద వార్షికంగా రూ.20 లక్షల టర్నోవర్ కలిగిన వ్యాపారులకు పన్ను మినహాయింపు ఉంది. దీన్ని రూ.75 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదనపైనా జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోనుంది. విపత్తు సెస్సుతోపాటు చిన్న సరఫరాదారులకు కాంపోజిషన్ స్కీమ్‌ను కౌన్సిల్ పరిశీలించనుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే లాటరీలపై 12% జీఎస్‌టీ, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో నడిచే లాటరీలపై 28% జీఎస్‌టీ అమలవుతోంది. వీటిని యథావిధిగా కొనసాగించడం లేదా మార్చడం చేయవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

### హెటెరో చేతికి స్పెయిన్ కంపెనీ టార్బిస్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ కంపెనీ హెటెరో ల్యాబ్స్... స్పెయిన్‌కు చెందిన టార్బిస్ ఫార్మాను కైవసం చేసుకుంది. ఫార్మా, కెమికల్స్ రంగంలో ఉన్న గ్రూపో ఫెర్రర్ ఇంటర్నేషనల్ నుంచి స్పెయిన్‌లోని హెటెరో అనుబంధ సంస్థ అయిన అమెరాక్స్ ఈ కంపెనీని కొనుగోలు చేసింది. విస్తృత శ్రేణి ఉత్పత్తులు, విస్తారమైన మార్కెటింగ్ నెట్‌వర్క్ టార్బిస్ ఫార్మా సొంతం. స్పెయిన్‌లో రిటైల్, హాస్పిటల్, టెండర్ వ్యాపారంలో విస్తరించేందుకు తాజా డీల్ దోహదం చేస్తుందని హెటెరో ఈడీ ఎ.వి.నరసారెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 126 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న హెటెరోకు ప్రపంచవ్యాప్తంగా 36 తయారీ కేంద్రాలున్నాయి.

### రెండు టెల్కోలకు మాత్రమే పెరిగిన సబ్‌స్క్రైబర్లు



**న్యూఢిల్లీ:** గతేడాది అక్టోబర్‌లో రెండు టెలికం సంస్థలు మాత్రమే సబ్‌స్క్రైబర్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోగలిగినట్లు నియంత్రణ సంస్థ ట్రాయ్ వెల్లడించింది. రిలయన్స్ జియో కోటి మందికి మించి కస్టమర్లను, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ 3.66 లక్షల కస్టమర్లను జత చేసుకున్నట్లు వెల్లడించింది. వోడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్, ఎంటీఎన్ఎల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కలిపి 1.01 కోట్ల సబ్‌స్క్రైబర్లను కోల్పోయాయి. మొత్తం యూజర్ బేస్ 119.2 కోట్లుగా ఉంది.

## అటూఇటుగా బైక్‌ల విక్రయాలు..



**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహన విక్రయాలు 2018 డిసెంబర్లో మిశ్రమంగా నిలిచాయి. పలు సంస్థల అమ్మకాలు 30 శాతానికి మించి వృద్ధిరేటు నమోదు చేయగా.. మరికొన్ని కంపెనీలు సవాళ్లను ఎదుర్కొన్నాయి. అత్యధిక వాల్యూమ్స్‌ను నమోదు చేస్తున్న హీరో మోటోకార్ప్ దేశీ అమ్మకాలు 4 శాతం తగ్గాయి. ఈ అంశంపై స్పందించిన సంస్థ చైర్మన్ పవన్ ముంజాల్.. 'లిక్విడిటీ (నగదు లభ్యత) కొరత, పెరిగిన ద్విచక్ర బీమా అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.' అని వ్యాఖ్యానించారు. ఇక రాయల్ ఎన్‌ఫీల్డ్ దేశీ అమ్మకాలు 13 శాతం తగ్గినప్పటికీ.. అంతర్జాతీయ అమ్మకాలు 41 శాతం వృద్ధి చెందాయి. ఇదే సమయంలో సుజుకీ మోటార్‌సైకిల్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 33.82 శాతం, ఏప్రిల్–డిసెంబర్ కాలంలో 30 శాతం పెరిగాయి. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.5 లక్షల యూనిట్ల విక్రయాలు జరగాలనేది సంస్థ లక్ష్యంగా కాగా, ఇప్పటివరకు 5,45,683 యూనిట్లను విక్రయించాం.' అని ఎస్ఎంఐపీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సతోషి ఉచిడా అన్నారు. మరోవైపు బజాజ్ ఆటో గతనెల మొత్తం విక్రయాలు 18 శాతం, దేశీ అమ్మకాలు 31 శాతం, ఎగుమతులు 16 శాతం వృద్ధి రేటును నమోదుచేశాయి. టీవీఎస్ మోటార్ మొత్తం విక్రయాల్లో 6 శాతం, దేశీ అమ్మకాల్లో ఒక శాతం, ఎగుమతుల్లో 22 శాతం పెరిగాయి. ఈ సంస్థ స్కూటర్ విక్రయాలు 9 శాతం పెరిగి 91,480 యూనిట్లుగా నిలిచాయి.

**ఫోర్డ్ అమ్మకాలు 14.8% అప్**

2018 డిసెంబర్ దేశీ అమ్మకాలు 5,840 యూనిట్లుగా ఉన్నట్లు ఫోర్డ్ ఇండియా సంస్థ తెలిపింది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 5,087 యూనిట్ల విక్రయాలు జరగ్గా.. ఏడాది ప్రాతిపదికన 14.8% వృద్ధి నమోదైనట్లు వెల్లడించింది. అయితే, ఎగుమతులు 24.8 శాతం తగ్గిన కారణంగా.. గత నెల మొత్తం అమ్మకాల్లో 18 శాతం క్షీణత నమోదైనట్లు వివరించింది.

**జీఎస్‌టీని తగ్గించాలి..**

ప్రస్తుతం కేవలం కొన్ని వస్తు, సేవలపై మాత్రమే 28% జీఎస్‌టీ రేటు అమల్లో ఉండగా.. ఈ క్యాటగిరీలో ద్విచక్ర వాహనాలూ ఉన్నాయని పవన్ ముంజాల్ వ్యాఖ్యానించారు. విలాస వస్తువులపై ఉండే ఈరేటును సామాన్యులు వినియోగించే బైక్‌లపై విధించడం సరికాదన్నారు. త్వరలోనే బీఎస్ సిక్స్ ఉద్గార నిబంధనలు అమలుకానుండగా.. ఈ నిర్ణయం తరువాత బైక్‌ల ధరలు మరింత పెరగనున్నట్లు తెలిపారు. ఈ అంశాలను పరిగణలోనికి తీసుకుని ద్విచక్రవాహనాలపై జీఎస్‌టీ రేటును 18%కి తగ్గించాలని కోరారు.

**సోనాలికా ట్రాక్టర్ విక్రయాలు 12% పెరిగాయి**

గతనెల్లో ట్రాక్టర్ల అమ్మకాలు 5,052 యూనిట్లుగా సంస్థ ప్రకటించింది. అంతక్రితం ఏడాది డిసెంబర్‌తో పోల్చితే 11.9% పెరిగాయి. ఎగుమతులు 26 శాతం, మొత్తం అమ్మకాలు 14% వృద్ధి చెందాయి.

**డిసెంబర్ ద్విచక్ర వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2018 | 2017 | వృ/క్షీ.(%) |
|---|---|---|---|
| సుజుకీ మోటార్‌సైకిల్ | 43,874 | 32,786 | 34 |
| బజాజ్ ఆటో | 2,98,855 | 2,28,762 | 31 |
| టీవీఎస్ మోటార్ | 2,09,906 | 2,07,739 | 1 |
| హీరో మోటోకార్ప్ | 4,53,985 | 4,72,731 | –4 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 58,278 | 66,968 | –13 |

### పార్లమెంటు ముందుకు ఆధార్ చట్ట సవరణ బిల్లు

**న్యూఢిల్లీ:** బయోమెట్రిక్ ఐడీ ఆధార్ చట్ట సవరణ బిల్లును కేంద్రం బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవి శంకర్ ప్రసాద్ దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బ్యాంక్ ఖాతా, మొబైల్ కనెక్షన్లు మొదలైనవి పొందడానికి వినియోగదారులు గుర్తింపు ధృవీకరణ పత్రం కింద ఆధార్‌ను స్వచ్ఛందంగా మాత్రమే ఇచ్చేలా ఇందులో ప్రతిపాదనలున్నాయి. ఆధార్ ఇవ్వడానికి ఇష్టపడని వారికి బ్యాంకు ఖాతా, సిమ్ కార్డులు మొదలైన సర్వీసులు అందించకుండా ఆయా సంస్థలు నిరాకరించడానికి ఉండదు. స్వచ్ఛందంగా ఆధార్ నంబర్ ఇచ్చిన వారి బయోమెట్రిక్ వివరాలను సర్వీస్ ప్రొవైడర్లు తమ సర్వర్లలో భద్రపర్చుకోరాదు. అలాగే, ఆధార్‌ను దుర్వినియోగం చేసే కంపెనీలపై రూ.1 కోటిదాకా జరిమానా, నిబంధనలు ఉల్లంఘన జరిగినంత కాలం రోజుకు రూ.10 లక్షల దాకా అదనంగా పెనాల్టీ విధించేందుకు యూఐడీఏఐకి అధికారాలు లభించనున్నాయి. ప్రతిపాదిత ప్రయోజనాల కోసం ఈ బిల్లు కింద ఆధార్ చట్టం 2016తో పాటు ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885, మనీ లాండరింగ్ నిరోధక చట్టం 2002ని కూడా సవరించనున్నారు.



## ఎస్‌బీఐ లైఫ్ – సిండికేట్ బ్యాంక్ జట్టు

**బ్యాంక్ అష్యూరెన్స్ ఒప్పందం**




**బెంగళూరు:** సిండికేట్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌ల మధ్య బ్యాంక్‌అష్యూరెన్స్ ఒప్పందం కుదిరింది. ఖాతాదారులకు సమగ్రమైన ఫైనాన్షియల్ ప్లానింగ్ సొల్యూషన్‌ను అందించడానికి ఈ ఒప్పం దం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థలు వెల్లడించాయి. ఈ ఒప్పందంపై సిండికేట్ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ మృత్యుంజయ్ మహాపాత్ర, ఎస్‌బీఐ లైఫ్ సీఈఓ, ఎమ్‌డీ సంజీవ్ నౌతియాల్ సంతకాలు చేశారు. దేశవ్యాప్తంగా 3,000 బ్రాంచ్‌లతో సేవలందిస్తున్న సిండికేట్ బ్యాంక్ తన బ్రాంచ్‌ల ద్వారా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు చెందిన పాలసీలను విక్రయిస్తుంది.

**ఎసాప్స్ ద్వారా రూ.500 కోట్లు...**

ఎంప్లాయీ స్టాక్ పర్చేజ్ స్కీమ్ (ఎసాప్స్) కింద ఉద్యోగులకు షేర్లు జారీ చేసి రూ.500 కోట్లు సమీకరించనున్నామని సిండికేట్ బ్యాంక్ తెలిపింది.



# చేతులెత్తేసిన జెట్ ఎయిర్‌వేస్

- రుణాల చెల్లింపుల్లో డిఫాల్ట్
- డిసెంబర్ 31 వాయిదాలకు చెల్లింపుల్లేవు
- నగదు ప్రవాహాల్లో అంతరాలే కారణమని ప్రకటన
- రేటింగ్ డౌన్ గ్రేడ్ చేసిన ఇక్రా; షేరు 6 శాతం పతనం



**న్యూఢిల్లీ:** కొన్ని త్రైమాసికాలుగా భారీ నష్టాలను చవిచూస్తూ... ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి సైతం ఇబ్బందులు పడుతున్న జెట్ ఎయిర్‌వేస్‌కు కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. తీసుకున్న రుణాలకు వాయిదాలను చెల్లించడంలో సంస్థ విఫలమైంది. ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని దేశీయ బ్యాంకుల కన్సార్షియానికి రుణంలో అసలును, వడ్డీని కలిపి డిసెంబరు 31న చెల్లించాల్సిన వాయిదాలు చెల్లించలేకపోయింది. తాత్కాలిక నగదు ప్రవాహాల్లో తారతమ్యాలే దీనికి కారణమని జెట్ ఎయిర్‌వేస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. రుణ చెల్లింపులకు సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపింది. జెట్ ఎయిర్‌వేస్ ఖాతాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎస్‌బీఐ ఇప్పటికే ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశించింది. వరుసగా గత మూడు త్రైమాసికాలుగా జెట్‌ఎయిర్‌వేస్ రూ.1,000 కోట్లకుపైగా నష్టాలను ప్రకటిస్తూ వస్తోంది. నష్టాల తగ్గింపు చర్యల్లో భాగంగా కొంత మంది ఉద్యోగులను తొలగించింది. లాభదాయకం కాని మార్గాల్లో సర్వీసులను కూడా నిలిపివేసింది. కాగా, మూలధన అవసరాల కోసం, కొన్ని రకాల చెల్లింపులకు రూ.1,500 కోట్ల మేర స్వల్పకాలిక రుణం తీసుకునే ప్రయత్నాలను సంస్థ ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి.

**రేటింగ్ తగ్గింపు**

జెట్‌ఎయిర్‌వేస్ దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణ సదుపాయాల రేటింగ్‌ను తగ్గిస్తున్నట్టు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా బుధవారం ప్రకటించింది. ''యాజమాన్యం నుంచి లిక్విడిటీ పెంపు చర్యల అమలులో జాప్యం నెలకొంది. దీంతో లిక్విడిటీ సమస్య తీవ్రతరం అయింది. కంపెనీ ఇప్పటికే ఉద్యోగుల వేతనాల చెల్లింపులు, విమానాల అద్దె చెల్లింపులనూ ఆలస్యం చేస్తోంది''అని ఇక్రా తన నిర్ణయం వెనుక కారణాలను తెలియజేసింది. జెట్ ఎయిర్‌వేస్ 2018 డిసెంబర్ నుంచి 2019 మార్చి వరకు రూ.1,700 కోట్ల మేర, 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.2,444 కోట్లు, రూ.2020–21లో రూ.2,167 కోట్ల మేర బకాయిలను తీర్చాల్సి ఉందని ఇక్రా తెలియజేసింది.

**షేరుకు అమ్మకాల ఒత్తిడి**

జెట్ ఎయిర్‌వేస్ రుణ చెల్లింపుల్లో విఫలమైందన్న సమాచారం బయటకు రావడంతో... కంపెనీ షేర్ల అమ్మకాలకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. దీంతో బీఎస్‌ఈలో 6 శాతానికి పైగా నష్టపోయి రూ.263.75 వద్ద క్లోజయింది. ఎన్‌ఎస్‌ఈలో 7 శాతం వరకు నష్టపోయింది.

### రూపాయి75 పైసలు డౌన్!

- డాలర్ మారకంలో మళ్లీ 70.18కి
- నాలుగు సెషన్స్‌లో మొదటి పతనం



**ముంబై:** నాలుగు ట్రేడింగ్ సెషన్ల నుంచీ వరుసగా లాభాల బాటన పయనిస్తూ వచ్చిన రూపాయి మళ్లీ నష్టాల బాట పట్టింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో బుధవారం ఒకేరోజు డాలర్ మారకంలో 75పైసలు నష్టపోయి, 70.18 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆరు దేశాల కరెన్సీలపై డాలర్ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో నష్టాలు, బలహీన వస్తు సేవల పన్ను వసూళ్లు రూపాయి సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. మంగళవారం రూపాయి 34 పైసలు లాభంతో 69.43 వద్ద ముగిసింది. అయితే బుధవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే 69.60 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 70.23ను సైతం తాకింది. తగ్గిన క్రూడ్ ధరలే ప్రస్తుతం రూపాయి సెంటిమెంట్ కొంత బలంగా ఉండడానికి కారణం. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో... క్రమంగా కోలుకుంటూ వస్తోంది.

## ఏఐపీబీఏ వైస్ ప్రెసిడెంట్‌గా సురేష్

పౌల్ట్రీ బ్రీడింగ్ కంపెనీ శ్రీనివాస ఫామ్స్ వైస్ చైర్మన్ అండ్ ఎండీ సురేష్ చిట్టూరి ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ (ఏఐపీబీఏ) వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన ఇంటర్నేషనల్ ఎగ్ కమీషన్ (ఐఈసీ) వైస్ చైర్మన్‌గానూ ఉన్నారు.

## పెన్నార్ గ్రూప్ చేతికి రూ.309 కోట్ల ఆర్డర్లు

Pennar Industries Limited
Engineering Excellence

ఇంజనీరింగ్ ప్రొడక్ట్స్ కంపెనీ పెన్నార్ గ్రూప్ రూ.309 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకుంది. పెన్నార్ ఇండస్ట్రీస్ రూ.124 కోట్లు, పెన్నార్ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ రూ.125 కోట్లు, పెన్నార్ ఎన్విరో రూ.60 కోట్ల ఆర్డర్లను దక్కించుకున్నాయి. రైల్వేస్, రిలయన్స్, ఎల్ అండ్ టీ, జేఎస్‌డబ్ల్యు, ఎమర్సన్, జెమిని ఎడిబుల్స్ వంటి కంపెనీల నుంచి వీటిని పొందినట్టు పెన్నార్ వెల్లడించింది.

## ఎన్‌సీసీకి రూ.2,891 కోట్ల ఆర్డర్లు

నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ డిసెంబరు నెలలో రూ.2,891 కోట్ల విలువైన పలు ఆర్డర్లను దక్కించుకుంది. ఇందులో నీరు, పర్యావరణ విభాగానికి సంబంధించి రూ.680 కోట్లు, రహదారులకు సంబంధించి రూ.2,127 కోట్లు, భవనాల విభాగానివి రూ.84 కోట్ల ఆర్డర్లున్నట్లు కంపెనీ తెలియజేసింది. ఇవన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కాంట్రాక్టులని కంపెనీ వెల్లడించింది.

# 36,000 దిగువకు సెన్సెక్స్

- చైనా వృద్ధిపై ఆందోళన
- పడిపోయిన ప్రపంచ మార్కెట్లు
- నిరాశ నింపిన వాహన విక్రయ గణాంకాలు
- అంచనాలు అందుకోలేని జీఎస్‌టీ వసూళ్లు
- బలహీనంగా రూపాయి
- 36,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 363 పాయింట్లు పతనమై 35,892 వద్ద ముగింపు
- 10,800 పాయింట్ల కిందకు నిఫ్టీ
- 118 పాయింట్ల నష్టంతో 10,793 వద్ద ముగింపు




కొత్త ఏడాది లాభాల మురిపెం మొదటి రోజుకే పరిమితమైంది. చైనా వృద్ధిపై ఆందోళన కారణంగా ప్రపంచ మార్కెట్లు పతనం కావడంతో మన మార్కెట్ కూడా బుధవారం నష్టపోయింది. బలహీనంగా ఉన్న గత నెల వాహన విక్రయాలకు, అంచనాలను అందుకోలేని జీఎస్‌టీ వసూళ్లు జత కావడం, డాలర్‌తో రూపాయి మారకం కూడా పతనం కావడంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 36,000 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,800 పాయింట్ల దిగువకు పడిపోయాయి. ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఇంట్రాడేలో 521 పాయింట్ల వరకూ పతనమైన బీఎస్‌ఈ సెన్సెక్స్ చివరకు 363 పాయింట్లు క్షీణించి 35,892 పాయింట్ల వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు తగ్గి 10,793 పాయింట్ల వద్ద ముగిశాయి. స్టాక్ సూచీలు చెరో 1 శాతం క్షీణించాయి. లోహ, వాహన, బ్యాంక్, ఇంధన షేర్లు నష్టపోయాయి. రూపాయి పతనం కారణంగా ఐటీ షేర్లు పుంజుకున్నాయి. కొత్త ఏడాది తొలి రోజు సెలవు కారణంగా మంగళవారం పనిచేయని ప్రపంచ మార్కెట్లు బుధవారం చైనా ఆర్థిక వృద్ధిపై ఆందోళనతో నష్టాలతో ఆరంభమయ్యాయి. దీంతో సెన్సెక్స్ నష్టాల్లోనే ఆరంభమైంది. రోజు గడిచేకొద్దీ పతనం పెరిగిందే కానీ తగ్గలేదు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 521 పాయింట్లు, నిఫ్టీ 175 పాయింట్ల వరకూ నష్టపోయాయి. బ్లూ చిప్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది.

**లోహ షేర్లు విలవిల:** చైనాలో వృద్ధి మందగించిందన్న గణాంకాలతో లోహ షేర్లు కుదేలయ్యాయి. ప్రపంచంలో లోహాలను అత్యధికంగా వినియోగించే చైనాలో వృద్ధిపై ఆందోళన కారణంగా అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, సీఎల్‌ఎస్‌ఏ పలు లోహ షేర్ల రేటింగ్‌ను తగ్గించింది. దీంతో లోహ షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, వేదాంత, నాల్కో, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హిందాల్కో షేర్లు 1–4 శాతం రేంజ్ వరకూ నష్టపోయాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)

| | |
|---|---|
| బీఎస్‌ఈ | 2,252 |
| ఎన్‌ఎస్‌ఈ | 28,239 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివే.) | 11,39,552 |
| ఎఫ్‌ఐఐ | - 621 |
| డీఐఐ | - 226 |

➡ కాగా స్టాక్ మార్కెట్ నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.1.39 లక్షల కోట్లు హరించుకుపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.144.81 లక్షల కోట్ల నుంచి రూ.143.42 లక్షల కోట్లకు తగ్గింది.

➡ సెన్సెక్స్‌లో ఆరు షేర్లు –సన్ ఫార్మా, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, యస్‌బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు మాత్రమే లాభపడగా, మిగిలిన 25 షేర్లు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 50లో 9 షేర్లు లాభపడగా, 41 షేర్లు నష్టపోయాయి.

## ఈనెల 5న బ్యాంక్ పెన్షనర్ల ధర్నా

**హైదరాబాద్:** బ్యాంక్ యాజమాన్యాలు, కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 5న హైదరాబాద్‌లో ధర్నా చేయనున్నట్లు బ్యాంక్ పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య ప్రకటించింది. ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి ఇందిరా పార్క్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు సమాఖ్య తెలిపింది. ''వేతన సవరణ కమిషన్ సిఫారసుల్ని అమలు చేసినపుడల్లా దేశంలోని పెన్షనర్లు అందరికీ బేసిక్ పెన్షన్ పెరుగుతోంది. ఒక్క బ్యాంక్ ఉద్యోగులకు మాత్రం పెరగకుండా జీవితాంతం అదే బేసిక్ ఉంటోంది. అలాగే రిటైర్డ్ ఉద్యోగి కనక మరణిస్తే తన కుటుంబ సభ్యులకు మూల వేతనంలో 50 శాతం పింఛన్‌గా అందుతోంది. బ్యాంక్ ఉద్యోగులకు మాత్రం ఇది 15 శాతమే ఉంది. ఇలాంటివెన్నో వివక్షలను బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. దీనికి వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాం'' అని సమాఖ్య తెలిపింది.

## పీఎన్‌బీ హౌసింగ్‌కు ఈసీబీ నిధులు

**ముంబై:** పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ విదేశీ వాణిజ్య రుణాల (ఈసీబీ) ద్వారా రూ.1,853 కోట్లు (26.5 కోట్ల డాలర్లు) సమీకరించింది. గత వారం సమీకరించిన ఈ నిధులను సాధారణ రుణ కార్యకలాపాలకు వినియోగిస్తామని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ గుప్తా చెప్పారు. మొత్తం మీద ఈ క్యూ3లో ఈసీబీల ద్వారా రూ.3,324 కోట్లు (46.5 కోట్ల డాలర్లు) సమీకరించామని తెలియజేశారు. ఈసీబీల కాలపరిమితి ఐదేళ్లని పేర్కొన్న ఆయన... కూపన్ రేటును మాత్రం వెల్లడించలేదు.

## ఆష్లే ఏవియేషన్‌లో పెరిగిన అశోక్ లేలాండ్ వాటా

**చెన్నై:** విమానయాన సంస్థ, ఆష్లే ఏవియేషన్‌లో తన వాటాను హిందుజా గ్రూప్‌నకు చెందిన ప్రధాన కంపెనీ అశోక్ లేలాండ్ మరింతగా పెంచుకుంది. వాటాదారుల నుంచి 27.25 లక్షల షేర్లను రూ.55.59 లక్షలకు కొనుగోలు చేశామని అశోక్ లేలాండ్ తెలిపింది. దీంతో తమ వాటా 76.25 శాతానికి పెరిగిందని పేర్కొంది. వాటాదారుల నుంచి మరిన్ని షేర్లను కొంటామని, ఆష్లే ఏవియేషన్ తమ పూర్తి అనుబంధ కంపెనీగా మారనుందని, ఈ విషయంలో పౌర విమానయాన శాఖ ఆమోదం కూడా పొందామని పేర్కొంది.

## బాసెల్-3 బాండ్ల ద్వారా బీఓబీ రూ.1,285 కోట్లు!

**న్యూఢిల్లీ:** బ్యాంక్ ఆఫ్ బరోడా బాసెల్–3 బాండ్ల ద్వారా రూ.1,285 కోట్లు సమీకరించనుంది. ఈ మేరకు తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. టైర్ టూ క్యాపిటల్ బాండ్ల ద్వారా రూ.250 కోట్లు (బేస్ ఇష్యూ సైజు) సమీకరించనున్నామని, అదనంగా సబ్‌స్క్రిప్షన్ లభిస్తే (గ్రీన్ షూ ఆప్షన్), రూ.750 కోట్ల వరకూ సమీకరిస్తామని, ఈ విభాగంలో మొత్తం రూ.1,000 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నామని తెలిపింది.

## 'వాట్సాప్' ద్వారా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సేవలు

**హైదరాబాద్:** కస్టమర్లకు సేవలు అందించేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వాట్సాప్ చానల్‌ను వినియోగించుకోనుంది. ఇందుకోసం వాట్సాప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. వెల్‌కమ్ కిట్లు, పాలసీ సర్టిఫికెట్లు, ప్రీమియం రసీదులు, మరెన్నో ఇతర సేవలను పాలసీదారులు వాట్సాప్ ద్వారా కంపెనీ నుంచి పొందే అవకాశం లభించనుంది.

## ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వడ్డీరేట్ల సవరణ

**చెన్నై:** ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ పొదుపు ఖాతా డిపాజిట్లపై వడ్డీరేట్లను సవరించింది. తాజా రేట్లు తక్షణం అమల్లోకి వస్తాయని తెలిపింది. రూ.లక్ష వరకూ డిపాజిట్లపై 5.5 శాతం వార్షిక వడ్డీని ఇస్తామని పేర్కొంది. రూ. లక్ష నుంచి రూ.10 లక్షల డిపాజిట్లపై ఆరు శాతం, రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకూ డిపాజిట్లపై 6.5 శాతం వార్షిక వడ్డీ లభిస్తుందని వివరించింది.

## పట్టణాల్లో 22 శాతం పెరిగిన ఇళ్ల ధరలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 33 పట్టణాల్లో ఇళ్ల ధరలు గతేడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 22 శాతం మేర పెరిగాయని నేషనల్ హౌసింగ్ బ్యాంకు సవరించిన గణాంకాలు తెలియజేశాయి. ఇదే కాలంలో 14 పట్టణాల్లో 13 శాతం వరకు ధరలు తగ్గుముఖం పట్టడం విశేషం. మూడు పట్టణాల్లో మాత్రం ధరల పరంగా ఎటువంటి మార్పుల్లేవు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి చూస్తే... 39 పట్టణాల్లో ధరలు 17 శాతం వరకు పెరిగాయి. 8 పట్టణాల్లో 8 శాతం వరకూ తగ్గినట్టు తెలుస్తోంది. నేషనల్ హౌసింగ్ బ్యాంకు 'ఎన్‌హెచ్‌బీ రెసిడెక్స్' పేరుతో ఇళ్ల ధరలను ప్రతిఫలించే సూచీని 2007లోనే ప్రారంభించింది.

## చమురు, ఇంధన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

### చమురు కంపెనీలు, ఐఐటీ బాంబే మధ్య ఎంవోయూ

**న్యూఢిల్లీ:** చమురు, గ్యాస్, ఇంధన రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (పరిశోధనలు, ప్రమాణాల వేదిక) ఏర్పాటుకు ఏడు చమురు కంపెనీలు, ఐఐటీ బాంబే మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ''ఇంధన రంగంలో పరిశోధనలతోపాటు నాణ్యత, ఉత్పత్తి, సామర్థ్యం పెంచే టెక్నాలజీల విషయంలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహకారం అందిస్తుంది'' అని ఒప్పందం సందర్భంగా పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. దీనివల్ల ఇంధన అవసరాలను ఆధునిక, కొత్త రూపాల్లో అధిగమించేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఐవోసీ, ఓఎన్‌జీసీ, గెయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఆయిల్ ఇండియా, ఇంజనీర్స్ ఇండియా ఈ ఒప్పందం చేసుకున్నాయి.

- కాగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) పెట్రోల్, డీజిల్‌పై రూపాయి చొప్పున ఇటీవల తగ్గించగా, ఈ మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ఆలోచనేదీ లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చైర్మన్ సంజీవ్‌సింగ్ చెప్పారు.

# చిన్న పరిశ్రమ వృద్ధిపై ఆర్‌బీఐ దృష్టి

- సిన్హా నేతృత్వంలో నిపుణుల కమిటీ
- వచ్చేవారం ఈ రంగం ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ భేటీ



**ముంబై:** లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) అభివృద్ధిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరింత దృష్టి సారిస్తోంది. ఈ రంగం అభివృద్ధిపై సలహాలకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అలాగే ఈ రంగం ప్రతినిధులతో వచ్చేవారం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ సమావేశం కానున్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) ప్రతినిధులతో కూడా తాను వచ్చేవారం సమావేశం కానున్నట్లు శక్తికాంత్ దాస్ ట్వీట్ చేశారు. మరిన్ని వివరాల్లోకి వెళితే...

- ఎంఎస్‌ఎంఈ రంగానికి సంబంధించి ఆర్థిక, ద్రవ్య స్థిరత్వానికి దీర్ఘకాలిక సూచనలు చేయడానికి ఆర్‌బీఐ బుధవారం ఒక అత్యున్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మాజీ చైర్మన్ యూకే సిన్హా నేతృత్వం వహిస్తారు. ఎనిమిది మంది సభ్యుల ఈ కమిటీ, 2019 జూన్ నాటికి తన నివేదికను సమర్పిస్తుంది. చిన్న పరిశ్రమలకు రుణ లభ్యతపై, ఇందుకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి పెడుతుంది. దేశం మొత్తం ఎగుమతుల్లో ఎంఎస్‌ఎంఈ వాటా 40%కాగా, తయారీ రంగంలోఈ విభాగం వాటా 45 శాతం.
- ఆర్‌బీఐ మంగళవారం చిన్న పరిశ్రమలకు భారీ ఊరటనిచ్చే కీలక నిర్ణయాన్ని తీసుకున్న నేపథ్యంలోనే ఈ రంగానికి సంబంధించి తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం ఆర్‌బీఐ చేసిన ప్రకటన ప్రకారం– రూ. 25 కోట్ల వరకూ రుణం ఉండి, చెల్లించలేకపోతున్న రుణాన్ని, ఒకేసారి పునర్వ్యవస్థీకరించడానికి ఆర్‌బీఐ అనుమతించింది. అయితే సంస్థ రుణం పునర్వ్యవస్థీకరించే నాటికి, ఆ సంస్థ జీఎస్‌టీలో నమోదై ఉండాలి. అయితే జీఎస్‌టీ నమోదు అవసరం లేదని మినహాయింపు పొందిన ఎంఎస్‌ఎంఈలకు ఇది వర్తించదు.
- ఎన్‌బీఎఫ్‌సీ ప్రతినిధులతో దాస్ సమావేశం మరో ముఖ్య విశేషం. దేశంలోని అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ రుణ చెల్లింపుల వైఫల్యం నేపథ్యంలో పలు ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు తీవ్ర లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) సమస్యలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆర్‌బీఐ గవర్నర్‌గా డిసెంబర్ 12న బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండుసార్లు ప్రభుత్వ బ్యాంకర్లతో, ఒకసారి ప్రైవేటు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. లిక్విడిటీ, చిన్న పరిశ్రమలకు రుణ లభ్యతసహా దిద్దుబాటు చర్యల పరిధిలో (పీసీఏ) ఉన్న 11 బ్యాంకులపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం.

### రుణ పునర్వ్యవస్థీకరణ స్కీమ్‌పై ఎంఎస్‌ఎంఈ డిమాండ్

ఇదిలావుండగా, ఆర్‌బీఐ రుణ పునర్వ్యవస్థీకరణ పథకాన్ని వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) కింద ఇంకా రిజిస్టర్ కాని కంపెనీలకూ వర్తింపజేయాలని ఎంఎస్‌ఎంఈ డిమాండ్ చేసింది. సంబంధిత సంస్థల రుణాలనూ ప్రాధాన్యతా రంగానికి ఇస్తున్న రుణాలుగా పరిగణించాలని విజ్ఞప్తి చేసింది.

## నిఫ్టీ 50

### టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SUNPHARMA | 439.95 | 1.48 |
| INFRATEL | 265.2 | 1.12 |
| TCS | 1,919.00 | 0.85 |
| ASIANPAINT | 1,380.05 | 0.62 |
| INFY | 668 | 0.44 |
| TITAN | 931.5 | 0.38 |
| UPL | 755.05 | 0.21 |
| YESBANK | 184.6 | 0.19 |
| ICICIBANK | 364.3 | 0.15 |

### టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| EICHERMOT | 21,014.00 | -9.4 |
| JSWSTEEL | 287.4 | -5.44 |
| TATASTEEL | 492.5 | -4.51 |
| VEDL | 193.2 | -4.4 |
| M&M | 740.55 | -4.24 |
| HINDALCO | 214.5 | -3.7 |
| HEROMOTOCO | 3,025.00 | -3.28 |
| GAIL | 350.3 | -3.27 |
| BPCL | 355.65 | -3.15 |
| TATAMOTORS | 168.4 | -2.91 |

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 32,190 | 0 |
| బంగారం (99.5, 10గ్రా) | 30,660 | 0 |
| వెండి (కిలో) | 41,500 | 0 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,190 | ▲ 190 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,390 | ▲ 180 |
| వెండి (కిలో) | 41,800 | ▲ 300 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,910 | ▲ 190 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,390 | ▲ 180 |
| వెండి (కిలో) | 41,800 | ▲ 300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 32,500 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,050 | ▼ 60 |
| వెండి (కిలో) | 39,300 | ▼ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 32,670 | ▲ 190 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,390 | ▲ 180 |
| వెండి (కిలో) | 39,500 | 0 |
| **విజయవాడ** | | |
| బంగారం(24 క్యారెట్లు) | 32,850 | ▲ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,100 | ▲ 70 |
| వెండి (కిలో) | 39,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 32,860 | ▲ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,390 | ▲ 180 |
| వెండి (కిలో) | 39,700 | ▲ 400 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 47.26 (రాత్రి 11.30కు) | $45.41 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 55.70 (రాత్రి 11.30కు) | $53.80 (మంగళవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 03-01-2019

| | |
|---|---|
| విశాఖ | 458–00 |
| చిత్తూరు | 438–00 |
| వరంగల్ | 441–00 |
| చెన్నై | 445–00 |
| ముంబై | 494–00 |
| విజయవాడ | 453–00 |
| నమక్కల్ | 430–00 |
| గోదావరి | 453–00 |
| **2–1–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 439–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 5.00 |
| బెంగళూరు | 445–00 |
| కోల్‌కత్త | 492–00 |
| ఢిల్లీ | 460–00 |

### ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 381.3 | 389 |
| ASIAN PAINT | 1383.3 | 1371.55 |
| AXIS BANK L | 620.05 | 627.3 |
| BAJAJ AUTO | 2692 | 2726.65 |
| BAJAJ FINSE | 6384 | 6521.95 |
| BAJAJ FINAN | 2614.05 | 2656.85 |
| BHARTI AIRT | 312.65 | 319.5 |
| BPCL | 357.95 | 367.2 |
| CIPLA LTD | 514.55 | 523.05 |
| COAL INDIA | 236.7 | 241.5 |
| EICHER MOTO | 21162.3 | 23195.1 |
| GAIL (INDIA | 350.3 | 362.15 |
| GRASIM INDU | 815.5 | 833.5 |
| HCL TECHNOL | 946.35 | 959.85 |
| HDFC LTD | 1980.65 | 2009 |
| HDFC BANK L | 2128.5 | 2148.1 |
| HERO MOTOCO | 3046.55 | 3127.6 |
| HINDALCO I | 214.55 | 222.75 |
| HPCL | 256.55 | 256.7 |
| HUL | 1784.6 | 1801.1 |
| INDIABULLS | 842.3 | 844.75 |
| ICICI BANK | 364.6 | 363.75 |
| INDUSIND BA | 1576.6 | 1595.6 |
| BHARTI INFR | 264.25 | 262.25 |
| INFOSYS LIM | 669.05 | 665.05 |
| INDIAN OIL | 137.25 | 137.7 |
| ITC LTD | 280.6 | 282.7 |
| JSW STEEL L | 288.7 | 303.95 |
| KOTAK MAHIN | 1240.6 | 1250.45 |
| LARSEN & TO | 1425.5 | 1441.9 |
| MAHINDRA &M | 741.7 | 773.35 |
| MARUTI SUZU | 7267.85 | 7476.8 |
| NTPC LTD | 147 | 148.7 |
| OIL AND NAT | 147.05 | 148.5 |
| POWER GRID | 195.25 | 200 |
| RIL | 1106.4 | 1121 |
| SBI | 293.9 | 299.6 |
| SUN PHARMAC | 440.05 | 433.55 |
| TATA MOTORS | 168.55 | 173.45 |
| TATA STEEL | 493.65 | 515.75 |
| TATA CONSUL | 1923.3 | 1902.8 |
| TECH MAHIND | 712.05 | 719.1 |
| TITAN COMPA | 932.15 | 928 |
| ULTRATECH C | 4006.1 | 4009.2 |
| UPL LIMITED | 756.5 | 753.5 |
| VEDANTA LIM | 193.15 | 202.1 |
| WIPRO LTD | 325.55 | 326.65 |
| YES BANK LI | 184.65 | 184.25 |
| ZEE ENTERTA | 470.25 | 480.25 |

### నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ABB INDIA L | 1319.25 | 1319.2 |
| ADITYA BIRL | 99.25 | 100.1 |
| ACC LIMITED | 1483.95 | 1488.8 |
| AMBUJA CEME | 218.95 | 222.9 |
| ASHOK LEYLA | 99.95 | 102.5 |
| BANDHAN BAN | 552.15 | 556.7 |
| BANK OF BAR | 119.35 | 123.3 |
| BHARAT ELEC | 89.7 | 87.45 |
| BHEL | 73 | 73.8 |
| BIOCON LIMI | 622.8 | 625.8 |
| BOSCH LIMIT | 19477.8 | 19576.5 |
| BRITANNIA I | 3116.85 | 3103.05 |
| CADILA HEAL | 346.75 | 350.05 |
| COLGATE PAL | 1301.8 | 1323.9 |
| CONTAINER C | 668.95 | 685.3 |
| DABUR INDIA | 416.4 | 421.85 |
| DLF LIMITED | 173.1 | 180.3 |
| AVENUE SUPE | 1560.25 | 1590.75 |
| GENERAL INS | 257.4 | 259.4 |
| GODREJ CONS | 806.65 | 807.35 |
| HAVELLS IND | 691.8 | 694.8 |
| HDFC STAND | 391.15 | 386.4 |
| HINDUSTAN Z | 272.75 | 277.85 |
| ICICI LOMBA | 875.45 | 873.25 |
| ICICI PRU L | 319.8 | 325.9 |
| VODAFONE ID | 36.75 | 37.75 |
| INTERGLOBE | 1161 | 1165.6 |
| L&T FINANCE | 150.5 | 153.15 |
| LIC HOUSING | 476.15 | 486.55 |
| LUPIN LIMIT | 832.8 | 841.45 |
| MARICO LIMI | 372.85 | 372.3 |
| UNITED SPIR | 619.75 | 621 |
| MOTHERSON S | 163.75 | 165.45 |
| MRF LTD | 66635.5 | 66801.2 |
| NHPC LTD | 25.65 | 25.95 |
| THE NEW IND | 184.8 | 179.75 |
| NMDC LTD. | 96.8 | 95.75 |
| ORACLE FIN | 3710.95 | 3729.45 |
| OIL INDIA L | 172.4 | 175.75 |
| PIRAMAL ENT | 2343.75 | 2395.3 |
| PETRONET LN | 228.8 | 229 |
| P&G HYGIENE | 9895 | 9903.75 |
| PIDILITE IN | 1107.65 | 1101.95 |
| STEEL AUTHO | 54 | 55.75 |
| SBI LIFE IN | 601.7 | 598.85 |
| SHREE CEMEN | 16939.95 | 16973.25 |
| SIEMENS LTD | 1056.55 | 1062.65 |
| SHRIRAM TRA | 1195.4 | 1229.75 |
| SUN TV NETW | 604.6 | 607.85 |

### A B C D

| | | |
|---|---|---|
| 3M INDIA LI | 19985.75 | 20666.35 |
| 5PAISA CAPI | 270.75 | 257.9 |
| 63 MOONS TE | 97.2 | 99.6 |
| 8K MILES SO | 138.8 | 142.3 |
| AARTI DRUGS | 575.1 | 575.65 |
| AARTI INDUS | 1450.7 | 1448.6 |
| AAVAS FINAN | 840.65 | 845.25 |
| ABAN OFFSHO | 74.1 | 74.5 |
| ABBOTT INDI | 7527.05 | 7580.05 |
| ACCELYA KAL | 949.4 | 950 |
| ACTION CONS | 97.4 | 94.4 |
| ADANI ENTER | 154.85 | 157.25 |
| ADANI GAS L | 100.45 | 101.85 |
| ADANI POWER | 50.55 | 50.85 |
| ADANI TRANS | 200.55 | 200.5 |
| ADF FOODS L | 269.55 | 270.1 |
| ADITYA BIRL | 60.35 | 56.25 |
| ADITYA BIRL | 195.55 | 199.55 |
| ADOR WELDIN | 373.75 | 382.3 |
| ADVANCED EN | 175 | 175.8 |
| ADVANI HOT. | 64 | 64.15 |
| AEGIS LOGIS | 203.95 | 204 |
| AGARWAL IND | 188.7 | 203.7 |
| AGC NETWORK | 73.75 | 73 |
| AGRO PHOS I | 50.4 | 50.5 |
| AGRO TECH F | 598.4 | 607.2 |
| AHLADA ENGI | 140 | 142 |
| AHLUWALIA C | 324.25 | 324.8 |
| AIA ENGINEE | 1652.55 | 1674.4 |
| AIRAN LIMIT | 59 | 60 |
| AJANTA PHAR | 1164.35 | 1181.7 |
| AJMERA REAL | 167.95 | 172.1 |
| AKASH INFRA | 80.7 | 84.4 |
| AKSHARCHEM | 441 | 444.9 |
| AKZO NOBEL | 1769.4 | 1769.55 |
| ALBERT DAVI | 417.55 | 414.5 |
| ALEMBIC PHA | 580.45 | 586.85 |
| ALICON CAST | 592.6 | 587.6 |
| ALKALI META | 54.45 | 55.2 |
| ALKEM LABOR | 1951.05 | 1940.3 |
| ALKYL AMINE | 783.85 | 773 |
| ALLCARGO LO | 108.6 | 107.75 |
| ALLSEC TECH | 200.75 | 201.9 |
| ALPHAGEO (I | 475.05 | 478.55 |
| AMBER ENTER | 899.95 | 909 |
| AMBIKA COTT | 1159.25 | 1159.1 |
| AMRUTAJAN H | 282.55 | 285.55 |
| ANI INTEGRA | 64.25 | 67 |
| ANJANI PORT | 132.35 | 130.8 |
| APAR INDUST | 663.15 | 665.6 |
| APCOTEX IND | 524.5 | 526.35 |
| APEX FROZEN | 360.4 | 367.35 |
| APL APOLLO | 1208.85 | 1172.8 |
| APOLLO HOSP | 1258.75 | 1266.4 |
| APOLLO MICR | 124.85 | 125.4 |
| APOLLO SIND | 1069.7 | 1069.7 |
| APOLLO TYRE | 230.85 | 234.4 |
| APTECH LIMI | 186.75 | 191.8 |
| ARIHANT SUP | 58.4 | 58.55 |
| ARMAN FIN S | 390.05 | 397.3 |
| ARO GRANITE | 52.1 | 52.1 |
| ARROW GREEN | 112.3 | 117.7 |
| ARTEM GLOBA | 65.9 | 64.65 |
| ARVIND LIMI | 96.3 | 98.4 |
| ARVIND SMAR | 124.05 | 128.8 |
| ASAHI INDIA | 258.75 | 263.5 |
| ASAHI SONGW | 214 | 213.55 |
| ASHIANA HOU | 118.85 | 118.45 |
| ASHOKA BUIL | 123.4 | 124.95 |
| ASIAN GRANI | 167 | 174.3 |
| ASIAN HOTEL | 146.75 | 146.9 |
| ASIAN HOTEL | 244.65 | 244.55 |
| ASIAN HOTEL | 296.2 | 303 |
| ASPINWALL & | 175 | 169.2 |
| ASTEC LIFES | 527.95 | 529.1 |
| ASTER DM HE | 160 | 161.55 |
| ASTRA MICRO | 78.9 | 78.8 |
| ASTRAL POLY | 1141.05 | 1128.8 |
| ASTRAZENECA | 1418.75 | 1443.6 |
| ASTRON PAPE | 109.8 | 108.6 |
| ATUL AUTO L | 357.35 | 349 |
| ATUL LTD | 3463.1 | 3443.2 |
| AU SMALL FI | 620.25 | 621.95 |
| AURIONPRO S | 129.65 | 128.9 |
| AUTOLINE IN | 70.6 | 69.45 |
| AUTOMOTIVE | 79.1 | 76.8 |
| AUTOMOTIVE | 1369.4 | 1406.2 |
| AVADH SUG & | 375.2 | 374.35 |
| AVANTI FEED | 378.4 | 387.9 |
| AXISCADES E | 82.5 | 83.45 |
| BAJAJ CORP | 378.05 | 373.4 |
| BAJAJ ELECT | 506.35 | 513.55 |
| BAJAJ HOLDI | 2950.1 | 2949.95 |
| BAL PHARMA | 79.2 | 79.05 |
| BALAJI TELE | 89.9 | 90.1 |
| BALKRISHNA | 50.55 | 50.6 |
| BALKRISHNA | 912.3 | 928.85 |
| BALMER LAWR | 198.75 | 202.7 |
| BALRAMPUR C | 104.5 | 103.4 |
| BANCO PRODU | 182.6 | 184.75 |
| BANG OVERSE | 57.25 | 58.45 |
| BANK OF IND | 104.8 | 106.35 |
| BANKA BIOLO | 82 | 99.5 |
| BANNARI AM | 210 | 215 |
| BANNARI AMM | 1513.95 | 1502.75 |
| BANSWARA SY | 82.5 | 83.5 |
| BASF INDIA | 1534.4 | 1550.3 |
| BATA INDIA | 1112.05 | 1126.05 |
| BAYER CROPS | 4199.6 | 4212.95 |
| BEML LIMITE | 922.9 | 903.35 |
| BERGER PAIN | 327.3 | 332.5 |
| BETA DRUGS | 78 | 76.5 |
| BF INVESTME | 254.5 | 257.95 |
| BF UTILITIE | 223.9 | 221.45 |
| BGR ENERGY | 60.9 | 61.75 |
| BHAGERIA IN | 282.75 | 286.95 |
| BHANSALI EN | 89.25 | 87.2 |
| BHARAT BIJL | 1168.4 | 1164.4 |
| BHARAT DYNA | 281.6 | 276.3 |
| BHARAT FIN | 1001.4 | 1011.85 |
| BHARAT FORG | 494.9 | 510.95 |
| BHARAT GEAR | 163.9 | 166.7 |
| BHARAT RASA | 5295.85 | 5297.5 |
| BHARAT ROAD | 121.75 | 121.95 |
| BHARAT WIRE | 71.65 | 75.1 |
| BHARTIYA IN | 239.4 | 236.75 |
| BINANI INDU | 72.05 | 73.2 |
| BIRLA CABLE | 196.95 | 199.55 |
| BIRLA CORPO | 590.8 | 593.65 |
| BLISS GVS P | 165.65 | 163 |
| BLS INTL SE | 117.1 | 119 |
| BLUE DART E | 3365.9 | 3413.75 |
| BLUE STAR L | 622.4 | 625.55 |
| BODAL CHEMI | 113.75 | 113.7 |
| BOMBAY BURM | 1305.25 | 1323.9 |
| BOMBAY DYEI | 112.45 | 115.75 |
| BOMBAY SUPE | 127.2 | 140 |
| BOROSIL GLA | 234.1 | 235 |
| BRIGADE ENT | 214 | 221 |
| BROOKS LAB | 58.4 | 59.95 |
| BSE LIMITED | 598.6 | 601.1 |
| BTRFLY GAND | 283.95 | 315.45 |
| CADSYS (IND | 52.35 | 55.1 |
| CAMLIN FINE | 53.8 | 53.95 |
| CAN FIN HOM | 280.9 | 286.8 |
| CANARA BANK | 275.4 | 281.5 |
| CANTABIL RE | 126.95 | 127.95 |
| CAPACITE IN | 247.55 | 247.3 |
| CAPLIN POIN | 382.75 | 382.7 |
| CAPRI GLOBA | 127.6 | 127.4 |
| CARBORUNDUM | 361.5 | 360.6 |
| CARE RATING | 972.85 | 980.1 |
| CAREER POIN | 78.65 | 79 |
| CASTROL IND | 147.35 | 151.15 |
| CCL PRODUCT | 270 | 269.8 |
| CEAT LIMITE | 1292.6 | 1293.6 |
| CENTRAL DEP | 230.85 | 227.15 |
| CENTUM ELEC | 353.65 | 345.25 |
| CENTURY ENK | 264.9 | 265.95 |
| CENTURY PLY | 174.9 | 176.45 |
| CENTURY TEX | 905.6 | 922.4 |
| CERA SANITA | 2354.8 | 2367.5 |
| CESC LTD | 666.85 | 671.3 |
| CHAMBAL FER | 154.8 | 147.25 |
| CHEMFAB ALK | 154.65 | 157.2 |
| CHENNAI PET | 285 | 290.55 |
| CHOLAMANDAL | 1236.95 | 1255.15 |
| CIGNITI TEC | 369.85 | 372.75 |
| CITY UNION | 193.1 | 193.8 |
| CL EDUCATE | 119.8 | 120.85 |
| CLARIANT CH | 413.6 | 417.1 |
| CMI LIMITED | 179.5 | 180.35 |
| COCHIN SHIP | 370.65 | 372.7 |
| COFFEE DAY | 275.9 | 278.25 |
| CONTROL PRI | 305.3 | 306.55 |
| CORDS CABLE | 64.05 | 64.95 |
| COROMANDEL | 450.05 | 451.05 |
| COSMO FILMS | 214.4 | 215.75 |
| COX & KINGS | 160.35 | 164.1 |
| CREATIVE PE | 106 | 105.6 |
| CREDITACCES | 384.2 | 386.8 |
| CREST VENTU | 145.65 | 142.9 |
| CRISIL LTD | 1625 | 1619.4 |
| CROMPT GREA | 231.7 | 234.3 |
| CUMMINS IND | 845.9 | 848.45 |
| CUPID LIMIT | 158.55 | 161.15 |
| CYIENT LIMI | 621.9 | 618.3 |
| D-LINK INDI | 78.65 | 72.8 |
| D.B.CORP LT | 169.9 | 171.2 |
| DALMIA BHAR | 91.5 | 92.15 |
| DANGEE DUMS | 202 | 201 |
| DATAMATICS | 116.05 | 113.1 |
| DCB BANK LI | 168.7 | 169.25 |
| DCM LTD | 72.85 | 74.15 |
| DCM SHRIRAM | 344.2 | 343.05 |
| DE NORA IND | 260.8 | 260.6 |
| DECCAN CEME | 391.3 | 402 |
| DEEP INDUST | 123.7 | 125.6 |
| DEEPAK FERT | 147.8 | 149.4 |
| DEEPAK NITR | 220.6 | 223.85 |
| DELTA CORP | 247.2 | 251.7 |
| DEN NETWORK | 70 | 70.5 |
| DEV INFO TE | 75.2 | 74.5 |
| DEWAN HOUSI | 241.7 | 246.35 |
| DFM FOODS L | 209.3 | 206.35 |
| DHAMPUR SUG | 160.4 | 159.65 |
| DHANUKA AGR | 442.15 | 445.1 |
| DHUNSERI IN | 257 | 256.1 |
| DHUNSERI TE | 245 | 248.75 |
| DHUNSERI VE | 109 | 108.3 |
| DIC INDIA L | 375.15 | 382.75 |
| DILIP BUILD | 419.35 | 423.7 |
| DISHMAN CAR | 231.65 | 233.15 |
| DIXON TECHN | 2010.55 | 2043.1 |
| DOLLAR INDU | 316.65 | 309.95 |
| DOLPHIN OFF | 51.15 | 51.6 |
| DR. LAL PAT | 915.2 | 924.8 |
| DRS DILIP R | 76 | 75.5 |
| DYNAMATIC T | 1534.85 | 1490.6 |
| DYNEMIC PRO | 133.8 | 133.85 |

### E F G H

| | | |
|---|---|---|
| ECE INDUSTR | 232.95 | 228.7 |
| ECLERX SERV | 1092.55 | 1075.15 |
| EDELWEISS F | 180.25 | 183.15 |
| EID PARRY I | 205.95 | 206.3 |
| EIH ASSOCIA | 391.3 | 408.5 |
| EIH LIMITED | 188.55 | 195.6 |
| EIMCO ELECO | 408 | 410 |
| ELECON ENG. | 68.3 | 69.6 |
| ELECTROTHER | 148.5 | 151.2 |
| ELGI EQUIPM | 257.3 | 259.25 |
| EMAMI LIMIT | 422.7 | 418.05 |
| EMAMI REALT | 147 | 148.65 |
| EMKAY GLOBA | 104.1 | 103.05 |
| EMMBI INDUS | 127.4 | 128.4 |
| ENDURANCE T | 1245.15 | 1260.2 |
| ENGINEERS I | 125 | 126.65 |
| ENTERTAIN N | 610.7 | 610.35 |
| EQUITAS HOL | 123.15 | 124.2 |
| ERIS LIFESC | 672.6 | 692.15 |
| EROS INTL M | 86.05 | 87.15 |
| ESAB INDIA | 913.05 | 919.75 |
| ESCORTS IND | 707.1 | 719.8 |
| ESSEL PROPA | 110.8 | 109.4 |
| EURO (I) FR | 116.5 | 117 |
| EVEREADY IN | 183.55 | 185.9 |
| EVEREST IND | 505.85 | 509.8 |
| EXCEL CROP | 3699.45 | 3747.65 |
| EXCEL INDUS | 1454.65 | 1472.15 |
| EXIDE INDUS | 261.4 | 267.5 |
| FAIRCHEM SP | 349.65 | 349.9 |
| FDC LIMITED | 172.8 | 173.05 |
| FEDERAL BAN | 94.8 | 93 |
| FEDERAL-MOG | 500.4 | 499.15 |
| FIEM INDUST | 504.1 | 496.8 |
| FILATEX IND | 61.05 | 64.1 |
| FINE ORGANI | 1202.55 | 1212.05 |
| FINOLEX CAB | 453.35 | 454.6 |
| FINOLEX IND | 533.95 | 548.95 |
| FIVE CORE E | 118 | 120 |
| FOCUS LIGHT | 166.45 | 158.55 |
| FORTIS HEAL | 140.5 | 140.2 |
| FOSECO INDI | 1410 | 1417.7 |
| FUT LIFESTY | 396.85 | 407.05 |
| FUTURE MKT | 57.55 | 60.4 |
| FUTURE RETA | 468.5 | 495.5 |
| FUTURE SUPP | 654.8 | 653.95 |
| G M BREWERI | 756.95 | 750.05 |
| GABRIEL IND | 144.6 | 141.35 |
| GALAXY SURF | 1215.15 | 1225.35 |
| GALLANTT ME | 56.95 | 57.8 |
| GANDHI SPL. | 382.9 | 379.15 |
| GANESH HOUS | 69.85 | 71.4 |
| GANESHA ECO | 291.95 | 294.65 |
| GARDEN REAC | 93.35 | 92.45 |
| GARWARE TEC | 1195.95 | 1190.25 |
| GATEWAY DIS | 123.15 | 125.1 |
| GAYATRI PRO | 176.4 | 178.35 |
| GE POWER IN | 815.9 | 821.3 |
| GE T&D INDI | 289 | 298.7 |
| GEECEE VENT | 127.85 | 127 |
| GENESYS INT | 137.5 | 138.55 |
| GHCL LIMITE | 244.75 | 245.35 |
| GIC HOUSING | 258.5 | 261.55 |
| GILLANDERS | 57.25 | 56 |
| GILLETTE IN | 6484.8 | 6467.7 |
| GKW LIMITED | 908.9 | 933 |
| GLAXOSMITHK | 1497.55 | 1498 |
| GLAXOSMITHK | 7515.85 | 7571.55 |
| GLENMARK PH | 683.05 | 692.15 |
| GLOBAL EDUC | 149.5 | 149.75 |
| GLOBAL VEC | 66.05 | 64.65 |
| GLOBUS SPIR | 160.2 | 162.6 |
| GMM PFAUDLE | 1184.45 | 1186.95 |
| GNA AXLES L | 356.25 | 361.65 |
| GOA CARBON | 572.5 | 576.85 |
| GOCL CORPOR | 292.25 | 296.95 |
| GODAWARI PO | 278.2 | 287.2 |
| GODFREY PHI | 868.05 | 879.8 |
| GODREJ AGRO | 499.45 | 503.1 |
| GODREJ INDU | 538.25 | 543.6 |
| GODREJ PROP | 669.8 | 660.3 |
| GOKALDAS EX | 76.55 | 77.5 |
| GOLDIAM INT | 81.15 | 83.4 |
| GOODLUCK IN | 67.75 | 68.95 |
| GP PETROLEU | 66.85 | 66.8 |
| GPT INFRAPR | 53 | 54 |
| GRAPHITE IN | 747.35 | 754.65 |
| GRAVITA IND | 74.95 | 75.35 |
| GREAVES COT | 116.45 | 119.25 |
| GREENLAM IN | 878.65 | 889.85 |
| GREENPLY IN | 137.45 | 139.15 |
| GRINDWELL N | 554.35 | 559.25 |
| GRP LIMITED | 1107.2 | 1122 |
| GRUH FINANC | 321.4 | 322.15 |
| GSS INFOTEC | 131.2 | 132.8 |
| JAY BHARAT | 306.55 | 314.25 |
| JAYANT AGRO | 232.85 | 228.5 |
| JAYSHREE TE | 86.4 | 88.15 |
| JBM AUTO LI | 305.3 | 302.6 |
| JET AIRWAYS | 263.55 | 280.8 |
| JINDAL DRIL | 111.5 | 112.8 |
| JINDAL POLY | 234.4 | 234.4 |
| JINDAL SAW | 83.05 | 85.3 |
| JINDAL STAI | 89.2 | 92.1 |
| JINDAL STEE | 158.2 | 162.9 |
| JINDAL WORL | 67.15 | 67.3 |
| JK CEMENT L | 727.15 | 719.25 |
| MANGALAM CE | 229.05 | 235.7 |
| MANGALAM DR | 70.75 | 71.95 |
| MANPASAND B | 86.4 | 88.55 |
| MARATHON NX | 114.25 | 116.75 |
| MARINE ELEC | 79.95 | 79.5 |
| MAS FINANCI | 567.6 | 577.1 |
| MASTEK LTD | 453.15 | 455.05 |
| MATRIMONY.C | 480.05 | 485.25 |
| MAX FINANCI | 428.55 | 443.55 |
| MAX INDIA L | 84.9 | 84.45 |
| MAX VENTURE | 51.85 | 52.55 |
| MAYUR UNIQU | 399.9 | 398.75 |
| PNC INFRATE | 150.9 | 148.9 |
| PODDAR HOUS | 501.15 | 501.4 |
| PODDAR PIGM | 185.5 | 184.65 |
| POKARNA LIM | 161.3 | 162.4 |
| POLY MEDICU | 224.8 | 223.5 |
| POLYPLEX CO | 518.1 | 526.4 |
| PONNIE SUGA | 139.7 | 138.95 |
| POWER FIN C | 104.05 | 107.4 |
| POWER MECH | 959.3 | 969.35 |
| PPAP AUTOMO | 375.15 | 379.6 |
| PRABHAT DAI | 91.3 | 93.05 |
| PRAJ INDUST | 113.65 | 111.2 |
| SHALIM PAIN | 73.05 | 74 |
| SHANKARA BL | 537.8 | 550.4 |
| SHANTHI GEA | 135.9 | 136.05 |
| SHARDA CROP | 300.25 | 303.75 |
| SHARDA MOTO | 1494.1 | 1495.05 |
| SHEELA FOAM | 1465.95 | 1482.5 |
| SHEMAROO EN | 430.7 | 425 |
| SHILPA MEDI | 381.85 | 392.6 |
| SHIRPUR GOL | 84.4 | 87 |
| SHIVA MILLS | 56.1 | 58.75 |
| SHIVA TEXYA | 198.1 | 200.95 |
| SHOPPERS ST | 527.4 | 532.55 |
| THE HI-TECH | 333.85 | 331.85 |
| THE INDIA C | 93.85 | 96 |
| THE INDIAN | 141.85 | 146 |
| THE INVEST | 164.9 | 161.85 |
| THE PHOENIX | 574.5 | 576.45 |
| THE RAMCO C | 638.1 | 641.25 |
| THE RUBY MI | 285.55 | 296.6 |
| THE STATE T | 139.5 | 144.55 |
| THE TINPLAT | 145.9 | 149.7 |
| THEMIS MEDI | 325.55 | 330.2 |
| THERMAX LTD | 1141.55 | 1130.7 |
| THIRUMALAI | 111.6 | 112.9 |

### బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| Alphageo | 475.15 | 479.95 |
| Alu Flouride | 121.95 | 123.85 |
| Amar Raja Bat | 730 | 739.65 |
| And Bank | 29.45 | 29.75 |
| And Cemen | 5.82 | 5.96 |
| And Paper | 442.6 | 447.4 |
| And Petro | 60.75 | 58.2 |
| Anjani Portl | 136 | 130 |
| Aries Agro Ltd | 99.8 | 102.2 |
| Aurobindo Ph | 722.3 | 731.7 |
| Avantel Soft | 222 | 226.55 |
| Avanti Feeds | 378 | 389 |
| AvonOrg | 7 | 6.7 |
| BN Rathi Sec | 27.85 | 27 |
| Bakelite | 19.45 | 20.45 |
| Balaji Amin | 456.8 | 459.5 |
| Bambino Agro | 199.95 | 199.2 |
| Baron Info | 0.19 | 0.19 |
| Bartronics | 7.23 | 7.22 |
| Bhagira Chem | 433.7 | 443.7 |
| Bhagya Nag | 31.2 | 31.35 |
| Bhaskar Agro | 20.35 | 19.4 |
| Brilliant Sec | 1.21 | 1.16 |
| CIL Securi | 18.6 | 17.8 |
| Color Chip | 18.15 | 18.95 |
| Combat Drugs | 19.9 | 20.9 |
| Cont Coffee | 268.75 | 271.9 |
| CoroFert | 448.35 | 450.5 |
| Cosboard Ind | 14.28 | 13.6 |
| Country Club | 7.4 | 7.44 |
| Cubex Tub | 15.2 | 14.6 |
| Cybermate | 2.44 | 2.43 |
| DR Reddy | 2600.6 | 2610.8 |
| Danlaw Tec | 102.6 | 104.9 |
| DecCement | 398.9 | 400.25 |
| Divi's Lab | 1471.2 | 1478.55 |
| Divya Granit | 87 | 90.4 |
| Dolphin Medi | 0.76 | 0.8 |
| Dredgin Corp | 463.05 | 470.45 |
| Empee Sugars | 1.22 | 1.27 |
| Everest Org | 103.95 | 103.85 |
| FinePlast | 6.09 | 5.8 |
| Fortune Info | 40.3 | 39.8 |
| Four Soft | 52.2 | 48.35 |
| GMR Ferro | 1.4 | 1.4 |
| GMR Infra | 15.95 | 16.45 |
| GVK Power | 7.87 | 8.03 |
| Galada Tele | 2.63 | 2.76 |
| Gati Corpn | 84.1 | 86.3 |
| Gayatri Proj | 176.6 | 179.05 |
| Gayatri Sugrs | 2.96 | 2.95 |
| Gennex Lab | 3.75 | 3.7 |
| GodavDru | 23.05 | 23.2 |
| Goldstn Tele | 240.7 | 230.45 |
| Goldstone Tech | 16.1 | 16.8 |
| Granules (I) | 89.65 | 90.8 |
| HBL Nife Pow | 28.75 | 28.85 |
| HYDIndus | 2038 | 2058 |
| Heritage Food | 525.4 | 528.75 |

# పబ్లిక్ చార్జింగా.. బుక్ అయిపోతారు!



**ఎక్కడ పడితే అక్కడ ఫోన్ చార్జింగ్ చేసుకుంటున్నారా?**

**అయితే కొంచెం జాగ్రత్త. అలా చేస్తే.. మీ బ్యాంక్ బ్యాలెన్స్ ఖాళీ కావచ్చు..**

**ప్రియురాలితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు నెట్‌కు ఎక్కేయవచ్చు...**

**ఏ ఇబ్బంది వద్దనుకుంటే ఇంత డబ్బు ఇవ్వమని ఫోన్‌కాల్స్ కూడా రావచ్చు!**

**అదెలా అని ఆశ్చర్యపోతున్నారా.. మీరు జ్యూస్ జాకింగ్ గురించి తెలుసుకోవాల్సిందే!**

పబ్లిక్ వైఫైలు వాడితే ఇబ్బంది ఉంటుందని చాలాకాలంగా వింటున్నాంగానీ.. ఇలా చార్జింగ్ చేసుకున్నా సమస్యలు తప్పవని ఇటీవలే తెలిసింది. ఇందులో టెక్నిక్ చాలా సింపుల్. ఎయిర్‌పోర్డులు, రైల్వే, బస్ స్టేషన్లతోపాటు చాలా షాపింగ్ మాళ్లలో స్మార్ట్‌ఫోన్ చార్జింగ్ స్టేషన్లు ఉంటాయి కదా.. హ్యాకర్లు అక్కడి యూఎస్‌బీ పోర్ట్‌లను మార్చేస్తారు. ఇదేమీ తెలియని మనం ఆ పోర్ట్‌కు మన ల్యాప్‌టాప్/ఫోన్‌లను కనెక్ట్ చేశామనుకోండి. గాడ్జెట్లు చార్జ్ అవుతాయిగానీ.. అదే సమయంలో వాటిలోని వివరాలను హ్యాక్ చేసేందుకు తలుపులు తెరుచుకుంటాయి అన్నమాట. హ్యాకర్లు మార్చేసిన యూఎస్‌బీ పోర్టులోనే సమాచారాన్ని తస్కరించేందుకు, స్టోర్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండటంతో ఇది సాధ్యమవుతుందన్నమాట. లేదంటే.. స్మార్ట్‌ఫోన్/ల్యాప్‌టాప్‌లోకి దురుద్దేశపూర్వకమైన మాల్‌వేర్‌ను జొప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ మాల్‌వేర్ ద్వారా డేటా మొత్తాన్ని లాక్ చేసేసి ఓపెన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేయవచ్చు. లేదంటే మీ బ్యాంక్ అకౌంట్‌లోకి లాగిన్ అయి (పాస్‌వర్డ్, యూజర్‌నేమ్ వంటివి మీరు గాడ్జెట్‌లో స్టోర్ చేసుకుని ఉంటే) డబ్బులు కాజేసేందుకూ అవకాశం ఉంటుంది. దీన్నే జ్యూస్ జ్యాకింగ్ అంటారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

## కొత్తదేమీ కాదు..



సైబర్ ప్రపంచంలో జ్యూస్ జాకింగ్ పేరు వినపడటం మొదలైంది ఈ మధ్యనే అయినప్పటికీ 2011లోనే కొంతమంది టెకీలు ఈ ప్రక్రియతో పాటు పేరును కూడా ఖాయం చేశారు. ఆ ఏడాది జరిగిన అంతర్జాతీయ హ్యాకర్ల సమావేశం డెఫ్‌కాన్‌లో కొంతమంది మార్చేసిన యూఎస్‌బీ పోర్టులతో ఒక చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. గాడ్జెట్ ఏదీ చార్జింగ్‌కు లేనప్పుడు ఈ స్టేషన్ తాలూకూ ఎల్‌సీడీ తెరపై ఉచిత చార్జింగ్ కేంద్రం అన్న ప్రకటన చూపుతూ ఉండగా.. స్మార్ట్‌ఫోన్/ల్యాప్‌టాప్‌ను అనుసంధానించగానే సమాచారాన్ని దోచుకునే మాల్‌వేర్‌ను జొప్పించేశారు. ఆ తరువాత దీని గురించి గాడ్జెట్ యజమానులకు వివరించి జాగ్రత్తలు తీసుకోమని చెప్పారు కూడా. అయితే అప్పటి నుంచి ఇటీవలి కాలం వరకూ ఈ జ్యూస్ జాకింగ్‌ను వాడింది చాలా తక్కువ. ఢిల్లీ రాజధానిలో ఒక యువకుడి స్మార్ట్‌ఫోన్‌ను హ్యాకర్లు ఇలా జ్యూస్ జాక్ చేశారన్న వార్తలు రావడంతో వారం పది రోజులుగా దీనిపై మళ్లీ చర్చ మొదలైంది.

## మరి ఏం చేయాలి?



ఏముంది.. ఎక్కడపడితే అక్కడ చార్జింగ్ చేసుకోకపోతే సగం సమస్యలు తీరిపోయినట్లే. ఇది జరగాలంటే వీలైనంత వరకూ మన ఫోన్/ల్యాప్‌టాప్ ఇంట్లోనే ఫుల్‌గా చార్జ్ చేసుకోవాలి. లేదంటే.. ల్యాప్‌టాప్ బ్యాటరీ ఒకటి ఎక్స్‌ట్రా పట్టుకెళ్లడం స్మార్ట్‌ఫోన్ విషయానికొస్తే మంచి పవర్‌బ్యాంక్ ఒకటి అందుబాటులో ఉంచుకోవడం. ఇవేవీ కుదరపోతే ఇంకో మార్గమూ ఉంది. చార్జింగ్ స్టేషన్లలోని యూఎస్‌బీ పోర్టులను ఉపయోగించకుండా.. అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ ప్లగ్‌ల ద్వారా మీదైన చార్జర్‌తో ఫోన్/ల్యాప్‌టాప్ చార్జ్ చేసుకోండి. ఎందుకంటే విద్యుత్తు ప్రవహించే చోట్ల డేటా ట్రాన్స్‌ఫర్ సాధ్యం కాదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో పబ్లిక్ యూఎస్‌బీ పోర్టు ద్వారానే చార్జ్ చేసుకోవాల్సి వస్తే.. మీ గాడ్జెట్‌ను ఆఫ్ చేసేయండి. దీంతో కూడా డేటా ట్రాన్స్‌ఫర్ జరగదు కాబట్టి ఎవరూ మీ గాడ్జెట్‌లోకి మాల్‌వేర్‌ను వేయడంగానీ.. సమాచారాన్ని తస్కరించడం గానీ జరగదు.

## గాంధీజీ జీవితమే దేశానికి స్ఫూర్తి

**మహాత్మాగాంధీ మనువడు, ప్రొఫెసర్ రాజమోహన్‌గాంధీ**



**పాతగుంటూరు:** జాతిపిత మహాత్మాగాంధీ జీవితమే దేశానికి స్ఫూర్తి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని గాంధీజీ మనువడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ రాజమోహన్‌గాంధీ అన్నారు. గుంటూరులో బుధవారం అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'గాంధీ సిద్ధాంతాలు, నేటి ఆవశ్యకత ' అంశంపై తెలుగునాట గాంధీ బాట చర్చా కార్యక్రమం జరిగింది. సభకు ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాజమోహన్‌గాంధీ పాల్గొని ప్రసంగించారు. గాంధీజీ పట్ల మనకు గౌరవం ఉంటే సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాడడమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అన్నారు. గాంధీజీ భావాలను ఆదర్శంగా తీసుకుని ఆయన వారసులుగా యువత నడవాలని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు నాట గాంధీ బాట పుస్తకాన్ని రాజమోహన్‌గాంధీ ఆవిష్కరించారు. రాజమోహన్ గాంధీ, ఉషా గాంధీ దంపతులను, స్వాతంత్ర్య సమరయోధుడు నూతక్కి సాంబశివరావు, నూతక్కి భాగ్యమ్మ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, మాణిక్యవేల్, కాంగ్రెస్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, అబ్దుల్ వహీద్, లింగంశెట్టి ఈశ్వరరావు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పుడు జోక్యం చేసుకోలేం



- హైకోర్టు విభజన వాయిదా వేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏపీ హైకోర్టులో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేనందున ఉమ్మడి హైకోర్టు విభజనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ అమలు ప్రక్రియను వాయిదా వేయాలంటూ ఏపీ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు సీతారాం, సభ్యుడు కాసాని జగన్మోహన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన బెంచ్ బుధవారం విచారించింది. పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రవీణ్ చతుర్వేది వాదిస్తూ.. ఏపీ హైకోర్టు భవనాలు, మౌలిక వసతుల కల్పన డిసెంబర్ 15 నాటికి పూర్తి చేస్తామంటూ ఏపీ ప్రభుత్వం కోర్టులో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. న్యాయమూర్తులు జోక్యం చేసుకొని.. ఇప్పటికే రెండు రాష్ట్రాల హైకోర్టుల కార్యకలాపాలు ప్రారంభమైనందున జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్లు కోరగా కోర్టు అనుమతించింది.

## ఆర్టీసీలో ఆర్నెళ్ల పాటు సమ్మె నిషేధం

- హడావుడిగా ఉత్తర్వులు జారీచేసిన యాజమాన్యం
- రవాణా మంత్రి అచ్చెన్నాయుడి ఆదేశాల ఫలితమేనా?

**సాక్షి, అమరావతి:** ఆర్టీసీ కార్మికులకు 50 శాతం ఫిట్‌మెంట్, ప్రభుత్వంలో విలీనం తదితర డిమాండ్లతో ఎంప్లాయీస్ యూనియన్ ఇచ్చిన సమ్మె నోటీసుతో బెంబేలెత్తిన యాజమాన్యం బుధవారం రాత్రి హడావుడిగా సమ్మె నిషేధ ఉత్తర్వులు జారీచేసింది. ఈయూ నేతలు బుధవారం మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ వెంటనే రవాణా మంత్రి ఎండీతో చర్చించారు. మంత్రి సూచన మేరకే యాజమాన్యం సమ్మె నిషేధ ఉత్తర్వులు జారీ చేసిందని కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఏపీ అత్యవసర చట్టం కింద సమ్మె నిషేధ ఉత్తర్వులు జారీ చేయడం వెనుక ఆంతర్యం ఏంటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. తమ సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 13 తర్వాత సమ్మెలోకి వెళతామని ఈయూ నేతలు ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య, ఎండీ సురేంద్రబాబుకు ఇటీవలే సమ్మె నోటీసిచ్చిన సంగతి తెలిసిందే. సంక్రాంతికి కార్మిక సంఘాలు సమ్మెకు వెళితే ఇబ్బందులు పడతామని యాజమాన్యం తర్జన భర్జన పడుతోంది. ఈయూ నేతలు మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి నోటీసివ్వడం, సమ్మె అనివార్యమయ్యే పరిస్థితులు కనబడటంతో ఆగమేఘాల మీద నిషేధ ఉత్తర్వులు జారీ చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఫైబర్‌గ్రిడ్ టార్గెట్‌లు!

**జనవరి ఆఖరుకు కోటి కనెక్షన్లు ఇవ్వాల్సిందే..**

- ఇప్పటికే ఉన్న కనెక్షన్లను తొలగించండి
- కిందిస్థాయి అధికారులకు ఉన్నతాధికారుల వేధింపులు
- వినియోగదారులు వద్దంటున్నా అంటకడుతున్న వైనం
- ఎన్నికల వేళ టీవీ చానళ్ల కట్టడికి ముఖ్యనేత కుట్ర
- గగ్గోలు పెడుతున్న కేబుల్ ఆపరేటర్లు

**సాక్షి, అమరావతి బ్యూరో:** ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రజాగొంతుకను నులిమేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బరితెగిస్తోంది. టీవీ చానళ్లను కట్టడి చేసి, కేవలం తమ అనుకూల మీడియా ప్రసారాలను మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఫైబర్‌గ్రిడ్ ముసుగులో ట్రాయ్ నిబంధనలను నిర్భీతిగా ఉల్లంఘిస్తోంది. అధికార యంత్రాంగాన్ని యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తోంది. వాళ్లకు టార్గెట్లు ఇచ్చి.. ఆ మేరకు చేయకపోతే వేధింపులకు గురిచేస్తోంది. ఇప్పటికే వేల కోట్ల ఫైబర్‌గ్రిడ్ కాంట్రాక్టులను ముఖ్యనేత బినామీలకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వ పెద్దలు తమ కుట్రలోని రెండో అంకానికి తాజాగా తెరతీశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 లక్షల ఇళ్లకు ఫైబర్ గ్రిడ్ కనెక్షన్లు ఉన్నాయి. 90 శాతం మంది ప్రజలు కేబుల్ ఆపరేటర్ల కనెక్షన్ల ద్వారానే తమకు ఇష్టమైన టీవీ కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. దీంతో ఆ కేబుల్ కనెక్షన్లను తొలగించి ఫైబర్‌గ్రిడ్ మాత్రమే ఉండేలా చూడాలని ముఖ్యనేత అధికారులను ఆదేశించారు. అందుకోసం రాష్ట్రంలో యావత్ రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. 2019 జనవరి ఆఖరుకు రాష్ట్రంలో కోటి ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. దాంతో ఫైబర్‌గ్రిడ్, జిల్లాల ఉన్నతాధికారులు.. కింది స్థాయి సిబ్బందిపై తమదైన శైలిలో చెలరేగిపోతున్నారు. ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లను నెలరోజుల్లో రెట్టింపు చేయించలేకపోయారని ఓ మండలస్థాయి అధికారిని కృష్ణా జిల్లాలో ఓ ఉన్నతాధికారి తీవ్ర పదజాలంతో దూషించారు. ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో ఆమె భర్త కీలక స్థానంలో ఉన్నారు. దీంతో ఆమె మరింతగా తమను వేధిస్తున్నారని మండల స్థాయి అధికారులు లబోదిబోమంటున్నారు. మండలస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల ఇళ్లకు ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లను బలవంతంగా ఏర్పాటు చేయిస్తున్నారు. తమకు నచ్చిన కేబుల్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవడం, నచ్చిన చానళ్లను చూసే హక్కు ప్రజలకు ఉంది. బలవంతంగా ఫైబర్‌గ్రిడ్‌గానీ ఇతర కనెక్షన్లుగానీ ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని ట్రాయ్ స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేస్తోండటం ముఖ్యనేత అప్రజాస్వామిక వైఖరిని తేటతెల్లం చేస్తోంది.

### లోపభూయిష్టంగా ఫైబర్‌గ్రిడ్

ఇంతగా ఒత్తిడి చేస్తూ ఏర్పాటు చేస్తున్న ఫైబర్‌గ్రిడ్ వ్యవస్థ సక్రమంగా సేవలు అందిస్తోందా అంటే అదీ లేదు. రాష్ట్రంలో ఫైబర్‌గ్రిడ్ వ్యవస్థ ప్రస్తుత సామర్థ్యం గరిష్టంగా 5 లక్షల కనెక్షన్లకే ఉంది. ఇప్పటికే 6 లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేశారు. టీవీ చానళ్ల మెరుగైన ప్రసారాల కోసం ప్రతి మండలంలో సబ్ స్టేషన్‌లో ఓఎల్‌టీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండాలి. కానీ కొన్ని నెలలుగా ఓఎల్‌టీల సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల తీవ్రమైన సాంకేతిక సమస్యలు తలెత్తుతూ ఫైబర్‌గ్రిడ్ ద్వారా టీవీ ప్రసారాలకు సక్రమంగా రావడం లేదు. మరోవైపు కేబుల్ ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారులు బదిలీ అయినా ఇతరత్రా కారణాల వల్ల బిల్లులు చెల్లించకున్నా సరే కేబుల్ ఆపరేటర్లు ఆ కనెక్షన్ల చందాను భరించాల్సి వస్తోంది. ఫైబర్‌గ్రిడ్‌లో భాగంగా అందిస్తున్న టెలిఫోన్ సేవల్లో బిల్లులు పారదర్శకంగా ఉండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఫైబర్ గ్రిడ్ కోసం జిల్లాకో సర్వీసు సెంటర్ ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రం అంతటికీ విజయవాడలో ఒక సర్వీసు సెంటర్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో రోజుకు సగటున 25 వేల ఫిర్యాదులు అందుతున్నాయి. అందుకు తగ్గ రీతిలో సర్వీస్‌సెంటర్ సేవలు అందించలేక చేతులెత్తేసింది. ప్రభుత్వ వ్యతిరేక చానళ్లు ప్రజలు చూడకుండా ఆపగలిగితే చాలు అనే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారని అధికారులు చెబుతున్నారు.

## రెవెన్యూ అధికారులపై ఫైబర్ పిడుగు


'మేము రెవెన్యూ అధికారులం.. ప్రభుత్వ విధులు చేయడం మా బాధ్యత.. కానీ కేబుల్ ఆపరేటర్ల మాదిరిగా ఇంటింటికీ తిరుగుతూ ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లు ఏర్పాటు చేయించడం ఏమిటి' ఇదీ రాష్ట్ర రెవెన్యూ అధికారుల ఆవేదన. అయితే ప్రభుత్వం మాత్రం వారు ఆ పని చేయాల్సిందే అంటోంది. తమకు సహకరించని అధికారులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. తాజాగా విజయవాడ పటమట తహసీల్దార్ ఎం. మాధురిని హఠాత్తుగా సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వం తమ ఉద్దేశాన్ని స్పష్టం చేసింది.

**అధికారులపై తీవ్ర వేధింపులు**

ముఖ్యనేత సన్నిహితుల అధీనంలో ఉన్న ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లు ఇంటింటికి తిరిగి ఏర్పాటు చేయాల్సిందేనని రెవిన్యూ అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. రానున్న ఎన్నికల్లో మీడియాను నియంత్రించే కుట్రతో ప్రస్తుతం ప్రజల ఇళ్లకు ఉన్న కేబుల్ కనెక్షన్లు తొలగించి మరీ ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యాలు పెట్టి మరీ వేధిస్తోంది. దీనిపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. కృష్ణా జిల్లాలో అధికారులపై ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంది. ఓ జిల్లా స్థాయి అధికారి పంతం పట్టి మరీ రెవెన్యూ అధికారులను వేధిస్తున్నారు. దాంతో కొన్ని రోజుల క్రితం జిల్లాలోని తహసీల్దార్లు సమావేశమై ఈ విషయంపై చర్చించారు. ఇదే పరిస్థితి కొనసాగితే సామూహిక సెలవు పెట్టాలని భావించారు.

**ఆందోళనలో అధికారులు**

రాష్ట్ర రెవెన్యూ సంఘ నాయకులకు తమ బాధలు ఏకరవు పెట్టారు. దీనిపై ఒకటి, రెండురోజుల్లో తుది నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగింది. సహేతుకమైన కారణం లేకుండానే పటమట తహసీల్దార్ ఎం.మాధురిని మంగళవారం రాత్రి సస్పెండ్ చేసింది. ఆమెను జిల్లా ఉన్నతాధికారులు పిలిపించి మందలించి మరీ సస్పెన్షన్ కాపీని చేతికి అందించినట్లు సమాచారం. దీనిపై ఆమె సహచర తహసీల్దార్లకు ఫోన్ చేసి తన ఆవేదనను వెళ్లగక్కారు. కొందరు అధికారులు జిల్లా ఉన్నతాధికారులతో చర్చించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. తమ చేతుల్లో ఏమీ లేదని, ఆమెను సస్పెండ్ చేయమని ప్రభుత్వ పెద్దల ఆదేశమని వారు చెప్పడం గమనార్హం. ఈ పరిణామాలపై రెవెన్యూ అధికారులు భగ్గుమంటున్నారు. ప్రస్తుతం తమ సంఘం నాయకులు విజయవాడలో లేనందున వారు రాగానే చర్చించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారు.



## బాపూ స్ఫూర్తికి చరఖా సాక్షి

సాదా సీదా కాదు.. ఇల్లంత చరఖాను ఈ విద్యార్థులు తయారు చేస్తున్నారు. బెంగళూరు చిత్రకళా పరిషత్‌లో ఈనెల 6న వార్షిక పెయింటింగ్స్ ప్రదర్శన (చిత్రసంత) జరగనుంది. గాంధీజీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా భారీ రాట్నాన్ని ఇందులో ప్రదర్శించనున్నారు. పరిషత్ విద్యార్థులు బుధవారం సుమారు 15 అడుగుల ఎత్తు, 22 అడుగుల పొడవైన రాట్నాన్ని ఇందుకోసం రూపొందిస్తున్న దృశ్యం.

– బెంగళూరు

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మువ్వన్నెల జెండా

**సాక్షి, హైదరాబాద్:** ప్రయాణికుల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను, స్ఫూర్తిని పెంపొందించే అతిపెద్ద మువ్వన్నెల జెండా బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఎగిరింది. దేశంలోని అన్ని ఎ–1 రైల్వేస్టేషన్‌ల వద్ద అతిపెద్ద జాతీయ జెండాలను ఏర్పాటు చేయాలని ఇటీవల రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేలో మొట్టమొదట సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఈ 100 అడుగుల పొడవైన జెండాను ఏర్పాటు చేశారు. స్టేషన్ మేనేజర్ సీబీఎన్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ క్యాబిన్‌మెన్ ఆర్.అశోకా చారి జెండాను ఆవిష్కరించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన త్రివర్ణపతాకం సమున్నతంగా గోచరిస్తూ ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపుతోంది. కార్యక్రమంలో సీనియర్ టెక్నీషియన్ గోపాల్‌రెడ్డి, జీఆర్‌పీ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సంబరం వెంటే విషాదాలు

- వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి
- బెంగుళూరులో కారు బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి
- తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అక్కాచెల్లెలు, డ్రైవర్ దుర్మరణం
- పెళ్లికి వెళ్లి వస్తుండగా గుంటూరు జిల్లా యడ్లపాడు వద్ద ప్రమాదం
- నలుగురి మృతితో రెండు కుటుంబాల్లో అలుముకున్న విషాదం



బెంగళూరు వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు

**కృష్ణరాజపురం (బెంగళూరు)/యడ్లపాడు (చిలకలూరిపేట):** వేగం.. ఏమరపాటు వెరసి నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి. వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలు ఏడుగురిని బలితీసుకున్నాయి. బెంగుళూరు వద్ద కారు బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు, గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడు వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మృతులంతా తూర్పుగోదావరి జిల్లాకే చెందిన వారు కావడం విషాదం. పెళ్లి వేడుకలకు వచ్చి వెళుతుండగా రెండు కుటుంబాలు, నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని తిరిగి వెళుతుండగా రెండు కుటుంబాలు ప్రమాదాల బారిన పడ్డారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఉంటున్న ఐటీ ఉద్యోగి బాల కిశోర్ (40) నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పుగోదావరి జిల్లా పసలపూడి గ్రామానికి కుటుంబంతో పాటు వెళ్లారు. వేడుకల అనంతరం మంగళవారం ఆయన భార్య ముళ్లపూడి శ్రీలత (37), కూతురు హర్షిణి (10)తో కలిసి బెంగళూరుకు కారులో బయలుదేరారు. వారితో పాటు శ్రీలత చెల్లెలు శ్రీలేఖ (32), ఆమె తనయుడు విష్ణేశ్ (5)లు కూడా అదే కారులో బయల్దేరారు. రాత్రి 11 గంటలకు చెన్నాపుర గేట్‌కు చేరుకోగానే కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. డ్రైవర్ శ్రీనాథ్ (45), శ్రీలత, శ్రీలేఖ ఘటనాస్థలంలోనే మరణించారు. బాలకిశోర్‌కు, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. గుంటూరు జిల్లా యడ్లపాడు వద్ద బుధవారం ఉదయం జరిగిన మరో ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం గెద్దనపల్లి గ్రామం నుంచి వచ్చి చిత్తూరు జిల్లా మదనపల్లెలో స్థిరపడిన వెంకటపతి సుందరరామరాజు (32), దంతులూరి సునీల్‌వర్మ కుటుంబాలు బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు డిసెంబర్ 28న తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో బుధవారం ఉదయం సునీల్‌వర్మ భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో కారులో బయలుదేరారు. రాజమండ్రిలోని రాజానగరం వద్ద 7 గంటలకు సుందర రామరాజు, భార్య సౌందర్య అదే వాహనంలో ఎక్కారు. గుంటూరు జిల్లా యడ్లపాడు సమీపంలో నిలిపి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుందర రామరాజు అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ సునీల్‌వర్మ భార్య సుష్మా (29), కూతురు కశ్విని వర్మ (2), తల్లి భారతి (54) మృతి చెందారు. సునీల్‌వర్మ, అతని మరోకుమార్తె జాహ్నవి, సుందర రామరాజు భార్య సౌందర్య చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ జె.శ్రీనివాస్, ఏఎస్‌ఐ శ్యామ్ మృతుల కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందుకుని కేసు నమోదు చేసుకున్నారు.



# రిజర్వ్‌డ్ అభ్యర్థులకు మొండిచేయే!

- ఎంపిక విధానం అంతా రహస్యం
- ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక అధికారం ఏపీపీఎస్సీకి కట్టబెట్టిన సర్కారు
- నోటిఫికేషన్లలో అభ్యర్థుల నిష్పత్తిని, ఎంపిక విధానాన్ని తెలపని కమిషన్

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో ఓపెన్ కేటగిరీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు మొండిచేయి తప్పదా? దీనిపై ఆయా వర్గాలకు చెందిన లక్షలాది మంది నిరుద్యోగుల్లో తీవ్ర ఆవేదన నెలకొన్నా ప్రభుత్వం మాత్రం మొండి వైఖరితో ముందుకు వెళుతోంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా జారీ చేసిన 21 నోటిఫికేషన్లలో స్క్రీనింగ్ టెస్టు నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక ఏ తీరున ఉంటుందో ఎక్కడా స్పష్టత ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన పెరుగుతోంది. గతంలో ప్రిలిమ్స్/స్క్రీనింగ్ టెస్టు అనేది కేవలం గ్రూప్–1 కేటగిరీ పోస్టులకు మాత్రమే ఉండేది. అయితే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అన్ని కేటగిరీ పోస్టులకూ దరఖాస్తుల సంఖ్య 25 వేలకు మించి వస్తే స్క్రీనింగ్ టెస్టును తప్పనిసరి చేసింది. అలాగే ప్రిలిమ్స్/ స్క్రీనింగ్ టెస్టు నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక తీరును ప్రభుత్వం గతంలో ఏపీపీఎస్సీకి నిర్దేశించేది. మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో ఎంపికచేసేలా 2016 నోటిఫికేషన్లలో పాటించారు. అయితే ఈసారి ప్రభుత్వం ఒక్కో పోస్టుకు ఎంతమంది అభ్యర్థులు అవసరమో నిర్ణయించుకోవడంతో పాటు కటాఫ్ మార్కులపైనా కమిషన్‌కే అధికారం కల్పించింది. ఆ కటాఫ్ మార్కు ప్రకారం ఎంపికయ్యే మొత్తం అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ కేటగిరీల్లో అభ్యర్థులు తగినంత మంది లేకుంటే... మిగతా వారిని కటాఫ్ మార్కులు తగ్గించి ఎంపిక చేసేలా కమిషన్‌కు వెసులుబాటు ఇచ్చింది. అయితే తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఏపీపీఎస్సీ స్క్రీనింగ్ టెస్టు/ ప్రిలిమ్స్‌కు సంబంధించి ఏ నిష్పత్తిలో ఎంపిక చేస్తారు? ఆ నిష్పత్తిని కేటగిరీల వారీగా అనుసరిస్తారా? లేదా? అనే అంశాలను ఎక్కడా పేర్కొనలేదు. ఇదే ఆయా వర్గాల నిరుద్యోగుల్లో పలు సందేహాలను కలిగిస్తోంది. ఆయా స్క్రీనింగ్ టెస్టులు ముగిసిన పిదప అభ్యర్థుల సంఖ్యను అనుసరించి నిష్పత్తి, కటాఫ్ మార్కులపై తాము నిర్ణయం తీసుకుంటామని ఏపీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులు తక్కువగా ఉంటే ఆమేరకు ఆ కేటగిరీల్లో కటాఫ్ మార్కులు తగ్గించి మిగతా వారిని ఎంపిక చేస్తామంటున్నారు. కానీ అలా కటాఫ్ మార్కుల తగ్గింపు ద్వారా ఎంపికైన వారు మెయిన్స్‌లో వారి రిజర్వ్‌డ్ కేటగిరీకి మాత్రమే పరిమితం కావలసి ఉంటుందని ఏపీపీఎస్సీ తన నోటిఫికేషన్లలో పేర్కొనడమే అభ్యర్థుల్లో ఆందళనకు కారణమవుతోంది. ప్రిలిమ్స్‌లో ఎక్కువ మార్కులు సాధించినా రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులను వారి కేటగిరీకే పరిమితం చేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ ఉత్తర్వుల్లో లేని నిబంధన నోటిఫికేషన్లో**

ప్రభుత్వం ఇచ్చిన జీఓ 5లో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక అధికారాన్ని ఏపీపీఎస్సీకి కట్టబెడుతూ రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు తగినంత మంది లేకుంటే కటాఫ్ మార్కులు తగ్గించి ఎంపిక చేసుకోవచ్చని మాత్రమే సూచించింది. కానీ ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లో జీఓలో లేకున్నా 'అలా ఎంపికయ్యే అభ్యర్థులు మెయిన్స్‌లో తమ రిజర్వ్‌డ్ కేటగిరీకి పరిమితం' అన్న నిబంధనను చేర్చింది.

### యూపీఎస్సీ తరహా అంటూ....

యూపీఎస్సీ తరహా విధానాన్ని అనుసరిస్తున్నట్లు కమిషన్ వర్గాలు చెబుతున్నా, యూపీఎస్సీలో కేటగిరీల వారీగానే ప్రిలిమ్స్‌నుంచి మెయిన్స్‌కు ఎంపికచేస్తారని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. మెయిన్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని వారి కులం కేటగిరీతో సంబంధం లేకుండా ఓపెన్ కేటగిరీకి ముందుగా ఎంపికచేసి, రిజర్వ్‌డ్ కేటగిరీలకు ఎంపికలు చేస్తారని వివరిస్తున్నారు. ఏపీపీఎస్సీ ఎంపిక విధానాన్ని నోటిఫికేషన్లో చెప్పకుండా తమకు అన్యాయం చేయాలని చూస్తోందని మండిపడుతున్నారు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఓపెన్ కేటగిరీకి అనర్హులని చెప్పడం ద్వారా ప్రభుత్వం తమకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కాలరాయడమేనని ధ్వజమెత్తుతున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ
గురువారం
3-1-2019




కొత్త సంవత్సరం... కొత్త ప్రయాణం



ఏక్ దీపిక దోసె పార్సిల్

సినిమాపేజిలో...

## చెట్టు నీడ

# ఏంటా ఆశ్చర్యం?

ఓ గురువు తన శిష్యులకు పాఠం చెబుతున్నారు. అప్పుడు ఓ నాస్తికుడు అక్కడికి వచ్చాడు. ఆ గురువుగారి తీరుతెన్నులను, విధానాలను కించపరుస్తూ మాట్లాడాడు. అవమానపరిచాడు. ఇదంతా అక్కడున్న శిష్యులు చూస్తూనే ఉన్నారు. వారికేమీ బోధపడలేదు. ఎందుకంటే అతనిని అంతకుముందెన్నడూ వారెవరూ చూడలేదు. తమ గురువుగారు ఎవరితోనూ గొడవపడటం కానీ వాదులాటకు దిగటం కానీ ఎప్పుడూ చూడలేదు. అసలాయనలో కోపమే ఎరుగరు. అటువంటిది ఎవరో ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చీరావడంతోనే రెచ్చిపోవడం వారికి విచిత్రంగా చూస్తున్నారు. గురువుగారు ఎలా స్పందిస్తారోనని వారిలో ఆసక్తి పెరిగింది.

మనసుకి ఏదనిపిస్తే అది మాట్లాడుతూ వచ్చిన ఆ నాస్తికుడు ''మిమ్మల్ని ఓ బౌద్ధ భిక్షువుగానో లేక జెన్ గురువుగానో నేనెందుకు స్వీకరించాలి... ఎందుకు నమస్కరించాలి'' అని అడిగాడు కటువుగా.

అతనలా అంటున్నప్పటికీ ఆ గురువుగారేమీ ఆగ్రహించలేదు. రెచ్చిపోలేదు. అతని మాటలను ఖండించలేదు.

అతనితో ఎంతోమర్యాదగానే మాట్లాడుతూ, ''మీరు చెప్పిందల్లా నిజమే. మీ సిద్ధాంతాలనూ మీ నమ్మకాలనూ నేను ఎందుకు కాదంటాను....మీ దారి మీది. నా దారి నాది. నేనేమీ మీ అభిప్రాయాలకు అడ్డురాను. కానీ ఒక్క విషయం... నేనే కాదు నాలాంటివారు ఓ ఆశ్చర్యాన్ని చెయ్యగలరు'' అన్నారా గురువు.

''అదేంటీ'' అని అడిగాడు నాస్తికుడు.

గురువుగారు ప్రశాంత చిత్తంతో ఇలా అన్నారు...

''ఎవరైనా తప్పు చేసినా, మాకు ద్రోహం చేసినా, అవమానించినా వారిపై మేము మండిపడం. కోప్పడం. ద్వేషం పెంచుకోము. వారి మాటలను అప్పటికప్పుడే మరచిపోతాము. అంతే తప్ప వాటిని మనసులో ఉంచుకుని లోలోపల రగిలిపోము....'' అని చెప్పారు.

అందుకే అంటారు జ్ఞానుల దగ్గర ఒకరిని క్షమించిన వాటి నీడలు కూడా చూడలేమని.

– యామిజాల జగదీశ్

## బ్యూటిప్స్

# బంగారుకాంతికి...



● పెసరపిండిలో కొద్దిగా పెరుగు, కొబ్బరి నూనె కలిపి చేతులకు రాయాలి. సున్నితంగా రబ్ చేసి, పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పెసరపిండి, పెరుగులో ఉండే గుణాలు నలుపుగా మారిన చర్మాన్ని సాధారణ రంగులోకి తీసుకువస్తాయి. కొబ్బరి నూనె చర్మాన్ని మరింత మృదువుగా మారుస్తుంది.

● టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.

● టేబుల్ స్పూన్ పెసర్లు, ఐదు బాదంపప్పులు రాత్రి నీళ్లలో నానబెట్టాలి. ఉదయాన్నే వీటిని పేస్ట్ చేసి, ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. మెడకు, గొంతుకు కూడా రాయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా అవుతుంది. చర్మం పొడిబారడం సమస్యే దరిచేరదు.

● పెరుగులో పెసరపిండి కలిపి రెండు రోజులు బయటే ఉంచాలి. తర్వాత రోజు ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, గంట తర్వాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే చుండ్రు తగ్గుతుంది. వెంట్రుకలకు మంచి కండిషనింగ్ లభించి మృదువు అవుతాయి.

● టీ స్పూన్ పెసరపిండిలో తగినంత పెరుగు కలిపి ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడిబారిన చర్మం మృదువవుతుంది.

## పాశుర ప్రభాతం 19వ రోజు

భగవంతుని నోరారా 'పలుకే బంగారమాయేనా' అని ప్రశ్నించే భావగంభీరత కేవలం భక్త హృదయానికి చెందిన స్వాధికారత. భక్తునికి మాత్రమే భగవంతునిపై సర్వాధికారం. అది స్వాభిమానానికే అలంకారం.



**కుత్తువిళక్కెరియ క్కొట్టుక్కాల్ కట్టిల్‌మేల్**
**మెత్తెన్ర పంచశయనత్తిన్ మేలేరి,**
**కొత్తలర్ పూంగుళల్ నప్పిన్నై కొఙ్గైమేల్**
**వైత్తుక్కిడన్ద మలర్ మార్‌పా! వాయ్ తిరవాయ్**
**మైత్తడమ్ కణ్ణినాయ్! నీయున్మణాళనై**
**ఎత్తనై పోదుమ్ తుయిలెళ వొట్టాయ్‌కాణ్!**
**ఎత్తనై మేలుమ్ పరివాత్త గిల్లాయాల్**
**తత్తువమన్రు తగవేలో రెమ్బావాయ్!**

**భావం:** అందమైన సౌధంలో చుట్టూ దీపాలు వెలుగుతుండగా సువిశాల పాన్పుపై లోక సంరక్షణా ఆలోచనాదక్షుడై నిద్రిస్తున్న శ్రీకృష్ణ పరంధాముని నిద్ర లపక ఎదురుచూస్తున్న నీలాదేవితో గోదాసమేత గోపికాబృందం తల్లీ! ఇకనైనా నీ స్వామిని నిద్ర లేపు. నీ పిలుపుతోనైనా నిద్ర లేచి మా మొర ఆలకిస్తాడేమో! శ్రీకృష్ణా! మేలుకో! తండోపతండాలుగా నీ పలుకుకై వేంచేసిన మమ్ములను నోరు తెరచి పలుకరించు. నీ మాటల విశ్వాసంతో ధైర్యంగా మా జీవనాన్ని సాగస్తామని ప్రార్థిస్తున్న శుభసందర్భం.



# అమ్మంటే ఇష్టం లేదు

**మన చేదు అనుభవాలు పిల్లలకు రావద్దుకుంటాం. మన గతం వెంటాడకూడదు అనుకుంటాం. కానీ మనమే అలాంటి పరిస్థితులు కల్పిస్తే... పిల్లల జీవితం ఏం కావాలి?**

'పదహారేళ్లంటే నీకేం తెలుసు. లోకం ఎలా ఉంటుందో తెలుసా? బయట ఎంత ప్రమాదమో తెలుసా? మనుషులు ఎన్ని రకాలుగా ఉంటారో తెలుసా? అసలు ఏం తెలుసని ఇంట్లో నుంచి పారిపోయావ్? పైగా ఆడపిల్లవి'

'....'

'మాట్లాడవేం?'

'అవన్నీ నాకు తెలుసో లేదో తెలియదు. కాని ఒక్కటి మాత్రం బాగా తెలుసు'

'ఏంటది'

'మా అమ్మకు నేనంటే ఇష్టం లేదు. అందుకే నాకు మా అమ్మంటే ఇష్టం లేదు'

ఆ జవాబుకు కన్సల్టేషన్ రూమ్‌లో నిశ్శబ్దం అలముకుంది

* * *

ఆ అమ్మాయికి అచ్చంగా పదహారేళ్లుంటాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బై.పి.సి ఇష్టమని చేరింది. కాని చదవదు. కాలేజ్‌కని వెళుతుంది. కాని వెళ్లదు. మాట విన్నట్టే కనిపిస్తుంది కాని వినదు. హుషారుగా ఉన్నట్టు అభినయిస్తుంది కాని నిజంగా హుషారుగా ఉండదు.

'నాకు చాలా బెంగ' అని మెసేజ్ పెట్టింది ఫేస్‌బుక్‌లో కనిపించిన హైస్కూల్‌నాటి ఫ్రెండ్‌కి.

'నాకూ బెంగే' అని కుర్రాడు అన్నాడు.

'మనిద్దరం కష్టసుఖాలు చెప్పుకుందామా?' అని టైప్ చేసింది.

'అందుకేగా నీతో ఫ్రెండ్‌షిప్ చేస్తోంది' అన్నాడు వాడు.

ఆ అమ్మాయి తన తొలి కష్టం చెప్పుకుంది.

'మా అమ్మంటే నాకు ఇష్టం లేదు'

'నాకు మా నాన్నంటే ఇష్టం లేదు. ఎప్పుడూ తిడుతుంటాడు' అన్నాడు వాడు.

ఇలా కొన్నాళ్లు మాటలు నడిచాయి. ఇద్దరూ పెనుకష్టాల్లో ఉన్నారని ఆ కష్టాలకు ఇళ్లే కారణమని ఇళ్లలో నుంచి పారిపోతే పూర్తి కష్టాలు పోతాయని ఇద్దరూ అనుకుని పారిపోయారు.

వైజాగ్ వెళ్లారు. అక్కడ ఏం చేయాలో తోచలేదు. అరకుకు వెళ్లి సాయంత్రం ఆ చీకటిని, తెలియని ముఖాలని చూసి బెంబేలెత్తారు. ఆ తర్వాత విజయవాడ వెళ్లారు. అక్కడి బస్ స్టేషన్‌లో ఆ అమ్మాయిని వదిలి ఇప్పుడే వస్తానని వాడు పారిపోయాడు. భయాన్ని తట్టుకోలేక ఇల్లు చేరాడని తర్వాత తెలిసింది. మొండి అమ్మాయి ఇంకో రోజు బెజవాడలోని బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో తిరిగి ఇల్లు చేరింది.

ఆడపిల్లకు ప్రమాదం, నష్టం జరిగడానికి వీలైన అన్ని పరిస్థితుల్లో ఆ అమ్మాయి ఆ రెండుమూడు రోజులు గడిపింది. ప్రమాదం, నష్టం జరిగాయా? తెలియదు. కాని ఇంటికి రాగానే తల్లితో యుద్ధాలు. తల్లికి కూతురితో యుద్ధాలు. ఇలా ఎంతకాలం అని భార్యనూ, కూతురిని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకొచ్చాడు తండ్రి.

* * *

ముందు ఎవరూ లేకుండా చేసి కూతురితో మాట్లాడాడు సైకియాట్రిస్ట్.

'ఊహ తెలిసినప్పటి నుంచి చూస్తున్నాను మా అమ్మ నాతో బాగుండదు. చీటికి మాటికి కోప్పడుతుంటుంది. కరెక్ట్ చేయాలని చూస్తుంటుంది. చూశారుగా నన్ను. కొంచెం పొట్టి. మా అమ్మా నాన్నల పక్కన ఎలుకపిల్లలా ఉంటాను వాళ్ల పర్సనాల్టీస్‌కి. అసలే కాన్ఫిడెన్స్ లేదు. చదువులో స్లో. ఫ్రెండ్స్ కూడా ఎక్కువ మంది నాతో కలవాలని అనుకోరు. ఇవన్నీ మా అమ్మకు డిస్‌శాటిస్ఫాక్షన్ అనుకుంటాను. అందుకని నాకు రిస్కీ ఫ్రెండ్‌షిప్స్ చేయడం అలవాటైంది. పక్కింటి అంకుల్‌తో, ఆటో అంకుల్‌తో, ఫేస్‌బుక్‌లో తెలియనివారితో ఇట్టే ఫ్రెండ్‌షిప్ చేస్తాను. తర్వాత వాళ్ల బిహేవియర్‌కి ఫ్రస్ట్రేట్ అవుతాను. ఒక ఫ్రెండ్‌తో ఇంట్లో నుంచి పారిపోతే వాడు కూడా నన్ను వదిలి పారిపోయాడు. నేను కోపంగా ఉంటానని మా అమ్మ అంటుంది. కాని మా అమ్మే కోపంగా ఉంటుంది. కాని సడన్‌గా ఒక డౌట్ వచ్చింది. ఏ తల్లీ సొంత బిడ్డతో ఇలా వ్యవహరించదు కదా... కొంపదీసి నేను ఈమెకు పుట్టలేదా? అని. అప్పుడు తెలిసింది...'

'ఏమని'

'నేను ఆమెకు పుట్టలేదు. మా పేరెంట్స్ నన్ను అడాప్ట్ చేసుకున్నారని. నాకు ఎనిమిదేళ్లప్పుడు ఆ సంగతి చెప్పారట..నాకు అర్థం కాలేదు... వాళ్లు ఆ సంగతి రిపీట్ చేయలేదు. టీనేజ్‌లోనే సరిగ్గా అర్థమైంది. ఇక ఇంట్లో ఎందుకుండాలి అనుకున్నాను' ఆ అమ్మాయికి ఏడుపు తన్నుకొచ్చింది.

సైకియాట్రిస్ట్ ఆ అమ్మాయిని మనసారా ఏడవనిచ్చాడు.

* * *

ఇప్పుడు ఎవరూ లేకుండా సైకియాట్రిస్ట్ ఆ అమ్మాయి తల్లితో మాట్లాడాడు.

'డాక్టర్... మాది కలిగిన కుటుంబమే. కాని చిన్నప్పటి నుంచి సంతోషం లేదు. మా నాన్న డ్రంకర్డ్. అమ్మను నిత్యం బాధించేవాడు. వేధించేవాడు. అనుమానించేవాడు. భయంకరమైన గొడవలను చిన్నప్పటి నుంచే చూస్తూ పెరిగాను. అలాంటి జీవితం నా సంతానానికి రాకూడదనుకున్నాను. పెళ్లితో అయినా నా జీవితం బాగుపడుతుందని ఆశించాను. నా అదృష్టం నా భర్త చాలా మంచివాడు. దురదృష్టం నా అత్తమామలు తగువులమారి స్వభావం ఉన్నవారు. 18 ఏళ్లకు పెళ్లయితే చిన్నదాన్నని కూడా చూడకుండా అన్ని పనులూ నా నెత్తినేసి సుఖం లేకుండా చేశారు. దానికి తోడు పిల్లలు పుట్టలేదు. ఏమిటా దురదృష్టం అని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను. చిన్నప్పటి డిప్రెషన్ ఇప్పటి డిప్రెషన్ అంతా కలిసి పేషెంట్‌లాగా మారాను'

'తర్వాత?' సైకియాట్రిస్ట్ అడిగాడు.

'అప్పుడు మావారే సర్దిచెప్పి అడాప్ట్ చేసుకుందామనుకున్నారు. అనాథ శిశుశరణాలయం నుంచి ఎనిమిది నెలల పాపను దత్తత తీసుకున్నాం. నాకు పిల్లలు ఇష్టమే. ఎన్నో కలలు కన్నాను పెంపకం విషయంలో. కాని పాప మా ఇద్దరికీ ఏ మాత్రం పొంతన లేని ఎత్తుతో పెరిగింది. తెలివితేటలు లేవు. దానికి తోడు ప్రవర్తన కూడా ఏమిటోగా ఉంది. దానిని కంట్రోల్ చేయబోయి దాని పట్ల గయ్యాళిగా మారాను. నేను ఎంత ప్రేమిద్దామనుకున్నా ఎందుకు నా బతుకు ఇలా అయ్యిందా అనే నెగెటివ్ ఆలోచన. నా జీవితం నరకంగా మారింది. నా భర్తతో కూతురితో ఆనందంగా నేను ఎలా గడపాలి?'... ఆమె కళ్లు ధారలు కట్టాయి.

> **ఆడపిల్లకు ప్రమాదం, నష్టం జరిగడానికి వీలైన అన్ని పరిస్థితుల్లో ఆ అమ్మాయి ఆ రెండుమూడు రోజులు గడిపింది. ప్రమాదం, నష్టం జరిగాయా? తెలియదు. కాని ఇంటికి రాగానే తల్లితో యుద్ధాలు. తల్లికి కూతురితో యుద్ధాలు.**

మనసును కుదుటపర్చడంలో కన్నీళ్లకు మించిన మందు లేదు.

సైకియాట్రిస్ట్ ఆమెను కూడా గుండె తేటపడే వరకు ఏడ్వనిచ్చాడు.

* * *

ఇప్పుడు గదిలో ముగ్గురూ ఉన్నారు. తల్లి కూతురు తండ్రి.

సైకియాట్రిస్ట్ మాట్లాడటం మొదలుపెట్టాడు.

'చూడండి... చీకటి అంటే వెలుతురు లేకపోవడం కాదు. ఇంకా రాకపోవడం. ఇంకా చెప్పాలంటే ఉన్న వెలుతురును చూడకపోవడం. మీరిద్దరూ జీవితంలో నెగెటివిటీని చూడటానికే అలవాటు పడి జీవితం పట్ల రోత పుట్టించుకున్నారు. (తల్లివైపు చూస్తూ) బాల్యంలో మీరు తల్లిదండ్రుల కొట్లాటలు చూశారు. కాని మీరొక కలిగిన కుటుంబంలో పుట్టారని ఏ పోలియో బాధో అనారోగ్య సమస్యో దేవుడు మీకు ఇవ్వలేదని చదువు అబ్బని తెలివితక్కువతనం ఇవ్వలేదని సంతోషపడలేదు. పెళ్లయ్యాక వేధించే అత్తామామలను చూసి శోకించారు తప్ప ఒక్క లోపం లేని భర్త దొరికాడని ఆనందించలేదు. ముఖ్యంగా మీకు పిల్లలు పుట్టరు అని డాక్టర్లు తేల్చినా లోపం మీదేనని చెప్పినా మిమ్మల్ని పన్నెత్తు మాట అనని భర్తను చూసి జీవితాంతం సంతోషంగా బతకొచ్చని మీరు అనుకోలేదు. దత్తతకు కుమార్తె దొరికితే దానికీ సంతోషపడలేదు. కళకళలాడే ఆడపిల్ల అనుకోక రూపం గురించి, ర్యాంకుల గురించి బాధ పడ్డారు. ఒక్కసారైనా మీరు మీకు ఏమేమి ఉన్నాయో లిస్టు రాసుకుంటే అవి లేనివాళ్లు కోట్లమంది కనిపించి ఉండేవారు. మీ దృష్టి రుణాత్మకం కావడంతో వచ్చిన సమస్య ఇది' అన్నాడు సైకియాట్రిస్ట్.

ఆ తర్వాత కూతురి వైపు చూశాడు.

'చూడమ్మా... ఎందరో పిల్లలు అడాప్ట్ చేసుకునే తల్లిదండ్రులు లేక బాధపడుతుంటే మంచి తల్లిదండ్రులను నీకు దేవుడు ఇచ్చాడని నువ్వు కొంచెం కూడా సంతోషపడటం లేదు. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతగా లేవు. అమ్మ వేధిస్తుంది అంటున్నావే తప్ప నాన్న నిన్ను ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటున్నాడని మాటవరసకు కూడా అనలేదు. సొంత ఇల్లు, కారు, మంచి కాలేజీ ఇవి ఎంతమందికి ఉన్నాయి. అమ్మ సమస్య ఏమిటో తెలుసుకోకుండా అమ్మ మీద డిమాండ్స్ పెట్టి ఆమెను బాధపెట్టావు. మీది అన్నీ ఉండి ఎక్కువైన బాధ. అసలు ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు హాయిగా జీవనం సాగించే పరిస్థితుల్లో ఉన్నారన్న దానికి మించిన అదృష్టం ఏముంది? మీరు యుద్ధాలు జరిగే నేల మీద, భూకంపాలు వచ్చే చోట, కరువు తాండవించే చోట లేరని కర్ఫ్యూ మధ్య లేరని అప్పుల్లో లేరని తెలుసుకుంటే పోల్చి చూసుకుంటే మీ జీవితం ఎంత వరప్రసాదమో తెలుస్తుంది. అసలు ముందు మీకు ఉన్న గొప్ప పాజిటివ్ విషయాలేమిటో చెప్తూ వెళతాను. నెగెటివ్ విషయాలు వాటికవే దూదిపింజల్లా తేలిపోతాయి' అన్నాడు సైకియాట్రిస్ట్.

సెషన్స్ మొదలయ్యాయి.

కొన్నాళ్లకు విడివిడిగా ఉన్న ఆ ముగ్గురు ఒక కుటుంబంగా బతకడం నేర్చుకున్నారు.

ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి,** సైకియాట్రిస్ట్

## నివాళి

# వేశ్యావాటికలో పుట్టిన నటుడు

**మురికికూపాల్లో కూడా మాటలు పూస్తాయి.**
**కష్టాలు చితక్కొట్టిన వేళ్లు కలాన్ని దృఢంగా పట్టుకోవడానికి చూస్తాయి.**
**'జిస్కా కోయీ నహీ ఉస్కాతో ఖుదా హై యారో' (ఎవరూ లేనివారికి భగవంతుడే తోడు) అని**
**'మొకద్దర్ కా సికిందర్'లో ఒక డైలాగ్.**
**ఖాదర్ ఖాన్‌కి దేవుని తోడు తప్ప మరేతోడూ లేదు.**
**మాటను ఊతంగా చేసుకుని అతడు ఎక్కిన ఎత్తు తలెత్తి చూడతగ్గది!**

చెట్టు మీద కాయకూ సముద్రంలో ఉప్పుకూ సంబంధం ఉందో లేదో కాని ఖాదర్ ఖాన్‌కూ మన అల్లు రామలింగయ్యకు మాత్రం సంబంధం ఉంది. నిజానికి ఖాదర్ ఖాన్ తన ఇంట్లో ఫొటో పెట్టుకోదగ్గ మేలు అల్లు రామలింగయ్య చేశారనే చెప్పాలి. కథ ఇది. తెలుగులో 'ఊరికి మొనగాడు' (1981) సినిమా చాలా పెద్ద హిట్. హిందీలో దానిని 'హిమ్మత్ వాలా' (1983)గా రీమేక్ చేశారు. దర్శకుడు తెలుగును తీర్చిదిద్దిన రాఘవేంద్రరావే. అప్పటికి హిందీలో ఖాదర్‌ఖాన్ నటుడుగా, రచయితగా గుర్తింపు పొందాడు. నటుడుగా నెగెటివ్ రోల్స్, అప్రధానమైన రోల్స్ చేస్తున్నాడు. రచయితగా హిట్ సినిమాలు ఇస్తున్నాడు. దక్షిణాది సినిమాలు హిందీలో రీమేక్ అయితే కొత్తగా రాస్తున్న రచయితవైపు చూడటం సహజం. అలా రాఘవేంద్రరావు దృష్టి ఖాదర్ ఖాన్ మీద పడింది. తెలుగు సినిమా చూసి సంభాషణల సారం అర్థం చేసుకొని హిందీ వెర్షన్‌కు డైలాగ్స్ రాశాడు ఖాదర్ ఖాన్. ఆ డైలాగ్స్‌ను క్యాసెట్‌లో రీడింగ్ ఇచ్చి మద్రాసు పంపాడు. వాటిని విన్న రాఘవేంద్రరావు వెంటనే బాంబేకి (అప్పట్లో అలానే పిలిచేవారు) ఫ్లయిట్ కట్టుకుని వెళ్లి ఖాదర్‌ఖాన్‌ని కలిశారు. 'డైలాగ్స్ చాలా బాగా రాశావు. హీరో జితేంద్ర కాబట్టి, విలన్ అంజాద్‌ఖాన్ కాబట్టి దిగుల్లేదు. కాని అల్లు రామలింగయ్య పాత్రకు నువ్వు రాసిన డైలాగులు చెప్పే యాక్టర్ హిందీలో ఎవరు? ఆ ఫ్లో, ఆ టైమింగ్ నువ్వు చదువుతుంటే ఆ పాత్ర నీదే అనిపించింది. నువ్వు చెయ్ దానిని' అన్నారు. 'నేనా... కామెడీయా' అన్నాడు ఖాదర్ ఖాన్. 'నువ్వే... కామెడీవే. నువ్వు చేస్తే హిందీలో అల్లు రామలింగయ్య అంతటివాడివవుతావు' అన్నారు రాఘవేంద్రరావు. 'హిమ్మత్‌వాలా'లో ఖాదర్ ఖాన్ ఆ పాత్ర చేశాడు. ఏ ముహూర్తాన చేశాడో చనిపోయేనాటి వరకు కామెడీ కింగ్‌గానే బతికాడు. అతడికి ఆ హాస్యకిరీటం పెట్టిన చేతులు తెలుగు వారివి అయినందుకు మనం సంతోషపడాలి.

ఖాదర్ ఖాన్ తెర జీవితం నవ్వులతో పండింది కాని అతడి బాల్యం కన్నీటి ఉప్పదనంతో బిరుసెక్కిపోయింది. అఫ్ఘనిస్తాన్‌లో కొండగాలికి పుట్టిన ముగ్గురు కొడుకులు చనిపోతే మిగిలిన నాలుగో కొడుకైనా బతకాలి అని చెప్పి ఆరేడేళ్ల ఖాదర్‌ఖాన్‌ను వెంటబెట్టుకుని అతని తల్లిదండ్రులు కాబూల్ నుంచి బాంబేకి వచ్చిపడ్డారు బిడారుతో కలిసి. చేతిలో చిల్లి గవ్వ లేదు. చిల్లి లేని గవ్వ కూడా ఆ నగరంలో ఊరికే రాదు. అందుకు కష్టపడాలి. కష్టపడాల్సిన తండ్రి భార్యను, బిడ్డను



● ఖాదర్ ఖాన్

వదిలేసి వేరే పెళ్లి చేసుకున్నాడు. తల్లీకొడుకులకు వేరే దారి లేక వేశ్యవాటికకు ఆసియా ఖండంలోనే పేరుపడ్డ కామాటిపుర మొదటి వీథిలో చిన్నగదిలోకి వచ్చి చేరారు. చుట్టూ వేశ్యలు, విటులు, తార్పుడుగాళ్లు, తాగుబోతులు, తగాదాలు, అల్లర్లు, అలగా జనాల బతుకు ఆక్రందనలు వీటిని వింటూ ఖాదర్ ఖాన్ పెరిగాడు. పెద్దలు తల్లికి మరో పెళ్లి చేస్తే మారుతండ్రి చేతిలో బాధలు పడ్డాడు. చదువు మానేద్దామనుకుంటే తల్లి ఒట్టు వేయించుకుంది– చదవాల్సిందేనని. ఒక పఠాన్ కంఠాన్ని తెగ్గోసుకోగలడుకాని మాట తప్పలేడు. తల్లి మాట కోసం టెక్నికల్ విద్యను పూర్తి చేసిన ఖాదర్‌ఖాన్ పిల్లలకు ట్యూషన్లు చెబుతూ కాలేజీలో పాఠాలు చెప్తూ ఖాళీ సమయాల్లో నాటకాలు వేస్తూ ముంబై మహానగరంలో ఉనికికి ప్రయత్నించాడు. అతడి దర్శకత్వంలో అప్పటికి పైకి రాని రాజేశ్ ఖన్నా నటించాడు. ఆ పరిచయంతో దర్శకుడు మన్‌మోహన్ దేశాయ్‌కు పరిచయం చేశాడు. అలా 'రోటీ' (1974) రచయితగా ఖాదర్ ఖాన్‌కు గుర్తింపు తెచ్చిన తొలి సినిమా అయ్యింది.

అయితే అసలు కథ ఇంకా మొదలుకావాల్సి ఉంది. ఆ వెంటనే మన్‌మోహన్ దేశాయ్ 'అమర్ అక్బర్ ఆంటోని' తల పెట్టాడు. అందులో ఒక మాస్ క్యారెక్టర్ అమితాబ్ చేయాలని ఖాదర్ ఖాన్‌కు చెప్పాడు. అప్పటి వరకు హిందీలో మాస్ క్యారెక్టర్‌లు వేరే తరహాగా ఉండేవి. ఖాదర్ ఖాన్ ఆ పాత్రను, భాషను మార్చాడు. కామటిపురాలో అలగా జనం మాట్లాడే 'అపున్', 'దారు', 'బేవ్‌డా' వంటి మాటలు పెట్టాడు. ఆ దిగువ భాష జనానికి పట్టింది. ఒక ట్రెండ్‌గా సెటిల్ అయ్యింది. యాంగ్రి యంగ్ మేన్ అమితాబ్‌ను మాస్ హీరో అమితాబ్‌గా మార్చిన పెన్ ఖాదర్ ఖాన్‌దే. ఆ తర్వాత వాళ్లిద్దరూ మంచి ఫ్రెండ్స్ అయ్యారు. వాళ్ల కాంబినేషన్‌లో 'మొకద్దర్ కా సికిందర్', 'మిస్టర్ నట్వర్‌లాల్', 'యారానా', 'కూలీ' వంటి సూపర్ హిట్స్ వచ్చాయి. 'లావారిస్' సినిమాలో అమితాబ్ ఒక ఫైట్‌లో సకల భాషల రౌడీలను కొడతాడు– ఆ భాషలు మాట్లాడుతూ. తెలుగు కూడా మాట్లాడటం తమాషాగా ఉంటుంది. జనం కేరింతలు కొట్టే ఈ తమాషాలు ఖాదర్ ఖాన్‌వే.





ఖాదర్ ఖాన్ తెలుగు నుంచి రీమేక్ అయిన చాలా సినిమాలకు రాశాడు. తెలుగు నటులు పోషించిన పాత్రలను పోషించాడు. 'జస్టిస్ చౌదరి' (జస్టిస్ చౌదరి), 'జాని దోస్త్' (అడవి సింహాలు), 'మవ్వాలి' (చుట్టాలున్నారు జాగ్రత్త), 'తోఫా' (దేవత), 'మక్సద్' (ముందడుగు), 'హైసియత్' (సీతారాములు), 'ఖైదీ' (ఖైదీ), 'సింఘాసన్' (సింహాసనం) ఇవన్నీ ఖాదర్ ఖాన్ రాసి, నటించిన సినిమాలు.

ఖాదర్ ఖాన్ హిందీ సినిమా రంగంలో చాలామందికి సుదీర్ఘమైన కెరీర్ ఇచ్చాడు. డేవిడ్ ధావన్ వంటి దర్శకుడు తయారవడంలో ఖాదర్ ఖాన్ పాత్ర ఉంది. కథల వరుస ఎలా ఉండాలో అని అగమ్యంగా ఉన్న నటుడు గోవిందాని కామెడీ బాట పట్టించినవాడు ఖాదర్ ఖాన్. గోవిందా, ఖాదర్ ఖాన్, శక్తికపూర్‌లు కలిసి 1990లలో ఒక పదేళ్ల పాటు తెర మీద చాలా సందడి చేశారు. అది టేస్ట్ ఉన్న కామెడీ కాకపోవచ్చు కాని నవ్వొచ్చే కామెడీయే.



● గోవిందాతో ఖాదర్ ఖాన్

ఖాదర్ ఖాన్ కోపం మనిషి. పటాటోపాలు నచ్చని మనిషి. అమితాబ్ తన స్టేటస్‌ను పెంచుకోవడంలో భాగంగా తనను అందరూ 'సర్‌జీ' అని పిలవాలని బాలీవుడ్‌లో ఆదేశాలు జారీ చేసినప్పుడు 'అతన్ని నేను అమిత్ అని పిలవడం అలవాటు. నా అలవాటును మార్చుకోను. అతనితో పని చేయను' అని తెగేసి చెప్పి అలాగే ఉన్న నటుడు ఖాదర్ ఖాన్. 'నా చేతి వాచీ లక్ష రూపాయలు తెలుసా' అని గోవిందా ఫోజు కొడితే 'నా చేతివాచీ నూట యాభయ్యే. అది కూడా కరెక్ట్ టైమే చూపిస్తుంది' అని వాత వేసిన వాడు అతను.


కాలం మారాక ఖాదర్‌ఖాన్ మెల్లగా సినిమాలకు దూరంగా ఉన్నాడు. ఉర్దూ, అరబ్బీలు నేర్పే ఇన్‌స్టిట్యూషన్ నడిపాడు. పేద ముస్లింలు హజ్ యాత్ర చేయడానికి సాయపడే సంస్థను నిర్వహించాడు. ఆయన పిల్లలు కెనడాలో స్థిరపడ్డారు. అక్కడే ఆయన డిసెంబర్ 31, 2018న 81వ ఏట కన్ను మూశాడు.

గట్టి ఎదురుదెబ్బలను, గొప్ప జీవితానుభవాలను సిరా చుక్కలుగా మార్చుకోగలిగినవాడు రచయితగా రాణించగలడని, సులువు తెలిసినవాడు నటుడుగా వెలగగలడని చెప్పినవాడు ఖాదర్ ఖాన్. రాసి రాసి అలసిపోయిన ఆ నట రచయితకు వీడ్కోలు చెప్పి అతడు పూయించిన నవ్వులను పెదాల మీదకు తెచ్చుకోవడమే అతనికి మనం అర్పించగలిగిన నివాళి.

– కె.

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
విజయవాడ ॥ గురువారం
3-1-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని ప్రేమిస్తున్నాను. తనకి ఆల్‌రెడీ లవర్ ఉంది. ఆ విషయం ముందే తెలియడంతో తనకి నేను ప్రపోజ్ చెయ్యలేదు. తనంటే నాకు చాలా ఇష్టం. తను నా లైఫ్‌లో ఉంటే బాగుండేదని అనిపిస్తోంది. ఇప్పుడు నేనేం చెయ్యాలి అన్నయ్యా?

– శ్రీహర్షిణి

అడిగేసెయ్యాలి!

'ఏంటి సార్? మీ చెల్లెలు ఫూల్ అయిపోతుందేమో సార్?'

నీలూ...! ఇట్ ఈజ్ బెటర్ టు బికమ్ ఏ ఫూల్ దేన్ బీ అఫ్రైడ్ నీలూ!!

'అంటే భయపడుతూ... బాధపడుతూ.. అడిగుంటే బాగుండేదేమో అనుకుంటూ... డౌట్‌లో జీవించడం కంటే అడిగి తేల్చేసుకోవడం బెటర్ అంటారు. ప్రాబ్లమ్ ఉండదు అంటారు కదా సార్?!'

కానీ అబ్బాయి ఒప్పుకుంటే మాత్రం ప్రాబ్లమ్ నీలూ!

'ఏంటి సార్? ఈ తికమక ట్విస్టులు..! ముందు అడగమంటారు.. అడిగాక ఒప్పుకుంటే ప్రాబ్లమ్ అంటారు.. అసలు మిమ్మల్ని సజెషన్ అడిగి బుక్ అయిపోతున్నారు సార్ ఈ లవర్స్..!! వీళ్లకెప్పుడు బుద్ధి వస్తుందో.. ఎప్పుడు మీకు రిక్వెస్ట్‌లు ఆపుతారో... అసలు ఎందుకు మిమ్మల్ని అడిగి కన్ఫ్యూజ్ అవుతారో... నాకైతే అర్థం కావడం లేదు. అయినా అబ్బాయి ఒప్పుకుంటే ప్రాబ్లమ్ ఏమిటో క్లియర్‌గా చెప్పండి సార్. నాకు తెలియాలి.''

ఆల్‌రెడీ ఇంకో అమ్మాయిని ప్రేమిస్తున్న వాడు శ్రీహర్షిణి ప్రపోజల్ వినగానే గంతులేస్తూ ఒప్పుకున్నాడనుకో లేదా నాటకీయంగా కొంచెం టైమ్ తీసుకుని తరువాత అయినా ఓకే చెప్పాడనుకో... అంటే మొదటి అమ్మాయికి మోసం చేసిన వాడే అవుతాడు కదా..!? ఆ అమ్మాయి కూడా ఓ ఇంటి బంగారు తల్లే కదా... ఆ అమ్మాయిని అలాగే లైన్లో పెట్టి క్రిమినల్‌గాడు శ్రీహర్షిణిని వాడేసుకోవాలని ప్లాన్ నడిపితే... పెద్ద ప్రాబ్లమ్ కదా నీలూ?!?

'అయ్యో సార్! అసలు విషయం తెలియక మిమ్మల్ని చాలా అనేశాను. అయినా ఇదే విషయం కన్ఫ్యూజన్ లేకుండా కూడా చెప్పొచ్చు కదా సార్?'

చెప్పొచ్చు నీలూ..! చదివే వాళ్లకు అర్థం కావాలిగా!?!

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2 | 4 | 3 | 1 | | 6 | | |
| 9 | | | | | | | | |
| 6 | 7 | 1 | | | 4 | | | |
| 5 | 8 | 6 | 1 | 9 | | | 2 | 7 |
| | | 3 | 8 | | 2 | 9 | | |
| 2 | 9 | | | 4 | 5 | | 3 | 8 |
| | | | 9 | | | 7 | 6 | 2 |
| | | | | | | | | 9 |
| | | 9 | | 2 | 8 | 3 | 4 | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 3 | 2 | 5 | 8 | 9 | 7 | 6 | 1 |
| 8 | 5 | 1 | 3 | 7 | 6 | 4 | 2 | 9 |
| 6 | 7 | 9 | 2 | 1 | 4 | 5 | 8 | 3 |
| 2 | 4 | 3 | 7 | 6 | 5 | 1 | 9 | 8 |
| 1 | 9 | 6 | 8 | 4 | 3 | 2 | 7 | 5 |
| 7 | 8 | 5 | 9 | 2 | 1 | 6 | 3 | 4 |
| 3 | 2 | 4 | 6 | 5 | 8 | 9 | 1 | 7 |
| 5 | 6 | 8 | 1 | 9 | 7 | 3 | 4 | 2 |
| 9 | 1 | 7 | 4 | 3 | 2 | 8 | 5 | 6 |

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?




దేవదాసు మనవడో
మన్మధుడికి వారసుడో
కావ్యములో కాముడో
అంతకన్నా రసికుడో
పర్ఫ్యూమ్ నవ్వుతో హత్తుకునే యవనుడు
కన్నె కళ్లలో కలలేవీ వదలడు
హార్మోన్స్‌లోనా సెగలు రేపు పొగలు
షార్ట్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ వీడి ముద్దు పేరు

మిస్టర్ మజ్ను కైపుకి కజిను
మిస్టర్ మజ్ను కన్నెల ప్రిజను
॥దేవదాసు॥
నిన్నలోన ఉండడే రేపు మనకే దొరకడే
ఈరోజంతా మనదేనన్నా గ్రంధసంగుడే
ఉన్న చోటే ఉండడే వన్నె చాటు కృష్ణుడే

గుండెల్లోనా బాణమల్లే వీడు
ఎన్నాళ్లున్నా నొప్పి తెలియనీడు
మిస్టర్ మజ్ను కైపుకి కజిను
మిస్టర్ మజ్ను కన్నెల ప్రిజను

చిత్రం : మిస్టర్ మజ్ను
రచన : శ్రీమణి
గానం : రమ్య ఎన్.ఎస్. కే
సంగీతం : తమన్

## రాజన్నా.. నిన్నాపగలరా..


మమ్ముట్టి

మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'యాత్ర'. మమ్ముట్టి టైటిల్ రోల్ పోషించారు. మహీ వి. రాఘవ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించారు. 'యాత్ర'లోని రెండవ పాట 'రాజన్నా నిన్నాపగలరా..'ను ఇటీవల రిలీజ్ చేశారు. ''ఒక ముఖ్యమంత్రి అభ్యర్థి నేరుగా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకోవడాన్ని, దాంతో ప్రజలంతా పొందిన ఆనందాన్ని ఈ పాటలో చూపించబోతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'యాత్ర' చిత్రాన్ని ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తున్నాం. తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: కె, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, కెమెరా: సత్యన్ సూర్యన్.

# 2 కోట్ల సెట్... 2 నిమిషాలే!


కమల్‌హాసన్

'2.0' రిలీజ్ టైమ్‌కే దర్శకుడు శంకర్ తన నెక్ట్స్ చిత్రం 'ఇండియన్ 2' సినిమా పనులతో బిజీ అయిపోయారు. గతేడాది డిసెంబర్ 14న ఈ చిత్రం షూటింగ్ స్టార్ట్ చేద్దాం అని ప్లాన్ కూడా చేశారు. కానీ 'భారతీయుడు' రెగ్యులర్ షూటింగ్ కొంచెం ఆలస్యంగా ప్రారంభం కానుందట. కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996 వచ్చిన చిత్రం 'భారతీయుడు'. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ రూపొందిస్తున్నారు. ఈ సీక్వెల్‌లో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ జనవరి 18న మొదలు కానుందని కోలీవుడ్ టాక్. ఈ సినిమా కోసం కాజల్ అగర్వాల్ కేరళ మార్షల్ ఆర్ట్ కలరి పయ్యట్టు నేర్చుకోనున్నారు. కమల్ కనిపించనున్న పాత్రల్లో తాత పాత్ర ఒకటి. దీని కోసం కమల్‌హాసన్ బరువు తగ్గారు కూడా. ఈ సినిమా బడ్జెట్ విషయంలో అస్సలు కాంప్రమైజ్ కాకూడదని దర్శకుడు శంకర్ ఫిక్స్ అయినట్టున్నారు. ఈ సినిమాలో ఓ సెట్ కోసం సుమారు 2 కోట్లు వరకూ వెచ్చించారట. గోల్డ్ సెట్ అని పిలిచే దీని తయారీకు కావాల్సిన వస్తువులను ప్రత్యేకంగా చైనా నుంచి తెప్పించారు. 2 కోట్లతో వేయించిన ఈ సెట్ సినిమాలో 2 నిమిషాలు కూడా కనిపించదట. సెట్స్ వర్క్‌తో పాటు నేచురల్ లొకేషన్స్‌లోనూ పలు సీన్స్ ప్లాన్ చేశారు. ముఖ్యంగా కీలక సన్నివేశాలను ఉక్రెయిన్ దేశంలో షూట్ చేయనున్నారట. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, శింబు కూడా కీలక పాత్రలు పోషించే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. 2020లో రిలీజ్ కానుంది.

### హృతిక్‌తో శంకర్?


హృతిక్

'భారతీయుడు 2' తర్వాత దర్శకుడు శంకర్ చేయబోయే ప్రాజెక్ట్‌లో హీరోగా హృతిక్ రోషన్ కనిపించనున్నారని బాలీవుడ్ టాక్. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఈ చిత్రకథ ఉండబోతోందట. ఆల్రెడీ శంకర్ వినిపించిన ఐడియా హృతిక్‌కు నచ్చిందని, 'భారతీయుడు 2' తర్వాత ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుందని భోగట్టా.

## ఆ వార్త నిజం కావాలి


కియారా అద్వానీ

'కళంక్, కబీర్ సింగ్, గుడ్ న్యూస్'....బాలీవుడ్‌లో కియారా అద్వానీ నటిస్తున్న సినిమాల లిస్ట్ ఇది. తాజాగా ఈ లిస్ట్‌లోకి దాదాపు పదేళ్ల క్రితం ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన 'లవ్ ఆజ్ కల్' చిత్రం సీక్వెల్ కూడా చేరిందని బాలీవుడ్‌లో వార్తలు వచ్చాయి. ''ఇంతియాజ్ సార్ దర్శకత్వంలో రూపొందనున్న ఓ సినిమాలో నేను కథానాయికగా ఎంపికయ్యానని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతానికైతే ఆయన కానీ, ఆ టీమ్ కానీ నన్ను సంప్రదించలేదు. అయినా ఈ వార్త నిజం కావాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. గతేడాది మహేశ్‌బాబు 'భరత్ అనే నేను' సినిమాతో తెలుగుతెరపై కనిపించిన కియారా ఈ ఏడాది రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' సినిమాలో కథానాయికగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది.

## హల్వా కావాలా బాబూ!


కంగనా

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు ఎక్కువమంది బాలీవుడ్ స్టార్స్ విదేశాలకు వెళ్లి మస్త్ మజా చేస్తే కంగనా రనౌత్ మాత్రం సొంతింట్లోనే వేడుక చేసుకున్నారు. గతేడాది కంగనా హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఓ ఇల్లు కొనుక్కున్నారు. న్యూ ఇయర్‌కు ముందు రోజు కిచెన్‌లోకి వెళ్లి ఆమె గరిటె తిప్పి హల్వా ప్రిపేర్ చేశారు. కంగనా వంట చేస్తున్న ఫొటోను ఆమె సోదరి రంగోలి షేర్ చేశారు. ఇక్కడున్న ఫొటో అదే. హల్వా కావాలా బాబు? అని అడిగేలా ఉంది కదా కంగనా స్మైల్. మరి.. టేస్ట్ ఎలా ఉందనే విషయం మైకుల ముందుకు వచ్చినప్పుడు కంగనానే అడిగి తెలుసుకుందాం. ఇక ఆమె నటిస్తున్న సినిమాల విషయానికి వస్తే... వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితం ఆధారంగా కంగనా రనౌత్ టైటిల్ రోల్ చేసిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రస్తుతం ఆమె అశ్వనీ అయ్యర్ తివారి దర్శకత్వంలో 'పంగా' అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత స్వీయ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీని తెరకెక్కించాలని కంగనా అనుకుంటున్నారట.

## ఏక్ దీపిక దోసె పార్సిల్


దీపికా పదుకోన్

అమెరికాలో టెక్సాస్ ప్రాంతంలోని దోసె ల్యాబ్స్ దగ్గర వేరే ఏ దోసె అడిగినా ఆర్డర్ కొంచెం ఆలస్యం అవ్వచ్చేమో కానీ.. అదే 'దీపికా పదుకోన్ దోసె' అనగానే ఆలూ, చిల్లీతో నిండిన వేడి వేడి మసాలా దోసె మన ముందు కొస్తుంది. సినిమా స్టార్ల పేర్లు నచ్చిన వాటికి పెట్టడం చాలాసార్లే విన్నాం.. చూశాం. తాజాగా టెక్సాస్‌లో 'దోశ ల్యాబ్స్' అనే స్ట్రీట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో ఓ దోసెకు దీపికా పదుకోన్ పేరును పెట్టుకున్నారు హోటల్ యాజమాన్యం. ట్వీటర్‌లో ఈ విషయాన్ని చూసిన దీపిక 'ఎవరెవరికి ఆకలిగా ఉందోచ్..' అంటూ తన ట్వీటర్‌లో ఈ విషయాన్ని వడ్డించారు. ''కొత్త సంవత్సరం ఇంతకన్నా గొప్పగా ప్రారంభం అవ్వదనుకుంటా. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు'' అని ట్వీట్ చేశారామె. వెంటనే ''మేడమ్ నార్త్ ఇండియాలో (పూణే) దీపికా పదుకోన్ పరాతా ఫుల్ ఫేమస్ అంటూ మరో హోటల్ సర్వ్ చేసే మెనూ పిక్ పోస్ట్ చేస్తూ రిప్లై చేశారో నెటిజన్. ''నేనా హోటల్‌కి వెళ్తే కచ్చితంగా 'దీపికా పదుకోన్ దోసె ఆర్డర్ ఇచ్చేవాణ్ణి'' అని సరదాగా పేర్కొన్నారు దీపికా భర్త రణ్‌వీర్ సింగ్.

# 20 ఏళ్ల కిందటి రజనీని చూస్తారు


'పేట'లో రజనీకాంత్

''రజనీకాంత్‌గారికి నేను పెద్ద అభిమానిని. బస్ కండక్టర్ నుంచి ఆల్ ఇండియా సూపర్ స్టార్‌గా ఎదిగారాయన. పైగా మంచి సేవాగుణం ఉంది. అందుకే రజనీకాంత్‌గారే నాకు స్ఫూర్తి. ఈ రోజు స్టేజ్‌పైన ఆయన పక్కన నిలబడే అవకాశం నాకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇందుకు నేనెంతో కష్టపడ్డాను కూడా'' అని నిర్మాత వల్లభనేని అశోక్ అన్నారు. రజనీకాంత్ హీరోగా, త్రిష, సిమ్రాన్ హీరోయిన్లుగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'పేట్టా'. ఈ చిత్రాన్ని 'పేట' పేరుతో వల్లభనేని అశోక్ ఈ నెల 10న తెలుగులో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ– ''ఇందులో 20 ఏళ్ల కిందటి రజనీని చూస్తారు. 'బాషా, ముత్తు, నరసింహ' సినిమాల కంటే మరో లెవల్‌లో 'పేట' సినిమా ఉంటుంది. ఈ సంక్రాంతికి మూడు పెద్ద సినిమాల మధ్యలో మా సినిమా రిలీజ్ అవుతోంది. థియేటర్లు చాలా తక్కువగా దొరికాయి. కానీ, సినిమా బాగుంది కాబట్టి విడుదల తర్వాత థియేటర్లు పెరుగుతాయనే నమ్మకం ఉంది. 'పేట' సినిమా తెలుగు హక్కుల కోసం చాలామంది పోటీ పడ్డారు. మా బ్యానర్‌లో ఈ మధ్య 'నవాబ్, సర్కార్' చిత్రాలను మంచి పబ్లిసిటీతో రిలీజ్ చేశాం. ఆ నమ్మకంతోనే సన్ పిక్చర్స్ వారు.. వేరే వారు ఆఫర్ చేసిన ఫ్యాన్సీ రేటుకంటే కోటిన్నర రెండు కోట్లు తగ్గించి నాకు ఇచ్చారు. ఇందుకు వారికి ధన్యవాదాలు. ఈ నెల 6న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహిస్తున్నాం. రజనీగారితో పాటు యూనిట్ అంతా వస్తారు. మా నాన్నగారు బ్రెయిన్ ట్యూమర్‌తో చనిపోయారు. అప్పటి నుంచి నా వంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ఇందులో భాగంగా ఇదే వేదికపై కొన్ని అనాథాశ్రమాలకు, ఇతర సేవలు అందిస్తున్న కొందరికి రజనీగారి చేతుల మీదుగా చెక్‌లను అందిస్తాం. ఈ ఏడాది తెలుగులో ఓ స్ట్రయిట్ సినిమా చేయనున్నాం. ప్రస్తుతం కథలు వింటున్నా'' అన్నారు.


అశోక్ వల్లభనేని

## దొంగ లక్ష్యం ఏంటి?


సప్తగిరి

హాస్య నటుడి నుంచి హీరోగా మారిన వారిలో సప్తగిరి ఒకరు. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎల్ఎల్‌బీ' చిత్రాలతో హీరోగా తనకంటూ ఓ రూట్‌ని ఏర్పరచుకున్న ఆయన నటిస్తోన్న తాజా చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' ఫేమ్ అరుణ్ పవార్ దర్శకత్వం వహిస్తున్నారు. వైభవీ జోషీ కథానాయికగా నటిస్తున్నారు. శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ పవార్ మాట్లాడుతూ– ''ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. పేరుకి చిలిపి దొంగ అయినా ఓ లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం అతనేం చేశాడన్నదే ఈ సినిమా కథాంశం. కడుపుబ్బా నవ్వించే అంశాలతోపాటు, యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు ఉన్నాయి'' అన్నారు. ''ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది'' అని నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి అన్నారు. అర్చనా వేద, 'టెంపర్' వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ: జి.టి.ఆర్. మహేంద్ర, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : సలాన బాల గోపాలరావు, స్క్రీన్‌ప్లే–దర్శకత్వం: అరుణ్ పవార్.

# డిఫరెంట్ ఉన్మాది


శిరీష, ఎన్.ఆర్. రెడ్డి

''ఉన్మాది' లాంటి సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ చేయడానికి చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్. రెడ్డిగారు ధైర్యం చేసి ఈ సినిమా తీశారు. ట్రైలర్ చాలా బాగుంది. హీరోయిజమ్, విలనిజమ్ చూపించదగిన పాత్రలో ఎన్.ఆర్. రెడ్డిగారు నటించారు. తమిళ్‌లో రాజ్‌కుమార్‌గారు కూడా ఇదే వయసులో హీరోగా పరిచయం అయ్యారు'' అని డైరెక్టర్ ఎన్.శంకర్ అన్నారు. ఎన్.ఆర్. రెడ్డి కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఉన్మాది'. ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో ఎన్. రామారావు నిర్మించారు. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను నిర్మాత రాజ్ కందూరి విడుదల చేయగా, ట్రైలర్‌ను ఎన్.శంకర్ ఆవిష్కరించారు. ''స్వర్గీయ హరికృష్ణగారికి నేను ఫ్యాన్. ఆయనే నాకు స్ఫూర్తి. 'ఉన్మాది' సినిమాలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. రాఘవ ఎంతో సపోర్ట్ ఇచ్చారు. ఈ కథ డిఫరెంట్‌గా ఉంటుంది'' అన్నారు ఎన్.ఆర్.రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: దంటు వెంకట్, నిర్వహణ: ఎన్.వరలక్ష్మి.

## ఫిబ్రవరిలో నటసార్వభౌమ


పునీత్ రాజ్‌కుమార్

కన్నడ సూపర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ హీరోగా రూపొందిన చిత్రం 'నట సార్వభౌమ'. అనుపమా పరమేశ్వరన్, రచితారామ్ కథానాయికలుగా నటించారు. రాక్‌లైన్ వెంకటేశ్ నిర్మించారు. పవన్ వడయార్ దర్శకత్వం వహించారు. ఇటీవల షూటింగ్ పూర్తయిన ఈ సినిమా జనవరిలో విడుదల కానుందన్న వార్తలు వచ్చాయి. తాజాగా ఈ సినిమాను ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించిందని శాండిల్‌వుడ్ సమాచారం. ఇందులో అనుపమ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే పునీత్ హీరోగా రూపొందనున్న నెక్ట్స్ చిత్రం 'యువరత్న'. ఇందులో స్టూడెంట్ పాత్ర పోషిస్తున్నారట పునీత్.

# కొత్త సంవత్సరం.. ప్రయాణం


అమీ జాక్సన్


అమీ, జార్జ్


జీవితంలో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించడానికి సంవత్సరంలో మొదటిరోజు ఎంచుకున్నారు అమీ జాక్సన్. తన బాయ్‌ఫ్రెండ్ జార్జ్ పణాయిట్టోతో జనవరి ఫస్ట్ రోజున ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారీ బ్రిటీష్ బ్యూటీ. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా తెలియజేశారు. జార్జ్, అమీ 2015 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. కానీ... అలాంటిదేం లేదని చాలాసార్లు తప్పించుకునే ప్రయత్నాలు చేశారు అమీ జాక్సన్. గతేడాది వేలంటైన్స్ డే రోజు జార్జ్‌ను ప్రేమిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి హాలిడే ట్రిప్స్‌లోనూ, పార్టీల్లోనూ తరచుగా కలుస్తూ, ఆ ఫొటోలు పోస్ట్ చేస్తున్నారు. రీసెంట్‌గా ఫ్యామిలీ ఫ్రెండ్స్ కోసం గ్రాండ్ క్రిస్మస్ పార్టీని కూడా అరేంజ్ చేశారు. న్యూ ఇయర్ హాలీడే సందర్భంగా జాంబియా వెళ్లింది ఈ జంట. అక్కడే ఈ ఇద్దరూ రింగ్స్ మార్చుకున్నారు. ''మా జీవితాల్లో సరికొత్త సాహస యాత్రను మొదలుపెట్టాం. ఐ లవ్ యూ జార్జ్. నన్నీ ప్రపంచంలోనే ఆనందమైన అమ్మాయిని చేసినందుకు థ్యాంక్స్'' అని ఈ ఫొటోను పోస్ట్ చేశారు. త్వరలోనే గ్రాండ్ వెడ్డింగ్ పార్టీ ఏర్పాటు చేయనున్నారట అమీ, జార్జ్.

నవరత్నాలు-2

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ గురువారం ॥ 3-1-2019



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి అంకమరావు తల్లి వరమ్మ



బేల్దారి పనిలో భాగంగా ఇసుక తోడుతున్న గోపాల్ (ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి అంకమరావు తండ్రి)

నెల్లూరు జిల్లా కుడుములదిన్నెపాడుకు చెందిన గడ్డమడుగు గోపాల్ పేదరికంలో మగ్గుతున్నా అన్ని కష్టాలు ఓర్చుకొని తన కొడుకును బాగా చదివించాడు. తండ్రి కష్టం నిత్యం కళ్లారా చూసిన అంకమరావు అందుకు తగ్గట్టే చిన్నప్పటి నుంచి చదువులో మేటిగా నిలిచాడు. కష్టపడి ఇంటర్ పూర్తి చేసి ఎన్నో ఆశలతో ఇంజనీరింగ్‌లో చేరాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పూర్తిగా డబ్బులు రాకపోవటం, తన కోసం తండ్రి అప్పులు చేస్తూ.. రెక్కలు ముక్కలు చేసుకొని పని చేయటం చూసి తట్టుకోలేకపోయాడు. ఉరి వేసుకొని తనువు చాలించాడు.

# అందని చదువులు.. ఉసురు తీస్తున్న ఫీజులు!

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో భారీగా కోత విధిస్తున్న ప్రభుత్వం
- ఇచ్చేది ఏ మూలకూ సరిపోక అప్పులపాలవుతున్న తల్లిదండ్రులు
- ఆస్తులమ్ముకుని చదివిద్దామన్నా పలువురికి కుదరని పరిస్థితి
- అప్పులు పుట్టక సతమతమవుతున్న వైనం
- ఇంట్లో బాధలు చూడలేక, చదువు'కొన'లేక విద్యార్థుల బలవన్మరణాలు
- పెద్ద సంఖ్యలో అర్ధంతరంగా చదువులకు స్వస్తి చెబుతున్న దుస్థితి
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంను గుర్తు చేసుకుంటున్న జనం
- ఆ సమయంలో ఫీజు ఎంత ఉన్నప్పటికీ మొత్తం బాధ్యత ప్రభుత్వానిదే
- చంద్రబాబు సీఎం అయ్యాక పరిస్థితి తారుమారు
- ఏం చదువులు చదువుతారో నేనే చదివిస్తానని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ భరోసా
- మళ్లీ వైఎస్సార్ స్వర్ణ యుగం తీసుకువస్తానని హామీ
- జగన్ భరోసాపై సర్వత్రా ప్రశంసలు

రాష్ట్ర వ్యాప్తంగా ఇలా లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కోట్లలో పేరుకు పోతున్నాయి. నిధులు విడుదల చేస్తున్నామని చెబుతున్నా, కాలేజీలకు సకాలంలో జమ కావడం లేదు. దీంతో ఎంతో మంది విద్యార్థులకు కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. చదువు పూర్తయి ఉద్యోగం వేటలో ఉన్న నిరుద్యోగులపై ఈ పరిణామం పిడుగు పడినట్లైంది. చాలా మంది నిరుద్యోగులకు 2017 – 18 సంవత్సరానికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చివరి దఫా కాలేజీలకు అందలేదు. పీజీ చదువుతున్న వారికి కూడా సరిగా ఇవ్వటం లేదు. అందరి కంటే ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీలు, నవోదయ కాలేజీల్లో చదువుకున్న విద్యార్థులకు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి. అయినా వీరికి కూడా రూ.35 వేలకు మించి ప్రభుత్వం ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆదేశాల కాపీని జత చేసి అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. గత సంవత్సర బకాయిలు ఇటీవలే విడుదల చేశామని ప్రభుత్వం చెబుతున్నా కూడా అది కాలేజీలకు అందలేదు.

– సాక్షి అమరావతి / సాక్షి ప్రతినిధి, నెల్లూరు

## ఆ ఫీజే ప్రాణం తీసింది..

బేల్దారి పని చేసే మాకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు అంకమరావు 10వ తరగతి వరకు కలిగిరి జెడ్పీ హైస్కూల్‌లో 9.5 జీపీఏతో పాసయ్యాడు. వింజమూరులోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. 9.8 జీపీఏ వచ్చింది. నాన్నా.. ఇంజనీరింగ్ చదువుతా అన్నాడు.. మాలాగా కష్టపడటం వద్దనుకుని సరేనన్నాము. 2016లో నెల్లూరులోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో సీటు వచ్చింది. కళాశాల యాజమాన్యం సంవత్సరానికి రూ.65 వేలు ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా అంతా వస్తుందనుకున్నాము. కానీ కేవలం రూ.30 వేలు మాత్రమే వస్తుందని, మిగిలిన రూ.35 వేలు ఫీజు సొంతంగా చెల్లించాలని కాలేజీ వాళ్లు చెప్పారు. తొలుత రూ.20 వేలు కట్టాము. మొదటి సంవత్సరంలో చేరాడు. హాస్టల్ ఖర్చు భరించలేమని నేను (గోపాల్) నెల్లూరుకు వెళ్లి ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నా. నెల్లూరులోనే బెల్దారి పనులు చేసుకుంటూ అంకమరావును కాలేజీకి పంపేవాడిని. నా భార్య వరమ్మ ఊళ్లోనే ఉంటూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేది. మూడు నెలలు కాలేజీకి వెళ్లాడు. మిగిలిన ఫీజు చెల్లించాలని చెప్పాడు. చూద్దాం.. కడదాములే అని చెప్పాము. ఇద్దరు ముగ్గురిని అప్పు అడిగాం. లేదన్నారు. ఎలాగైనా అప్పు తెస్తామని చెప్పాను. సరేనన్నాడు. అంతలోనే ఏమనుకున్నాడో ఏమో.. బిడ్డడు అదే ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన ఇంట్లో మేమెవ్వరం లేనప్పుడు ఉరేసుకుని మమ్మల్ని వదిలి కనిపించనంత దూరం వెళ్లిపోయాడు. చేతికందొచ్చిన కొడుకు ఇలా మమ్మల్ని వదిలి కానరాని లోకాలకు వెళ్లిపోతాడని కలలో కూడా ఊహించలేదు. ఇంజనీరయ్యి మిమ్మల్ని బాగా చూసుకుంటా అనేవాడు. ఆ చదువు చదివించకపోయుంటే పిల్లాడు మా కళ్ల ముందే ఉండేవాడు. పెద్దోడు ఇలా అయిపోయాక మాకు దిక్కుతోచడం లేదు. చిన్నోడి భవిష్యత్ కోసం కన్నీళ్లు దిగమింగుకుంటూ జీవిస్తున్నాం. చిన్నోడు కలిగిరిలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. మాకు సెంటు భూమి కూడా లేదు. ఇప్పుడుంటున్నది కూడా పూరిల్లే.



విద్యార్థి అంకమరావు (ఫైల్)

– గోపాల్, వరమ్మ దంపతులు, కుడుములదిన్నెపాడు, కృష్ణారెడ్డిపాలెం పంచాయతి, కలిగిరి మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

## అదే జరిగితే మా బతుకులే మారిపోతాయి

నాకు ఇద్దరు పిల్లలు. రోజూ కూలినాలీ చేసుకొని కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి మాది. నా పిల్లల్లో అమ్మాయి సరళ కొండాపురంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా ఇచ్చివుంటే కార్పొరేట్ కళాశాలలో చేర్పించేవాళ్లం. సొంత నగదుతో ఆ కళాశాలలో చేర్పించే తాహతు లేదు. వైఎస్.రాజశేఖరరెడ్డి గారు బతికున్నప్పుడు మాలాంటి అనేక మంది పేద కుటుంబాలకు చెందిన పిల్లలు అన్ని సౌకర్యాలున్న కార్పొరేట్ కాలేజీల్లో చదువుకునేవారు. దానికయ్యే డబ్బంతా ప్రభుత్వమే చెల్లించేది. కానీ ఇప్పటి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా ఇవ్వడం లేదు. పేద పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. చదివించే స్థోమత లేనివారు పిల్లలను మధ్యలోనే చదువు మాన్పించి పనులకు పంపాల్సి వస్తోంది. మాలాంటి పేదోళ్ల కష్టాలు కళ్లారా చూసిన రాజన్న బిడ్డ జగన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బాగా అమలు చేస్తానని చెబుతున్నాడు. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకోవచ్చు. ఎన్ని లక్షలు ఖర్చు అయినా సరే ఇస్తానంటున్నాడు. అంతా ప్రభుత్వమే భరించేలా చేస్తానంటున్నాడు. పైగా హాస్టల్ ఖర్చులకు మెస్ చార్జీల కింద ఏటా రూ.20 వేలు అదనంగా ఇస్తానని చెబుతుండటం చాలా చాలా మంచిది. ఇదే జరిగితే మా లాంటి పేదోళ్ల జీవితాలే మారిపోతాయి. నా కూతురును, ఇప్పుడు 10వ తరగతి చదువుతున్న నా కొడుకు వెంకట్‌ను ఉన్నత చదువు చదివిస్తాను. జగన్ చెబుతున్న మాటలపై మాకు పూర్తిగా నమ్మకం ఉంది. ఎందుకంటే వాళ్ల నాయన రాజశేఖరరెడ్డి గారు పేదోళ్ల కోసం ఈ పథకాన్ని బాగా అమలు చేశాడు. ఆయన కంటే రెండడుగులు ముందుకు వేసి పేదోళ్లను చదివిస్తానని జగన్ కసిగా చెబుతుండటం రోజూ చూస్తున్నాం. అందుకే ఆయన (జగన్) ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– కొప్పర్తి సుజాతమ్మ, సాయిపేట ఎస్సీ కాలనీ, కొండాపురం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.



కొప్పర్తి సుజాతమ్మ

## ఇంజనీరింగ్ విద్యార్థులపై పెనుభారం

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు 321 ఉన్నాయి. ఈ కాలేజీల్లో సుమారు 90 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరితో కలిపి మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు (ఇంటర్ నుంచి పీజీ వరకు అన్ని కోర్సులు కలిపి) 16,00,054 మంది ఉన్నారు. 8,352 కాలేజీల్లో చదువుతున్న వీరికి ప్రభుత్వ నిర్దేసించిన మేరకు ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,555.26 కోట్లు చెల్లించాలి. ఈ లెక్కన ఒక్కో ఇంజనీరింగ్ విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం చెల్లిస్తున్నది రూ.35 వేలు మాత్రమే. అది కూడా సకాలంలో ఇవ్వడం లేదు. సగటున రూ.65 వేలు సొంతంగా చెల్లిస్తున్నారు. ఇతర కోర్సుల విద్యార్థులదీ ఇదే పరిస్థితి.


| | |
|---|---|
| రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన ఇంజనీరింగ్ విద్యార్థులు | 90,000 |
| వాస్తవంగా ప్రభుత్వం వీరికి ఏటా చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లల్లో) (సగటున ఫీజు రూ.లక్ష అనుకుంటే) | 900 |
| ప్రభుత్వం ఇచ్చామంటున్న మొత్తం (ఇదీ సకాలంలో ఇవ్వడం లేదు) (రూ.కోట్లల్లో) | 315 |
| విద్యార్థులపై అదనంగా పడుతున్న భారం (రూ.కోట్లల్లో) | 585 |
| ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన ఇతర కోర్సుల విద్యార్థులు | 15,10,054 |
| వాస్తవంగా ప్రభుత్వం వీరికి ఏటా చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లల్లో) (సగటున ఫీజు రూ.40 వేలు అనుకుంటే) | 6,040.22 |
| ప్రభుత్వం ఇచ్చామంటున్న మొత్తం (ఇదీ సకాలంలో ఇవ్వడం లేదు) (రూ.కోట్లల్లో) | 2,240 |
| విద్యార్థులపై అదనంగా పడుతున్న భారం (రూ.కోట్లల్లో) | 3,800.22 |
| మొత్తంగా విద్యార్థులందరిపై ఏటా పడుతున్న భారం (రూ.కోట్లల్లో) | 4,385.22 |

### కొర్రీలతో కోతలు

- ఇంజనీరింగ్ ఫీజు రూ.లక్షకు పైగా ఉంటే ప్రభుత్వం ఇస్తున్నది కేవలం రూ.35 వేలు మాత్రమే. అది కూడా సకాలంలో ఇవ్వడం లేదు.
- హాజరు శాతం కాస్త తక్కువ ఉందనే సాకుతో పలువురు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొడుతోంది.

## ప్రభుత్వం తీరిది..

ప్రతి సంవత్సరం నాలుగు క్వార్టర్లలో ప్రభుత్వం ఫీజులు కాలేజీలకు చెల్లిస్తోంది. ఉదాహరణకు 2018 –19 సంవత్సరానికి రెండు క్వార్టర్లు రీయింబర్స్‌మెంట్ చెల్లించారు. మొదటి క్వార్టర్‌లో రూ. 576.25 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.537.10 కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే రూ.39.15 కోట్లు మొదటి క్వార్టర్‌కు బకాయి ఉంది. ఇక రెండో క్వార్టర్‌లో రూ.618.33 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.485.05 కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే రూ.133.28 కోట్లు ఇంకా చెల్లించాలి. రెండు క్వార్టర్‌లకు కలిపి ఈ సంవత్సరంలో ఇంకా రూ.162.43 కోట్లు విద్యార్థులకు ప్రభుత్వం బకాయి ఉంది. ఇంకా రెండు క్వార్టర్ల ఫీజులు చెల్లించాలి. 75 శాతం హాజరు ఉన్నట్లు కాలేజీ నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి వివరాలు అందాలి. లేకుంటే చివరి క్వార్టర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రిలీజ్ కావడం లేదు. హాజరుతో సంబంధం లేకుండానే బకాయిలు ఉంటున్నాయి. నాలుగో క్వార్టర్ రిలీజ్‌లో జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థులకు ఏడాది వృథా అవుతోంది. ప్రభుత్వ ఈ విషయాన్ని ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు. హాజరు లేదని కొర్రీలు వేస్తోంది. పైకి మాత్రం ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో ఇస్తున్నామని అబద్ధాలు చెబుతోంది.




## డబ్బులు కట్టి సర్టిఫికెట్లు తీసుకున్నా...

'నేను విజయవాడలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో 2017లో ఫైనల్ ఇయర్ ఈసీఈ పూర్తి చేశా. నాకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. సర్టిఫికెట్లు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని బతిమాలినా ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫైనల్ క్వార్టర్ రాలేదు. కాలేజీకి రావాల్సిన ఫీజు ఇంకా రూ.26 వేలు ఉంది. డబ్బులు చెల్లిస్తే సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. మాది నిరుపేద కుటుంబం. మా అమ్మా నాన్నలు వేరే వారి దగ్గర అప్పు తెచ్చిచ్చారు. డబ్బులు కట్టి సర్టిఫికెట్లు తీసుకున్నాను. గవర్నమెంట్ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు కాలేజీ అకౌంట్‌లోకి వేయగానే నా డబ్బులు వెనక్కి ఇస్తామన్నారు. ఇప్పటికి ఏడాదిన్నరైంది. ఆ డబ్బులు రాలేదు.

– అన్నాబత్తుల సురేష్‌కుమార్, పోరంకి, కృష్ణా జిల్లా

## సర్టిఫికెట్లు ఇవ్వలేదు

నేను ఏలూరులోని కట్టమంచి రామలింగారెడ్డి పీజీ కాలేజీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివాను. నాకు కాలేజీ వారు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. 2017 – 18 సంవత్సరానికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. కాలేజీ వారు రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి సాంఘిక సంక్షేమ శాఖకు లేఖలు రాయించారు. అయినా స్పందించ లేదు. గత ఏడాది మార్చిలో మా కోర్స్ పూర్తయింది. మొత్తం 16 మందిమి పొలిటికల్ సైన్స్ క్లాస్‌లో ఉన్నాము. ఎవ్వరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. కారణమూ చెప్పలేదు.

– జె శ్రావణి, కాకినాడ.

## వైఎస్సార్ హయాంలో ఇలా..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో బీసీలు, ఈబీసీలకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. అంతకు ముందు బీసీ, ఈబీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేది కాదు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం ఫీజులు కొంత వరకు చెల్లిస్తుండటంతో 2004లో వైఎస్సార్ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు బీసీ, ఈబీసీలందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో ఇచ్చారు. దీంతో వందల కోట్లలో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్క సారిగా వేల కోట్లలోకి వెళ్లిపోయింది.



సంవత్సరానికి రూ. 1 లక్ష నుంచి 1,50,000
(ఫీజు ఎంతైతే అంతా + 20,000)

- పేదవాడి చదువుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది.
- ఎన్ని లక్షల రూపాయలైనా సరే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తాం.
- అంతే కాకుండా మెస్ చార్జీల (వసతి, భోజనం కోసం) కోసం అదనంగా ప్రతి విద్యార్థికి ఏటా రూ.20 వేలు ఇస్తాం.
- పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలై ఆత్మహత్యల వరకు వెళ్ల కూడదనేది మా ఆలోచన.
- పిల్లల చదువును ప్రభుత్వం చూసుకుంటుందనే భరోసా కల్పిస్తాం. దీంతో పిల్లల చదువుల గురించి తల్లిదండ్రులు ఆలోచించకుండా సంతోషంగా వారి పనులు వారు చేసుకునే అవకాశం కలుగుతుంది.
- పేదల చదువుల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకు వేస్తే, ఆయన స్ఫూర్తితో నేను రెండడుగులు ముందుకు వేస్తా.

- వైఎస్ జగన్

### పేదల చదువుకు పూచీ నాది

బంగారు భవిష్యత్తు ఉన్న విద్యా కుసుమం నేలరాలిన వైనంపై తండ్రి గోపాల్.. ప్రజా సంకల్ప యాత్రలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు వివరించి.. కొడుకు ఫొటో చూపించి కుమిలిపోయాడు. గోపాల్ మాటలు విన్న వైఎస్ జగన్ తీవ్రంగా చలించిపోయారు. ఇలాంటి కష్టం భవిష్యత్తులో ఏకుటుంబానికి రాకూడదని బలంగా నిర్ణయించుకున్నారు. సమగ్ర మార్పులు, చేర్పులతో ఆర్థిక ఇబ్బందులు లేని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం ఎన్నికోట్లు అయినా ఖర్చు చేస్తామన్నారు.

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
3-1-2019




## ఉద్యోగాలు

### ఎయిమ్స్-జోధ్‌పూర్

జోధ్‌పూర్ (రాజస్థాన్)లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 37 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ)–3**
2. **డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ)–2**
3. **లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)–32**

- **అర్హత:** ఇంటర్, డిగ్రీ, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ సామర్థ్యం ఉండాలి.
- **వయసు:** పోస్టును బట్టి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులకు రూ.200.
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 27, 2019
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

### ఏపీపీఎస్సీ-నోటిఫికేషన్లు

**1. డిగ్రీ లెక్చరర్లు: 308**

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీతో పాటు నెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు ప్రారంభ తేదీ:** ఫిబ్రవరి 5, 2019.
- **ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** ఫిబ్రవరి 25, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 26, 2019.

**2. పాలిటెక్నిక్ లెక్చరర్లు: 405**

- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టులు/బ్రాంచుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ లెక్చరర్ పోస్టులకు కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, ఇంగ్లిష్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉండాలి.
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** ఫిబ్రవరి 6, 2019.
- **ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** ఫిబ్రవరి 26, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 27, 2019.

**3. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు: 43**

- **అర్హత:** బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** జనవరి 17, 2019.
- **ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** ఫిబ్రవరి 7, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 8, 2019.

**4. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు: 10**

- **అర్హత:** ఫిషరీస్ టెక్నాలజీలో పీజీ డిప్లొమా లేదా డిప్లొమా, నేవిగేషన్ పాలిటెక్నిక్ లేదా ఇన్‌ల్యాండ్/మెరైన్ ఫిషరీస్ క్లాసెస్ కోర్సు సర్టిఫికెట్ లేదా జువాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ లేదా బీఎఫ్ఎస్సీ లేదా బీఎస్సీ (ఎఫ్‌జడ్‌సీ), బీఎస్సీ (ఫిషరీస్) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** జనవరి 18, 2019.
- **ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** ఫిబ్రవరి 7, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 8, 2019.

**5. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్లు: 5**

- **అర్హత:** ఎలక్ట్రానిక్స్ లేదా టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** జనవరి 22, 2019
- **ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** ఫిబ్రవరి11, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 12, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

## క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

# అంకుర ఆఫర్స్.. ఆచితూచి!



**క్యాంపస్‌ప్లేస్‌మెంట్స్ కోసం విద్యార్థులు కోర్సులో చేరిన తొలిరోజు నుంచే ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్, ఎంబీఏ కాలేజీల్లో ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ కొద్దిరోజుల క్రితమే ప్రారంభమైంది. ప్రభుత్వరంగ సంస్థలు, బహుళజాతి సంస్థలు, ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలతోపాటు కొత్తగా ఏర్పాటైన స్టార్టప్ సంస్థలు సైతం ప్రతిభావంతుల అన్వేషణలో క్యాంపస్‌ల బాటపడుతున్నాయి. స్టార్టప్స్ (అంకుర సంస్థలు) సైతం మంచి ప్యాకేజీలతో ఆఫర్స్ అందిస్తున్నాయి. మరి ఈ అంకుర సంస్థల్లో చేరాలా వద్దా.. చేరితే ఎలాంటి లాభనష్టాలుంటాయి..? ఇలాంటి సందేహాలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. స్టార్టప్ కంపెనీల ఆఫర్స్ అంగీకరించే ముందు యువత పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై విశ్లేషణ...**

- దేశవ్యాప్తంగా కాలేజీల్లో ప్రారంభమైన క్యాంపస్ డ్రైవ్స్ సందడి
- ఎంఎన్‌సీలతో పాటు స్టార్టప్స్ నుంచి మంచి వేతనంతో ఆఫర్లు అందుతున్న వైనం
- స్టార్టప్స్‌లో కొలువుల పట్ల యువతలో పెరుగుతున్న ఆసక్తి
- అంకుర కొలువులో చేరే ముందు ఆచితూచి అడుగేయాలంటున్న నిపుణులు

### అంకుర ఆఫర్లపై ఆసక్తి

ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ల సీజన్ మొదలైంది. ఇప్పటికే ఐఐటీలు, ఎన్ఐటీల్లో తొలి దశగా డిసెంబర్ మొదటి వారం నుంచే క్యాంపస్ డ్రైవ్స్ జరుగుతున్నాయి. ఐఐఎంలు వంటి ప్రముఖ బీ-స్కూల్స్‌లో సైతం ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ ప్రారంభమైంది. ఐఐటీలు, ఎన్ఐటీల్లో తొలి దశలో ఎంఎన్‌సీ సంస్థలను ఇన్‌స్టిట్యూట్‌లు ప్లేస్‌మెంట్స్‌కు పిలుస్తున్నాయి. తదుపరి దశలో అంకుర సంస్థలు క్యాంపస్‌లకు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. కొంత మంది విద్యార్థులు ఎంఎన్‌సీల్లో ఉద్యోగం కంటే స్టార్టప్ సంస్థల ఆఫర్ల కోసం ఎదురు చూస్తుండటం ఆసక్తిగా మారింది. స్టార్టప్ సంస్థల్లో చేరితే తమ ప్రతిభను ప్రత్యక్షంగా నిరూపించుకునే అవకాశం లభిస్తుందని అభ్యర్థులు చెబుతున్నారు. నేరుగా సంస్థ వ్యవస్థాపకులతో మాట్లాడుతుండటం వల్ల త్వరగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొంటున్నారు. అయితే ఇది సదరు అభ్యర్థులు చేరిన స్టార్టప్ సంస్థ వ్యాపారం, మార్కెట్ మనుగడపై ఆధారపడి ఉంటుందనేది నిపుణుల అభిప్రాయం.




### 15 నుంచి 20 శాతం

గత మూడేళ్లుగా ఐఐటీలు, ఐఐఎంలు, ఇతర ప్రముఖ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో స్టార్టప్ ఆఫర్స్‌ను అంగీకరిస్తున్న విద్యార్థుల సంఖ్య 15 నుంచి 20 శాతంగా ఉంటోంది. ఇందులోనూ బీటెక్ అర్హతతో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులదే కొంత పైచేయిగా ఉంది. స్టార్టప్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యకలాపాలు టెక్నికల్, మేనేజీరియల్ స్కిల్స్ రెండింటి సమ్మిళితంగా ఉండటమే ఇందుకు కారణం. ఇలాంటి అంకుర సంస్థల్లో చేరితే తమకు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు లభిస్తాయనే ఆలోచన విద్యార్థుల్లో నెలకొంది. అయితే స్టార్టప్స్ ఆఫర్స్‌ను అంగీకరించేముందు ఆచితూచి అడుగేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అదృష్టం బాగుండి సంస్థ సక్సెస్ అయితే కొత్తగా చేరిన ఉద్యోగులకు అద్భుత భవిష్యత్తు సొంతమవుతుంది. ఏ మాత్రం తేడా వచ్చి సంస్థ ఆశించిన రీతిలో విజయం సాధించకుంటే.. కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




### ప్రతిభను నిరూపించుకోవచ్చు

పేరున్న ఎంఎన్‌సీల్లో అవకాశం వచ్చినా వదులుకొని అభ్యర్థులు స్టార్టప్ ఆఫర్స్‌వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారు? అని అడిగితే అందుకు ఎక్కువ మంది చెప్పే సమాధానం... స్టార్టప్స్‌లో ప్రతిభను ప్రత్యక్షంగా నిరూపించుకునే అవకాశం ఉంటుందని! స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య 50 నుంచి 150 మధ్యలోనే ఉంటుంది. కాబట్టి విధి నిర్వహణ పరంగా ఆయా ఉద్యోగుల పనితీరును, సంస్థ వృద్ధికి వారి తోడ్పాటును యాజమాన్యం నేరుగా గుర్తించే అవకాశం లభిస్తుంది. పెద్ద కంపెనీల్లో వేల సంఖ్యలో ఉద్యోగులు ఉంటారు. బృందంలో సభ్యుడిగా లేదా మేనేజర్‌గా శ్రమకోర్చి సత్ఫలితాలు సాధించినా.. సంస్థ అత్యున్నత అధికారులకు నేరుగా తెలిసే వీలుండదు. ఒకవేళ పెద్ద సంస్థ యాజమాన్యం నుంచి అభినందలు వచ్చినా.. అది ప్రాజెక్ట్ టీమ్ మొత్తానికి వర్తించే విధంగానే ఉంటుంది తప్ప.. వ్యక్తిగతంగా గుర్తింపు ఉండదు. ఇలాంటి కారణాలతో విద్యార్థులు అంకుర సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి ఆలోచనా దృక్పథం కలిగిన అభ్యర్థులు తమ ప్రతిభను గుర్తించి 'భేష్' అంటూ.. వెన్నుతట్టే వాతావరణం సదరు అంకుర సంస్థలో ఉందో లేదో తెలుసుకోవాలి. సిబ్బంది పని తీరును యాజమాన్యం వ్యక్తిగతంగా పరిశీలించే పరిస్థితి ఉంటేనే ఆఫర్‌కు అంగీకరించడం మేలు.

### ప్రొఫైల్, ప్రమోటర్స్

స్టార్టప్ ఆఫర్స్‌ను అంగీకరించేముందు విద్యార్థులు మార్కెట్ పరంగా సంస్థ కార్యకలాపాలు, వ్యవస్థాపకుల దీర్ఘకాలిక లక్ష్యాలు తెలుసుకోవాలి. సంస్థ కార్యకలాపాలు మార్కెట్ పరంగా వినియోగదారులను ఆకట్టుకునేలా ఉంటే 'ఒకే' చెప్పొచ్చు. కానీ.. సదరు స్టార్టప్ కార్యకలాపాలు పరిమిత వర్గాలనే లక్ష్యంగా చేసుకుంటే మాత్రం కాస్త ఆలోచించాల్సి ఉంటుంది. అదే విధంగా స్టార్టప్‌ను నెలకొల్పిన యాజమాన్యాలకు సంస్థను దీర్ఘకాలంపాటు నడిపించే ఆసక్తి, సామర్థ్యం ఉందో లేదో పరిశీలించాలి. కొంతమంది మార్కెట్ పరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఎదురైనా సంస్థను మూసేందుకు సైతం వెనుకాడరు. పర్యవసానంగా ఇది సంస్థలో పనిచేసే సిబ్బంది భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

### ఆర్థిక సామర్థ్యం

స్టార్టప్ సంస్థలు ఇచ్చే ఆఫర్లను అంగీకరించే ముందు వాటి ఆర్థిక సామర్థ్యం గురించి కూడా ఆరా తీయాలి. నూటికి తొంభై శాతం అంకుర సంస్థలు సీడ్ ఫండింగ్, ఏంజెల్ ఫండింగ్ విధానంలో నిధులు సమకూర్చుకుంటున్నాయి. కాబట్టి మార్కెట్‌లో కొద్దిపాటి తేడాలు వచ్చినా.. సీరియల్ ఫండింగ్ ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. ఫండింగ్ చేసే సంస్థలు, వ్యక్తులు వెనుకంజ వేస్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఇలాంటి సందర్భాల్లో సైతం సదరు యాజమాన్యాలు సంస్థను మూసేయకుండా ముందుకు తీసుకెళ్లగలుగుతాయా అనేది పరిశీలించాలి. ఆమేరకు వారికి ఆర్థిక స్థిరత్వం ఉందో లేదో చూడాలి.



### వేతనం.. నగదు రూపం

నేడు యువత ఎక్కువగా ఆలోచించేది పే ప్యాకేజ్ గురించే! స్టార్టప్ సంస్థల్లో చేరే అభ్యర్థులు వేతనం విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వేతనాన్ని పూర్తిగా నగదు రూపంలో చెల్లిస్తారా? లేదా కొంత నగదు, మరికొంత షేర్లు లేదా స్టాక్ ఆప్షన్ రూపంలో ఇస్తారా? అనే విషయం తెలుసుకోవాలి. పలు స్టార్టప్ సంస్థలు మొత్తం వేతనంగా ఇవ్వకుండా.. కొంత నగదు, మరికొంత స్టాక్ ఆప్షన్స్‌ను ఇచ్చే విధానాన్ని అనుసరిస్తున్నాయి. నగదు రూపంలో ఇచ్చేది మొత్తం ప్యాకేజ్‌లో 60 శాతం కంటే తక్కువగా ఉంటే.. ఆ ఆఫర్‌ను వదులుకోవడమే మేలు అనేది నిపుణుల అభిప్రాయం. వాస్తవానికి అంకుర సంస్థలు అందించే పే ప్యాకేజ్‌లు నగదు పరంగా తక్కువగా... షేర్ల రూపంలో ఎక్కువగా ఉంటాయి. ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంపికైన అభ్యర్థులకు పే ప్యాకేజీ సగటు ఏడు నుంచి తొమ్మిది లక్షల మధ్యలో ఉంటోంది. ఇలాంటప్పుడు నగదు రూపంలో ఇచ్చేది తక్కువగా ఉంటే ఆమోదించకపోవడమే మంచిది.

### సవాళ్లు ఎన్నో

స్టార్టప్ కొలువులో అడుగడుగునా సవాళ్లు కూడా ఎదురవుతాయని గమనించాలి. సవాళ్లకు సిద్ధపడే సదరు ఆఫర్స్‌ను అంగీకరించాలి. ముఖ్యంగా సంస్థకు మార్కెట్‌లో ఎదురవుతున్న పోటీని అంచనా వేయగలగాలి. అంతేకాకుండా మారుతున్న వినియోగదారుల దృక్పథం..సమీప భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే పసిగట్టి ధీటుగా ఎదుర్కొనే వ్యూహం.. ముందస్తు ప్రణాళికలు రూపొందించుకునే చొరవను విధి నిర్వహణలో ప్రదర్శించాలి. ఇప్పటికే ఉన్న వినియోగదారులు చేజారకుండా చూసుకోవాలి. అలాగే ఎప్పటికప్పుడు కొత్త కస్టమర్స్‌ను ఆకట్టుకునేలా వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి. వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయాలి. అందుకోసం పైవాళ్లను ఒప్పించడంతోపాటు సిబ్బందితో పని చేయించే నేర్పు, ఓర్పు ఎంతో అవసరం. అప్పుడే యాజమాన్యం కూడా ప్రతిభను గుర్తించి ఉన్నత అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం లభిస్తుంది.

### తెలుసుకోవడం ఎలా

స్టార్టప్ సంస్థల ఆఫర్‌ను అంగీకరించే క్రమంలో.. ముందుగానే ఆయా అంకుర కంపెనీలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం ఎలా అనే సందేహం ఎదురవడం సహజం. ఇందుకు ఇప్పుడు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మొదటిది కాలేజీ క్యాంపస్‌లో ఉండే ప్లేస్‌మెంట్ సెల్. స్టార్టప్ ఆఫర్స్ ఔత్సాహికులు.. సదరు ప్లేస్‌మెంట్ సెల్ అధికారులను సంప్రదించి క్యాంపస్‌కు రానున్న స్టార్టప్ సంస్థల వివరాలు సేకరించాలి. ఆయా అంకుర కంపెనీలకు మార్కెట్ పరంగా ఉన్న ఆదరణ తెలుసుకోవాలి. అదే విధంగా సదరు స్టార్టప్ సంస్థలో చేరిన పూర్వ విద్యార్థులను సంప్రదించి తాజా పరిస్థితిని ఆరా తీయొచ్చు. ఇలా అన్ని రకాలుగా తెలుసుకొని.. అన్నివిధాల నమ్మకం కుదిరాకే స్టార్టప్ ఆఫర్స్‌వైపు మొగ్గు చూపడం మేలు.

### వారికి అనుకూలం

భవిష్యత్తులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి స్టార్టప్ ఉద్యోగం అనుకూలమని చెప్పొచ్చు. మార్కెట్ పరిస్థితులను నేరుగా అధ్యయనం చేసే వీలు కలుగుతుంది. ఫండింగ్ రిసోర్సెస్ గురించి కూడా తెలుసుకోవచ్చు. పే ప్యాకేజ్‌లు తక్కువగా ఉండటం నిజమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని వ్యక్తిగతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

**– ప్రొఫెసర్ అమిత్ ఆచార్య**, యాక్టింగ్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, ఐఐటీ-హెచ్ ప్లేస్‌మెంట్ సెల్

### నిత్య విద్యార్థిగా ఉంటేనే

అంకుర సంస్థల్లో చేరాలనుకునే అభ్యర్థులు.. నిత్య విద్యార్థిగా ఉండగలగాలి. ఆ నమ్మకం ఉంటేనే స్టార్టప్స్ దిశగా అడుగులు వేయాలి. లేదంటే ఈ ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. రెగ్యులర్ లెర్నింగ్ దృక్పథం లేకుంటే వ్యక్తిగతంగానే కాకుండా.. సంస్థకు కూడా ఇబ్బందే. ఇలాంటి ఉద్యోగులను కొనసాగించడంపై సంస్థలు పునరాలోచనలో పడతాయి.

**–డాక్టర్ వరుణ్ దత్**, హెడ్, ఐఐటీ-మండి ప్లేస్‌మెంట్ సెల్

### అంకుర ఆఫర్స్... అనుకూలతలు

- తమలోని సృజనాత్మకతను, ప్రతిభను నిరూపించుకునే అవకాశం.
- తమ పనితీరుకు నేరుగా ఉన్నతాధికారులు, యాజమాన్యం నుంచి గుర్తింపు.
- ఆసక్తికి అనుగుణంగా పని చేసే వీలుంటుంది.
- వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించొచ్చు.

### ప్రతికూలతలు

- సంస్థకు నిర్దిష్ట వ్యూహం లేకపోతే భవిష్యత్తు కెరీర్‌కు ప్రతికూలం.
- కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీలు నేర్చుకోవడంలో సవాళ్లు.
- తక్కువ మొత్తంలో నగదు రూపేణా వేతనాలు.
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రాణించేందుకు కష్టపడాలి.

### ఎంఎన్‌సీ జాబ్స్.. అనుకూలతలు

- ఆర్థికంగా భవిష్యత్తుపై ధీమా. స్టార్టప్‌లతో పోల్చితే పే ప్యాకేజ్‌ల మొత్తం ఎక్కువ.
- కొత్త టెక్నాలజీల విషయంలో సంస్థల్లోనే శిక్షణ పొందే అవకాశం.
- అనుభవంతో భవిష్యత్తులో ఇతర సంస్థల్లో ఉన్నత హోదాలు లభించే వీలు.

### ప్రతికూలతలు

- ప్రారంభంలో బృంద సభ్యుడిగా లేదా ఎగ్జిక్యూటివ్ హోదాలోనే ఉద్యోగం.
- నేరుగా యాజమాన్యంతో సంప్రదించే అవకాశం చాలా తక్కువ.
- స్టార్టప్‌లతో పోల్చితే కొంత అధిక ఒత్తిడితో కూడిన పని వాతావరణం.

## జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్




జేఈఈ మెయిన్ అభ్యర్థుల కోసం సాక్షి.. 'విద్య వీక్లీ టెస్ట్'ను నిర్వహించనుంది. పోటీ, అకడమిక్ పరీక్షల అభ్యర్థుల కోసం ప్రతిరోజూ 'విద్య'లో స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్లను అందిస్తున్న విషయం తెలిసిందే. ఇకపై అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను సమీక్షించుకునేందుకు వీలుగా ప్రతి వారం ఆన్‌లైన్‌లో గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహించనుంది. 'విద్య'లో ప్రచురించిన సబ్జెక్టుల్లోంచి రూపొందించిన ఈ టెస్టులు రాయడం ద్వారా అభ్యర్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకోవచ్చు. తద్వారా పరీక్షలకు మరింత సన్నద్ధమవడానికి అవకాశం ఉంటుంది. జేఈఈ మెయిన్ పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు **www.sakshieducation.com** ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఆదివారం సాయంత్రం వరకు ఈ పరీక్ష అందుబాటులో ఉంటుంది. మొబైల్ లేదా కంప్యూటర్‌లో పరీక్ష రాయొచ్చు. టాప్ ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి.



## కెరీర్ గైడెన్స్

# డెంటిస్ట్



**సమాజంలో దంత సమస్యలు పెరుగుతున్న కొద్దీ... ప్రస్తుతం డెంటిస్ట్ (దంత వైద్యం) కెరీర్.. జనరల్ సర్జన్‌లకు ఏమాత్రం తీసిపోకుండా సాగుతోంది. దీంతో బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్ (బీడీఎస్) కోర్సులో చేరాలనుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దంత సమస్యలు పెరగడం, డిమాండ్‌కు సరిపడా డెంటిస్టులు అందుబాటులో లేకపోడంతో బీడీఎస్‌కు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో.. డెంటిస్ట్‌గా మారేందుకు అందుబాటులో ఉన్న కోర్సులు.. ప్రవేశాలు.. ఉన్నత విద్య.. దంత వైద్య రంగంలో కెరీర్ స్కోప్‌పై స్పెషల్ ఫోకస్...**

బైపీసీ విద్యార్థులు నీట్ ద్వారా బీడీఎస్ కోర్సులో చేరొచ్చు. బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్(బీడీఎస్) కోర్సును పూర్తి చేసినవారు దంత సంబంధిత వ్యాధులకు చికిత్సలను అందిస్తారు. వీరిని డెంటిస్టులుగా వ్యవహరిస్తారు. డెంటిస్ట్‌లు దంతవ్యాధుల నుంచి సంరక్షణ, దంత క్షయం, పళ్ల మధ్య ఖాళీలు, చిగుళ్ల సమస్యలు, దంతాల సర్దుబాటు, కృత్రిమ దంతాలు అమర్చడం వంటి సేవలు అందిస్తారు.

### బీడీఎస్

కోర్సు వ్యవధి ఐదేళ్లు. ఇందులో ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు తర్వాత ఇంటర్న్‌షిప్ ప్రారంభమవుతుంది. ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు హౌస్ సర్జన్‌గా పనిచేయాల్సి ఉంటుంది. ఈ దశలో కాలేజీకి అనుబంధంగా ఉన్న లేదా నిర్దేశించిన హాస్పిటల్‌లో సీనియర్ డాక్టర్ పర్యవేక్షణలో విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచుకుంటారు. హౌస్ సర్జన్సీలో మూడు నెలలపాటు గ్రామీణ ప్రాంతాల్లోని శాటిలైట్ క్లినిక్స్‌లో పని చేయాల్సి ఉంటుంది.

### బోధించే అంశాలు

అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ అండ్ న్యూట్రిషన్, డెంటల్ అనాటమీ, ఎంబ్రీయాలజీ అండ్ ఓరల్ హిస్టాలజీ, జనరల్ పాథాలజీ అండ్ మైక్రోబయాలజీ, డెంటల్ మెటీరియల్స్, జనరల్ అండ్ డెంటల్ ఫార్మాకాలజీ అండ్ థెరపెటిక్స్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓరల్ పాథాలజీ అండ్ మైక్రోబయాలజీ, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ తదితర సబ్జెక్ట్‌లను బోధిస్తారు.

### ఇంటర్న్‌షిప్

ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల పంటి సమస్యలతో బాధపడుతున్న పేషెంట్లను కలుస్తారు. తద్వారా ఒక వ్యాధికి సంబంధించి అకడెమిక్‌గా నేర్చుకున్న విషయాలు, లక్షణాలను వాస్తవ పరిస్థితుల్లో గుర్తించడం, సదరు వ్యాధికి గురైన రోగులకు సీనియర్లు అందిస్తున్న చికిత్స తీరును పరిశీలించడం ద్వారా పూర్తిస్థాయి డెంటిస్ట్‌కు కావాల్సిన సామర్థ్యాలను అలవరచుకుంటారు. బీడీఎస్ తర్వాత ఉన్నత విద్య పరంగా మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్(ఎండీఎస్) కోర్సు అందుబాటులో ఉంది.

### ఎండీఎస్

బీడీఎస్ పూర్తి చేసిన వారు మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్(ఎండీఎస్) కోర్సు చదివేందుకు అర్హులు. ఇందులో పలు స్పెషలైజేషన్స్ ఉంటాయి. అవి.. ఓరల్ పాథాలజీ అండ్ మైక్రోబయాలజీ, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడెంటిక్స్, పెన్‌డోడెంటిక్స్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ, ఆర్థోడెంటిక్స్ అండ్ డెంటో ఫేషియల్ ఆర్థోపెడిక్స్, పరియోడెంటిక్స్, ఓరల్ అండ్ మ్యాక్సిల్లోఫేషియల్ సర్జరీ తదితరాలు. ఎండీఎస్ తర్వాత ఆసక్తి ఉంటే పీహెచ్‌డీ కూడా చేయొచ్చు.



### ప్రవేశాలు


దేశవ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)–యూజీలో సత్తా చాటడం ద్వారా బీడీఎస్ కోర్సులో ప్రవేశాలను సొంతం చేసుకోవచ్చు. అలాగే నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)–పీజీలో ప్రతిభ చూపి ఎండీఎస్ కోర్సులో ప్రవేశించొచ్చు.

### కెరీర్ అవకాశాలు

బీడీఎస్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో అవకాశాలు ఉంటాయి. ప్రైవేట్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్/హౌస్ స్టాఫ్‌గా కెరీర్ ప్రారంభించొచ్చు. తర్వాత అర్హత, అనుభవం ఆధారంగా.. సీనియర్ డాక్టర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్/రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ) వంటి హోదాలు పొందొచ్చు. ప్రభుత్వ రంగానికి సంబంధించి పీహెచ్‌సీ, జనరల్ హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, జిల్లా ఆస్పత్రుల్లో డెంటల్ సర్జన్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది. అనుభవం, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లోని మెడికల్ సర్వీసెస్‌లో కూడా డెంటిస్ట్‌లు అవకాశాలు సొంతంచేసుకోవచ్చు. దీంతోపాటు సొంతంగా ప్రాక్టీస్‌ను ప్రారంభించొచ్చు. మెడికల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు, పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. టీచింగ్‌పై ఆసక్తి ఉన్నవారు బోధనా రంగంలో స్థిరపడొచ్చు. మెడికల్ కాలేజ్/ఇన్‌స్టిట్యూట్‌లలో క్లినికల్ అసిస్టెంట్/క్లినికల్ ట్యూటర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు.

### నైపుణ్యత ఉండాలి

నైపుణ్యతపైనే దంత వైద్యుల కెరీర్ ఆధారపడి ఉంటుంది. కాబట్టి విద్యార్థులు కోర్సులో చేరిన తొలిరోజు నుంచే థియరీతోపాటు క్లినికల్ నాలెడ్జ్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. సబ్జెక్ట్‌పై పట్టు పెంచుకోవాలి. తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నైపుణ్యతను పెంచుకోవడమే ధ్యేయంగా క్లినికల్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఇంటర్న్‌షిప్‌లో నిరంతరం వార్డుల్లో పర్యటించి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న పేషెంట్లను పరిశీలించాలి. తద్వారా క్లినికల్ నాలెడ్జ్ పెరుగుతుంది. నైపుణ్యత అలవడుతుంది. వృత్తిలో భాగంగా రోగులతో మాట్లాడటం, వారిలో నమ్మకం కలిగించడం ప్రధానం. కాబట్టి విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి. డెంటిస్ట్‌గా రాణించాలంటే ఎండీఎస్ కోర్సు చేయడం తప్పనిసరి.



### ఈ స్కిల్స్ తప్పనిసరి

- సేవా దృక్పథం, ఓర్పు, ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత
- దృఢ చిత్తంతో వ్యవహరించగలగడం
- నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం
- కమ్యూనికేషన్ స్కిల్స్
- కష్టపడే మనస్తత్వం
- కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి